శ్రీ

# విష్ణు పురాణం

రచన

కవిరత్న

కుమారసరస్వతి

**యామిజాల పద్మనాభస్వామి**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2013**

# SRI VISHNU PURANAM

**By**
**Yamijala Padmanabhaswamy**

T.T.D. Religious Publications Series No. 993
© All Rights Reserved

*First Edition : 2013*

*Copies : 2000*

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

## ముందు మాట

ఒకానొకప్పుడు మైత్రేయుడు అనే మునిపుంగవునికి అనేకమైన సందేహ పరంపరలు కలిగాయి. ఆ సందేహాలను తీర్చుకోవాలన్న జిజ్ఞాస కలిగింది.

ఇంద్రాదులకు ప్రభువు ఎవరు? యోగీంద్రవినుతుడు, వేదమయుడు, జ్ఞానప్రదాత, భువననిర్మాత, భర్త, సంహర్త ఎవరు? ఇలా సమస్త లోకాలకు ఆధారభూతమై విలసిల్లే దేవుడు ఎవరు? ఆ దేవుణ్ణి గూర్చి కొంతవరకైనా తెలుసుకోగలమా!

అనంతమైన ఈ కాలచక్ర భ్రమణంలో సూర్యాది నవగ్రహ సంచార విశేషాలు, దేవతలు మొదలుగా నాలుగు విధాలైన భూతసృష్టి, చతుర్దశ మన్వంతరాలు, నాలుగు యుగాల ప్రమాణం, ఆ యుగధర్మాలు, ఆ యా యుగాల్లో విలసిల్లిన రాజవంశ చరిత్రలు... వీటిని గూర్చి అవగాహన చేసుకోగలమా!

వేదశాఖల ప్రమాణాలు, బ్రాహ్మణాది నాలుగు వర్ణాల ధర్మాలు, బ్రహ్మచర్యం మొదలు నాలుగు ఆశ్రమాల నియమాలు... ఇలా వీటన్నింటిని సవివరంగా ఆకళింపు చేసుకోగలమా! అన్న అంతులేని ఆలోచనలకు లోనై తన గురువైన పరాశరమహర్షిని అడిగాడు మైత్రేయమహర్షి.

వశిష్ఠమహర్షి పౌత్రుడే పరాశరుడు. ఈయన తండ్రి శక్తిమహర్షి.

మైత్రేయు డడిగిన ప్రశ్న పరంపరల్ని విన్న పరాశరమహర్షి సంతోషిస్తూ, అత్యంత శిష్యవాత్సల్యంతో ఇలా అన్నాడు.

మైత్రేయా! నీవడిగిన ప్రశ్నలన్నింటికి కలిపి ఒకే ఒక చక్కని సమాధానం ఉంది. అదే **శ్రీ విష్ణుపురాణం! –** దాన్ని నేను ప్రవచనం చేస్తాను. శ్రద్ధగా విను.

విష్ణుపురాణం వేదాల్లో వేదం! శాస్త్రాల్లో శాస్త్రం! జ్యోతిషంలో జ్యోతిషం! నీతిశాస్త్రాల్లో నీతిశాస్త్రం! పురాణాల్లో పురాణం! ఇతిహాసాల్లో ఇతిహాసం! యోగవిద్యల్లో యోగవిద్య! కావ్యాల్లో కావ్యం!... ఇలాగ విష్ణుపురాణం సకలలోక విషయమే కాక, సకలలోక మనోరంజనం కూడ.

ఇంతటి ప్రశస్తమైన విష్ణుపురాణాన్ని మొదట చతుర్ముఖ బ్రహ్మదేవుడు దక్ష ప్రజాపతికి వినిపించాడు. ఆ దక్షుడు పురుకుత్సుడనే రాజుకు చెప్పాడు. ఆ రాజు సారస్వతుడనే వాడికి చెప్పగా, ఆయన వల్ల నేను విన్నాను అంటూ పరాశరమహర్షి విష్ణుపురాణగాథను హృదయంగమంగా శిష్యుడైన మైత్రేయునికి విన్పించాడు.

ఇలా మహిమాన్వితమై వెలుగొందిన ఈ విష్ణుపురాణాన్ని సరళమైన వచనంలోనే కవిరత్న శ్రీ యామిజాల పద్మనాభస్వామి తెలుగువారికి అందించారు.

ఈ ఆధ్యాత్మిక గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తమ ధార్మిక ప్రచురణగా ముద్రించి భక్తులకు కానుక పెడుతున్నది. పాఠకులు ఈ పుస్తకాన్ని నిత్యపారాయణ గ్రంథంగా చేసుకొని తరించగలరని ఆకాంక్షిస్తూ...

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు
తిరుపతి

**శ్రీ**

## విష్ణు పురాణం

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్,**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే.**

**శ్రీవాణీగిరిజారూపాం**
**శ్రీవాక్సౌభాగ్యదాయినీమ్,**
**శ్రితకల్పలతాం వందే**
**మాతరం భువనేశ్వరీమ్.**

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగమ్,**
**లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం**
**వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్.**

**శ్రీ వాగేశ్వరీ దేవ్యై నమః**

**శ్రీ గురుభ్యో నమః**

## కథాప్రారంభం

పరాశరుడు మునులలో మున్నెన్నదగిన తపోధనుడు. తల్లి కడుపులో ఉన్నపుడే వేదశాస్త్రాది విద్యలు క్షుణ్ణంగా నేర్చిన విద్యావంతుడు. చిన్నతనంలోనే తపశ్శక్తిచే రాక్షససంహారం చేసినవాడు. బ్రహ్మమానస పుత్రుడైన పులస్త్యబ్రహ్మవల్ల దివ్యజ్ఞానశక్తిని పొందినవాడు. పద్మాక్షుని పాదపద్మభక్తికి జీవితం అంకితం చేసినవాడు. దివ్యతేజోవిరాజమానుడు.

ఆ మహానుభావుడు గురువుగా మైత్రేయుడు, వేదశాస్త్రాలు అభ్యసించి శుశ్రూష చేస్తూ ఒకనాడు ప్రభాతకాలకృత్యాలు నిర్వర్తించి సుఖాసీనుడై ఉన్న గురువునకు నమస్కరించి అన్నాడు.

గురుదేవా! నీ అనుగ్రహంవల్ల వేదాలూ, శాస్త్రాలూ క్షుణ్ణంగా తెలుసుకున్నాను. జ్ఞానధనం పొందిన అదృష్టవంతుడనయ్యాను. ఇంక ఒకటి అడగాలని ఉంది. దానికి సమాధానం సర్వజ్ఞుడవైన నీవే చెప్పగలవు. చెప్పవలసిందని మనవి. అదేమిటంటే?

అన్ని లోకాలలో ఆధారమై విలసిల్లే దేవుడెవరు? ఇంద్రాదులకు ప్రభువు, భక్తుల కోర్కెలు తీర్చేవాడు, చరాచర పదార్థములందుండేవాడు, యోగీంద్ర వినుతుడు, వేదమయుడు, తన కథలచే ఇహపరసుఖమును కలిగించే దేవుడు ఎవరు? విజ్ఞానప్రదాత, భువననిర్మాత, భర్త, సంహర్త అయిన ఆ దేవుని గూర్చి తెలుసుకొనవలెనని నా కోర్కె.

అలాగే పృథివ్యాది భూతప్రమాణాలూ, సప్తసముద్ర విస్తారం, సప్తద్వీపవృత్తాంతం, సప్తకుల పర్వతాల విషయం, సూర్యాదిగ్రహ తారకసంచారం, దేవాదిచతుర్విధ భూతసృష్టి, చతుర్దశమన్వంతర వృత్తాంతం, నాలుగు యుగాల ప్రమాణం, కల్పవిషయం, యుగధర్మాలూ, దేవర్షుల చరిత్రలు, రాజవంశ చరిత్ర, వేదశాఖాప్రమాణాలూ, బ్రాహ్మణాది వర్ణధర్మాలూ, బ్రహ్మచర్యం మొదలుగా నాలుగాశ్రమాల పద్ధతి వినాలని ఉన్నది. సెలవియ్యవలసిందని మనవి అని అనగా పరాశరుడు పరమానంద హృదయుడై చెప్పాడు.

మైత్రేయా! మంచి విషయం అడిగావు. అదంతా నాకు తెలిసినదే. ఇప్పుడు నీవల్ల నాలోనుంచి బహిర్గతం అవుతుంది. విను.



నా చిన్ననాడు ఒకప్పుడు పులస్త్య బ్రహ్మ వచ్చి నన్నెంతో ఆదరముగా చూసి నువ్వు పురాణకర్తవవుతావు అని వరమిచ్చి వెళ్లిపోయాడు. ఆ వరం ప్రభావం పౌరాణిక విషయం అంతా నాకు స్వాధీనం అయింది. దానిని వివరిస్తాను విను అని అనగా మైత్రేయుడు ఆచార్యా! “పురాణకర్త”గా నిన్ను పులస్త్యుడు అనడానికి కారణమేమిటి? అని అడుగగా పరాశరుడు చెప్పాడు.

మునుపు విశ్వామిత్రుడు పగబట్టి మా తాత కొడుకులను నూర్వురను దారుణముగా చంపించాడు రక్షకులచేత, మా తండ్రి శక్తి వారితోనే మరణించాడు. అప్పటికి నేను తల్లి కడుపులో ఉన్నాను. వేదశాస్త్రాదులు నాకు వశమయ్యాయి. కొన్నాళ్లకు జన్మించాను. పెద్దవాడనై తపశ్చర్యలో ఉండగా మా అమ్మ దృశ్యంతి నా వద్దకు వచ్చి చెప్పింది.

నీ తండ్రిని నిష్కారణముగా రాక్షసులు వచ్చి దారుణముగా చంపారు. నిగ్రహించడం అనుగ్రహించడం అనే శక్తులు కలవాడవై శత్రుసంహారం చేయకపోవడం ఏమనాలి? అని నన్ను నిందాస్తుతిగా అన్నది. వెంటనే నేను అధర్వ మంత్రాలతో రాక్షస సంహారయజ్ఞం ఆరంభించాను. నా మంత్రాల ధ్వనికి లోకం అల్లలాడింది. సురలు ఆనందముగా జయధ్వనులు చేశారు. ఆ రాక్షస సంహారయజ్ఞములో లెక్కకు మిక్కిలిగా రక్కసులు మరణించారు.

చావక మిగిలినవారు మా తాత వసిష్ఠుని వద్దకు వెళ్ళి రాక్షస సంహార విషయం చెప్పి ప్రార్థించగా ఆయన వాళ్లకి అభయం ఇచ్చి నా దగ్గరకు వచ్చి ఆదరముగా అన్నాడు :

నాయనా! పరాశరా! శాంతించు. ఏదో ఎప్పుడో జరిగింది. దాని కిప్పుడు నువ్వు ఘోరంగా యీ జీవహింసాకార్యం మునులకు దూష్యం చేయవచ్చునా? ఇలాగ చేయవలసే వారు రాజులు. ఆపు. కోపం విడువు.

జీవహింస చేసేవారికి సద్గతి రాదు. ఆ విషయం నీకు తెలియనిది కాదు. ఇంకొకమాట. ఈ పని ఆనాడు నేను చెయ్యలేనా? కన్నతండ్రిని చూస్తూ ఊరకున్నాను. కారణం? జీవహింస మునులకృత్యం కాదు. కాబట్టి. శాంతించు. కోపం పాపానికి ధూపం. ఘోరనరకకూపం. ముక్తినీ, స్వర్గమును, సంపాదించిన తపశ్శక్తిని, పుణ్యమును, యశస్సును, ధర్మమునూ పోగొట్టుతుంది. ఇక వారి వారి కర్మఫలం కష్టసుఖాలను కలిగిస్తుంది. దానికై చింత, సంతోషం పొందకూడదు. చూడు. ఏ తప్పూ చెయ్యని రాక్షసులు వచ్చి అభయం కోరుతూ ఏడుస్తున్నారు. వారిని రక్షించు'.

తాత బోధ విని శాంతించి రాక్షస మారణహోమం ముగించాను...

అంతలో పులస్త్య బ్రహ్మవచ్చి మా తాతచే సత్కారం పొంది కూర్చుండి నన్ను చూశాడు. ఆనందించి అన్నాడు. వాసిష్ఠా! శాంతమూర్తివయావు. నీ కోరిక ఏమి? అని అడగగా నేను ఆయన పాదాలకు నమస్కరించి జ్ఞానం మధురమైన వాక్కు, ప్రతిభ, పాండిత్యం, పురాణప్రావీణ్యం కావాలి. ప్రసాదించు! అని ప్రార్థించాను. తథాస్తు అని ఆయన వెళ్లిపోయాడు. పులస్త్యుని వాక్కు నీ కోరికను సఫలం చేయుగాక! అని మా తాత వరమిచ్చినట్టుగా ఆశీర్వదించాడు.

మైత్రేయా! ఆ మహానుభావుల అనుగ్రహంవల్ల దేవరహస్య కార్యాలూ, వేదవిద్యా విశేషాలూ, నాకు కరతలామలకా లయాయి. అనేక శాస్త్రాలూ గాన నృత్య విశేషాలూ, చరాచర భూతగణ ప్రవర్తనా నాకు వశమయాయి. వివరించి చెప్పగలను. కాబట్టి నువ్వడిగినవి పురాణరూపాన చెప్తాను విను.

విష్ణువు భక్తవత్సలుడు. దేవమయుడు. దేవరక్షకుడు. విశ్వగురువు. సమస్తమూ విష్ణుమయమై నడుస్తుంది. ఆ దేవునికి సంబంధించి విష్ణుపురాణముగా చెప్తాను. అది వేదసమానముగా భావించు. శ్రద్ధగా ఆలించు!



విష్ణుపురాణం వేదాలలో వేదం, శాస్త్రాలలో శాస్త్రం, జ్యోతిషంలో జ్యోతిషం, నీతిశాస్త్రాలలో నీతిశాస్త్రం, పురాణాలలో పురాణం, ఇతిహాసాలలో ఇతిహాసం, యోగవిద్యలలో యోగవిద్య, కావ్యాలలో కావ్యం, సకలలోక విషయం, సకలజనమనోరంజనం.

పరమాత్ముడైన విష్ణుని చరిత్ర గల పురాణసంహిత అది. మునుపు బ్రహ్మదేవుడు దానిని స్వకీయబుద్ధి విశేషముతో దక్షప్రజాపతికి చెప్పాడు. ఆయన పురుకుత్సుడనే రాజునకు చెప్పగా ఆ రాజు సారస్వతునకు చెప్పాడు. అతని ముఖతః నేను విన్నది విన్నట్టు నీకు చెప్తాను.

మైత్రేయా! నీవల్ల ఈనాడు పరమానందుడు, జగద్వంద్యుడు, మునిలోకస్తుత్యుడు, నిత్యుడు అయిన రమారమణుని వర్ణించే అదృష్టం కలిగింది. నా జన్మకృతార్థం అయింది అని వాసుదేవునకు నమస్కరించి వసిష్ఠ పులస్త్య బ్రహ్మలను మనసా స్మరించి కనులు మూసికొని ధ్యానముద్రలో భూతభవిష్యద్వర్తమానములను తెలిసి కనులు తెరిచి ఆదరముగా శిష్యుణ్ణి చూసి అన్నాడు.

మైత్రేయా! జగములు తనలోన, జగములలో తానూ ఉన్నందువల్ల విష్ణువును ప్రాజ్ఞులు వాసుదేవుడు అని అన్నారు.

ఆ వాసుదేవుడు అంతా తనరూపమై చరాచరము లుంటాయి. ఆయన తనరూపం ఉపసంహరించుకుంటే సర్వం శూన్యం. అపుడు వాసుదేవుడు కాలపురుషుడౌతాడు. కాలం వాసుదేవుని లీలారూపం. ఆ రూపమే పగలుగా రాత్రిగా ఉంటుంది.

ఆద్యంతాలు లేక విశ్వమయుడైన వాసుదేవు డనగా కాలపురుషు డనగా నిర్వచించి ముందు వెనకలు చెప్పడం వేదాలకు కూడా సాధ్యంకాదు. విత్తు ముందా? చెట్టుముందా? అంటే ఏది ముందు ఏది వెనుక – ఎవరు

చెప్పగలరు మైత్రేయా?

ఆ వాసుదేవుని స్వరూపం కాలప్రవృత్తి. ఆ విధముగా ఉన్న కాలపురుషుని నుంచి శబ్దం పుట్టింది. ఆ శబ్దం నుంచి ఆకాశతత్వం ఉద్భవించింది. ఆ విధముగా ఆకాశం శబ్దగుణకం అయింది. ఆ శబ్దానికి స్పర్శ తన్మాత్రగుణం. ఆ స్పర్శ గుణంవల్ల వాయుతత్వం. వాయువునకు రూపం తన్మాత్రగుణం. ఆ రూపంవల్ల అగ్నితత్వం పుట్టింది. అగ్నికి రసం తన్మాత్రగుణం. ఆ రసంవల్ల జలతత్వం పుట్టింది. జలమునకు గంధం తన్మాత్రం. ఆ గంధంవల్ల పృథ్వీతత్వం పుట్టింది. పృథ్వికి శబ్దాదులైదున్నూ తన్మాత్ర గుణము లయ్యాయి. ఈ విధముగా పంచభూతాలూ తమలోని శబ్దగుణాలు ప్రవర్తించగా వ్యాపించి విశ్వమయమై భాసించడం విష్ణుభక్తిగా భావించు.

పృథివ్యప్తేజో వాయ్వాకాశములనే పంచభూతాలూ, శబ్దస్పర్శరూప రసగంధపంచకం, త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములనే బుద్ధీంద్రియాలైదు, వాక్పాణిపాద పాయూపస్థలనే కర్మేంద్రియాలైదు మనోబుద్ధ్యహంకారాలతో రాజస తామస సాత్వికగుణాతిశయముతో ప్రజాసృష్టి విస్తరిల్లింది. ఇది ఆదిభూతవిధం. ప్రపంచ మనగా ఒక దేహం. ఆ దేహధారి లక్ష్మీవసుధార మణుడైన కేశవుడు. కాగా ఆ ప్రభువువి కానివేవీలేవు. చరాచర స్థితులు ఆ లక్ష్మీపతి లీలలుగా గ్రహించాలి. ఈ విధంగా శ్రీపతి విశ్వమంతా తానే అయి వాసుదేవు డయాడు.

ఇక బ్రహ్మాండ సృష్టిని గురించి చెప్తాను విను.

పరమాత్ముడు, పంచభూతమయుడు, బ్రహ్మణ్యుడు తానే అయి హరినారాయణుడై పాలకడలిలో శేషశాయియై ఉన్నప్పుడు ఆతని రాజసవృత్తి సృష్టిక్రియను సాగించింది. ఒక నీటిబుడగను పోలి అండం ఒకటి ఉద్భవించింది. క్రమంగా గాఢాంధకారమునందు పెరిగింది. దానికి పైన



జల, అగ్ని, వాయు, ఆకాశములు ఆవహించాయి. ఆ నాలుగు భూతాలు ఒక్కొక్కటి అయిదేసిమారులు కలియగా ఆ అండం మరింత పెద్దదిగా ఉబికింది. ఆ అండములోంచి ఆ నారాయణుని రాజసమూర్తియై సృష్టికర్తగా బ్రహ్మ అనే ఒక దివ్యమూర్తి సంభవించాడు.

ఆ బ్రహ్మ చరాచర సృష్టికర్తకాగా సాత్వికమూర్తిగా విష్ణువు పోషిస్తూ ఉండడం, తామసమూర్తియైన రుద్రుడుగా చరాచర ప్రళయం చేయడం జరుగుతూ ఉంటుంది. ఇలాగు బ్రహ్మాండ ప్రళయాలు విష్ణులీలలుగా ఎన్నో జరిగాయి. ఆలాంటి నారాయణుడి మహిమ ఆ చతుర్ముఖ బ్రహ్మ కూడా తెలిసి చెప్పలేడు అని చెప్పగా మైత్రేయుడు ఆచార్యా! నిర్గుణుండని వేదాలు చెప్తాయి. మరి ఆ నిర్గుణమూర్తి సృష్టిస్థిత్యంతములు కలిగించడం ఎలాగా? అని అడగగా పరాశరుడు చెప్పాడు.

మైత్రేయా! అదంతా ఆయనకి సహజం. అగ్నికి వేడి ఎలా వస్తుంది అంటే ఏమి చెప్పేది? ఇక నారాయణ నామ నిర్వచనం చెప్తాను విను.

నారం అంటే నీరు. అది నివాసముగా గలవాడు నారాయణుడు. ఆ నారాయణుడు భూతరాశికి కర్త అయి ప్రజాపతి అని చెప్పదగినవాడు. అతని పరమాయువు నూరు సంవత్సరాలు . ఆ దేవుని పరమాయువైన నూరు సంవత్సరాల కాలములో మనలాంటి వారికి ఎన్నో సంవత్సరాలు తిరిగిపోతాయి. ఆ కాలక్రమం చెప్తాను విను.

ఒక్క లఘువును పలికేకాలం ఒక నిమిషం. పదునెనిమిది నిమిషాలొక కాష్ఠ. అవి ముప్పది ఒక కళ. ముప్పది కళలు ఒక క్షణం. పన్నెండు క్షణాలు ఒక ముహూర్తం. ముప్పది ముహూర్తాలు ఒక పగలు, ఒక రాత్రి (దినం). పదునైదు దినాలు ఒక పక్షం. రెండు పక్షా లొక నెల. రెండు నెల లొక ఋతువు. మూడు ఋతువులు (ఆరునెలలు) ఒక అయనం. అది

ఉత్తరాయణం, దక్షిణాయణం అని రెండు. ఆ రెండు ఒక సంవత్సరం. దేవతలకు అది ఒక పగలు, ఒక రాత్రి (ఒక దినం). దానికి సౌరమానం అని వ్యవహారం.

పదేడు లక్షల ఇరవై ఎనిమిది వేల సంవత్సరాలు కృతయుగం. పన్రెండు లక్షల తొంబదియారు వేల సంవత్సరాలు త్రేతాయుగం. ఎనిమిది లక్షల ఇరవై నాలుగువేల సంవత్సరాలు ద్వాపరయుగం. నాలుగు లక్షల ముప్పది రెండువేల సంవత్సరాలు కలియుగం. అలాంటి నాలుగు యుగాలు ఒక దివ్యయుగం. దానిలెక్క నలువది మూడు లక్షల ఇరవై వేల సంవత్సరాలు. ఇలాంటి యుగాలు ఒక వెయ్యి అయితే బ్రహ్మకి ఒక దినం.

బ్రహ్మ పగలు సృష్టి, రాత్రి ప్రళయం. దీనికి నైమిత్తిక కల్పమని సంజ్ఞ. ఇలాంటి దినాలు ముప్పది బ్రహ్మకి ఒక నెల. అవి పన్నెండు ఒక సంవత్సరం. ఆ సంవత్సరాలు నూరు బ్రహ్మ ఆయుఃపరిమాణం. దానికి మహాకల్పం అని వ్యవహారం. దానికి పూర్వార్ధానికి పద్మకల్పం అని ఉత్తరార్ధానికి వరాహకల్పం అని సంజ్ఞలు. ఇవీ కాలగతులు అని చెప్పగా విని మైత్రేయుడు సరే పద్మాసనుడు లోకమును సృజించిన విషయం చెప్పవలసిందని అడగగా పరాశరుడు చెప్పాడు.

కడచిన కల్పం చివరిదశయందు నిశియందలి నిద్రనుంచి నారాయణ ధ్యాన పరాయణుడై మేల్కొని బ్రహ్మ పరమశూన్యమైన లోకమును చూసి నారాయణ సాత్త్వికమూర్తియై అంతకుముందట మత్స్యకూర్మావతారాల లాగ వరాహరూపం ధరించి అగాధమైన సముద్రములో మునిగిన భూమిని ఉద్ధరించే సంకల్పముతో సముద్రములో ప్రవేశించి ఘుర్ఘుర ధ్వనితో ఉప్పొంగి దంష్ట్రాగ్రముతో అవలీలగా పూబంతిని ఎత్తినట్టు మీదికి ఎత్తాడు. సముద్రములో మునిగిన నావను కర్ణధారుడు గట్టుకి తెచ్చినట్టే ఆ పని...



పద్మదళం సరస్సులో తేలినట్లు భూమి సముద్రముపైకి తేలగా నీరు పాతాళానికి చేరింది.

అలాగు భూమిని సముద్రము పైకి నిలిపి నలువైపులా కొండలనుంచి ఇక్కట్టు కలగనట్లు ఆదికూర్మమును, శేషుణ్ణి క్రిందనుంచి భూమిని విశ్వమంతటా భద్రముగా ఉంచడానికి తన శక్తిని ప్రసరింపజేసిన మహానుభావుడు ఆ పద్మాక్షుడే.

భూమిని సముద్రము లోంచి ఉద్ధరించిన తరువాత మళ్లీ బ్రహ్మరూపుడై సకల నదీసముద్ర పర్వత ద్వీపాలను, సురాసురనర పితృలోకాలను, గరుడ గంధర్వ విద్యాధర పశుపక్షిమృగాది నానావిధ భూతసమూహమునూ మునుపటి సృష్టిలాగే సృష్టించి తగిన గుణరూప స్వభావ చేష్టలు కలిగించాడు అని చెప్పగా విని మైత్రేయుడు గురుదేవా! బ్రహ్మసృష్టి సంగ్రహించి చెప్పావు. దానిని వివరించి చెప్పవలసిందిగా కోరుతున్నాను అని అడగగా ఆ గురువు చెప్పాడు.

బ్రహ్మ ప్రజాపతియై నాలుగు మొగాలవాడు, రాజసగుణ ప్రభావుడు అయి సృష్టిని ధ్యానిస్తూ ఉండగా తమోమయము, తమోమోహము, మహామోహము, తమిస్రము, అంధతమిస్రము అని అయిదు జగాలకు ముఖ్యభూతములుగా ఆవిర్భవించాయి.

కాని అవి సక్రమమైన సృష్టికి సాధనాలు కాలేదు. అంతట ఆత్మజ్ఞాన–అజ్ఞానాలలో తామసమైన తిర్యగ్ధ్యానం తిర్యక్స్రోతమై పశుమృగాదులు పుట్టాయి.

తరువాత సాత్త్వికగుణ ధ్యానశక్తితో అమరసృష్టి కలిగింది. తదుపరి రాజస తామస గుణసంకలితమైన ధ్యానసృష్టిగా మానవసృష్టి జరిగింది.

ఆపైన కమలభవుని సకలావయముల నుంచి దేవ అసుర మనుజ పితృముఖ సచరాచరభూతసృష్టి అయింది.

తరువాత ఆయా జాతులు వారి వారి కర్మలు కారణములుగా పుట్టి హింసాహింసలూ, కాఠిన్యమార్దవములు, నిందానిందలు, ధర్మాధర్మాలు, సత్యాసత్యాలూ, జ్ఞానాజ్ఞానాలు కలిగి ఇంద్రియ వ్యాపారాలకు తగిలి నానావిధములైన రూపాలు జాతిస్వభావ చేష్టాగుణాలూ కలిగేట్టు సృష్టించాడు అని చెప్పగా విని మైత్రేయుడు అన్నాడు.

సరే – మానవులు ఏయే జాతులుగా బ్రహ్మ అవయవాల నుంచి ఉద్భవించారో? వినాలని ఉంది అనగా పరాశరుడు చెప్పాడు.

బ్రహ్మ సాత్త్వికగుణరూపముగా ముఖము నుంచి బ్రాహ్మణులు, రాజసగుణ రూపాన భుజముల నుంచి క్షత్రియులు, రాజస తామసగుణ రూపాన ఊరువులనుంచి వైశ్యులు, తామసగుణరూపాన పాదాలనుండి శూద్రులూ పుట్టారు. వీరిలో బ్రాహ్మణులకు వేదాధ్యయనం, క్షత్రియులకు భూపాలన, వైశ్యులకు కృషి, శూద్రులకు బ్రాహ్మణభక్తి విహితకర్మలుగా నిర్ణయించాడు.

ఈ నాలుగు కులాలవారూ బ్రహ్మ అవయవాలనుంచి పుట్టినవారే కనుక యజ్ఞాలు చెయ్యడానికి అర్హులే.

యజ్ఞాలవల్ల దేవతలకు సంతృప్తి సంతుష్టి కలుగుతాయి. ఆ దేవతల ఆనందం ప్రజావృద్ధికి మూలం. కాబట్టి యజ్ఞాలు కళ్యాణ కారణములుగా గ్రహించాలి.

పాపకర్మల ఆలోచన లేక, దుర్జనుల పనులు విమర్శించక, ధర్మమార్గం తప్పక, నింద వచ్చే పనులు చెయ్యక, ఇతరుల పొగడ్తలకు పొంగక ప్రవర్తించే నరులు సురలతో సమానులు.



తాము చేసిన దానముల ఫలముగా మోక్షమును మానవులు పొందుతారు.

శ్రద్ధగా ఆచారమును పాటిస్తూ ఎవ్వరినీ బాధించక తాము ఏలాటి బాధలూ పొందక నిర్మల మనస్కులై విష్ణుభక్తిపరాయణులుగా జీవించేవారు బ్రహ్మ ప్రత్యేకించి సృష్టించినవారని గ్రహించాలి.

తామస గుణముతో లోభమోహాలకు లొంగి పుణ్యక్రియల ఆలోచనలేక రోగాలకు చిక్కి పాపపుణ్యాలతో నలుగుతూ పామరులుగా ఉండేవారుగా బ్రహ్మ కొందరిని సృష్టిస్తాడు.

కొందరు పుణ్యాత్ములు, కొందరు పాపకర్ములు, కొందరు పాలకులు, కొందరు సేవకులు, కొందరు మాననీయులు, కొందరు సంపన్నులు, కొందరు దరిద్రులు బ్రహ్మసృష్టిలో ఉంటారు.

పరస్పరం ధనకాంక్షతో పోరాడేవారికి తగిన చతురంగ బలాలూ పురాలూ, వాహనాలూ – బ్రహ్మసృష్టి విశేషముగా తెలుసుకో!

మానవుల జీవనానికి ధాన్యం, పప్పుదినుసులూ, గోమహిషాలూ, నివాసాలూ, ఫలవృక్షాలూ, తిలలూ పెసలూ మొదలైన పదార్థాలూ బ్రహ్మ సృష్టించినవే.

ఇలా సృష్టించినా పెంపులేక సృష్టి ఉండడంచూసి బ్రహ్మ తనతో సమానులయిన ప్రజాపతులను సృష్టించి లోకమును ప్రజాసమృద్ధితో చెయ్యాలని సంకల్పించి నవబ్రహ్మలను మానసిక సృష్టిగా రూపొందించాడు.

వారు భృగువు, పులస్త్యుడు, పులహువు, క్రతువు, అంగిరసుడు, మరీచి, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు.

ఖ్యాతి, భూతి, సంభూతి, క్షమ, ప్రీతి, సన్నపి, ఊర్జ, అనసూయ, అరుంధతి అనే కన్యకలను సృష్టించి ఆ నవ బ్రహ్మలకు సక్రమంగా భార్యలను చేశాడు.

అలాగే సనకాది యోగులను మానస సృష్టిగా సృష్టించాడు. వారు సంసార విముఖులై బ్రహ్మవిద్యా పారంగతులై తపశ్చర్యకి జీవితాలు అంకితం చేసిన మహాత్ము లయారు.

తరువాత పద్మాసనుని కనుబొమ్మల నడుమ నుంచి కామినీసహితుడై మధ్యాహ్న భాస్కరుడులాగా ఫాలాక్షుడైన రుద్రుడు ఉద్భవించాడు. ఆ అర్ధనారీశ్వరుడి వెంట మరి పదిమంది జన్మించారు. మొత్తం వారు ఏకాదశ రుద్రులు.

తరువాత బ్రహ్మ ఒక పుత్రుణ్ణి పుట్టించాడు. అతని పేరు స్వాయంభువ మనువు. శక్తియుక్తులకు ఆ తండ్రిలాటివాడు. అతడు శతరూప అనే కాంతను పరిగ్రహించాడు. ఆ వధూవరులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అని ఇద్దరు కొడుకులు, ప్రసూతి, ఆకూతి అని ఇద్దరు కూతుళ్లు కలిగారు. దక్షుడు ప్రసూతిని, రుచికుడు ఆకూతిని చేపట్టారు.

వారికి యజ్ఞుడు అనే కొడుకు కలిగాడు. అతడు దక్షిణ యందు యాములు అనే కొడుకులు పన్నెండుగురు పుట్టి దేవగణములయ్యారు.

దక్షునకు ప్రసూతి యందు ఇరవై నలుగురు కూతుళ్లు జన్మించారు. వారిలో శ్రద్ధ, లక్ష్మి, ధృతి, తుష్టి, పుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, సిద్ధి, కీర్తి అనే పదముగ్గురను ధర్మువు పరిగ్రహించాడు.

ఖ్యాతి, సతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సన్నపి, అనసూయ, ఊర్జ, స్వాహ, స్వధ అనే పదునొకండ్రను వరుసగా భృగువు, భవుడు, మరీచి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అత్రి, వసిష్ఠుడు, అగ్ని, పితృదేవుడు వరించారు.

తదుపరి కల్పారంభ సమయమందు బ్రహ్మ అంకమునుంచి ఒకనిని పుట్టించాడు. అతని పేరు నీలలోహితుడు. పుట్టిన వెంటనే ఆ శిశువు



నాకు పేరేమి అని రోదించగ రోదనంవల్ల రుద్రుడు అని పేరు పెట్టాడు. ఆ బాలుడు అలాగే ఏడుమార్లు ఏడ్వగా వారించి భవుడు, శర్వుడు, మహేశ్వరుడు, పశుపతి, భీముడు, ఉగ్రుడు, మహాదేవుడు అని పేర్లు పెట్టి రుద్రాదిగా ఎనిమిది పేర్ల వానిని చేసి ఎనమండ్రుగా విభాగించాడు.

వారు సూర్యుడు, జలం, పృథ్వి, వాయువు, అగ్ని, ఆకాశం, దీక్షితుడు, చంద్రుడు అనే శరీరాలుగా ఉండేట్టు చేసి ఆ సూర్యాదులకు వరుసగా

సువర్చల, ఉష, సుకేశి, శివ, స్వాహ, దిక్కు, దీక్ష, రోహిణి అనే వారికి భార్యలనుగా చేశాడు.

అష్టమూర్తియైన రుద్రునకు మేనకాహిమవంతులకు జన్మించిన ఆదిశక్తి, పరమేశ్వరి, గౌరి, సతిగా ప్రస్తుతి పొంది భార్య అయింది.

భృగువునకు ఖ్యాతియందు ధాత, విధాత అనే కొడుకులు, లక్ష్మి అనే కూతురు జన్మించారు. ఆ లక్ష్మిని శ్రీహరికిచ్చి పెళ్లి చేశాడు అనగా విని మైత్రేయుడు అడిగాడు.

లక్ష్మికి పాలకడలి కూతురని లోకంలో పేరు. మీరు భృగుపుత్రిక అని చెప్తున్నారు. ఏమిటి ఈ వింత?

శిష్యుని ప్రశ్నకి గురువు చెప్పాడు. మైత్రేయా! సర్వభూతమయుడైన వాసుదేవుని మాయాశక్తి లక్ష్మీరూపముతో అతనికి తోడై ఉంటుంది. కనుక లోకాలకు సంపద కలిగించే వయిన పరికరాలన్నీ శ్రీచిహ్నము లని చెప్పదగినవి. ఇంతెందుకు? లోకాలలో చరాచరభూతకోటియందు అందమయిన స్త్రీరూపాలన్నీ లక్ష్మీరూపాలు. పురుషాకారములన్నీ హరిమయము లని గ్రహించు. పాలకడలిలో పుట్టి రమాదేవి వాసుదేవుని దేవియై లోకంలో ప్రసిద్ధి పొందడం వేదవాక్కు. ఆ వృత్తాంతం మరచి బ్రహ్మముఖతః నేను విన్నది చెప్తాను విను.

అత్రికి అనసూయ యందు శంకరాంశతో జన్మించిన వాడు దుర్వాసుడు. కోపానికి పురుషరూపం. కోపించాడంటే బ్రహ్మాదులను కూడా గడగడలాడించ గల అపరరుద్రుడు. తాపసులలో మిన్నగా పేర్గన్నవాడు.

ఒకప్పుడు భూమినంతనూ పరిభ్రమించి ఇంద్రలోకానికి వెళ్లాడు. అప్పుడు ఒక విద్యాధరకాంత నందనవనములో ఉన్న పారిజాతం నుంచి పువ్వులు కోసి దండ అల్లి పట్టుకుని ఎదురువచ్చి దుర్వాసుణ్ణి చూసి ఆ దండ ఇచ్చి నమస్కరించి వెళ్లిపోయింది. దుర్వాసుడు దండను తన జడలకు వేలాడగట్టి విలాసంగా ఏనుగులాగా నడుస్తూ వస్తూ ఎదురుగా ఐరావతారూఢుడై వస్తూన్న ఇంద్రుణ్ణి చూసి కొంచెం ప్రక్కకు ఒత్తిగిలి నిల్చున్నాడు. ఒకింత సేపటికి ఇంద్రుడు దగ్గరగా వచ్చాడు. వెంటనే దుర్వాసుడు తన జడలలో ఉన్న పూదండను తీసి ఇంద్రున కందించి దీవించాడు. ఇంద్రు డా దండను అంకుశముతో అందుకుని అలక్ష్యంగా ఐరావతం కుంభస్థలంపైన ఉంచాడు. ఆ పూదండ పరిమళానికి గండు తుమ్మెదలు రొద చేస్తూ దానిమీద వాలగా ఐరావతం బెదిరి ఆ పుష్పమాలికను తొండముతో కిందపడవేసి కాళ్లతో తొక్కి రేకులూడగొట్టి నలిపి విసిరి వేసింది. ఇటూ అటూ ఉన్నవారు, ఇంద్రుడు ఏనుగు చేసిన పనికి చప్పట్లు చరుస్తూ పకాపకా నవ్వసాగారు. దుర్వాసుడా వికారపు పనిచూసి నిప్పులు రువ్వే కళ్లతో చూసి –

ఔరా! ఇంద్రా! అమరాధిపతివని ఆదరించి మన్ననగా పూదండ ఇస్తే రాజ్యాధికారమదముతో ఇలాంటి దుర్నీతి పని చేస్తావా? నీ సిరీ, సంపదా సముద్రములో కలియుగాక! అని శపించి వేడినిట్టూర్పులు విడుస్తూ వడివడిగా అడుగులు వేస్తూ వెళ్లిపోయాడు.

వెంటనే ఇంద్రుడు ఏనుగు మీంచి దిగి పరుగెత్తిపోయి దుర్వాసుని పాదాలకు సాష్టాంగముగా నమస్కరించి లేచి చేతులు జోడించి మహామునీంద్రా!



క్షమించు! నా తెలివి తక్కువతనం క్షమించు! అనుగ్రహించు అని గద్గదకంఠుడై ప్రార్థించగా దుర్వాసుడు నెయ్యిపోసిన అగ్గిలాగ మరింత ఉడుకెత్తి –

దురాత్మ! మర్యాదా, మన్ననా లేక నన్ను అవమానిస్తావా? ముజ్జగాల దొరతనం అంతమత్తెంకించిందా? అలా చేసిన అవమానం చాలక ఇంకా ఏదో అని నన్ను వలలో వేసుకోవాలని చూస్తున్నావా? నోరు మూసుకుని పోతివా సరే, లేదా నీ పేరూ ఊరూ లేకుండా శపిస్తాను చూడు.

ఆనాడు దొంగవేషం వేసి అహల్యను అవమానించి గౌతమునిచే దయదలచి బ్రతికి వచ్చావు. నేను గౌతముణ్ణి కాను. నా కోపానికి అగ్ని కూడా బూడిద అవుతాడు. అత్రి మహాముని కొడుకును తెలుసునా? పో! నువ్వు ఇంకా ఏమైనా అన్నావో నీ బ్రతుకు నడివీథి మెతుకవుతుంది. భరించరాని అవమానం చేశావు. పోరా!... అని వడివడిగా పరుగెత్తినట్టు వెళ్లిపోయాడు. చేసేది లేక ఇంద్రుడు వెనుదిరిగి వచ్చి కందిపోయిన హృదయముతో కుందుతూ ఐరావతం ఎక్కి ధారగా కన్నీరు కారే కళ్లతో భవనానికి వెళ్లాడు.

అంతే. అమరావతిలో ఒకటే కలకలం. ఏమిటా అని బిక్కమొగముతో భవనము నుంచి వెలుపలకు వచ్చి నిల్చున్నాడు. అప్సరసలు, కల్పవృక్షాలూ కామధేనువు, ఐరావతం, ధనరాసులూ ఒకదానివెంబడి ఒకటి పెనుగాలికి దొర్లిపోయినట్టు పోయి అదృశ్యము లయాయి. ఇంద్రజాలంలాగా అయి అమరావతి సర్వశూన్యం అయిపోయింది.

దుర్వాసుడు పెట్టిన శాపం ముల్లోకాల ప్రభువుకి తగిన ముజ్జగాలకి ఆవరించింది. ధరలో దానధర్మాలు తెరచాటయాయి. అనావృష్టి, సస్యనాశం, ధనధాన్యాల తరుగుదల. యజ్ఞాలు పేరుకే. మరి దేవతలకు ఉపవాసం

ఇలాంటి దౌర్భాగ్యం పట్టింది. ఇదే సమయ మని విప్రజిత్తు మొదలైన దానవులు అమరావతి మీదికి దండెత్తారు. అక్కడ చాటుమాటుగా ఉన్న సంపద కొల్లగొట్టి ఇంద్రుణ్ణి ఎదిరించారు. సర్వసన్న్యాసం చుట్టుకున్న ఇంద్రుడు వారి నెదిరించలేక పారిపోయి బ్రహ్మను దర్శించి దుర్వాసుని శాపంవల్ల ముల్లోకాలకూ, తనకూ పట్టిన దౌర్భాగ్య దశ రోదిస్తూ చెప్పాడు.

ఇంద్రా! దుర్వాసుడు సామాన్యుడు కాడు. సిరిసంపదలు నీకుపోయిన నువ్వు ప్రాణాలతో ఉన్నావు. అంతకి సంతోషించు. ఆ దుర్వాసుడి పేరు చెప్పితే నా గుండె కూడా గడగడలాడుతూంది. ఒక్కమాట విను. ఎలాంటి ఆపదలనూ బాపి సిరిసంపదలు నింపుగా కలిగించి కాపాడే సర్వశక్తి సంపన్నుడు లక్ష్మీరమణుడు. పద. ఆ స్వామిని ప్రార్థింతము అని అగ్ని మొదలు దిక్పాలకులనూ, బృహస్పతి మున్నగా గల మునులనూ వెంటనుంచుకొని బ్రహ్మ పాలసముద్రం వద్దకు వెళ్లాడు. అందరూ శ్వేతద్వీపం చేరారు. ఆ ద్వీపం నడుమనున్న వైకుంఠమునూ, దానిలో లక్ష్మీమండపముపై సనకాదుల దివ్యప్రసంగాలు వింటూ ఉన్న కోటికందర్పమూర్తిని పుండరీకాక్షుణ్ణి, దివ్యాలంకార శోభితుణ్ణి, పీతాంబరుణ్ణి, లక్ష్మీమనోహరుణ్ణి దర్శించి ఆనందపరవశు లయ్యారు. వివిధ రీతుల స్తుతించారు. ఆ సమయంలో లక్ష్మీపతి ఇంద్రుణ్ణి చూసి –

దేవేంద్రా! ఏమి వార్త! చిన్నవోయిన మోముతో చెన్నుదరిగి కనిపిస్తున్నావు. బ్రాహ్మణ క్షోభ నీకు తగిలినట్లు తోచుతూంది అని అనగా బ్రహ్మ దుర్వాసుడు శపించడం, ఇంద్రరాజ్య సంపదలు సర్వశూన్యమవడం చెప్పాడు. ఈ దౌర్భాగ్యం ఎలా తప్పుతుందో సెలవియ్యవలసిందని అడిగాడు. అంతా విని శ్రీహరి కనికరపు చూపుతో ఇంద్రుణ్ణి చూసి – వాసవా! విచారించకు! నేను చెప్పేది విను.



దిక్పాలకులతో వెళ్లి రాక్షసులతో కపటపు సంధి చేసుకుని వాళ్ళూ మీరు పాలసముద్రంలో ఓషధీలతలు వేసి మందరగిరి కవ్వముగా – వాసుకి త్రాడుగా ఆ సముద్రమథనం చెయ్యండి. నా సహాయం సమయానుసారంగా ఉంటుంది. అమృతంతో సహ మహిత వస్తువులు ముల్లోకాల వైభవానికి కారణమ్ములైనవన్నీ వస్తాయి. అమృతపానం అవుతుంది. ఆ పోయిన సంపద అంతా మీ వశం అవుతుంది. రాక్షసులకు చెందేది శ్రమ మాత్రమే. నువ్వు యథాపూర్వముగా ముల్లోకాల అధిపతివవుతావు. వెళ్లు – అని ధైర్యం చెప్పి పంపించాడు. అందరూ ఆనందంగా వెనుదిరిగి వచ్చారు. చమత్కారంగా మాటాడి దనుజులతో సంధి చేసుకున్నారు.

మందరగిరిని పెల్లగించి తెచ్చారు. వాసుకిని కవ్వపు తాడుగా చుట్టి పాలకడలిలో వేశారు. ఓషధీలతలు చుట్టూ ఉంచారు. అడుగున ఆధారం లేక మందరగిరి లోనికి దిగజారింది. ఇంద్రుడు మనసా పుండరీకాక్షుణ్ణి ధ్యానించి ప్రార్థించగా పద్మాక్షుడు వచ్చి లక్షయోజన విశాలమైన కూర్మరూపం ధరించి జలధిలో ప్రవేశించి మందరగిరిని పైకెత్తి తన వెన్నుపై ధరించాడు. నిజరూపముతో వచ్చి దేవదానవులను చూసి తరవండి అని ప్రోత్సహించాడు.

దేవతలు వాసుకి తోకను దానవులు తలను పట్టుకుని మందరగిరిని త్రిప్పనారంభించారు. వాసుకి శ్రమపడుతూ విడిచే నిట్టూర్పులతో విష జ్వాలలు వచ్చి దానవులను బాధించేవి. వారు ఆ బాధకి చిక్కి అలాగే త్రిప్పుతూ ఉంటే దేవతలు ఏలాటి శ్రమ ఎరగక త్రిప్పుతూ ఉన్నారు.

అలాగు తరవగా తరవగా సముద్రము నుంచి కల్పవృక్ష కామధేనువులూ, చింతామణి, రంభాద్యప్సరసలూ, ఐరావతం, ఉచ్చైశ్రవం వెలికిరాగా శ్రీపతి ఆ సమూహమును ఇంద్రున కప్పగించాడు.

నవనిధులు పుట్టగా కుబేరునకు ఇవ్వగా, చంద్రకళరాగా శివునకు శిరోభూషణంగా ఇచ్చాడు.

ఒక కల్లుకుండ రాగా దానిని దానవులు కైవసం చేసుకున్నారు. భరించరాని విషం రాగా సర్పాలు తీసుకున్నాయి.

తరువాత – అమృత కలశం పట్టుకుని దివ్యాంబరాభరణ ధరుడు ధన్వంతరి వెలికివచ్చి విష్ణువు కనుసైగచే తీరమునందున్న ఒక వృక్షము కింద నిల్చున్నాడు.

తరువాత పద్మపాణి, లోకజనని, విద్వాంసుల ఉపాస్యదేవత, త్రిలోకసుందరి, దయారాశి, లక్ష్మీదేవి పాలకడలి తరంగాల మీంచి అల్లనల్లన తీరానికి వచ్చింది.

మునులు శ్రీదేవిని శ్రీ సూక్తముతో స్తుతించారు. విశ్వావసువు మొదలైన గంధర్వులు శుభగీతాలు పాడారు. ఘృతాచి మొదలైన అచ్చరలు ముచ్చటగా నాట్యమాడారు. ఐరావతాది దిగ్గజాలు సువర్ణ కలశాలలో గంగాజలం తెచ్చి అభిషేకించాయి. సముద్రపతి ఎన్నడూ వాడని పద్మమాలిక ఇచ్చాడు. విశ్వకర్మ దివ్యరత్నాలంకారాలు సమర్పించాడు. బ్రహ్మరుద్రాది దేవతలు దివ్యమాల్యాంబరాలతో చందనముతో అలంకరించారు.

ఇలాగు మహావిభవాభిరామయైన ఆ దేవిని దేవదేవుడు పరిగ్రహించి వక్షఃస్థల నివాసినిగా చేసుకున్నాడు. వెంటనే ముల్లోకాలూ సకల సంపద్వృద్ధిని పొంది కలకలలాడాయి.

శ్రీహరి తనకు శత్రువులైన దానవులకు తృణమైనా చేరనీక జలధిలో సంభవించినదంతా తన అనుచరులైన దేవతలకు సంక్రమింపజేశాడు.



అంతలో విప్రజిత్తి మొదలైన దానవులు గుమికూడి ఉరికి అమృత కలశం తీసుకుని పోయారు. దేవతలు బిక్క మొగాలతో చూస్తూ నిల్చున్నారు. శ్రీపతి వెంటనే మోహినీ రూపముతో దానవులవద్దకు వెళ్లి వారిని మోహ విభ్రాంతులను చేశాడు.

చిరునవ్వులు, చికిలి చూపులూ, అంచనడలూ, చేసంజ్ఞలూ మొదలైన విలాసాలు ప్రదర్శించే ఆ మోహినిని చూసి అందరూ ముగ్ధులయ్యారు. దానవుల మాట చెప్పనక్కరలేదు. తమవద్ద అమృతకలశం ఉందన్న విషయమే మరిచిపోయి పరవశమైపోయారు. ఆ అవస్థలో మోహిని వారివద్దనున్న అమృతకలశం తీసుకుని దేవతలకు పంచిపెట్టింది. అమృతపానముతో ఇంద్రుడు రెట్టించిన బలపరాక్రమాలు కలవాడయ్యాడు. వజ్ర ప్రయోగముతో దానవులను హడలగొట్టగా చేసేది లేక అందరూ పాతాళానికి పారిపోయారు.

మందర పర్వతమును మునుపటి చోట ఉంచి వాసుకిని ప్రశంసించి పంపించి దేవతలు తమ స్థానాలకు వెళ్లారు.

ఇంద్రుడు లక్ష్మీకాంతునకు నమస్కరించి ఆ స్వామి కరుణచే ముల్లోకాల పాలనాధికారం పొందాడు. సూర్యుడు ప్రసన్నదీప్తిమంతుడై ప్రకాశించాడు. గ్రహ తారకాగణాలు యథాపూర్వముగా విలసిల్లాయి. అగ్నిహోత్రాలు ప్రదక్షిణార్చులతో వెలిగాయి. భూతకోటి హృదయం ధర్మజ్ఞానముతో విలసిల్లింది. భూమండలం అనావృష్టి దోషం, రాచ దురుసుతనం పోయి సస్యసమృద్ధితో ప్రజాభివృద్ధితో రాణించింది. సకలలోకాలూ సంపత్కరము లయాయి. ఈ విధముగా లక్ష్మీవిలాసంవల్ల లోకాలన్నీ నిండుకుండలు అయ్యాయి. ఇంద్రుడు శ్రీకాంతుని అనుమతితో అమర సమేతుడై అమరావతికి వెళ్లి సమధిక సంపత్కళతో ధర్మమార్గాన ప్రవర్తిస్తూ ఉన్నాడు. నిత్యమూ తనను ఉపాసిస్తూన్న ఇంద్రునకు మహాలక్ష్మి ప్రత్యక్ష్యం కాగా సాష్టాంగ నమస్కారం చేసి లేచి చేతులు మోగిచి ఇంద్రుడు స్తుతించాడు.

అంబా! బ్రహ్మ, మునులు మనసారా నిన్ను ధ్యానిస్తున్నా దర్శనభాగ్యం పొందలేరు. ఆలాంటి తల్లివి నీ పదపద్మ దర్శనం పొంది ధన్యుడనైనాను.

నీ దయ కలవానికి ఎప్పుడూ ఎలాంటి ఆపదలూ ఉండవు. ఆ వ్యక్తి సభలలో అందరికీ మాననీయుడవుతాడు. చక్కని వాగ్వైభవముతో ఆ పురుషుడు విరాజిల్లుతాడు. అందరికీ ఆశ్రయుడవుతాడు. తల్లి నీ కృపకి పాత్రుడైనవాడు ఏలాంటి తప్పులు చేసినా బాధలు పొందక సుఖి అవుతాడు. నీ దయలేనివాడు శిక్షాపాత్రు డౌతాడు.

అని నుతింపగా లక్ష్మీదేవి ఇంద్రా! భక్తితో నన్ను ఆరాధిస్తున్న వాడవు కనుక సంతసించి దర్శనమిచ్చాను. కోరుకో వరం ఇస్తాను అని అనగా ఇంద్రుడు అడిగాడు.

మాతా! నేను నేర్చిన విద్యలయందు, శరచాపఖడ్గాది సాధనముల యందు, చతురంగ బలముల యందు, గోమహిషాదులయందు, అవి గల ప్రదేశముల యందు, మణికనక వజ్రాలంకారాలయందు, పరిమళ ద్రవ్యముల యందు, నా పుత్రమిత్ర కళత్రబంధువులందు, శక్తిగుణ – ఇంద్రియములందు, రాష్ట్రాలలో, దుర్గాలలో, రాజధానులలో, క్రీడావిహార ప్రదేశాలలో, నా శరీరమునందు దయతో నీవు ఉండవలసిందిగా నా కోరిక.

నిన్ను ఇలాగు నుతించే వానియందు కొడుకుని చూస్తున్నట్టు దయతో చూస్తూ రేయింబవళ్లు కాపాడుతూ ఉండవలసిందని నా ప్రార్థన.

తథాస్తు – అని అభయ హస్తముతో ఇంద్రుడిని అనుగ్రహించి లక్ష్మీదేవి అదృశ్యురాలయింది. ఆనాటి నుంచి ఇంద్రుని నివాసం లక్ష్మీకళతో రాణిస్తూ ఉంది.

వాసుదేవుడు కృతయుగమునందు పరశురాముడుగా అవతరించగా లక్ష్మీదేవి భూదేవి అయింది. త్రేతాయుగమున శ్రీరాముడుగా అవతరించగా



సీతాదేవి అయింది. ద్వాపరయుగమందు కృష్ణావతారుడు కాగా ఆ దేవి రుక్మిణీదేవి అయింది. కలియుగమున సూర్యరూపుడు కాగా ఆమె పద్మిని అయింది. ఈ విధముగా లక్ష్మీదేవి పద్మాక్షునకు తోడై ఉంటుంది. ఆ స్వామి దేవరూపములో ఉంటే ఆ దేవి దేవతాకాంతరూపాన, మానవరూపములో ఉంటే మానవకాంతగా ఉండి శబ్దమునను సరించే అర్థంలాగా అనుసరిస్తూ ఉంటుంది అని లక్ష్మీచరిత్ర చెప్పగా విని మైత్రేయుడన్నాడు.

సరే ఆచార్యా! ఇక భృగువు మొదలైన మునుల సృష్టి విశేషాలు వివరించవలసింది – అని అనగా పరాశరుడు చెప్పాడు.

భృగువునకు ఖ్యాతియందు ధాత, విధాత అనే కొడుకులు. వారికి మేరుపుత్రికలు ఆయతి, నియతి అనే కన్యలు భార్యలు. ధాతకి ఆయతియందు ప్రాణుడు, విధాతకు నియతియందు మృకండుడు జన్మించారు. ఆ మృకండుని నందనుడే మార్కండేయుడు, దీర్ఘాయువు...

ప్రాణునకు వేదశరుడు, వానికి ద్యుతిమంతుడు, అతనికి అజరుడు జన్మించారు. వారి వంశాలు మిక్కిలిగా విస్తరించాయి.

మరీచికి సంభూతియందు పౌర్ణమాసుడనే కొడుకు అతనికి విరజుడు, పర్వతుడు అని ఇద్దరు కొడుకులు.

అంగిరసునకు స్మృతియందు అసుమతి, రాక, సినీవాలి, కుహు అను నల్గురు జన్మించారు.

అత్రికి అనసూయయందు చంద్రుడు, దుర్వాసుడు, దత్తాత్రేయుడు అని ముగ్గురు దివ్యశోభామహిమాన్వితులు బ్రహ్మ శివకేశవాంశ సంజాతులు పుట్టారు.

ప్రీతికి దత్తాగ్ని – అతడు స్వాయంభువ మన్వంతరమునందు అగస్తుడయ్యాడు.

పులహునకు క్షమయందు కర్దముడు, సహిష్ణువు, ఊర్ధ్వరేతుడు కలిగారు.

క్రతువునకు సన్నతియందు వాలఖిల్యాదులు అరవై అయిదుగురు పుట్టారు.

వసిష్ఠునకు ఊర్జయందు విరజుడు, గోత్రుడు, ఊర్ధ్వబాహుడు, సవనుడు, అనఘుడు, సుతపుడు, శక్రుడు అని ఏడ్గురు కొడుకులు జన్మించారు. వారు ఉత్తమ మన్వంతరమందు సప్తర్షులు అయ్యారు.

అగ్నికి స్వాహయందు కలిగినవారు పావకుడు, పవమానుడు, శుచి. వారికి నలభై అయిదుగురు పుట్టారు. ఆ విధంగా అగ్నులు నలభై తొమ్మిదిమందిగా విస్తరించారు.

పితృదేవునకు స్వధయందు పితృగణాలూ, మేనక, వైతరణి అనే కన్యకలూ పుట్టారు. ఆ కన్యలు దివ్యజ్ఞానమూర్తులూ, బ్రహ్మవాదినులూ, యోగినీదేవతలూ అయ్యారు అని చెప్పగా విని మైత్రేయుడు సరే ఇక స్వాయంభువమనువు వంశమునందు పుట్టిన రాజుల చరిత్ర చెప్పవలసిందని అడిగాడు.

* * *

## 2

పరాశరుడు చెప్పాడు. ఆదిమనువైన స్వాయంభువునకు ప్రియంవదుడు, ఉత్తానపాదుడు అని ఇద్దరు కొడుకులు. ఉత్తానపాదునకు ఉత్తముడు, ధ్రువుడు అని కొడుకులు ఇరువురు అని చెప్పగా మైత్రేయుడు గురువర్యా! ధ్రువుడు పరమభాగవతుడని పెద్దలమాట. అతని చరిత్ర విస్తరించి చెప్పవలసిందని అడగగా పరాశరుడు చెప్పాడు.



### ధ్రువ చరిత్ర

ఉత్తానపాదుడు ఏకచ్ఛత్రముగా భూమినేలుతూ శత్రురాజుల ప్రక్కలో బల్లెమై, ధైర్యశౌర్య పరాక్రమాలకు రూపమై, నయమార్గాన ప్రజాపరిపాలన చేస్తూ ఉండేవాడు.

నిర్విఘ్నముగా దేవ భూదేవ తృప్తిగా యజ్ఞాలు చేశాడు. దిగంత విశ్రాంతమైన యశస్సు సంపాదించిన మహారాజు. అతనికి సురుచి, సునీతి అని ఇద్దరు భార్యలు. సురుచి కొడుకు ఉత్తముడు. సునీతి సుతుడు, ధ్రువుడు ఇద్దరు సోదరులూ సమానరూప రేఖావిలాసాలూ, విద్యావివేకాలూ కలవారై పెరుగుతూ ఉండగా ఒకనాడు ఉత్తానపాదుడు నిండు కొలువులో సింహాసనాసీనుడై ఉత్తముణ్ణి అంకముపై ఉంచుకుని ముచ్చటలాడుతూండగా ధ్రువుడు వచ్చి తండ్రి తొడమీద కూర్చుండడానికి సింహాసనం వద్ద నిలిచి చెయ్యి చాచాడు. ఆ సమయములో సవతి తల్లి సురుచి సభామర్యాదను పాటించక సవతి మచ్చరముతో ధ్రువుణ్ణి వారించి నీరసంగా చూసి –

ఆగరా! ఆగు. ఈ సింహాసనం ఎక్కడానికి నా కొడుకు అర్హుడుగాని నువ్వు కావు. ఈ రాజుకి నేను ప్రియపత్నిని. సిరి, సంపద, ఐశ్వర్యం అంతా నాది. నీ తల్లి నా సవతిగా ఉండడానికి ఏదో అదృష్టం – అంతే. నా దగ్గరకు వచ్చి ఏదో వాగుతూ ఉంటుంది. నేనామాటలు లక్ష్యపెట్టను. ఈ సింహాసనం ఎక్కడానికి నా కొడుకు ఉత్తముడు తగినవాడు. నీకు అలాంటి ఉత్తమత్వం ఉంటే ఆ అదృష్టం నీకు కలుగుతుంది. ఊరక చెయ్యి చాస్తే ఆ అదృష్టం పట్టుతుందా? పోరా! అని చెయ్యి పట్టుకుని వెనుకకునెట్టి వీపుమీద చరిచింది.

ధ్రువుడు చెమ్మగిలిన కనులతో బిరబిర నడిచి తల్లివద్దకు వెళ్లి పెదతల్లి చేసిన పని, తండ్రి ఉపేక్ష – ఏడుస్తూ చెప్పాడు.

ఆ ముద్దరాలు పైట చెరగుతో కొడుకు కన్నీళ్లు తుడిచి అల్లనల్లన ఓదార్చి ఏడుపు మానిపించి నీరు గమ్మిన తన కళ్లు అరచేతులతో ఒత్తుకుని సన్నని కంఠస్వరముతో అన్నది :

నాయనా! సురుచి అనినదంతా నిజం. రాజు దానిపై ప్రాణాలు నిలిపి ఉన్నవాడు కనుక దాని కొడుకుకి ఆ మన్నన కలుగుతూంది. ఆ పద్ధతిలో మనకి అంత చనువు ఎలా ఉంటుంది? అది సౌభాగ్యవతి కనుక దానికీ, దాని కొడుకుకీ రాజువల్ల మన్నన కలుగుతూంది. మనం మందభాగ్యులం. మనకా రాజువల్ల మన్నన ఎలా కలుగుతుంది?

ఇక ఆ సురుచి కొడుకు రాజై పరిపాలన చేసే సమయం వస్తే నువ్వు వాని అడుగులకు మడుగులొత్తుతూ బతకవలసి వస్తుంది. అలాంటి దౌర్భాగ్యానికి నువ్వు తలఒగ్గితే నా కడుపున పుట్టిన ఫలితం నాకేమి దక్కుతుంది అని కంట నీరు కార్చిన తల్లిని చూసి ఓదార్చి ధ్రువుడన్నాడు.

అమ్మా! విచారించకు. ఆ ఉత్తముడు రాజై రాజ్యం ఏలనీ! ఈ రాజుకి యీ రాజ్యం, సిరి, సంపదా యిచ్చినవాడు మనకి ఇవ్వడా? ఇదిగో నా మాట విను.

అన్నవల్ల ఇప్పటి రాజు పొందిన రాజ్యభోగాలు క్షణికములు. అలాంటి ఐశ్వర్యం నాకక్కరలేదు. ఆ దేవతలకు పైన ఉండే పదమందు – సూర్యచంద్రులు వెలుగుతూన్నంతకాలం నేను ఉండడానికి సంకల్పించాను. ఒక్కటే నా ప్రతిజ్ఞ అని తల్లిని ఓదార్చి ఆ చిన్నబాలుడు ధ్రువుడు ఏలాటి విచారం లేక తపస్సు చేసే సంకల్పం తల్లికి చెప్పి నగరం నుంచి బయల్వెడలినాడు. నగరం వెడలి సమీపాన ఉన్న ఉద్యానవనములో కృష్ణాజినములపై ఆసీనులై ఉన్న సప్తర్షులను చూసి నమస్కరించగా వారు అన్నారు.



ఎక్కడినుంచి వస్తున్నావు? ఎవరు నువ్వు? నీ పేరేమి? ఒంటరిగా ఎందుకిలా వచ్చావు?

నేను ఉత్తానపాదుడనే రాజు కొడుకును. నా పేరు ధ్రువుడు. తపస్సు చెయ్యాలని ఇలా వచ్చాను. నా పూర్వపుణ్యఫలం వల్ల మీ దర్శనం అయింది అని ధ్రువుడు చెప్పగా వారు ఆశ్చర్యముగా చూసి రాజభోగాలు విడిచి ఇలా తపశ్చర్యకి నిశ్చయించుకున్నావా? ఏమి కారణం? నిండా అయిదేళ్లవాడవు. సుకుమార మోహనాకారుడవు. లవలేశమైనా రోగబాధ ఉన్నట్టు కనిపించవు. తల్లిదండ్రులు సజీవులై ఉన్నవాడవు. ఇలాంటి నువ్వు కష్టసాధ్యమైన తపస్సుకి దిగడమేమిటి? ఇలాంటి చిన్నతనం బుద్ధి విడిచి తిరిగిపో అని అనగా ధ్రువుడు సవతితల్లి అనిన మాటలు, తండ్రి ఉపేక్ష, తల్లి విచారం, తన ప్రతిజ్ఞ చెప్పి ఇక తిరిగి పోయేది లేదు. దయచేసి నా సంకల్పం సఫలమయేట్టు మార్గోపదేశం చెయ్యండి అని చేతులు జోడించి నమస్కరించాడు. ధ్రువుని సమాధానం విని వారు తమలో తాము అనుకున్నారు.

యుద్ధములో పగవాని బాణాలకి బాధపడని రాజనందనుడు సవతితల్లి పోటుమాటలకి బాధపడ్డాడా? ఆశ్చర్యం అని అనుకుని ధ్రువుణ్ణి చూసి

రాకుమారా! నీ కోరిక సఫలం కావాలంటే సర్వేశ్వరుడు సర్వశక్తి సంపన్నుడు, భక్తజన పారిజాతం, పద్మాక్షుణ్ణి ఉపాసించాలి. మునుపు మీ వంశకర్త స్వాయంభువ మనువు, ప్రియవ్రత – ఉత్తానపాదులును ఆ వాసుదేవుని భజించి కృతార్థులయ్యారు. మావంటి మునులున్నూ ఆ లక్ష్మీకాంతుని ఉపాసించి అందరికీ సమ్మాన్యులయ్యారు. కాబట్టి నువ్వు కూడా ఆ లక్ష్మీనారాయణుని ఆరాధించు. కృతార్థుడవవుతావు అని ద్వాదశాక్షరమంత్రం ఉపదేశించి తపస్సు చేసే పద్ధతి చెప్పి కృతార్థుడవవుదువుగాక!

అని ఆశీర్వదించారు. తరువాత ధ్రువుడు అక్కడినుంచి యమునా తీరాన ఉన్న మధువనమునకు వెళ్లి యమునలో స్నానం చేసి మునులు చెప్పిన పద్ధతిని మనస్సును విష్ణువునందు లగ్నం చేసి మంత్రం జపిస్తూ బాహ్య ప్రపంచమును మరచి నిశ్చలదీక్షలో ఉన్నాడు.

ఒక పాదం నేలమోపి ఊర్ధ్వబాహుడై ఉగ్ర తపస్సు చేస్తూ ఉండగా భూమి ఆ పాదం బరువుకి లోనికి క్రుంగింది. చివరకు ధ్రువుని తపశ్చర్య చరాచర భూతకోటికి సహించరానిదయింది. ఆ దశలో ఇంద్రుడు ధ్రువుని తపస్సుకి విఘ్నం కలిగించాలని తలంచి యాములనే దేవతలను రప్పించి వెళ్లండి భూతప్రేత పిశాచరూపాలతో ఉండే కూశ్మాండ రాక్షస గణాలతో వెళ్లి భయంకర ధ్వనులతో ఆ బాలునిచుట్టూ అరవండి. వాడు భయపడి తపస్సు విడిచేట్టు చెయ్యండి అని ప్రోత్సహించాడు.

యామదేవతలూ ఆ రక్కసులూ వివిధ క్రూర జంతువుల్లాగా మారి విషసర్పాల్లాగా, పెద్దపులుల్లాగా, పిశాచాల్లాగా, కార్చిచ్చులాగా, విషం చిమ్ముతూ, మంటలురొప్పుతూ, భీకరంగా అరుస్తూ ధ్రువుని చుట్టూ తిరగగా వారి ఆటలు వానిముందు సాగలేదు.

ఒక మాయావి అయిన రాకాసి సునీతిలాగా మారి ధ్రువుని వద్దకువచ్చి కుమారా! ఒకే ఒక్క కొడుకువి. నన్ను వదిలి ఇలాగ కారడవికి వచ్చి తపస్సు చెయ్యడం – నన్నేడిపించడం తగునా? ఆ విష్ణువు నీలాంటి బాలురకు వరాలిచ్చినట్టు విన్నావా? ఎందుకీ శ్రమ? అందని పండుకి అర్రుచాచినట్టు నీ పని శ్రమకరమేగాని కనిపించని ఆ విష్ణువుచే వరాలిప్పిస్తుందా?... లే... లే... పోదాం రా. మీ నాయనని మెప్పించి తిరుగుతూ రాజభోగా లనుభవించవచ్చు. ఎందుకీ కీకారణ్యంలో ఈ వయసులో ఒంటరితనం. తపస్సు? లే. చిన్నతనంలో ఆటపాటలతో, ముద్దుమాటలతో తల్లిదండ్రులను సంతోషపెట్టడం, యుక్తవయస్సు రాగా చక్కని చుక్కలాంటి కన్నెను పెళ్లాడి ఆనందంగా జీవించడం, వయస్సు ముదిరాక అడవికి వచ్చి తపస్సు చెయ్యడం లోకధర్మం. అలా ప్రవర్తించక యీ వయసులో తపస్సేమిటి నాయనా? సవతితల్లి ఏదో అన్నదని అలిగి ఇలా వచ్చావు. తొందరపాటు. ఆ మాట మరచిపో. రాజ్యాధికారం మీ తండ్రి నీకు కలిగించే ఉపాయం ఆలోచించాను. రా. పట్టాభిషేకం నీకు. ఎన్నో నోములు నోచి నిన్ను కన్నాను. మరి నన్ను ఏడిపించడం ధర్మమా? రా. నా మాటవిను. రాజభోగాలు అనుభవిస్తూ నన్ను సంతోషపెట్టు. రావా? నీ ముందు ఇక్కడే నా ప్రాణం విడుస్తాను.



ఇలాగ ఆ మాయామాత అనిన మాటలు ఒక్కటైనా ధ్రువుని చెవికెక్కలేదు. వాని మనస్సు కమలాక్షుని ధ్యాననిమగ్నమై ఉన్నది. బాహ్య ప్రపంచ ప్రవృత్తి ఎరగక రాతిబొమ్మలాగే ఉన్నాడు. కదలలేదు మెదలలేదు.

ఆ సమయంలో వికృత వేషాలు ధరించి వివిధాయుధాలు తిప్పుతూ భయంకరాకారులైన రాక్షసులు వచ్చి ధ్రువుణ్ణి బెదిరించి ఏమేమో చేశారు. కాని ఫలితం సున్న. ఆ విషయం తెలిసి ఇంద్రుడు – ఇక ఉపేక్షిస్తే లోకానికి ప్రమాదం కలుగుతుంది. లక్ష్మీనాథునకు విన్నవించి ధ్రువ తపస్సు మానిపించాలని తిన్నగా వైకుంఠానికి వెళ్లి స్వామిని దర్శించి నమస్కరించి

లోకేశ్వరా! ఉత్తానపాదుడనే రాజు కొడుకు ధ్రువుడు. నీయందు భక్తి కలవాడట. అయిదేండ్ల బాలుడు. ఇంతవరకు అలాంటి దీక్షతో ఎవ్వరూ చెయ్యని తపస్సు చేస్తున్నాడు. మానిపించాలని ఏవేవో పనులు చేస్తాను. ఫలించలేదు. నిన్ను మెప్పించి నా స్థానం పొందుతాడో! సూర్యస్థానం కోరుతాడో! చంద్రస్థానం ఆక్రమిస్తాడో! ఏ దిక్పాలకత్వం పొందుతాడో... ఆలోచించు ప్రభూ!... అని బెదురుతూ అనగా శ్రీకాంతుడు చిరునవ్వు మోముతో ఇంద్రుని చూసి

మహేంద్రా! భయపడకు ఆ బాలుని కోరిక నాకు తెలుసును. మీ స్థానాలేవీ కోరడు.

ఆ కోర్కె నేను నెరవేర్చి తపస్సు మానిపిస్తాను. నువ్వు వెళ్లు. నిర్భయంగా ఉండు అని ఇంద్రుని పంపించి వెంటనే ధ్రువుని వద్దకు వచ్చాడు. ఆదరముగా ధ్రువుని సంబోధించి కుమారా! నీ తపస్సుకి మెచ్చి వచ్చాను. చూడు. కోరుకో వరం – అని అనగా ధ్రువుడు కనులు తెరిచి నీలనీరద గాత్రుని, లక్ష్మీకళత్రుని చూసి చప్పున లేచి సాష్టాంగముగా నమస్కరించి లేచి చేతులు జోడించి ఆనందాతిరేకముచే ఒకింతసేపు మైమరచిపోయాడు. క్రమంగా స్మృతి చెంది గద్గద స్వరముతో –

స్వామీ! నీ దివ్యరూపం చూసి మైమరిచాను. ప్రార్థించాలంటే మాటరాకుండా ఉన్నది. దయచేసి వాక్శక్తి ముందు ప్రసాదించు – అని అనగా శ్రీహరి తన చేతి శంఖమును ధ్రువుని శిరస్సున ఉంచాడు. దానితో ధ్రువుడు నింపైన మనసుతో భాసిస్తూ సొంపైన వాక్కుతో శ్రీపతిని స్తుతించాడు.

శ్రీ రమాకళత్రా! సరోజనేత్రా! దివ్యరూపా! నిగమాంతరహస్య కళాకలాపా! యోగి మానసరాజ హంసా! నమస్తే.

శ్రీపతీ! ముజ్జగాల భూతగణాలలో గుణాలలో రేయింబవళ్ల కాలమానములో నీ మూర్తి వెలుగొందుతూ ఉంటుంది.

ఈశ్వరా! చరాచర భూతసృష్టి, పుష్టి, నష్టి నీ రాజస సాత్త్విక తామసగుణ ప్రభావమని మూఢబుద్ధులు తెలియలేరు.

జనార్దనా! ఆవునుంచి పాలు పితికి ఆ పాలనుంచి నెయ్యి తీసి దానిని ఆ ఆవుకి పెట్టినట్లు నీనుంచి వాక్కు పొంది ఆ వాక్కునే సంస్తుతిగా నీకు సమర్పించగా ఆనందిస్తావు. నీ నటన బహు విచిత్రము కదా!



అని అనేక విధాలను తించగా సంతసించి శ్రీకాంతుడు నీ ఆరాధనకూ స్తుతికీ సంతోషించాను. నా దర్శనం వృధా కాదు. వరం కోరుకో ఇస్తాను అని అనగా ధ్రువు డన్నాడు.

ప్రభూ! అన్ని ప్రాణులయందు అంతర్యామివై ఉండే సర్వేశ్వరుడవు. సర్వజ్ఞుడవు. నీకు నా కోర్కె చెప్పడం సముచితమా? ఐనా నీ ఆజ్ఞ ననుసరించి మనవి చేస్తున్నాను చిత్తగించు.

నా తండ్రి కొలువులో గద్దెపై నుండగా నేను వెళ్లి తండ్రి ఆసనము మీదికి చెయ్యి చాచగా నా సవతి తల్లి వారించి అక్కడ కూర్చొనడానికి నా కొడుకు అర్హుడు గాని నువ్వు కావు పో! అని పరుషంగా అన్నది. ఆ మాటకి నేను కించపడి లోకేశ్వరుడవైన నీవల్ల అత్యున్నతమైన దివ్యపదం పొందాలని దీక్షపట్టి ఇలా వచ్చి నిన్ను ఆరాధిస్తున్నాను. కాబట్టి నా దీక్ష సఫలం చెయ్యవలసిందని వేడుతున్నాను. అదే నేను కోరే వరం...

ధ్రువుని మాట విని మహావిష్ణువు కరుణారసభరిత హృదయుడై అన్నాడు.

రాకుమారా! పూర్వజన్మమున నువ్వు ఒక బ్రాహ్మణుడవు. వేదశాస్త్రాలు చదివి కులాచారం తప్పక తల్లిదండ్రుల నతిభక్తితో సేవిస్తూ జపాదులతో నన్ను ఉపాసిస్తూ మనసు నాయందే ఉంచి ప్రవర్తిస్తూ ఉండేవాడవు. ఆలాంటి నువ్వు ఒక రాజుకి మిత్రుడవై అతని వైభవముతో సమాన వైభవం కల ప్రభుత్వం కోరి యీ జన్మలో రాజనందనుడవై జన్మించావు.

బాలుడవై ఉన్నా మాకు నచ్చిన భక్తుడవై ఎనలేని దీక్షతో తపస్సు చేసి మహాపుణ్యుడవయ్యావు. నీ కోరిక నెరవేరేట్టు వరమిస్తున్నాను విను.

దేవతలకు, గ్రహాలకూ, నక్షత్ర తారాగణములకు పైన ధ్రువస్థానం ఉన్నది. అది నీకు ఇస్తున్నాను. ఆ దివ్యపదమందు నీ తల్లితో నక్షత్ర రూపాన

కల్పాంతం వరకు ఉండు. కల్పాంతమందు మోక్షం ఇస్తాను అని ఆనందంగా పలికి మహావిష్ణువు అంతర్హితు డయ్యాడు.

ఆ సమయమందు నర సుర కిన్నర సిద్ధసాధ్యాదులు స్తుతిస్తూ ఉండగా తల్లితో దివ్యవిమానారూఢుడై ధ్రువుడు పై స్థానానికి వెళ్లాడు.

ముందు సూర్యమండలమునకు తరువాత చంద్ర, నక్షత్ర, బుధ, అంగారక, శుక్ర, బృహస్పతి, శనైశ్చరమండలాలకు వెళ్లి వారి మన్ననలు పొంది సప్తర్షి మండలం దర్శించాడు. వారి అనుగ్రహముతో ధ్రువస్థానానికి చేరి అక్కడ మహాభాగ్యముతో లోకాలకు తలకట్టై నేటికీ సకలజన మాననీయుడై విరాజిల్లుతూ ఉన్నాడు.

ఈ ధ్రువచరిత్ర చదివినవారు, విన్నవారు యశస్ఫూర్తితో సకుటుంబముగా సుస్థిర నివాసులై శ్రీమంతులై రాణిస్తారు.

ఆ ధ్రువునకు శంభువు అనే భార్యయందు శిష్టి, భవ్యుడు అని ఇద్దరు కొడుకులు. శిష్టికి సుచ్ఛాయ అనే భార్యయందు రిపుడు, రిపుంజయుడు, విప్రుడు, వృకలుడు, వృకతేజుడు – అని అయిదుగురు కొడుకులు.

రిపునకు బృహతియందు చాక్షుషుడు – వానికి పుష్కరిణియందు చాక్షుషమనువు పుట్టాడు. వానికి సద్వలయందు ఊరుడు, పూరుడు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యభాక్కు, శుచి, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, అభిమన్యుడు అని పదిమంది కొడుకులు పుట్టారు.

ఊరునకు ఆగ్నేయి అనే కాంతయందు అంగుడు, సుమనసుడు, స్వాతి, క్రతువు, అంగిరసుడు, శిబి అని ఆర్గురు సుతులు జన్మించారు. వారిలో అంగునకు సునీథ అనే యిల్లాలి యందు వేనుడు అనే కొడుకు పుట్టాడు.

ఆ వేనుని కుడి భుజమును మునులు మథించగా దానినుండి పృథువు అనే కొడుకు పుట్టి సాటిలేని భుజవిక్రమముతో రాజలోకమును వశపరచుకొని



నేలనేలిన చక్రవర్తి అయి భూమిని గోవుగా చేసి పాలు పితికి ఆ పాలతో సచరాచర భూతకోటికి సంజీవన స్థితిని కలిగించాడు అని చెప్పగా శిష్యుడు గురువుకి నమస్కరించి –

గురుదేవా! మునులు వేనుని భుజం మథించడం, పృథువు జన్మించడం, ఆ రాజు భూమిని ఆవును చేసి పిదకడం – ఈ విషయం విస్తరించి చెప్పవలసిందని అడగగా పరాశరుడు చెప్పాడు.

అంగుడు మృత్యు పుత్రికయైన సునీథను పెండ్లాడి ఆమెయందు కనిన వాడు వేనుడు. వానికి పట్టంకట్టి భార్యతో సహ తపశ్చర్యకై వనవాసి అయ్యాడు. ఆ వేనుడు మాతామహదోషంవల్ల పరిపాలన ధర్మపద్ధతిని చెయ్యక పాపపు పనులు చేస్తూ ఉండేవాడు. తాతముత్తాతలనాటి అగ్రహారాలలో పన్నులు వసూలు చేస్తూ బ్రాహ్మణులను బాధించడం, న్యాయపద్ధతికి విరుద్ధముగా ధనార్జన చేస్తూ దానిని దుర్వినియోగం చెయ్యడం, వేదవేత్తలైన విద్వాంసుల జీవితాలకు వేడి కల్గించి రాష్ట్రమునుంచి వెడలగొట్టడం, శుభప్రదమైన ఆస్తికపద్ధతిని విడిచి పాషండమతం అవలంబించడం, జారచోరులనూ, దురాచారాలనూ ఆదరించి పోషిస్తూ ఉండడం, అసత్యమాడడం, ధర్మమార్గాన నడిచేవారిని క్రూరంగా శిక్షించి ఏడిపించడం, పనిపట్టి సాధువులను బాధించడం వేనుని నిత్యకృత్యాలు...

యజ్ఞాలూ, వ్రతాలూ, నోములూ, జపాలూ దేవపూజలూ చెయ్యకూడదు. చేసినవారికి మరణదండన అని తన రాష్ట్రమంతటా చాటించాడు.

తన కెవరైనా బుద్ధులు చెప్తే వారిని తన – పర అనే విమర్శలేక శిక్షించి పురము నుంచి వెడలగొట్టేవాడు.

ఈలాటి వేనుని దుష్టపరతకి ఫలితం అనావృష్టి. పాడీపంట ఏష్యమైపోయాయి. ప్రజలు అన్నపానీయాలకి అలమటిస్తూ దిక్కులేని వారయ్యారు.

ఆ దశలో మునులు ఆలోచించి వానికి సద్బుద్ధి చెప్పి దారికి తీసుకురావాలని సంకల్పించి వెళ్లి పూర్వ రాజుల చరిత్రలు చెప్పి ఆలాంటి వారి వంశములో పుట్టి వారిలాగ ప్రవర్తించక దుర్మార్గాన ప్రవర్తిస్తూ ప్రజలను కూడూ గుడ్డా లేని దుర్దశకి తేవడం మంచిది కాదు రాజా! మునులను చంపడం, వేదాలను దూషించడం, దేవాలయాలు పడగొట్టించడం, బ్రాహ్మణులను ఏడిపించడం రాజధర్మమా?

యజ్ఞాలు చేస్తే దేవతలు సంతోషిస్తారు. వారి సంతోషం వాన కురిపిస్తుంది. దానితో భూమి సస్యశ్యామలం అవుతుంది. ప్రజలు పాడిపంటలతో సుఖజీవనులౌతారు. ఇప్పటి నీ ప్రవృత్తివల్ల దేశం దుర్భిక్షమునకు గురియయి భూతకోటికి దినదిన గండమయింది. మళ్లీ చెప్తున్నాము. మీ పూర్వుల మార్గాన ప్రవర్తించు అని బోధించగా కోపముతో కొరకొరలాడుతూ వేనుడు మునులను చూసి –

ఆపండి మీ పేలాపన. నాకన్న మిన్నగా చెప్పదగిన వాడు లోకంలో ఎవడున్నాడు? విష్ణువును నా కన్న అధికుడుగా చెప్తున్నారే. మీకన్న పిచ్చివాళ్లుంటారా? బ్రహ్మ విష్ణు మహేశ్వరుల అంశలు ఉన్నవాడను నేను. కాబట్టి యజ్ఞాలూ, యాగాలు అనేవి మరి చెయ్యనక్కరలేదని శాసించాను. పతిసేవ యిల్లాలికి పరమధర్మం. అలాగే నా ఆజ్ఞ అందరికీ అనుసరణీయం అని అనగా మునులు శాంతించి అల్లనల్లన ఏమేమో బోధించారు. కాని వేనుడు వినలేదు. పైగా దేవతానింద పాట పాడుతూనే ఉన్నాడు. వాని వికృత పద్ధతిని భరించలేకపోయారు. కరుణాపయోనిధిని పద్మాక్షుణ్ణి శ్రీహరిని



నిందిస్తూన్న యీ పాపాత్ముణ్ణి తుదముట్టించి ధర్మసంరక్షణ చేసి ప్రజలను కాపాడాలి అని నిశ్చయించుకుని దర్భలు పట్టుకుని మారణమంత్రాలు పలుకుతూ ఆ దర్భలను వేనుని మీదికి విసిరారు. తీవ్రాగ్నిజ్వాలలు చిమ్ముతూ ఆ దర్భలు నిశిత శరములై వానిని తాకగానే వేనుడు దబ్బున కిందపడి కన్ను మూశాడు.

వాని శరీరమును తైల పాకం చేయించి మంత్రుల కప్పగించి భూపరిపాలన చేస్తూ ఉండం డన్నారు. మంత్రులు ఏమీ అనలేక ఊరకున్నారు.

ఇక ఏముంది? పరిపాలకుడు లేడు. దొంగలు మూకమూకలుగా ఊళ్లపైబడి బ్రాహ్మణులను చావగొట్టుతూ సిరిసంపదలను హరింపసాగగా ఆ బ్రాహ్మణులు కుయ్యో మొర్రో అని ఏడుస్తూ వచ్చారు.

అరాజకం పద్ధతి అలా ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. మునులు బ్రాహ్మణులను చూసి జాలిపడి ఓదార్చి వేనుని ఊరు భాగమును మథించారు. ఆ భాగము నుంచి భయంకర వికృతాకారు డొకడు బయల్పడి నన్నేమి చెయ్యమన్నారని హుంకరిస్తూ అడిగాడు. అనుకున్నదొకటి జరిగినదొకటి. వీడు ప్రశాంతంగా పరిపాలన చెయ్యడని మునులు ఆలోచించి నువ్వు వింధ్య పర్వత ప్రాంతాన ఉండి మ్లేచ్ఛ కిరాత జాతుల కధిపతివై ఉండు అని నియమించగా వాడు సుడిగాలి లాగా తిరుగుతూ ఎగిరి వెళ్లిపోయాడు.

తరువాత మునులు – ఈ వేనునిలో ఉన్న పాపం ఆ నిషాదరూపములో వెళ్లిపోయిందని సంతసించి ఉదాత్తానుదాత్తస్వరిత పద్ధతిని వేదమంత్రాలు ఉచ్చరిస్తూ వేనుని కుడిభుజం మథించారు. ఆ మథనం ఫలితముగా సాటిలేని భుజబలం, దివ్యతేజస్సు సులక్షణ లక్షితమైన అంగసౌష్ఠవం కలవాడై విష్ణువు అంశలో ఒక బాలుడు పుట్టాడు. వానిని చూచి మునులు ఆనందించి యీ బాలుడు ధరణికి తగిన పతియని ఏకవాక్కుగా వానికి –

పృథువు - అని నామకరణం చేశారు. ఆ సమయములో దివినుంచి పుష్పవర్షం కురిసింది. దేవదుందుభులు మోశాయి. దేవగణాలు అభినందించారు. అలా పుట్టిన పృథువు యువకుడై మహనీయ మహిమ కలవాడై విరాజిల్లుతూ ఉన్నాడు. అలా ఉండగా దేవలోకము నుంచి విశిష్ట తేజస్సు గల ఖడ్గం, ధనుస్సు, అక్షయబాణ తూణీరములు రెండు, వజ్రకవచం యుద్ధసాధనాలుగా వచ్చాయి. ధర్మానికి మగరూపయిన మంచి కొడుకు కలగడం వల్ల వేనుడు పుణ్యస్థానానికి చేరాడు. మునులు పరమానందభరితులై గంగాది పుణ్య నదులనుంచి, సముద్రాల నుంచి నీరు సువర్ణ పాత్రలతో తెచ్చి పృథువునకు అభిషేకం చేశారు. దేవగణాలతో బ్రహ్మ వచ్చి శుభముహూర్తాన పృథువుకి ధరాధిపతిగా పట్టం కట్టి చక్రవర్తిని చేశాడు. విష్ణుచక్రం వచ్చి పృథువు దక్షిణ హస్తమునకు దివ్యాభరణముగా ప్రకాశించింది. దానిని చూసి బ్రహ్మ చక్రవర్తిగా పృథువును చెప్పి అభినందించాడు.

ఆ విధముగా పృథువు చక్రవర్తి అయి ధర్మమూర్తిగా సురనర ప్రశంసను పొంది సమధికైశ్వర్యవంతుడై రాజ్యం చేయసాగాడు.

అలా చేస్తూ పైతామహయజ్ఞం చేశాడు. ఆ యజ్ఞమునకు సంబంధించిన సూత్ర మంత్రప్రభావముచే ఇద్దరు శిశువులు పుట్టారు. పుట్టిన వెంటనే యువకులు కాగా చూసి యజ్ఞానికి వచ్చిన మునులు వారి రూపరేఖలూ, మాటతీరు చూసి సంతుష్టులై మీ పేరు సూతుడు, మాగధుడు. మీరే చక్రవర్తిని స్తుతిస్తూ ఉండం దన్నారు. వారికి చక్కని వాగ్వైభవం కలిగించారు. సమయానుసారంగా సూతమాగధులు పృథుచక్రవర్తిని కీర్తిస్తూ ఉన్నారు.

అలా ఉండగా ప్రజలు ఆకలిదప్పులకు లోనై, ఆగలేక పృథు చక్రవర్తివద్దకు వెళ్లి -



మహారాజా! ధర్మనష్టం. దానివల్ల అనావృష్టి. దానిమూలాన పాడిపంటలూ నశించాయి. సస్యములూ, ఓషధులూ జీర్ణములై చెడిపోయాయి. ఇలా ఆకలిదప్పులకు చిక్కి శల్యాలమై పోయాము. అందరూ అడవులకు పోయి అక్కడ దొరికే కందమూలాలతో కక్కుర్తిపడి ప్రాణాలు నిల్పుకుంటున్నారు.

అన్నం ధాన్యమూలం. అందరికీ ఆధారం అన్నం. ఆ అన్నం లేకపోతే ఇక బ్రతుకెక్కడిది? ఆ అన్నం మాకు సంతృప్తిగా లభించే ఉపాయం చూసి ప్రజారక్షకుడవై వర్ధిల్లు మహారాజా! అని ఘోషించారు.

వారి ఘోష విని ఒక్కక్షణం పృథు చక్రవర్తి ఆలోచించాడు. సస్యనాశం చేసి ప్రజలకు కరువు కలిగించిన ఆ భూమినీ హతమారుస్తాను అని దిగ్గున లేచి విల్లందుకుని బాణం సంధించాడు. ఇక ప్రయోగించడమే తడవు. భూమి అదిరి గోరూపం ధరించి బ్రహ్మ దగ్గరకు వెళ్లాలని పరుగెత్తుతూండగా చక్రవర్తి వెంటవెళ్లుతూ నువ్వు ఎక్కడకు వెళ్లినా సరే నా బాణానికి గురికాక తప్పదు అని గట్టిగా అనగా భూమి రాజా! స్త్రీవధ పాపం అని నీకు తెలియదా? కాగా నన్ను చంపితే ప్రజలస్థితి ఏమి? నీవు పాలించేది ఎలాగ? ఆలోచించావా?...

ప్రజలకు తిండి లేకుండా చేసిన దుర్మార్గురాలవు. అందరిని కాపాడడానికి నిన్ను చంపడం పుణ్యమే గాని పాపం కాదు. వారి స్థితి తరువాత చూస్తాను. దైవబలం సమృద్ధిగా ఉన్నవాడను నేను. వారిని సుఖంగా పాలించడం నాకు కష్టంకాదు.

సరే - ఒక ఉపాయం చెప్తాను విను. దానివల్ల ప్రజాసంరక్షణ జరుగుతుంది. సస్యాలూ, ఓషధులూ నాలో జీర్ణములై ఉన్నాయి. ఇపుడు గోరూపాన ఉన్న నాకు ఒక దూడను కలిగించు. అది తాగే సమయంలో ఓషధులూ, సస్యాలూ ఆవిర్భవిస్తాయి. ఆ ప్రయత్నం చెయ్యి.

చక్రవర్తి భూదేవి మాటవిన్నాడు. సరే అన్నాడు. స్వాయంభువును దూడగా కల్పించి తానే పితికాడు. ఏకధారగా పాలు కురిశాయి. అవి నేలపై పడగానే సస్యములు మంత్రించినట్టు నూత్న శోభతో పైకి లేచాయి. ఎక్కడచూసినా భూమి సస్యశ్యామలమై కనుపండువుగా ఉన్నది. ఆ పాలతో దేవదైత్య కిన్నరాదులకూ, మృగాలకూ, మానవులకూ సమృద్ధిగా వారివారికి కావలసిన ఆహారం సమకూరింది. అలాగ భూమిని మళ్లీ యథాపూర్వ రూపానికి తెచ్చి నరసుర రంజనముగా పృథు చక్రవర్తి పరిపాలన చిరకాలం చేశాడు. ఆ సత్క్రియ వలన భూమికి ఆ చక్రవర్తి పేరుతో 'పృథివి' అనే పేరు వచ్చింది.

ఈ పృథు చక్రవర్తి కథ విన్నవారికి ఏలాటి పాపమూ అంటదు. తేజస్సు, సమృద్ధిగా సిరిసంపదలూ, సుఖసంతోషాలూ, కీర్తి, ఆయురారోగ్యాభివృద్ధి, అశ్వమేథ యాగం చేసిన ఫలమూ ఆ మహావిష్ణువు ప్రసాదిస్తాడు.

ఆ పృథుచక్రవర్తికి అంతర్ధి, వార్థి అని ఇద్దరు కొడుకులు. వారిలో అంతర్ధికి శిఖండియను భార్య యందు హవిర్ధానుడు అనే కొడుకు పుట్టాడు. వానికి అగ్ని వలన పుట్టిన ధిషణ అనే కాంత యందు ఒక కొడుకు కలిగాడు. అతడు యజ్ఞ సమయమందు కుశలను ప్రాచీనాగ్రములుగా ఉంచడం వల్ల ప్రాచీనబర్హి అని ప్రసిద్ధు డయ్యాడు. అతనికి సముద్ర పుత్రియైన సౌవర్ణయందు ధనుర్వేద పారంగతులైన ప్రచేతసులు పదిమంది పుట్టారు. వారు భేదము లేని పద్ధతిని ధర్మప్రవర్తనులై పదివేల సంవత్సరాలు సముద్రం నడుమ తపస్సు చేశారు అని చెప్పగా మైత్రేయుడు అడిగాడు.

గురువర్యా! ప్రచేతసులు సముద్రమధ్యమున అంతకాలం తపస్సు చెయ్యడానికి కారణం ఏమి? ఆ కథ వినాలని ఉంది అని అడగగా పరాశరుడు చెప్పాడు.



ప్రాచీనబర్హి ఇంద్రుడులాగా భూవలయమును ధర్మవైభవముతో పాలించాడు. తనమాట జవదాటక భక్తితో ప్రవర్తిస్తూన్న కొడుకులతో ఒక నాడన్నాడు.

మీరు ధర్మసమైక్యముతో ప్రవర్తిస్తూన్న బుద్ధిమంతులు కనుక మీకు అసాధ్యమేదీ ఉండదు. విష్ణువును ధ్యానిస్తూ తపస్సు చెయ్యండి. ఆ దేవుని అనుగ్రహం వల్ల భావికాల ప్రజాపతి శక్తి పొంది చరాచర భూతసృష్టి చెయ్యండి అని చెప్పగా వా రందుల కంగీకరించి సముద్రం నడుమ విష్ణువును ధ్యానిస్తూ అంతకాలం తపస్సు చేశారు. కాగా విష్ణువు ప్రసన్నుడై ప్రత్యక్షమై మీ తపస్సుకి మెచ్చాను. వరాలు కోరండి ఇస్తా నన్నాడు.

'కమలామనోరమణా! జగదేకపవిత్రచరిత్రా! సరోజనేత్రా! శుభాలోకనా! సకల లోకపాలనా! కరుణాపయోనిధీ! మాకు ప్రజాపతి ప్రాభవం అనుగ్రహించు! అని వారు కోరారు.

'మీ కొడుకు దక్షుడనే పేరుతో ప్రజాపతి అవుతాడు అని వరమిచ్చి శ్రీపతి అంతర్హితుడు అయ్యాడు.

అలాగ విష్ణువువల్ల వరం పొంది తరువాత వారు సముద్ర మధ్యమునుంచి వెలుపలకు వచ్చారు. అంతకాలం వారు తపస్సు చేస్తూ సముద్రములో ఉండడం వల్ల దేశం అరాజకమై చెట్లు తెగపెరిగి భయంకరారణ్యమైపోయింది. ఆ బాధ పోగొట్టాలని చంద్రుడు ఆలోచించి అవయవాల నిండుసొబగుతో మోహినీ దేవతను పోలిన ఒక కన్యను కల్పించి వారివద్దకు వచ్చి సమర్పించి అన్నాడు.

మీరు దేశమందు లేకపోవడంవల్ల వృక్షాలు తెగపెరిగి ఉండడంలో దోషం లేదు. ఇప్పుడు మీ కోపాగ్నికి చూడండి, చెట్లన్నీ మాడి మసి అయిపోయాయి. తపస్సు చేసిన మీవంటి వారికి దీర్ఘకోపం కూడదు. చెట్లు

మీకు అనుకూలంగా ఉండడానికి ఇదిగో యీ కన్య ఆ వృక్షాల నుంచి ఆవిర్భవించి నా కిరణామృతం వల్ల పెరిగింది. పేరు మారిష. ఈమెను గృహిణిగా పరిగ్రహించండి. అప్రమేయబలుడైన సుతుడు జన్మిస్తాడు. ఆ కొడుకు మీకూ నాకూ గల తేజస్సు నుంచి భాగం పొంది దక్షుడనే పేరున ప్రజాపతి అవుతాడు. అతనివల్ల ప్రజాసమృద్ధి అవుతుంది అని సానునయముగా చెప్పగా ప్రచేతసు లంగీకరించి చంద్రునితో అన్నారు.

ఈమె చెట్లనుంచి ఎలా పుట్టింది? నీ కిరణప్రసారముచే పెరగడ మేమిటి? అది వివరించు – అని అనగా చంద్రుడు చెప్పాడు.

## మారిష వృత్తాంతం

ఒకప్పుడు కంధుడు అనే ముని గోమతీ తీరమునందు అసాధారణమైన తపస్సు చేస్తూండగా ఇంద్రుడు బాధపడి అతని తపస్సు చెడగొట్టాలని సంకల్పించి ప్రమ్లోచన అనే అప్సరసను రప్పించి వెళ్లు. గోమతీ తీరాన తపస్సు చేస్తూన్న కంధుని నీ మోసాలతో వశపరచుకుని తపస్సు చెరచిరా. తగిన చెలికత్తెలతో వెళ్లు – అని నియమించగా ఆ అప్సరస చెలికత్తెలను కొందరిని వెంటపెట్టుకుని కంధుని ఆశ్రమానికి వెళ్లింది. ఆ ముని తపశ్చర్యను చూసి ఎదురుగా వెళ్లడానికి భయపడి దరినున్న పొదరిళ్లలో ఆటలాడుతూ, పాటలు పాడుతూ అతనికి కనిపిస్తూ కనిపించక విహరించసాగింది.

ఆ సమయంలో చల్లని మలయవాయువు ఆ అప్సరసకు తోడయి దాని నెమ్మేనినెత్తావి ఆ మునికి మైమరపు కలిగించేది. అది అప్పుడు పూచిన పువ్వులు తెచ్చి ముని ముందువంగి ఉంచేది. వీణమీటుతూ, శృంగార కీర్తనలు పాడేది. అప్పు డప్పుడు తన చేతులు తగిలేట్టుగా వంగి పయ్యెదజార్చి ముని పాదాలకు నమస్కరించి లేచి చిరునవ్వుతో చూసేది. ఆ విలాసాలకూ, వికారాలకూ ముని తపోదీక్షకు స్వస్తి చెప్పి మదనవిలాస దీక్షకు సంసిద్ధుడయి



ఒకనాడు సుందరీ! నా మనసు దొంగిలించినదానవు. శిక్ష నా కౌగిటిలో నిన్ను బంధించడం అని అనగా ఆ దేవవేశ్య స్వామీ! మీ మాటకి ఎదురుచెప్పగలనా? అని దగ్గరగా వచ్చింది ఇంకేముంది – ముని ఆ వేల్పుసానితో విలాసాలు చిత్తగిస్తూ కొన్ని సంవత్సరాలు వెళ్లించాడు.

ఆ విధంగా ముని తపస్సు పాడుచేసి ఒకనాడు అచ్చరమచ్చెకంటి మునీంద్రా! నేను ఇంద్రుని కొలువులో ఉండే దేవవేశ్యను. ఇక్కడికి వచ్చి చాలాకాలం అయింది. ఇక సెలవిస్తే అమరావతికి వెళ్లుతాను. ఇంకా జాగుచేస్తే సురపతి ఆగ్రహిస్తాడు అని అనగా కంధముని కాదు కాదు. నాకు సంతృప్తి కలగలేదు. నాతో ఉన్న నిన్ను తెలిసి ఇంద్రుడు ఏమీ చెయ్యలేదు రా! అని చేతిని పట్టుకుని పొదరింటికి తీసుకుపోయాడు.

మళ్లీ కొంతకాలమయిన తరువాత ప్రమ్లోచి స్వామీ! ఇక సెలవిప్పించు– అని నొక్కి వేడింది.

సుందరీ! నేను సూర్యోదయ సమయంలో దినకరునకు అర్ఘ్య మిస్తూండగా నువ్వు నా కంటపడ్డావు. నీతో నిన్నరాత్రి వెళ్లించాను. ఈ ఒక్కనాటితో నన్ను విడిచి వెళ్లడం న్యాయమా? అని ముని అనగా – మునీంద్రా! నీ మాటకి ఎదురుచెప్పలేను. కాని జరిగినది ప్రమాణవాక్కుగా చెప్తాను. నాతో నీవు గడపిన కాలం –

తొమ్మిదివందల ఏడు సంవత్సరాల ఆరునెలల మూడు దినాలు. యోగదృష్టితో చూడు. ప్రమ్లోచి మాటలు విని ముని కనులుమూసి ధ్యానించి తెలుసుకున్నాడు. కనులు తెరిచాడు. కోపరేఖతో కనులు ఎరుపెక్కాయి. నా తపస్సు ఇలా పాడుచేశావా? ఇంద్రుని కపటోపాయం. అయినా తప్పు నీదే. కాని యింతకాలం నన్ను అలరించావు. కనుక క్షమించాను. ఇక పో! నా ఎదుట ఉండకు. మళ్లీ ఎన్నడూ నా వద్దకు రాకు.

అని సింహంలాగా గర్జించాడు. చిత్తం. సెలవు అని ప్రమ్లోచి రివ్వున పైకెగిరింది. ఆ ఎగరడంలో దాని గర్భమునందున్న ముని వీర్యం చెమటగా అవయవాలనుంచి కారింది. ప్రమ్లోచి చెట్ల చిగురాకులతో ఆ చెమట తుడుచుకుని వెళ్లిపోయింది. కంఢముని అక్కడినుంచి పురుషోత్తమ తీర్థమునకు పోయి దేవవేశ్యతో గడపిన అధర్మ ప్రవర్తన పాపం పోవడానికి బ్రహ్మసూత్రస్తోత్రముతో మహావిష్ణువును ప్రార్థిస్తూ తపస్సు చేస్తూ ఉన్నాడు.

చెట్ల చిగురాకులలో కలిసిన ఆ ముని తేజస్సు నా కిరణాలనుంచి స్రవించే అమృతముచే యీ లతాంగి రూపొందింది. ఆ మహాముని తేజస్సు, దివ్యకాంత గర్భరూపం, వాయువుచే చెట్ల ఆకులలోపడడం, నా కిరణామృత దోహదం – ఆ విధంగా పుట్టిన యీ మారిషకు సాటికాగల బోటి ఉంటుందా?... ఇక కర్తవ్యం.

దీనిని మీరు పరిగ్రహించండి. దీని పూర్వజన్మ వృత్తాంతం చెప్తాను వినండి. తొలి జన్మలో ఇది ఒక రాజపత్ని. అనతికాలమునకే వితంతువయి ఏ సుఖమూ కోరక శ్రీహరి భక్తురాలయింది. విష్ణువు ప్రత్యక్షమై, లలనా! ఏమి నీ కోరిక? అని అడగగా స్వామీ! బాల్యమునందే వితంతువునయ్యాను. మరి కామభోగం అనుభవించాలి కదా! ఆ తృష్ణ తీరేట్టు నా భర్తలు ఎక్కువగా నా వారు కావాలి. నేను అయోనిజనై ఉండి వారితో సుఖించి ప్రజాపతి అయ్యే కొడుకును కన్నతల్లి నవ్వాలి అని కోరింది. హరి తథాస్తు అని అంతర్హితు డయ్యాడు. అదే యీ మారిషగా రూపొందింది. మీరు దీనిని పరిగ్రహించండి. మీకు దీనియందు మహానుభావుడు ప్రజాపతి అయ్యే కొడుకు కలుగుతాడు. అది మహావిష్ణువు అనుగ్రహం. వాడు అనేక వంశాలకు కర్త అయి చరాచర నిర్మాత అవుతాడని చంద్రుడు నచ్చచెప్పి మారిషను ప్రచేతసుల గృహిణిగా పాణిగ్రహణం చేయించాడు.



ప్రచేతసులకు మారిషయందు బ్రహ్మకి సాటిగా చెప్పదగిన కుమారుడు కలిగాడు. పేరు దక్షుడు. అతనివల్ల దేవదానవగంధర్వసిద్ధ విద్యాధరాది నానాజీవులును, ద్విపదచతుష్పదాది నానాజంతుసంతతి కలిగింది. ఆ విధంగా దక్షుడు ప్రజాపతి అయ్యాడు అని చెప్పగా మైత్రేయుడు –

గరువర్యా! బ్రహ్మయొక్క కుడిచేతి బొటనవ్రేలి నుంచి దక్షుడు పుట్టాడని వినికిడి. మరి అతడు ప్రచేతసుల కొడుకు అవడం ఎలాగ? అని అడగగా పరాశరుడు చెప్పాడు.

బ్రహ్మ మానసపుత్రుడు దక్షుడు. తపోధనులలో అగ్రగణ్యుడు. అతనికి నాశం లేదు. సృష్టికై ప్రతి మన్వంతరమందు యుగానికి ఒక ప్రజాపతి దక్షనామముతో పుట్టి సృష్టికర్తగా ఉంటాడు. కనుక ప్రచేతసుల కొడుకయిన దక్షుని చరిత్ర విస్తరించి చెప్తాను విను.

ప్రచేతసపుత్రుడైన దక్షుడు చాలాకాలం శ్రీహరిని ధ్యానిస్తూ అసాధారణమైన తపస్సుచేసి ఆ దేవునివల్ల చరాచర భూతసృష్టికి కర్తగా వరం పొంది బ్రహ్మ అనుమతితో ఖేచరభూచరాదిభూత సృష్టి మానసికముగా చేశాడు. కాని అది పెరగలేదు. భార్య సంబంధం లేక సృష్టి పెంపు జరగదని ఊహించి వరుణపుత్రియైన అసిక్నిని పెండ్లాడి హర్యశ్వులు అనే కొడుకులను పెక్కుమందిని కన్నాడు. వారిని సృష్టికార్యానికి నియోగించాడు. ఆ దశలో వారి పనికి విఘ్నం కలిగించాలని వారివద్దకు వచ్చి –

ఏమయ్యా! అవివేకం. దేశం కాలం – పరిస్థితి తెలియక ఒకమూల కూర్చుని ఏమి చేస్తారు. సృష్టికి వెళ్లండి అని తనదారిని తాను పోయాడు. నారదుని మాటవిని వారు నలుదిక్కులా చెదరిపోయారు. సముద్రములో కలిసిపోయిన నదుల్లాగా తిరిగి మరి రాలేదు.

దక్షుడు మళ్లీ వైతరణియందు కొడుకులను కని వారికి శబళాశ్వులు అని పేరు పెట్టి సృష్టి కార్యానికి నియమించగా మునుపటిలాగే నారదుడు వచ్చి వారికి ఏమేమో చెప్పి వెళ్లిపోయాడు. వారు నారదుని మాటవిని అన్నల్లాగే చెదిరిపోయారు. ఎక్కడికి పోయారో చెప్ప శక్యం కాదు.

అందరు కొడుకులూ పోయి తిరిగి రాకపోవడం ఆ తండ్రికి విచారం కలిగించిందని వేరే చెప్పనక్కర లేదు. నారదుని వల్ల ఇలా అయిందని తెలిసి కోపించి తిట్టి మళ్లీ వైతరణియందు అరవైమంది కూతుళ్లను కన్నాడు.

వారిలో పదిమందిని ధర్ముడు, పదముగ్గుర్ని కశ్యపుడు, ఇరవై ఏడుగురిని చంద్రుడు, నలుగురిని అరిష్టనేమి, ఇద్దరిని బహుపుత్రుడు, ఇద్దరిని అంగిరసుడు, ఇద్దరిని కృతాశ్వుడు పరిగ్రహించారు.

ధర్ముని వంశమున పుట్టిన వారిలో విశ్వకర్మ శిల్పవిద్యాపారంగతుడు. అప్పటికప్పుడు వివిధ రకాల దివ్యభవన నిర్మాణం చేసే దివ్యశిల్పిగా ప్రసిద్ధుడయ్యాడు. ఆ విశ్వకర్మ కొడుకు త్వష్ట. త్వష్ట కొడుకు మహాతపోధనుడు విశ్వరూపుడు. అతని సుతులు ఏకాదశరుద్రులు.

ఇక కశ్యప ప్రజాపతి సంతతి చెప్తాను విను. అదితికి శక్రుడు, చక్రధరుడు పుట్టారు. చాక్షుషమన్వంతరమందు దేవగణాలలో ముఖ్యులు ద్వాదశాదిత్యులుగా ప్రసిద్ధులయినవారు పుట్టారు. వారు వైవస్వతమన్వంతరము నందు అర్యముడు, ధాత, త్వష్ట, పూషుడు, రవి, వివస్వంతుడు, సవిత, మిత్రుడు, వరుణుడు, అంశుడు, భగుడు, తేజుడు అని ద్వాదశాదిత్యులుగా ఉద్భవించారు.

బహుపుత్రునకు పది నలుగురు మనువులు పుట్టారు.

అంగిరసునకు రుచికుడు పుట్టాడు. బ్రహ్మర్షిగా ప్రసిద్ధుడు. కృతాశ్వునకు దేవాయుధాలు కలిగాయి. ఈ అమర సమూహం బ్రహ్మదినమునందు ఆయా యుగాలలో యజ్ఞ భాగాలకు పుట్టుతూ ఉంటారు.



ఇక చెప్పేది చాలా విశిష్టమైన భక్తచరిత్ర. విను. కశ్యపుని రెండవ భార్యయైన దితియందు హిరణ్యకశిపు హిరణ్యాక్షులు, సింహిక పుట్టారు. సింహిక విప్రజిత్తి అనే రాక్షసుని భార్య అయింది. హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, హ్లాదుడు – అనే నలుగురు కొడుకులు పుట్టారు. వారిలో ప్రహ్లాదుడు పరమభాగవతుడు. అతని చరిత్ర మనసుకి మాటకీ అందని మహనీయ గుణవిశిష్టం. అతని చరిత్ర నాకు అందినంత చెప్తాను విను.

హిరణ్యకశిపుడు బ్రహ్మను గూర్చి చాలాకాలం తపస్సు చేసి ముల్లోకాలకూ తన దొరతనం కలిగేట్టు బ్రహ్మవల్ల వరం పొందాడు. సకలలోక భీకరంగా పరిపాలన సాగిస్తూ యజ్ఞభాగాలు తానే తీసుకునేవాడు. దానితో దేవతలు సుఖస్థితీ గతీ లేనివారయ్యారు.

అలా ఉండగా ఒకనాడు మద్యపానమత్తుడై దివ్యమణిమయ సౌధమునందు కొలువుతీరి గురువులతో, కొడుకును ప్రహ్లాదుణ్ణి రప్పించి

కుమారా! గురువులేమి చెప్తున్నారు? శ్రద్ధగా రాజనీతి చదువుతున్నావా? ఏదీ ఒక పద్యం చదువు – అని అనగా ప్రహ్లాదుడు చదువవలసినది చదివాను. విష్ణుభక్తి కన్న, విష్ణుస్తోత్రం కన్న నేర్వవలసింది ఏముంటుంది నాయనా! అని తేలికగా అన్నాడు.

కొడుకుమాట ఆ తండ్రికి శూలముతో పొడిచినట్టు వినిపించి కోపించి కళ్లెర్రచేసి – కొడుకుకి దగ్గరగా ఆసనాసీనుడైన గురువుని చూసి అన్నాడు...

ఏమయ్యా! నువ్వు గురువువా? జాతికి బ్రాహ్మణుడవుగాని నీతికి కావు. పసిపాపనికి నువ్వు చెప్పిన చదువు ఇదా? దనుజకంటకుడైన ఆ విష్ణువును గురించి చెప్తున్నావా? ఏమనాలి నిన్ను? కుటిలమతీ!...

హిరణ్యకశిపుని కరకు మాటవిని ఆ గురువు దనుజాధిపా! విను నేను చెప్పేది. నీ కొడుకు సంగతి తోడి బాలురకు తెలుసును. నేను నీ సంబంధమైన రాజనీతే చెప్తున్నాను. వింటున్నట్టు నటిస్తాడు. పాఠం అయిన తరువాత ఆవలకు పోయి దనుజ బాలురకు విష్ణువు గురించే చెప్తూ ఉంటాడట. ఏమి చెయ్యమన్నావు. నా తప్పేమీ లేదు అని చెప్పగా హిరణ్యకశిపుడు కొడుకుని అదలించి – ఇదిగో యీనాటి నుంచి గురువు చెప్పినది బుద్ధిగ నేర్చుకుంటూ ఉండు. మనవంశానికి విరోధి అయిన ఆ విష్ణువు ఘోష నీకు తగదు. మనయింటా వంటా లేని బుద్ధి – ఇది మంచిది కాదు. ఆ విష్ణువు నాకన్నా గొప్పవాడా? నీ వెర్రికాని... అని బుద్ధి చెప్పి – గురువుతో పంపించాడు.

ఇంటికి వెళ్లిన తరువాత గురువు బుజ్జగిస్తూ ప్రహ్లాదా! నీ తండ్రి బ్రహ్మను గూర్చి గొప్ప తపస్సు చేసి ముల్లోకాలకూ ప్రభువుగా వరం పొందిన మహావీరుడు. కనుక ఆ విష్ణువు పేరెత్తితే ఒప్పుకోడు. విన్నావా! ఇక నేను చెప్పే నీతిశాస్త్రం శ్రద్ధగా చదువుతూ ఉండు.

అని అనగా విని ప్రహ్లాదుడన్నాడు : అయ్యా! నా తండ్రికి పుట్టిన వెర్రితనం నీకూ అబ్బినట్టుంది. సకలలోకాధిపతి విష్ణువును కాదని యింకొకనిని చెప్పడం అజ్ఞానం కాదా? పాపకర్మలు చేసే దనుజులకు పౌరోహిత్యం చేస్తూన్నందువల్ల వారి గుణాలే నీకూ పట్టినట్టున్నాయి. ఇలాటి నీ దగ్గర చదువుకోడం తెలివితక్కువతనం. ఒక్కటే నా నిర్ణయం. ఆ విష్ణుదేవుని కాదని నీ చెప్పే చదువు నేను వినేది లేదు.

ప్రహ్లాదుని మాట విని ఆ గురువు పెదవి కదల్పలేకపోయాడు.

కొన్నాళ్లు అయిన తరువాత హిరణ్యకశిపుడు మేడపై మద్యపానం చేసి స్త్రీలతో వినోదం చిత్తగిస్తూ కొడుకుని రప్పించి ఊఁ – శ్రద్ధగా నీతిశాస్త్రం చదువుతున్నావా? ఏదీ చదువు; వింటాను అని అనగా చెప్పాడు కొడుకు.



శ్రీరమణీ మనోహరుడు, సర్వలోకవిఖ్యాత చరిత్రుడు, పద్మనేత్రుడు అయిన విష్ణుదేవుని భజించిన ధన్యుడను. నాకీ నీతులు గీతులూ ఎందుకు?

అని చెప్పగానే హిరణ్యకశిపుడు ఆపరా? కోపముతో పళ్లు పటపట కొరికి నిప్పులు రువ్వే చూపుతో కొడుకును చూసి దురాత్మా! వంశానికి ముప్పు తెచ్చే దుర్మార్గుడవైనావు. దనుజ జాతికి మారకుడైన వానిని భజిస్తున్నావా? ఎంత ధైర్యం? నా ముందు నా పగవానిని పొగడుతున్నావే. ఇక నిన్ను ప్రాణాలతో ఉంచేది లేదు. చంపవలసిందే. నువ్వు భజించే ఆ దనుజవైరి నిన్ను ఎలా కాపాడుతాడో చూస్తాను అని తాళ్లతోకట్టి ఏనుగులచే పొడిపించి విషాన్నం పెట్టించి – ఇలాగు ఏవేవో మారణప్రయోగాలు చేశాడు. వాటికి ప్రహ్లాదుడు మరింత తేజస్సుతో రాణించాడు గాని క్షీణించలేదు.

హిరణ్యకశిపుడు కుక్కిన పేనులాగా నోరు మూసుకుని వింతగా చింతగా చూస్తూ కూర్చున్నాడు. ప్రహ్లాదుడు మళ్లీ గురువువద్దకు వెళ్లిపోయాడు...

కొన్నాళ్లు గడచిన తరువాత హిరణ్యకశిపుడు కొడుకుని రప్పించి ఏమి నీ బుద్ధి మారిందా లేదా? గురువు చెప్పినట్టు కులోచితమైన విద్య చదువుతున్నావా అని అడిగాడు. నాయనా? నా బుద్ధి ఆ విష్ణుదేవుని భజనకి అంకితమైపోయింది. లౌకికమైన కులవిద్యకి కట్టుపడదు. ఇదే నా నిర్ణయం అని ప్రహ్లాదుడు చెప్పగా హిరణ్యకశిపుడు మితిమీరిన కోపముతో చూసి సరే. ఇక నిన్ను మారణహోమంతో తుదముట్టించవలసిందే అని తన భటులను చూసి –

వీడిని ఈడ్చుకుపోయి తాళ్లతో కట్టి సముద్రములో పడద్రోసి పైన ఒక కొండ పడవేసి చంపి రండి – అని శాసించాడు. వారు ప్రహ్లాదుని తోడుకొని వెళ్లి తాళ్లతో కట్టి సముద్రములో పడద్రోసి పైన ఒక కొండ వేశారు. ప్రహ్లాదుడు

చలించలేదు. శ్రీహరిని తన హృదయపద్మములో ధ్యానముద్రతో ప్రతిష్ఠించి స్తుతిస్తూ హాయిగా ఉన్నాడు. గట్టున ఉన్న రాక్షస భటులు వింతగా చూస్తూ ఉండగా సముద్రం అలలతో పొంగి కొండను ప్రక్కకు తొలగించి ప్రహ్లాదుణ్ణి అల్లనల్లన గట్టుకి చేర్చింది. ఆ రక్కసుల ఆశ్చర్యానికి అంతు లేదు. సర్వశక్తి సంపన్నుడైన శ్రీహరి సంరక్షకుడై ఉన్న భక్తునకు కొండలూ బండలూ ప్రమాదకరము లవుతాయా?... చంపడానికి నిల్చున్న రాక్షస భటులు బెదిరి కొంతదూరాన ఉన్న చెట్లకిందికి పారిపోయారు. ఆ సమయములో గట్టున ఉన్న ప్రహ్లాదునకు శ్రీహరి అభయ హస్తముతో ప్రత్యక్షమయ్యాడు. ఆ దేవుణ్ణి చూసి ప్రహ్లాదుడు పరమానందభరితుడై చేతులు మొగిచి నుతించాడు.

పుండరీకాక్షా! ఆశ్రితపక్షా! అధర్మశిక్షా! ధర్మవర్ధనా! దుర్మతిమర్దనా! శ్రీపతీ! యోగసద్గతీ! వాసుదేవా! మహానుభావా! నిర్వికారా! సదాధారా! గోబ్రాహ్మణహితా! త్రిగుణాతీతా! పరమపావనా! బ్రహ్మణ్యదేవా! గోవిందా! సచ్చిదానందా! సనాకాది యోగీంద్రసన్నుతా! హృషీకేశా! నమస్తే నమస్తే నమస్తే!

ప్రహ్లాదుని స్తుతికి సంతసించి శ్రీహరి దగ్గరగా తీసుకుని అల్లనల్లన శరీరం నిమిరి ప్రహ్లాదా! బాల్యంలో ఉన్న వాడవే అయినా నీ తండ్రి చేసిన దారుణకర్మకు బెదరక నన్ను మనసా వదలక భక్తియుక్తుడవై ప్రవర్తిస్తూన్నావు కనుక నువ్వు కోరిన వరం ఇస్తాను అడుగు – అని ఆప్యాయంగా అనగా దేవా! నేను ఏ జన్మలోనూ నీ పాదభక్తి వదలని మనసు కలవాడనై ఉండేట్టు వరం అనుగ్రహించు! అని ప్రహ్లాదుడు అడిగాడు.

ప్రహ్లాదా! నీకు మరి జన్మ లేదు. నీ యీ ప్రవర్తన విష్ణుభక్తులకు మేల్బంతి అయింది. ముక్తి నీ చేతిబంతి. పాపం నీ చుట్టుప్రక్కల చేరదు. కాబట్టి నాయందు భక్తిని గురించి అలా ఉండనీ. ఇంకొక వరం కోరుకో



అని విష్ణువనగా – నా తండ్రి అహంకారముతో నిన్ను ద్వేషించి నన్ను హింసించాడు. నా ప్రార్థన మన్నించి అతని చెడుతనమును పోగొట్టి పుణ్యాత్ముణ్ణి చెయ్యవలసిందని నా కోరిక అని ప్రహ్లాదుడు కోరాడు. ఆ మాటకి శ్రీహరి చిరునవ్వు నవ్వి – సరే నీ తండ్రి పుణ్యమార్గం నేను చూస్తానులే. ఇంకొక వరం అడుగు అని అనగా నేను సంసారినయినా పురుషార్థములను నాల్గింటినీ ధర్మప్రవృత్తితో నీ భక్తి చేయూతగా సాధించేవాడను అయ్యేట్టు వరం అనుగ్రహించు అని ప్రహ్లాదుడు అడిగాడు.

తథాస్తు! అని చెక్కిలి నిమిరి శ్రీహరి అదృశ్యుడయ్యాడు. ప్రహ్లాదుడు చిన్నారి నడకలతో నగరం ప్రవేశించి తండ్రివద్దకు వెళ్లి నమస్కరించి ప్రక్కగా నిల్చున్నాడు.

హిరణ్యకశిపుడు హరి వరంవల్ల మునుపటి ద్వేషం పోయి సత్త్వగుణం కలవాడై కొడుకును కాగిలించుకుని శిరసు మూర్కొని చెక్కిలి నిమిరి కుమారా! నావల్ల పడరాని బాధపడినా ఆ శ్రీహరి దయవల్ల క్షేమంగా ఉన్నావు. ఇది నా భాగ్యం అని లాలనగా ఓదార్చి కొడుకుతో ఆనందంగా ఉంటూ చిరకాలం రాజ్యం పాలించి తుదకు విరక్తి కలిగి శరీరత్యాగం సామాన్యముగా అవదు. ఆ విష్ణువువల్లనే అవ్వాలని మళ్లీ రాజసమూర్తియై విష్ణువును ద్వేషించనారంభించాడు. అంతట ఒకనాడు నిండు సభలో లోకభీకరమైన అట్టహాసం; ఒకింత సేపటికి స్తంభం విరిగింది. దానిలోంచి నరసింహమూర్తి ఆవిర్భవించి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు.

తరువాత ప్రహ్లాదుడు పెరిగి పెద్దవాడై చిరకాలం ధర్మమార్గాన జనరంజనముగా పరిపాలించి పుత్రపౌత్రాభివృద్ధితో ఆనందముగా ఉంటూ వైష్ణవ భక్తాగ్రగణ్యుడుగా ప్రసిద్ధుడయ్యాడు.

పౌర్ణమి, అష్టమి, ద్వాదశి, అమావాస్య – ఈ తిథులలో ప్రహ్లాద చరిత్ర చదివేవారికి అభీష్టసిద్ధి, గోదాన భూదానఫలమూ కలుగుతుంది. మైత్రేయా! ఇదీ ప్రహ్లాద చరిత్ర.

ఆ ప్రహ్లాదునకు విరోచనుడు, ఆయుష్మంతుడు, శిబి, భాష్కలుడు – అని నలుగురు కొడుకులు. విరోచనుని కొడుకు బలి. బలికి బాణాసురుడు మొదలుగా నూర్గురు కొడుకులు.

ప్రహ్లాదుని వంశమునందు పుట్టినవారే నివాతకవచులు మూడు కోట్లు.

హిరణ్యాక్షునకు ఝర్ఝరి, శకుని, భూతసంతాపనుడు, మహానాగుడు, మహాభాగుడు, కాలనాభుడు అని ఆర్గురు కొడుకులు.

కశ్యపుని మూడవ భార్యయైన దనువునకు పదిముగ్గురు కొడుకులు పుట్టారు. వారిలో పెద్దవాడైన వైశ్వానరునకు కాలిక, పౌలోమ అని ఇద్దరు కూతుళ్లు. వారు మరీచి భార్యలయ్యారు. ఆ యిద్దరి సంతతి కాలకేయులు పౌలోములు అని అరవై వేలమంది.

దనువు సంతతిలోని వాడే అయిన విప్రచిత్తికి సింహికయందు త్ర్యంశుడు, శల్యుడు, నభండుడు, వాతాపి, ఇల్వలుడు, నముచి, ఖస్యముడు, అంధకుడు, నరకుడు, కాలనాభుడు, స్వర్భానుడు, వక్రయోధి అనేవారు పుట్టారు.

తార అనే దానికి శుకి, శ్యేని, భాసి, సుగ్రీవి, శుచి, గృధ్ర అని ఆర్గురు కలిగారు. శుకికి శుకాలు, శ్యేనికి శ్యేనకపోతాలు, శుచికి జలపక్షులు, సుగ్రీవికి అశ్వ, ఉష్ట్ర, గార్దభాలు పుట్టాయి.

వినతకు అనూరుడు, గరుడుడు పుట్టారు. గరుడుడు సర్పాశనుడు, విష్ణువునకు వాహనం అయ్యాడు.



సురసకు వేయిలెక్కను విషపూర్ణములైన సర్పాలు పుట్టాయి.

కద్రువకు శేష వాసుకి కాలనాభ శంఖ పద్మ మహాభోగ శంబతక్షాదులు వేయిమంది నాగరాజులు పుట్టారు. వీరందరూ గరుత్మంతునకు వశులైనారు.

క్రోధవశ అనే దానికి క్రోధమూర్తులూ పెద్ద కోరలు గల క్రూర జంతుజాలాలు పుట్టాయి.

సురభికి గోవులు మహిషాలు పుట్టాయి.

ఇలకు యక్షరాక్షసులు పుట్టారు.

మునికి అప్సరో గణాలు జన్మించారు.

అరిష్ట సంతతి గంధర్వులు.

కశ్యప వంశం ఇలాగ అనేక సహస్ర సంఖ్యను పుత్రపౌత్రాభివృద్ధి కలదై స్థావరజంగమ రూపాలతో లోకములందు నిండి ఉన్నది. ఇదంతా స్వారోచిష మన్వంతరమందు శ్రీనాథుని రాజసగుణ కల్పితమైన సృష్టి.

అదితినందనుడైన ఇంద్రుని వజ్రాయుధమునకు దైత్యదానవ సమూహం బలికాగా దితి దుఃఖిస్తూ కశ్యపుణ్ణి చాలాకాలం సంతతి కోర్కెతో నిరంతరం సేవ చేసింది. అది వైవస్వత మన్వంతరం. దాని సేవకు మెచ్చి కశ్యపుడు ఏమి నీ కోరిక? అని అడిగాడు.

ఇంద్రుణ్ణి చంపి శచితో సహ దేవరాజ్యం ఏలే కొడుకుని ప్రసాదించు నాథా! అని దితి అడిగింది.

సరే శుచిగా ఉంటూ (అవయవశుద్ధి కలిగి) నియమంగా వ్రతం చేస్తూ ఉండు. నీ కోరిన కొడుకు కలుగుతాడు. అశుచిగా ప్రవర్తిస్తే గర్భం నశిస్తుంది అని కశ్యపుడు పుత్రదానం చేసి వెళ్లిపోయాడు. దితి నియమం

పాటించి ప్రవర్తించగా గర్భవతి అయింది. ఇంద్రుడికి దితి కోరిక తెలిసి వచ్చి కపటపు భక్తితో సవతితల్లికి సేవచేస్తూ ఉండేవాడు.

అలా ఉండగా దితి ఒకనాడు భోజనం చేసి పాదప్రక్షాళనం చెయ్యక లోనికి వచ్చి జుత్తు విరబోసుకుని పాన్పుమీద వాలి నిద్రాముద్రిత అయింది. ఇదే సమయం అని ఇంద్రుడు సూక్ష్మరూపముతో దితి కడుపులో ప్రవేశించి లోపల ఉన్న శిశువు ఏడ్వగా –

మారోదీః (ఏడవకు) అని వజ్రముచే ఆ శిశువును ఏడు ఖండాలుగా నరికి వాటిని మళ్లీ నలభై తొమ్మిది తునియలుగా చేసి బయల్పడి చడీచప్పుడూ లేకుండా వెళ్లిపోయాడు. ఆ నలభై తొమ్మిది ఖండాలూ రూపాలు ధరించి ఇంద్రుడికి తోడుగా అయిపోయారు.

మారోదీః అని యింద్రుని మాటననుసరించి వారు మరుద్గణాలుగా ప్రసిద్ధులయ్యారు.

మునుపు పృథువును పరిపాలకుడుగా బ్రహ్మ నియమించిన తరువాత ఆయా శాఖలకు అధిపతులుగా కొందరిని నిర్ణయించాడు.

నక్షత్ర గ్రహ విప్ర తపోయజ్ఞ వృక్షలతా గుల్మాదులకు చంద్రుడు, రాజులకు వైశ్రవణుడు, జలమునకు వరుణుడు, ఆదిత్యులకు ఉపేంద్రుడైన విష్ణువు, వసువులకు పావకుడు, ప్రజాపతులకు దక్షుడు, మరుద్గణాలకు ఇంద్రుడు, మునులకు కపిలుడు, దైత్యదానవులకు ప్రహ్లాదుడు, పితృగణములకు యముడు, ఏనుగులకు ఐరావతం, పక్షులకు గరుత్మంతుడు, సర్పాలకు వాసుకి, అశ్వములకు ఉచ్చైశ్రవం, గోవులకు వృషభం, మృగాలకు సింహం, వృక్షాలకు ప్లక్షం, (జువ్విచెట్టు) పర్వతాలకు హిమగిరి – అధిపతులు.



ఇప్పుడు చెప్పిన వీరందరూ విష్ణుని అంశతో పుట్టినవారే. ఆయన ప్రభావము లేకపోతే ఏదీ లేదు. పాలకునియందు విష్ణుభావం లీనమై ఉంటుంది.

కాలం, చరాచరాత్మకమైన జగత్తు, మంత్రతంత్రాలు, యజ్ఞయాగాలూ, గురువు, దేవతలు కర్మజ్ఞానేంద్రియాలూ – సమస్తమూ విష్ణురూపమని తెలుసుకో!

అలాగే వేదాలూ, ఉపనిషత్తులూ, శాస్త్రాలూ, ధర్మశాస్త్రాలూ, పురాణాలూ, అనువాకాలూ, కావ్యాలూ, సంగీతాదివిద్యలూ మూర్తామూర్తాలూ ఆ పురుషోత్తముని మూర్తి భేదాలని గ్రహించు!

మైత్రేయా! ఈ పురాణకథ చదివినా ఎన్నో వ్రతాలూ కార్తికస్నానాలూ పుణ్యక్షేత్ర దర్శనం చేసిన పుణ్యఫలం వస్తుంది అని చెప్పగా మైత్రేయుడు ఆనందముగా నమస్కరించి గురుదేవా! ధన్యుడను. ఇక ఒక మనవి. ఉత్తానపాదుని అన్వయ కథ చెప్పావు. ఆ ప్రియవ్రతునికి, అతని కొడుకులకూ సంబంధించిన రాజచరిత్ర వినాలని ఉంది – అని అనగా సరే చెప్తానన్నాడు పరాశరుడు.

* * *

## 3

స్వాయంభువనందనుడైన ప్రియవ్రతుని భార్య కుక్షి. ఆమె కర్దమ ప్రజాపతి కూతురు. ఆ దంపతులకు పదిమంది కొడుకులు. వారు –

ఆగ్నీధ్రుడు, మేథాతిథి, వపుష్మంతుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, సవనుడు, మేథుడు, అగ్నిబాహుడు, పుత్రుడు.

వారిలో మేధుడు, అగ్నిబాహుడు, పుత్రుడు పూర్వజన్మ స్మృతికలవారై విరక్తులై యోగనిరతులై భువి నుంచి వెళ్లిపోయారు. మిగిలిన ఏడుగురు కుమారులలో ఆగ్నీధ్రునకు జంబూద్వీపం, మేధాతిథికి ప్లక్షద్వీపం, వపుష్మంతునకు శాల్మలి, జ్యోతిష్మంతునకు కుశద్వీపం, ద్యుతిమంతునకు క్రౌంచద్వీపం, హవ్యునకు శాకద్వీపం, సవనునకు పుష్కరద్వీపం ఇచ్చి రాజ్యాభిషిక్తులను చేశాడు. వారు ఇంద్రమిత్రులై సప్తద్వీపాలనూ ఎదురులేని పరాక్రమముతో ధర్మమార్గాన పాలించారు.

జంబూద్వీపాధిపతియైన ఆగ్నీధ్రునకు తొమ్మిదిమంది కొడుకులు. నాభి, కింపురుషుడు, హరివర్షుడు, ఇలావృతుడు, రమ్యుడు, హిరణ్వంతుడు, కురుడు, భద్రాశ్వుడు, కేతుమాలుడు అని వారి పేర్లు.

ఆ తండ్రి జంబూద్వీపమును తొమ్మిది భాగాలుగా చేసి వాటికి వరుసగా వారిని రాజులనుగా చేశాడు. తరువాత ఆగ్నీధ్రుడు సాలగ్రామ తీర్థానికి పోయి తపస్వి అయ్యాడు. ఆ కొడుకులు పాలించే నవఖండాలూ వారి పేర్లతో వర్షసంజ్ఞలు కలవయ్యాయి.

నాభి హిమగిరికి దక్షిణభాగముగా ఉన్న భూమికి అధిపతి అయ్యాడు. అతని కొడుకు వృషభుడు. అతనికి నూర్గురు కొడుకులు. వారిలో పెద్దవాడు భరతుడు.

ఆ భరతుడు భూపతియై శత్రుభంజనుడు, ప్రజారంజనుడై భూమిని పాలించి ఇంద్రునకు ప్రేమాస్పదుడయి యజ్ఞాలు సురనర ప్రీతిగా చేసి పూర్వుల కీర్తికి మిన్నగా కీర్తినార్జించాడు. వాని పేరుతో నాభి వర్షం భరత ఖండముగా ప్రసిద్ధమయింది. వాని తండ్రి భూభారమంతా కొడుకుపై ఉంచి తపశ్చర్యకై పులహాశ్రమానికి వెళ్లిపోయాడు.



భరతుడు చిరకాలం రాజ్యం పాలించి కొడుకుని సుమతిని పట్టాభిషిక్తుణ్ణి చేసి సాలగ్రామ క్షేత్రానికి వెళ్లాడు. పతిని ఆరాధించి తనుత్యాగం చేసి మలిజన్మలో బ్రాహ్మణుడుగా పుట్టాడు.

భరతనందనుడైన సుమతికి కలిగిన సుతుడు ఇంద్రద్యుమ్నుడు. అలాగ భరతవంశం విస్తరించింది అని పరాశరుడు చెప్పగా విని మైత్రేయుడు సరే. ఇక భూమండల వైశాల్యం, సప్తద్వీప చరిత్ర, నదీసాగర పర్వత విస్తార విషయం, సురాసుర గంధర్వ నగరవృత్తాంతం వినాలని ఉన్నది. చెప్పవలసిందని అనగా ఆ ఆచార్యుడు శిష్యుడికి చెప్పాడు.

శిష్యా! నీవడిగిన విషయం సమగ్రంగా చెప్పడం చాలాకాలం అవుతుంది. అలా చెప్పడం అసాధ్యం. సంగ్రహించి చెప్తాను విను.

ఏడు ద్వీపాలకూ చుట్టు లవణ, ఇక్షు, సురా, సర్పి, దధి, క్షీర, జల సముద్రాలుంటాయి. అవి ఒకదానికి ఒకటి రెండింతలు విస్తీర్ణములు. ఈ ద్వీపాలకు నడుమ ఉన్నది జంబూద్వీపం. దానిమధ్య నున్నది మేరుపర్వతం. అది యక్షకిన్నర గంధర్వ తాపస దేవతల నివాసముగా చెప్పదగినది. దానికి దక్షిణముగా హిమగిరి, హేమకూటం, నిషధ పర్వతం – తూర్పు పడమర దిక్కులకు వ్యాపించి సమున్నతములై ఉన్నాయి.

నీలాచలం, వెండికొండ, మేరు పర్వతానికి చెప్పవలసిన శిఖరాలు.

ఒక్కొక్క పర్వతం రెండువేల యోజనాల విస్తీర్ణం, ఔన్నత్యం కలవై దక్షిణోత్తర భాగాలలో ఉంటాయి.

తూర్పున దేవకూటం, పడమటను జఠరపర్వతం ఉంటాయి.

మేరుపర్వతానికి దక్షిణమున భారతకింపురుష హరివర్షములు, ఉత్తరాన రమ్యక హిరణ్మయ కింపురుష వర్షములు, తూర్పున భద్రాశ్వ వర్షం, పడమటను కేతుమాలావర్షం – వాటి నడుమ ఇలా వృతవర్షం ఉన్నాయి.

మేరుగిరికి తూర్పున మందరగిరి, దక్షిణాన గంధమాదనం ఉన్నాయి. దాని శిఖరమునందు రావి, నేరేడు, కడిమి, మర్రిచెట్లు జెండాల్లాగా దుబ్బుగా ఎత్తుగా పెరిగినవి ఉంటాయి.

జంబూవృక్షం పేరుతో ఆ ద్వీపానికి ఆ పేరు ప్రసిద్ధం అయింది. దాని ఫలాలు ఏనుగంతలేసి ఉంటాయి. ఆ పళ్లు హేమకూటాచలం సానువులలో పడి చిదిగి రసం పారుతూ ఉంటుంది. అది మేరుగిరి చుట్టూ కమ్మి ఉంటుంది. ఆ ప్రవాహం జాంబూనదం అని పేరు పొందింది. ఆ ఫలరసం త్రాగుతూ అక్కడ ఉండేవారికి ఏలాటి రోగాలూ రావు. ముసలితనం అంటదు. దేవతలకు సాటిగా సుఖజీవనులు అవుతారు. ఇంకా విశేషం ఏమిటంటే ఆ ఫలరసం తాకిన మన్ను బంగారం అవుతుంది. ఆ కారణంవల్ల బంగారానికి జాంబూనదం అని ఒక చక్కని పేరు కలిగింది.

చైత్రరథం, గంధమాదనం, వైభ్రాజితం, నందనం అనే ఉపవనాలు అరుణాధర మహాపద్మనీలోదక మానసములు అనే సరస్సులూ మేరుగిరికి తూర్పు మొదలుగా నాల్గుదిక్కులా ఉండి దేవతలకు అనుభవములవుతూ ఉన్నాయి.

అలాగే ఆ బంగారు కొండకు నలుదిక్కులా గొప్ప పర్వతాలున్నాయి.

ఆలాంటి మేరుపర్వతం మీది దేవరాజధాని పదునాల్గు వేల యోజనాల వైశాల్యముతో సువర్ణరత్నస్థగిత గోపుర భవనాలతో త్రిజగన్నుతమై ఉన్నది.

విష్ణుపాదమునుంచి బయల్వెడలిన ఆకాశగంగ నాలుగుపాయలై సీత, అలకనంద, చక్షువు, భద్ర అనే పేర్లు గలదై ఆ అమర రాజధానికి నలుదిక్కులా ప్రవహించి కిందనున్న భారతాది వర్షములందు ప్రవహిస్తూ ఉంటుంది.

వాసుదేవుడు భద్రాశ్వవర్షమునందు హయగ్రీవ రూపముతోను, భారతవర్షమున కూర్మరూపముతోను, కేతుమాలా వర్షమున వరాహరూపముతోను, కురువర్షమున మత్స్యరూపముతోను తక్కిన వర్షములందు వివిధ రూపాలతోను ఉంటాడు.



అలాంటి కింపురుషాదివర్షములందు ఉన్న వారికి శోకం, ఆయాసం, ఉద్వేగం, దీపనం అనేవి ఉండవు. చిరంజీవులై సుఖసంతోషాలతో ఉంటారు.

భారతవర్షమునందు ప్రత్యేకించి కులపర్వతాలూ మహానదులూ చాలా ఉన్నాయి.

హిమగిరినుంచి దక్షిణ సముద్రం వరకు తొమ్మిదివేల యోజనాల విస్తీర్ణము కలదై భారతవర్షం ఉన్నది. అది కర్మభూమిగా ప్రసిద్ధం. పుణ్యాత్ములకు స్వర్గమోక్షప్రదం. మునులూ, సురలూ భారతవర్షమునందు నివసించాలని కోరుతూ ఉంటారు. జపతపోదానయజ్ఞాదులు యథాశక్తిగా చేసి తాము కోరే పుణ్యలోకాలు పొందడానికి భారతవర్షమే ప్రధానపీఠం.

మలయం, మహేంద్రం, శుక్తిమంతం, వింధ్యం, పారియాత్రం, ఋక్షం, సహ్యగిరి అని ప్రసిద్ధములైన కులపర్వతాలు భరత ఖండానికి భవ్యాలంకారాలు.

శతద్రు, చంద్రభాగ అనే నదులు మహేంద్ర పర్వతమునందు, వేదస్మృత్యాదులు పారియాత్రమునందు, నర్మదాదులు వింధ్యమునందు, తాపీపయోష్ణీ నిర్వింధ్యాదులు ఋక్షమునందు, గోదావరీ భీమరథీకృష్ణ వేణ్యాదులు సహ్యమునందు, తామ్రపర్ణీ కృతమాలాదులు మలయపర్వతము నందు, ఋషికుల్యాదులు శుక్తిమంతమునందు ప్రభవించాయి. ఇలాగే ఇంక కొన్ని పుణ్యనదులు ఉన్నాయి.

భరతవర్షానికి నలువైపులా వెయ్యేసి యోజనాల విరివితో తొమ్మిది ద్వీపాలూ ఉన్నాయి. ఇలాంటి నవద్వీపాలూ, మహానదులూ, కులపర్వతాలూ,

భరతవర్షమునందు తప్ప ఇంకే వర్షమునందు లేవు. ఈ విధముగా భారతవర్షం కర్మభూమి, పుణ్యభూమి అయింది. మిగిలినవి భోగభూములు.

జంబూద్వీపం లక్షయోజనాల పరిణామం కలది. దానికి చుట్టూ ఉండేది లవణ సముద్రం.

లవణ సముద్రానికి ఆవల ఉన్నది ప్లక్షద్వీపం. అది రెండు లక్షల యోజనాల పరిణామం కలది.

ఆ ద్వీపానికి ప్రభువు మేధాతిథి. అతనికి ఏడుగురు కొడుకులు. భుజబలానికీ, రూపరేఖావైభవానికీ వారికి వారే సాటి. తండ్రి ఆ ద్వీపమును ఏడు భాగాలుగా విభజించి వారిని ప్రభువులను చేశాడు. ఆ భాగాలకు వారి పేర్లు వచ్చాయి.

శాంత, హయ, శిశిర, సుఖోదయ, నంద, శివ, క్షేమక, ధ్రువ వర్షములని వాటి పేర్లు.

ఆ వర్షములలో ఉన్న నరులు సురలు కలిసి సోదరుల్లాగా జీవిస్తూ ఉంటారు. వారికి రోగాలూ ఏలాటి బాధలూ ఉండవు. కారణం? ధర్మానికి ఆ నరులు పెట్టినది పేరు.

ప్లక్షము = జువ్విచెట్టు. అది ఆ ద్వీపానికి పేరు తెచ్చినది.

విష్ణువు చంద్రరూపుడై ఆ ద్వీపములో భాసిస్తూ ఉంటాడు. ప్లక్షద్వీపానికి ఆవల ఉన్నది ఇక్షు సముద్రం. అది లక్ష యోజనాల వైశాల్యం గలది.

ఇక్షు సముద్రానికి ఆవల ఉన్నది శాల్మలద్వీపం, (బూరుగుమాను) దాని విరివి నాలుగు లక్షల యోజనాలు. దాని ప్రభువు వపుష్మంతుడు. అతనికి సుతులు ఏడ్గురు.



శ్వేతహరితులు, జీమూతరోహితులు, సుప్రభుడు, వైద్యుతి, మానసుడు – అని వారి పేర్లు. శాల్మలద్వీపం ఏడు భాగాలయి వారు ప్రభువులుగా వారి పేర్లతో అవి వర్షములయ్యాయి. ఆ వర్షములకు నడుమ కుముదము, ఉష్ణము, వలాహకము, ద్రోణము, మహిషము, కంకము, కకుద్వంతము – అని కులపర్వతాలు ఉన్నాయి. ఏడు నదులు ఆ పర్వతాలనుంచి ఉద్భవించాయి.

విష్ణువు వాయురూపుడై ఆ ద్వీపమునందు ఉంటాడు. ఆ శాల్మలవృక్షం పదునొకండు వందల యోజనాల ఔన్నత్యం కలదై ఆ ద్వీపానికి తన పేరు కలిగించింది.

ఆ ద్వీపానికి చుట్టూ ఉన్నది సురా సముద్రం. ఆ సముద్రానికి అవతల ఉన్నది కుశద్వీపం. ఆ ద్వీపమును జ్యోతిష్మంతుడు తన కొడుకులకు ఏడుగురకు విభజించి ఇవ్వగా వాటికి వారి పేర్లు వచ్చాయి. ఆ భాగాలలో మందరాది గిరులున్నాయి. ఆ పర్వతాల నుంచి శివ, విధూతపాప, పవిత్ర, సుమతి, పాపహర, హైమవతి, విద్యుదంభ – అని ఏడు నదులు పుట్టాయి. దైత్య దానవులు, దేవగణాలు, ఆ వర్షములందున్న నరులు కలిసి మెలిసి జీవిస్తూ ఉంటారు. మహావిష్ణువు బ్రహ్మరూపుడై ఆ ద్వీపమందుంటాడు.

ఆ ద్వీపమునందు ఆకసమును తాకుతూ కుశస్తంభం ఉన్నందువల్ల ఆ ద్వీపానికి కుశద్వీపం అని పేరు వచ్చింది.

కుశద్వీపానికి ఆవల ఉన్నది క్రౌంచద్వీపం. దానిచుట్టూ ఉన్నది ఘృత (నేయి) సముద్రం.

ద్యుతిమంతుని కుమారు లేడుగురు. వారికి ఆ ద్వీపాన్ని విభజించి యివ్వగా వారి పేర్లతో ఆ వర్షములు ప్రసిద్ధములు అయ్యాయి. ఆ భాగాలకు

పొలిమేరల ఏడుకొండలున్నాయి. క్రౌంచం, వామనం మొదలైనవి. ఆ కొండలనుంచి ఖ్యాతి, కుముద్వతి మొదలైన ఏడునదులు వెలువడ్డాయి.

విష్ణువు ఆ ద్వీపమందు రుద్రరూపుడై ఉంటాడు. దాని తరువాతిది శాకద్వీపం. దానిచుట్టూ ఉన్నది దధి సముద్రం. ఆ ద్వీపాదిపతి హవ్యుడు. తన ద్వీపమును కొడుకులేడుగురకు విభజించి ప్రభువులను చేశాడు. వారిపేర్లతో ఆ భాగాలకు పేర్లు వచ్చాయి. ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క కులపర్వతం, ఒక్కొక్క నది ఉన్నాయి. ఆ ద్వీపాలవాసులు ధర్మమూర్తులు. పరస్పర కలహం, పాపాలోచనలేని గుణవంతులు ఆ ద్వీపమునందు శ్రీహరి సూర్యరూపుడై యజ్ఞాలలో పూజలందుకుంటూ ఆ ద్వీపవాసులను కాపాడుతూ ఉంటాడు.

ఆ ద్వీపానికి ఆవల ఉన్నది క్షీరసముద్రం. దానికి సంబంధించి ఉన్నది పుష్కరద్వీపం. ఆ ద్వీపాధిపతి సవనుడు. అతనికి వీరయుక్తుడు, మహావీర ధాతకుడు అని ఇద్దరు కొడుకులు. వారికి తన రాజ్యం సమముగా విభజించి వాటికి ప్రభువులను చేశాడు. ఆ రెండు భాగాలకు నడుమ మానసోత్తరం అనే కొండ ఉన్నది. అది ఏబది వేల యోజనాల పొడవు, ఆకసమును తాకుతూ ఉంటుంది. సురసిద్ధ గంధర్వులకు నివాసం. ఆ ఇద్దరి పేర ఆ రాజ్యాలకు (పుష్కరాలకు) పేరు వచ్చింది. ఆ పుష్కరాల ప్రజలు దేవతల్లాగా హాయిగా జీవిస్తూ ఉంటారు. రోగాలూ, శోకాలూ, దుష్టగుణాలూ ముసలితనం లేని ధన్యజీవులు. వారు కోరినంతనే షడ్రసోపేతములైన ఆహారపదార్థాలు అక్కడి కక్కడ సంభవిస్తాయి. వారి ఆయుర్దాయం పదివేల సంవత్సరాలు.

అక్కడ బ్రహ్మస్థానమై వటవృక్షం ఉన్నది. మహావిష్ణువు బ్రహ్మమూర్తియై ఉంటాడు. దానికి దరిగా ఉండే సముద్రం జలార్ణవం. ఆ సముద్రానికి ఆవల ఉన్న పర్వతం చక్రవాళం.



ఈ విధముగా బ్రహ్మాండమునందు సప్తద్వీపాలతో, సప్త సముద్రాలతో, నానా చరాచరభూతకోటితో భూమి ధాత్రి, విధాత్రి అనే పేర్లతో ఒప్పుతూ ఉంటుంది. దాని అధోభాగమునందు అతల వితల నితల గభస్తిమంత, మహాతల సుతల పాతాళములనే లోకాలున్నాయి. అవి శుక్ల కృష్ణ అరుణ పీతశర్కర శైల కాంచన వర్ణాలు గల భూములు గలవై దైత్యదానవ, సర్ప నివాసములుగా ఉన్నాయి.

ఒకప్పుడు నారద మునీంద్రుడు ఆ లోకాలను చూసి వచ్చి నాకు చెప్పగా విన్నాను. భాగ్యరేఖకు ఆ లోకాలతో పై లోకాలు సాటికావన్నాడు.

విశేషమేమిటంటే సూర్యుడు ఆ లోకాలలో మితిమీరిన వేడిగా వెలుగడట! చంద్రుడు అతిచల్లని వెన్నెల విరియడట! ఆశ్చర్యం కదా!

ఆ లోకాల రాజధానులు అన్నీ భవ్యశోభాభాసమానములైన మేడలతో ఉంటాయి. అందున్న వారందరూ అమూల్యములైన చీనాంబరాలతో, మణికాంచనభూషణాలతో భాసిస్తూ ఉంటారు.

భక్ష్యభోజ్య లేహ్య పానీయ చోష్యములు అతిమనోహరములుగా సుగంధ కర్పూరకస్తూరీ పరిమళముతో భవనాలు దివ్యభోగాలతో ఉంటాయి.

వేణువీణా గానముతో మృదంగనాదముతో నాగకాంతలు వేడుకగా పాడుతూ ఉంటారు.

పద్మపరిమళముతో గండుతుమ్మెదల రొదలతో సరస్సులు ఉప్పొంగుతూ ఉంటాయి.

ఆరపండిన ఫలవృక్షాలతో ఆ నాగకాంతల విహారారామాలు నిత్యనూతన వికాసముతో ఒప్పారుతూ ఉంటాయి.

ఆలాటి పాతాళానికి కింద అపరపురుషోత్తముడు అనంతుడు సమధికైశ్వర్యముతో విరాజిల్లుతూ ఉంటాడు. దైత్యదానవులు, దేవతలు, మునులు, సిద్ధసాధ్యులు ఆ అనంతుని ఉపాసిస్తూ ఉంటారు. ఆ అనంతదేవుని మహిమలను ఏ మహానుభావుడున్నూ వర్ణించలేడు. వేయి శిరోమణుల కాంతులు దిక్కులయందు నిత్యనూతన కళలను కూర్చుచుండగా కిరీట కుసుమమాలికల సుగంధం ఆ లోకానికంతకూ భవ్యసౌరభం కలిగిస్తూండగా శరత్కాల మేఘచ్ఛాయకు పోటీచేసే శరీరకాంతి నిండు వెన్నెలపండువుకాగా నడుమున కట్టిన నీలాంబర కాంతి దిక్కుల చిమ్మచీకట్లు క్రమ్ముతూ ఉండగా ఆ శేషుడు (అనంతుడు) అనాయాసంగా భూమండలమును భరిస్తూ ఉంటాడు. అతని రెండు చేతులలో ఆకాశగంగ ముసలము నాగలిగా రెండు రూపాలతో ఉంటుంది. ఆ అనంతునకు ఒకప్పుడు కోపంవచ్చి ఊపిరి విడిస్తే దాని జ్వాల చరాచర ప్రపంచానికి ప్రళయాగ్ని జ్వాల అవుతుంది. అతడే ప్రళయ సమయమునందు రుద్రుడై జగాలను నశింపజేస్తాడు. మద్యపానముచే మత్తెక్కి కనులు తిప్పుతూ పడగలు విప్పి భీకరంగా ఆడించాడంటే నరసురాసురాళితో ఉన్న లోకాలన్నీ ఉగ్రూతలూగుతాయి. ఆలాటి దివ్యశక్తి సంపన్నుడైన అనంతుడు సకల నదీనదసముద్రపర్వత సహితమూ, చరాచరజంతు సంయుతమూ, ఏబదికోట్ల యోజనాల విస్తారమూ అయిన భూమండలమును శిరసుపై పూదండలాగా భరిస్తూ ఉంటాడు. ఇంత శక్తి అనంతునకు కలిగిందంటే సాక్షాత్తూ అది విష్ణుప్రభావశక్తి అతనిలో ఉందన్నమాట. పుష్పసుగంధులైన నాగకన్యలు ఆ అనంతునకు చందనపు పూత పూస్తూ ఉన్నపుడు ఆ సుగంధ వాయువులు లోకరంజనములై ఎల్లెడలా వ్యాపిస్తూ ఉంటాయి. గర్గుడా అనంతుని గురువుగా సేవించి జ్యోతిశ్శాస్త్ర పద్ధతులను, శకునశాస్త్ర విషయాలనూ నేర్చుకున్నాడు.



ఆ పాతాళానికి క్రింద పుణ్యమంటే ఏమిటో తెలియరానివై యమునకు సంబంధించిన ఘోర నరకాలు ఉన్నాయి. అవి చాలా భేదములుగా ఉంటాయి. అవి రౌరవం, సూకరం, రోదనం, తాలం, మహాజ్వాలం, తప్తకుంభం, అసిపత్రం మొదలైనవి. వాటిలో యమకింకరుల భీకరధ్వనులు, పాపకర్మ రోదనాలు వినిపించేవై ఉంటాయి.

పక్షపాతముతో ధర్మానికి విరుద్ధముగా కూడ సాక్ష్యం చెప్పే దుర్బుద్ధులు రౌరవానికి వెళ్లుతారు.

గురువును, ఆవును, పసిపాపను చంపినవారు రోధం అనే నరకమును చేరుతారు.

మద్యపానం, బంగారం దొంగిలించడం, బ్రాహ్మణహత్య చేసినవాడు వానితో స్నేహం చేసినవాడు సూకర నరకం చేరుతాడు. గురుభార్యను కూడినవాడు, ప్రభువును, వైశ్యుని చంపినవాడు, రాజద్రవ్యం అపహరించిన వాడు తప్తకుంభ నరకవాసి అవుతాడు. కూతురును, కోడలిని చెరచినవాడు, గురువులకు అపకారం చేసినవాడు మహాజ్వాలా నరకంలో పడతాడు. వేదం అమ్మినవారు, (వేదపాఠం చెప్పి ధనం పుచ్చుకునేవారు) వేదమును దూషించినవారు, పరధనం అపహరించినవారు లవణ నరకములో పడతారు. దేవతలను, గురువులను, బ్రాహ్మణ సమాజాలను నిందించేవారు విలోమమనే నరకంలో కూలుతారు. దేవ, ఋషి, అతిథి, పితృపూజలను విడిచినవారు క్రిమినరకములో చేరుతారు. అపవిత్రదానం పట్టినవాడు, మృష్టాన్నం ఇతరులకు పెట్టక తానే భుజించేవాడు, ఉప్పు, బెల్లం, పాలు, నెయ్యి, మాంసం, తిలలు, తైలం, తేనె, చల్ల, పెరుగు వర్తకం చేసే బ్రాహ్మణుడు, పిల్లిని, కోడిని, కుక్కను, మేకను, గొర్రెను, పందిని పెంచేవాడు, భూతదయలేనివాడు అయిన బ్రాహ్మణుడు అధోముఖం అనే నరకంలో

పడి పదరాని బాధలు అనుభవిస్తాడు. చేపలను పట్టి బ్రతికేవాడు, నాట్యవిద్య నేర్పినవాడు, విషం పెట్టినవాడు, స్త్రీవలన బ్రతికేవాడు, ఇల్లు కాల్చినవాడు, ఆశ్రయించినవానిని, తనకు మేలుచేసిన వానినీ చంపినవాడు, యజ్ఞ సమయంలో సోమం అమ్మిన బ్రాహ్మణుడు రక్తనరకంలో పడతారు.

తేనెపట్లు చెడగొట్టినవాడు, కులగౌరవం చెడగొట్టి బ్రతికేవాడు, గ్రామజనులకు హాని కలిగించేవాడు వైతరణిలో చేరుతారు. అడవులను చెడగొట్టినవాడు అసిపత్రవన నరకంలో పడతాడు. గొర్రెలను పెంచి చంపి వాటి మాంసం అమ్మి జీవించేవాడు, వేటాడి సాధు జంతువులను సంహరించేవాడు అగ్నిజ్వాలానరకంలో కూలుతారు.

వ్రతలోపం చేసినవాడు, తన కులాచారం విడిచినవాడు, వంట వండి ముందు తాను భుజించినవాడు సందంశం అనే నరకములో కింకర శిక్ష లనుభవిస్తారు.

పగలు నిద్రించే బ్రహ్మచారి, మిత్రఘాతుకుడు కుక్కమాంసభక్షకులై నరకబాధలు పొందుతారు.

ఇంకా ఇలాటివి పాపకర్ములను ఏడిపించే నరకభేదాలు చాలా ఉన్నాయి. పాపాలకు తగిన నరకాలు ఉన్నాయి. ఎచ్చుతక్కువలు లేక పాపాత్ములకు అక్కడ శిక్షలు పడుతూ ఉంటాయి. నరకంలో ఉన్నవారు దేవతలను తలఎత్తి చూడలేరు. అలాగే దేవతలున్నూ ఆ పాపులను తలలు వంచుకుని అసహ్యంగా చూస్తారు.

పుణ్యాత్ములు స్వర్గానికి వెళ్ళి సుఖంగా జీవిస్తూన్నట్టు పాపాత్ములు నరకానికి వెళ్లి కష్టాలకు చుట్టుకొని ఏడుస్తూ ఉంటారు.

సారం చెప్తున్నాను విను. మనసుకి సంతోషం కలగడం స్వర్గం. దుఃఖం కలగడం నరకం. మేలు స్వర్గం – కీడు నరకం.



చేసిన పాపాలకు తగిన ప్రాయశ్చిత్తకర్మ చెయ్యనివారు నరకయాతన లనుభవించక తప్పదు. స్వాయంభువాదులైన మనువులూ, మహామునులూ మనుషుల పాపాలకు తగిన ప్రాయశ్చిత్తాలు లోకోపకారకములుగా చెప్పారు. ఆ విధులను నిర్వర్తిస్తే పాపాలు పోతాయి. పుణ్యలోక నివాస సుఖం కలుగుతుంది.

ఇంకొక విశేషం చెప్తాను విను. ఆ మనువులూ, మునులూ చెప్పని పాపప్రాయశ్చిత్తం శ్రీమన్నారాయణ నామస్మరణం. దానిని నిశ్చల మనసుతో చేసినవానికి ఏలాటి పాపమున్నూ ఇట్టే నిశ్శేషంగా ఎగిరిపోతుంది.

ఏయే వ్రతాలూ, పూజలూ, జపాలూ, తపాలూ ఆరాధనాలూ, దానధర్మాలూ చేసినా పోని పాపం అచ్యుతా! గోవిందా! హరే! ముకుందా! నమస్తే – అని మనసా వాచా శ్రీహరిధ్యాన స్మరణ చేస్తే రూపుమాసిపోతుంది. జన్మాంతమందు పరమపదప్రాప్తి కలుగుతుంది. పునర్జన్మ మరి కలగదు.

వాసుదేవనామం భక్తిబీజం. దానిని నిశ్చల మనస్కుడే రేయింబవళ్లు భజించేవాడు విష్ణులోకవాసుడౌతాడు గాని నరకమును చేరడు సరికదా! చూడడు కూడ. వానికి పాపం అంటదు.

కోపం పాపానికీ, శాంతం పుణ్యానికీ మూలములు. దుఃఖమూ సుఖమూ వానివల్లనే కలుగుతాయి. ఆ పాపమును రూపుమాపి సుఖమును కలిగించేది జ్ఞానం. దానికిమూలం హరినామ సంకీర్తనం అని చెప్పగా విని శిష్యు డడిగాడు.

గురుదేవా! ఇక భువర్లోకాదులకు సంబంధించిన కథలు వినిపించు – అని అడగగా గురువు పరాశరుడు చెప్పాడు :

మైత్రేయా! సూర్యచంద్రుల కాంతులతో కలకలలాడుతూ సాగర కులపర్వత ద్వీపాలతో ఒప్పుతూన్నది భూమి. ఈ భూమి యెంత విరివి కలదో గగనం కూడా అంత పరిమాణం కలదే. ఈ రెంటికీ హద్దులు లేవు.

భూమండలానికి లక్షయోజనాలపైన ఉండేది సూర్యమండలం. అలాగే ఉంటుంది చంద్రమండలం. (సూర్యచంద్రుల దూరం) చంద్రమండలానికి అన్నియోజనాల దూరాన నక్షత్రమండలం. దానికి రెండులక్షల యోజనాల దూరాన బుధమండలం. దానికంతదూరాన శుక్రమండలం. దానికి అంత ప్రమాణంలో అంగారక మండలం. దానికి రెండులక్షల యోజనాల దూరాన బృహస్పతి మండలం. దానికి అంతదూరాన శనైశ్చర మండలం దానికి శతసహస్ర యోజనాలదూరాన సప్తర్షిమండలం. దానికి అంతదూరాన ధ్రువమండలం ఉన్నాయి. ఆ ధ్రువునకు జ్యోతిశ్చక్రం అంగవిభూష.

ఆ ధ్రువ మండలానికి కోటి యోజనాలపైన మహర్లోకం, దానికి రెండింతలపైన జనర్లోకం ఉన్నాయి. దానియందు కల్పాంతవాసులైన సనకాది యోగులు ఉంటారు. ఆ లోకానికి నాల్గింతల దూరాన తపోలోకం, దానికి నాల్గింతల పొడవున సత్యలోకం. సత్యలోకమునందున్న మహాత్ములు పునర్జన్మ బాధలేనివారై ఆనందంగా ఉంటారు.

అడుగులచే నడువదగినది మేదిని. అదే భూలోకం. భూమి నుంచి సూర్యమండలం వరకు ఉన్నది భువర్లోకం. సూర్యమండలం నుంచి పైన ధ్రువమండలం వరకు ఉండేది స్వర్లోకం. ఈ భూర్భువస్స్వర్లోకాలు కల్పితములు. జనతపస్సత్యలోకాలు కల్పితములు కావు. ఈ ఆరింటికీ నడుమనున్నది మహర్లోకం. అది కల్పాంత సమయమందు కొంత నశిస్తుంది. కొంత సుస్థిరమై ఉంటుంది. ఇలాగు చరాచరభూతకోటితో పదునాలుగు లోకాలబ్రహ్మాండం వెలగపండులాగా ఉంటుంది.

బ్రహ్మాండానికి వెలుపల బహువిస్తారముగా జలంచుట్టి ఉంటుంది. దానికి నాలుగింతలు ఎక్కువగా అనలం (అగ్ని); దానికి వెలుపల మహావాయువు, దానికి పదింతలు ఎక్కువగా ఆకాశం – ఇలాగ పంచభూత



స్థితి ఉంటుంది (ఇవే పృధివ్యప్తేజోవాయ్వాకాశాలు). ఈ భూతపంచకమును ఆవరించి మహత్తు – దానికి వెలువల భాగం ప్రధాన పురుషసంయుతమై ఉంటుంది. ఇన్నిటికీ ఆధారంగా విష్ణుమాయాశక్తి ఆక్రమించి ఉంటుంది.

బీజం – మొలకెత్తి పెరిగి రెమ్మలు, కొమ్మలు, పువ్వులు, పిందెలు, కాయలు, పళ్లు – గల వృక్షం; ఆవిధంగా వనాలు ఏర్పడుతున్నవి.

అలాగే విష్ణు మాయాశక్తివల్ల ప్రకృతి పురుషుడు సంభవించి అతనికి ప్రధానభూతం కలుగుతుంది. అతనివల్ల మహత్తు మొదలైనవి అవతరిస్తాయి. వానిలో ఆకాశతత్వం, దానినుంచి వాయువు, వాయువువల్ల అగ్ని, అగ్నివల్ల జలం, దానినుంచి పృథివి, ఆ భూమివల్ల దేవదైత్య పితృమానవాది సృష్టి – అది చరాచరరూపాన వ్యాపిస్తుంది. ఇలాగ బ్రహ్మాండం విస్తరిస్తుంది. ఇది బ్రహ్మాండతత్త్వం. ఇక జ్యోతిశ్చక్రం. సూర్యుడు అనే విషయం చెప్తాను విను అని పరాశరుడు చెప్పాడు.

సూర్యరథం నొగ తొమ్మిదివేల యోజనాల నిడివి గలది. దానికి రెండింతల ప్రమాణం గలది ఇరుసు. దానికి కడకమ్ములు అయిదు. మూడు తూములు (కుంచాలు) – ఆ రథగమనం అతిసూక్ష్మం. సంవత్సర గణనతో అది కాలచక్రం అవుతూంది.

ఆ రథం రెండవ ఇరుసు నలభై వేల యోజనాల నిడివి గలది. మూడవ యిరుసు ఇరవై అయిదువేల యోజనాల పరిమాణం గలది.

వర్ష, శీత, ఉష్ణములు వరుసగా ఆ మూడు ఇరుసులకు – కుంచాలకూ సంబంధించి వక్రగమనంతో కలుగుతూ ఉంటాయి.

ఏభై వేల యోజనములైన బండికాడికి వలపల, ఇరుసు వలపల ధ్రువునకు ఆకట్టుగా ఉంటాయి. కాడికి ఎడమవైపు గాయత్రి, బృహతి,

ఉష్ణిక్కు, జగతి, త్రిష్టుప్పు, అనుష్టుప్పు, పంక్తి అని ఏడు ఛందస్సులు ఏడు గుర్రాలై ఉంటాయి. ఆలాటి రథచక్రం మానసోత్తరశైలం మీద తిరుగుతూ ఉంటుంది.

ఆ మహాపర్వతమందు తూర్పున ఇంద్రపాలితమైన దేవనగరం, దక్షిణమున యమపాలితమైన సంయమనీ నగరం, పశ్చిమాన వరుణ పాలితమైన సుఖోదయపురం, ఉత్తరాన సోమపాలితమైన విభావరీపురం ఉన్నాయి. అవి అనేక యోజనాల విస్తీర్ణం కలవి. ఈ నాలుగు నగరాలలో సూర్యుడు సంచరిస్తూ ఉంటాడు. ఆ సంచారానికి సంబంధించి ఉదయాస్త మానాలు తోచుతాయి. సూర్యుడు జ్యోతిశ్చక్రముతో కలిసి ముప్పది ముహూర్తాలు గడవగా అస్తమిస్తాడు. ఆ సూర్యుడు భాసిస్తూన్న ప్రదేశం పగలుగా, ఆ కిరణప్రసారం లేనిచోట రాత్రిగా ఉంటాయి.

సూర్యసంచారం ఇంద్రనగరంలో ప్రభాతం, యమనగరంలో మధ్యాహ్నం, వరుణపురాన సాయంసమయం, సోమనగరాన మధ్యరాత్రం కలిగిస్తూంది.

ఆ సూర్యుడు కనిపించేది తూర్పు, కనిపించనిది పడమర – అని గ్రహించేది (ఇది భూలోకవాసులకు).

మానవలోకానికి ఉత్తరాన ఉన్న ఆ మేరు శిఖరాన బ్రహ్మసభ ఉన్నది. సూర్యుడు దానికి ప్రదక్షిణ గతిని చరిస్తాడు. ఆ సంచారం పైన జరుగు తూన్నపుడు ఉత్తరాయణం. క్రింద జరుగుతూన్నపుడు దక్షిణాయనం అని వ్యవహారం.

సూర్యుని మకరరాశి ప్రవేశం మొదలు మిథునం వరకు జరిగే సమయం ఉత్తరాయణం, కటకరాశి మొదలు ధనూరాశి వరకు జరిగే సంచారం దక్షిణాయనం అని లెక్క.



ఉత్తరాయణమున పగళ్లెక్కువ, రాత్రులు తక్కువ. దక్షిణాయనమున అది మార్పుగా ఉంటుంది.

సూర్యుడు మేష తులారాసులలో ఉన్నపుడు వాటికి విషువత్పుణ్యకాలములని వ్యవహారం. ఆ కాలములలో పగలూ, రాత్రీ సమముగా ఉంటాయి. అహోరాత్రముల ముప్పది ముహూర్తములను, ద్వాదశరాసులను ప్రవర్తించడం అవుతుంది. ఒక్కొక్క రాశియందు రెండు నక్షత్రాలూ ఒక్కపాదం లెక్కను ఇరవైయేడు నక్షత్రాలలో క్రమంగా ప్రవర్తిస్తాడు.

ఉత్తరాయణమున సూర్యుడు పగలు పదిమూడున్నర నక్షత్రాలను పదునెనిమిది ముహూర్తాలలో సంచరిస్తాడు. రాత్రి శీఘ్రగమనుడై అన్ని నక్షత్రాలలో పదునెనిమిది ముహూర్తాలకు అస్తమిస్తాడు. చక్రసంచారము ననుసరించి అహోరాత్రాలూ సమాధికహీనములవుతూ ఉంటాయి.

కుమ్మరి సారెవలె కాలచక్రం వడిగా తిరిగేటప్పుడు దానినడుమన సూర్యుడు మందగమనుడై తిరుగుతూ నభస్థలమున వెలుగు గలిగించి మేరుగిరి చుట్టూ ప్రదక్షిణం చేస్తాడు. అలా వడిగా కాలచక్రం తిరుగుతూన్నపుడు ధ్రువుడు మందగమనుడౌతాడు.

ఈ విధముగా కాలాత్ముడైన సూర్యుడు కనిపించడం, కనిపించక పోవడం గల పగలు, రాత్రి వ్యుష్టి, ఉష అనే సంజ్ఞ గలవవుతాయి. వాటి మధ్యకాలం సంధ్యాకాలం...

సూర్యతేజస్సు రాత్రులందు అగ్నికి చేరుతుంది. పగటిపూట అతనినుండి మళ్లీ సూర్యునికి సంక్రమిస్తూంది. కనుక సూర్యుడు పగలు తేజోమూర్తికాగా రాత్రి అగ్ని దివ్యప్రభతో భాసిస్తాడు.

ఉభయ సంధ్యాసమయాలలో సూర్యతేజస్సు నీళ్లలో ప్రవేశించి ఆకసముపై ప్రతిఫలిస్తుంది. ఆ విధమున ప్రభాత సాయంకాలములు అరుణరాగము లవుతాయి.

ఆ సంధ్యాకాలములందు మందేహులనే రాక్షసులు సూర్యమండలమును భక్షించడానికి మూగుతారు. ఆ సమయమందు బ్రాహ్మణులు వైదిక పద్ధతిని ఓంకారపూర్వకముగా గాయత్రిని జపించి భక్తితో అర్ఘ్యం ఇవ్వాలి. ఆ నీరు వజ్రరూపమై ఆ రాకాసిమూకలను చెడగొట్టుతూ సూర్యునకు తేజస్సును కలిగిస్తుంది. ఈ విధముగా ప్రతిదినం ఆ రక్కసులకు అగ్నిహోత్ర ప్రాణాహుతులతో హాని కలుగుతూ, సూర్యునకు సహజ తేజస్సు సంఘటిత మవుతూ ఉంటుంది. ఆ తేజస్సు భువన జీవనానికి ఆధార మవుతుంది. కనుక బ్రాహ్మణులు సంధ్యావిధులు ఆ కాలములందు తప్పక చేస్తూ ఉండాలి. ఉభయసంధ్యలయందు అగ్నిహోత్రవిధి నిర్వర్తించాలి.

కాలానుసారముగా సంధ్యోపాసన చెయ్యక అగ్నిహోత్ర విధి నాచరింపక ప్రవర్తించే బ్రాహ్మణుడు ఎంత యోగ్యుడైనా సూర్యద్రోహి అవుతాడు.

ఈ విధముగా సూర్యుడు వైఖానసాది బ్రాహ్మణులవల్ల రక్షణ కలవాడై కాలం గడుపుతూ జగాలను పాలిస్తూ ఉంటాడు. ఆ దేవుని ఉదయాదిగా మూడేసి ముహూర్తాలు ప్రాతస్సంగవ మధ్యాహ్న అపరాహ్న, సాయాహ్నములుగా అయిదు విధాలుగా కాలం వ్యవహారం.

అలాగే రాత్రికూడా పదునైదు ముహూర్తాల పరిమాణం గలదై ఉంటుంది. ఉత్తర దక్షిణాయనాలలో దినరాత్రాలు ఎక్కువతక్కువగా ఉంటాయి. మేష తులా సంక్రమణాలలో దివారాత్రులు సమంగా ఉంటాయి. అట్టి విషువ కాలాలు దేవపితృ సంతర్పణ జపతపోనుష్ఠాన దానాలకు యోగ్యములు.

సప్తముని మండలంపైన నూరు యోజనాల దూరాన ధ్రువుడుంటాడు. దానికి విష్ణుపదం అని పేరు. అక్కడ ఉంటారు బ్రహ్మణ్యులు (పరతత్త్వం తెలిసినవారు).



నిత్యమూ అష్టాక్షరమను జపపరాయణులై చిదానందముతో 'త్వం విష్ణోః పరమం పదం' అని అంటూ భక్తులు విష్ణుధ్యాన నిమగ్నులై అక్కడ ఉంటారు.

ఆ విష్ణుపదమునందు విష్ణుపాదము నుంచి భువనపావనియైన గంగ ఉద్భవించి శివజటాజూటము నలంకరించి సప్తముని మండలమును పావనము చేసింది. అక్కడినుంచి చంద్రమండలమును చేరి చంద్రకిరణాల నుంచి స్రవించే అమృతముతో మెరుగెక్కి మేరుగిరికి చేరింది. అక్కడ అమరావతికి నలుదిక్కులా సీత, అలకనంద, చక్షువు, భద్ర అనే పేర్లతో ప్రవహించి అలకనంద శివుని జటామకుటమునందుండి భగీరథుని ప్రయత్నముచే భూమండలానికి దిగి పాతాళాన ప్రవేశించి అక్కడ కపిల కోపాగ్ని జ్వాలచే బూదిరాసులై ఉన్న సగరపుత్రులను పవిత్రులను చేసింది. తరువాత దక్షిణ సముద్రాన కలిసింది.

దేవదేవుడైన వాసుదేవుడా పావన నదీతీరములందుండి తనను సేవించువారికి ముక్తిమార్గమును చూపుతూ ఉంటాడు. ఆ దేవునితోనే లక్ష్మీదేవి ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు.

గంగకు వెళ్లి అక్కడ సముచిత కర్మగతితో పితృతర్పణముగా తిలోదకాలూ పిండదానాలూ భక్తితో ఒక్కమారు చేస్తే ఆ చేసినవాని వంశం తరతరాలుగా పావనమౌతుంది.

ద్వీపాంతరాలలోనూ దేశాంతరాలలోనూ ఉన్నవారైనా ఒక్కసారి మనసారా భక్తితో గంగను స్మరించినట్లైతే మూడు జన్మలలో చేసిన పాపాలు తుడుచుకుపోతాయి.

ప్రభాత కాలమునందు గంగానది, గంగానది, గంగానది అని గంగానామస్మరణ చేస్తే శుభాలు కలుగుతాయి.

ఆ విధముగా లోకపావనియైన గంగానదికి జన్మస్థానమైన విష్ణుపదము నందు ఆకాశమంతా తానే అయి హరిని ఆత్మలో ధ్యానిస్తూ శింశుమార ప్రజాపతి మకరరూపముతో ఉంటాడు. ఆ మకర పుచ్ఛమునందు ధ్రువుడుంటాడు.

ఆ శింశుమార చక్రం సూర్యచంద్రాది గ్రహాలనూ నక్షత్రాలనూ తిప్పుతూ తానూ తిరుగుతూ ఉంటుంది. వాటికి పైన ధ్రువుడు తిరుగుతూ ఉంటాడు. సూర్యచంద్రాదులు వాయునాళములచే ధ్రువునియందు దృఢంగా కలిసి ఉంటారు.

ఆ శింశుమారుడు హరిని గూర్చి తపస్సుచేసి జ్యోతిశ్చక్రమునం దున్నాడు. ఆ విధముగానే ధ్రువుడు తపస్సు చేసి ఆ శింశుమార పుచ్ఛమునందున్నాడు. ఆ విధముగా మహావిష్ణువు శింశుమార చక్రానికి ఆధారం అయ్యాడు. శింశుమారుడు ధ్రువుని స్థితికి ఆధార మయ్యాడు. సూర్యునకు ఆధారం ధ్రువుడు. సూర్యుడు దేవాసుర మానవలోకాలకు ఆధారం అయి సమస్త భూతకోటికి అన్నపానాదులచే సంతృప్తి కలిగిస్తున్నాడు. ఎలాగంటావా విను చెప్తున్నాను.

సూర్యుడు ఎనిమిది నెలలు తన కిరణాలచే భూమియందున్న నీటిని ఆకర్షించి మిగిలిన నాలుగు నెలలూ వర్షరూపముతో వదులుతాడు. ఆ నీరు అన్నపానీయాలకు ఉపయుక్తమౌతూంది.

కాలాత్ముడైన సూర్యదేవుడు తన తీక్ష్ణ కిరణాలచే జలమునంతనూ ఆకర్షించి దానిని చంద్రమండలమం దుంచుతాడు. చంద్రుడు ఆ జలమును వాయునాళములతో ఆకాశమం దుంచుతాడు. వాయుజల ధూమజ్యోతి స్సంయోగముతో మేఘాలు పుట్టి కాలానుసారముగా వాయుబంధాలను వదుల్చుకొని గగనాన ఉన్న నీటిని కిందికి విడుస్తాయి. అదే వాన కురవడం అంటే.



పైన వ్యాపించిన సూర్యకిరణాల వల్ల గంగాజలం వానజల్లులో కలిసి భూమికి వస్తుంది. ఆ విధముగా భువిపై ప్రవహించే నీరు పుణ్యప్రదమౌతూంది.

కృత్తిక నుంచి బేసి లెక్కనున్న నక్షత్రాలలో మేఘసంబంధం అక్కరలేక వాన కురుస్తుంది. దిగ్గజాలు ఆకాశగంగలో వినోదంగా మునిగి తేలుతూ ఆ నీరు కిందికి జల్లుతాయి. ఆ విధంగా వానరూపాన నీరు పుడమికి వస్తుంది. అది స్నానానికి దివ్యతీర్థం ఔతూంది.

మేఘాలు కురిసే వానలు నింపుగా నీటిని కలిగించడంవల్ల సస్యాలూ, ఓషధులు సమృద్ధిగా పుట్టి పెరిగి భూతకోటికి ఆహారం కలిగిస్తూ ఉంటాయి. దానిచే బ్రాహ్మణులు యజ్ఞాలూ యాగాలూ చెయ్యడం, దానిచే దేవతలకు తృప్తి కలగడం జరుగుతుంది.

లోకములో వేదాలూ, శాస్త్రాలూ, యజ్ఞాలూ, హోమాలూ, అన్నదానాలూ జరుగుతూన్నాయి. అంటే అన్నిటికీ కారణం వర్షం. ఆ వర్షమును కురిపించే దేవుడు సూర్యుడు. ఆ మహానుభావుడు రెండు దిక్కులందున్నూ ఉత్తరాయణ దక్షిణాయన సంజ్ఞలతో సంచరిస్తూ ఉంటాడు. ఆ దేవుని రథమును మునులూ, దేవతలూ, భుజగులూ, యక్షులూ, గంధర్వులూ, దైత్యులూ అచ్చరల మంగళ గమనాలతో రక్షిస్తూ ఉంటారు. మహావిష్ణుశక్తిమూలాన పద్మబాంధవుడు సప్తర్షుల సూక్తాలతో దివ్యతేజోవిరాజమానుడై లోకాల చీకట్లను రూపుమాపుతూ ఉంటాడు.

ఆదిత్యులు అధిపతులుగా ఉంటారు. వాలఖిల్యాదులు మౌనులు కీర్తిస్తూండగా ముచ్చటగా అచ్చరలు నాట్యం, గంధర్వులు గానం, సురలు పరివారముగా ఉండి పనులు చెయ్యడం, నాగులు మోకులుగా

సూర్యరథమును లాగుతూ ఉండడం – ఇలాగు పద్మబాంధవుడు శీతోష్ణ జలరోచులతో విష్ణుశక్తి ప్రభావం అంగరక్షగా అన్ని లోకాలలో దర్శనమిస్తూ వెలుగుతూ ఉంటాడు అని చెప్పగా మైత్రేయుడు గురుదేవా! ఇప్పుడు నీ చెప్పిన చొప్పున ఆలోచిస్తే ఎవ రెవరో ఏవేవో చేస్తూ ఉండగా మరి సూర్యునకు గల శక్తిసామర్థ్యాలు ఏమని సందేహం? మరి ప్రత్యేకించి ఆయన మహత్వం ఏదో చెప్పవలసింది – అని అడగగా పరాశరుడు చెప్పాడు.

దేవతలలో సూర్యునకు ఆ తేజస్సు కలగడానికి కారణం శ్రీహరి దివ్యశక్తి ఆయనలో లీనమై ఉండడమే. ఆ తేజస్సుతో బ్రహ్మాండ మధ్యమునందున్న కటిక చీకట్లను రూపుమాపుతున్నాడు. ఆదినారాయణుని అంశములతో ఒప్పినట్టి ఋగ్యజుస్సామవేదాలు మూడున్నూ ఆ సూర్యుని మూర్తినుంచి వెలువడి మూడు సంధ్యాసమయాలలో వినవస్తున్నాయి. అగ్నిజ్వాలతో రూపొందిన దీపం ఇంటి నడుమనుండి ఇంటనున్న చీకటిని పోగొట్టినట్టు శ్రీ మహావిష్ణువు తేజస్సులో సహస్రాంశం మార్తాండునియందు సంక్రమించి బ్రహ్మాండం నడుమ వెలుగు కలిగిస్తూంది. ఆ విధముగా చైత్రాదిగా పన్నెండు నెలలతో ప్రత్యేకముగా దేవ ఋషియక్ష గంధర్వాదులతో కలిసి శీతోష్ణజలాలు కిరణాలుగా విష్ణుతేజో విరాజమానుడై దేవపితృ మానవలోకాలకు తృప్తిని సూర్యుడు కలిగిస్తున్నాడు. ఆ సూర్యుని కిరణముల యందున్న సుషుమ్న అనే కళ చంద్రమండలానికి అభివృద్ధిని కలిగిస్తూ ఉంటుంది. అమృతమయములైన సూర్యకిరణముల వృద్ధి పొందిన చంద్ర మండలమందున్న అమృతమును దేవసమూహం కృష్ణపక్షమునందు ఆస్వాదిస్తూ భాసిస్తూ ఉంటుంది. చంద్రుడు శుక్లపక్షములో సూర్యప్రభ వల్ల పుష్టిని పొందుతూ ఉంటాడు. ఆ అమృత కిరణునివల్ల దేవతలకు అర్థమాసం, పితృగణాలకు పూర్ణమాసం, మానవులకు సర్వకాలమూ తృప్తి కలుగుతూ ఉంటుంది.



చంద్రుని రథమునకు సంబంధించిన గుణాలు జలమునుంచి పుట్టినవి (జలమయములు) మొల్ల పూవన్నె గలవి. వాటి నడక క్రమముగా ఉండదు. వాటి సంచారానికి ఆధారం ధ్రువుడు. కుడియెడమ భాగాల కల్పాంతం వరకు నడుస్తూ ఉంటాయి. ఆ విధంగా అవి సూర్యరథాశ్వాల్లాగా దృఢబంధములై సంచరిస్తాయి. చంద్రుని కిరణాలు వృద్ధి క్షయం కలవై ఉంటాయి. చంద్రుని పుష్టికి ఆధారం సూర్యుడు.

కృష్ణపక్షములో అమృతమయములైన చంద్రకిరణాలు ఒక్క కళ మిగులుగా దేవతలు పీలుస్తూ ఉంటారు.

శుక్ల పక్షములో సూర్యకిరణ ప్రభావముచే దినదినం వృద్ధి పొందుతూ ఉంటాయి.

చంద్రుని పదునైదవ కళను పితృదేవతలు పానం చేస్తారు. కనుకనే అమావాస్య పితృతిథి అని తెలిసిన పెద్ద లన్నారు.

అమావాస్యనాడు చంద్రుడు లతలయందుండి చెట్లలో అమృతం నింపి సూర్యునిలో చేరుతాడు. కనుక ఆ ఆకును గోటితో గిల్లినవాడు బ్రాహ్మణహత్య చేసిన పాపం చుట్టుకుని అధోగతుడై చాలాకాలం కష్టపాటుననుభవిస్తాడు.

ఆ సూర్యేందు సంగమం పర్వం అని సంజ్ఞ కలదయింది. ఆ సమయంలో చంద్రుని పదునైదవ కళ సూర్యునియందు కలుస్తుంది. అమావాస్య అని పేరు పొందింది. ఆనాడు చంద్రుడు ఏకకళామాత్రుడై లతలయందు, చెట్లయందు జలరూపాన ఉంటాడు. ఆ విధముగా లతలూ, చెట్లూ, ఓషధులూ, పశువులూ, మనుష్యులూ జంతుసంతతి చంద్రునివల్ల సంజీవనం కలవారవుతూ ఉంటారు.

గాలి నుంచి అగ్నినుంచి పుట్టిన రథమునందు వాయువేగము గల ఎనిమిది గుర్రాలు లాగుతూండగా చంద్రనందనుడు బుధుడుంటాడు. ఆ గుర్రాల వన్నె గోరోజనచ్ఛాయ.

శుక్రుడు అమ్ములపొది, అపురూపమైన జెండా, చక్కని గుర్రాలూ గల రథమునందుంటాడు.

అంగారకుడు కెంపువన్నె గల గుర్రాలు గలది. అగ్నియందు పుట్టిన ఎనిమిదంచుల బంగారు రథమునం దుంటాడు.

గురువు తెల్లని ఎనిమిది గుర్రాలు పూన్చిన బంగారు రథమునందుండి ఒక్కొక్క రాశియందు ఒక్కొక్క సంవత్సరం సంచరిస్తాడు.

శని చిత్రవర్ణములు, ఆకసము నుంచి పుట్టినవియైన గుర్రాలు పూన్చిన రథమునందుండి ఒక్కొక్క రాశియందు రెండున్నర సంవత్సరాలు తిరుగుతూ ఉంటాడు.

రాహువు నల్లని ఎనిమిది గుర్రాలు పూన్చిన బూడిద వన్నె రథమునందుండి సవిలాసముగా సంచరిస్తూ ఉంటాడు.

తాను తిరుగుతూ ఉన్న నక్షత్రాలకు పర్వదినములందు సూర్యుడుగాని, చంద్రుడుగాని వచ్చినట్లైతే పట్టుతాడు (అదే గ్రహణం).

కేతువు లక్కరంగు, వాయువేగం గల ఎనిమిది గుర్రాలు పూన్చిన పొగరంగు రథమునందుండి సంచరిస్తూ ఉంటాడు.

ఇలాగు సూర్యాది గ్రహాలూ, నక్షత్రాలూ ధ్రువుని యందు దృఢ బంధములైన వాయునాళము లాధారముగా సంచరిస్తూ ఉంటాయి. చక్రధరుని ఆజ్ఞప్రకారం జ్యోతిశ్చక్రం ఈ విధంగా తిరుగుతూ ఉంటుంది. ఆ చక్రము నందున్న శింశుమారమును రాత్రులందు చూచినవారు పుణ్యాత్ములూ, ధర్మాత్ములూ అవుతారు.



శింశుమారాదిగా ఇవన్నీ విష్ణుదేవుని రూపములుగా భావించు. జ్యోతిశ్చక్రం, లోకాలూ, నదీనదాలూ, సముద్రాలూ, పర్వతాలూ, భువనాలూ, దిక్కులూ అన్ని జీవరాసులూ విష్ణువే. పుడమియందలి మన్ను కుండ మొదలైన రూపాలు పొందినట్లు విష్ణుశక్తి వివిధ రూపాల విలసిల్లుతుంది. బ్రహ్మసృష్టితో రూపించిన యీ ప్రపంచ ప్రవర్తన విష్ణుమూర్తులే. అయినా వస్తుభేద వృత్తితో ఉంటాయి అని చెప్పగా విని మైత్రేయుడు అడిగాడు.

గురుదేవా! ఏ పాపం ఎరగని భరతుడు సాలగ్రామ తీర్థానికి వెళ్లి యోగసాధనతో విష్ణువును భజించి ముక్తి పొందలేక మలిజన్మలో బ్రాహ్మణుడుగా జన్మించాడని చెప్పావు. ఆ జన్మలో గృహస్థ ధర్మాలనుసరించి ప్రవర్తించాడా? లేక పరతత్త్వ విద్యోపాసకుడై ముక్తుడయ్యాడా? ఆ కథ చెప్పవలసింది అని అడగగా పరాశరుడు చెప్పాడు.

**జడభరతుని కథ**

భరతుడు సాంసారిక సుఖానికి ఇష్టపడక మోక్షకాంక్షతో సాలగ్రామ తీర్థమునకు పోయి అక్కడ శ్రీ మహావిష్ణుధ్యానం చేస్తూ యోగీంద్రుడుగా ప్రసిద్ధుడు అయాడు.

కేశవా! పద్మనాభా! హృషీకేశా! శ్రీపతీ! గోవిందా! జనార్దనా! వాసుదేవా! పరమేశ్వరా! అని శ్రీహరినామస్మరణ తప్ప ఇంకేమాట అతనినోట వచ్చేది కాదు. హరినామ సంకీర్తనలు, హరిభక్తులతో ప్రసంగం – హరి పాదపద్మ పూజకి కావలసిన పదార్థాలు సేకరించడం ఆ భరతుని నిత్యకృత్యాలు.

అలా ఉంటూ ఒకనాడు కొండ దరినున్న తీర్థములో స్నానం చేసి ఒడ్డున కాలోచిత కృత్యాలు చేస్తూండగా నిండు చూలాలైన ఒక లేడి అల్లనల్లన వచ్చి ఆ నీటిలో నీరు త్రాగుతూండగా భీకరంగా సింహగర్జన వినిపించింది. ఆ ధ్వని విని బెదిరి చప్పున నీటిలోంచి ఎగిరి గట్టుకిరాగా దాని గర్భం

జారిపోయి నీళ్లలో పడిపోయింది. లేడి గట్టుమీదపడి ప్రాణం విడిచింది. దాని కడుపు నుంచి జారి నీళ్లలో పడిన లేడి పిల్లను చూసి భరతుడు జాలిగుండెతో పరుగెత్తి వెళ్లి దానిని ఎత్తుకువచ్చి మెల్లగా నడుస్తూ తన ఆశ్రమానికి తీసుకువెళ్లి పోషిస్తూ ఉండగా అది క్రమంగా పెరిగి పెద్దదయింది. సూర్యకిరణ సంపర్కముచే శుక్లపక్ష చంద్రరేఖలాగా భరతుని పోషణచే ఆ లేడి చక్కగా పెరిగింది.

మేతకి ఆశ్రమం నుంచి కొంతదూరాన ఉన్న అడవికి పోయి పులులు కనిపించగానే బెదిరి పరుగుపరుగున వచ్చేది. ఆశ్రమంచుట్టూ గంతులు వేస్తూ తిరిగేది. అల్లనల్లన వచ్చి తన లేత కొమ్ములతో మెల్లమెల్లగా గీసేది. ఆయన యోగాసనం మీద ఉండగా తొడలపై పడుకునేది. పర్ణశాల చుట్టూ పరుగు పెట్టుతూ లేతపచ్చిక మేసేది. ఇలాగ ఆ లేడిపిల్ల అతనికి ముద్దు చూపుతూ ఉండేది. ఒక్కొక్కనాడు దూరంగా మేతకి వెళ్లి తిరిగి రావడం ఆలస్యమైతె ఎందుచే రాలేదా అని రాజు దిగులు పడేవాడు. లేచి ఏమయిందో అని అటూ ఇటూ చూస్తూ తిరిగేవాడు. ఏదైనా లేడిపిల్ల కనిపిస్తే ఇదే అని దగ్గరగా వెళ్లి చూసి ఇది కాదు అదేమయిందో అని చింతించేవాడు. గాలికి పర్ణశాలలో ధూళి రేగితే ఆ – వచ్చిందే అని సంతోషంగా వెనుదిరిగి వచ్చేవాడు. పొదలలో కదలిక చూసి ఇందులో ఉన్నదా అని వెతికేవాడు. ఇలాగ ఆ లేడిపిల్ల మీది మోహముతో కర్తవ్యం మరిచి ప్రవర్తించే స్థితిలోకి వచ్చాడు.

సతీసుతులను బంధుమిత్రులను రాజ్యవైభవమును విడిచి కైవల్యకాంక్షతో అడవికి వచ్చి యోగాభ్యాసముతో నారాయణుని ధ్యానిస్తూ ఉన్న భరత క్షితిపతి లేడి సంబంధముతో భ్రాంతచిత్తుడై కైవల్యప్రాప్తికి దూరమైపోయాడు. ఇలాగ ప్రవర్తిస్తూ కొంతకాలానికి శరీరత్యాగం



సమీపించగా ఆ లేడిని చూస్తూ శోకసంతప్తుడై కన్నీళ్లు కార్చుతూ ముద్దులకూనా! నిన్ను విడిచి పోవలసే దుర్దశ దాపురించింది. దైవసంకల్పం ఎవ్వరూ తప్పించలేరు అని ఆ లేడిని గట్టిగా కౌగిలించుకుని ఏడుస్తూ ప్రాణం విడిచాడు.

పూర్వ జన్మవాసన వదలక ఒక లేడి కడుపున పుట్టి తల్లిని విడిచి సాలగ్రామ తీర్థానికి పోయి యోగపద్ధతిని అవలంబించాడు. దేహాభిమానం విడిచి ఎండుటాకులూ, కసవు మేస్తూ అలా ఉండి కొంతకాలానికి ఆ శరీరం విడిచాడు.

ఒక యోగివంశములో పుట్టి వేదవేదాంగ వేదాంతతత్త్వజ్ఞుడై జ్ఞానియై బ్రహ్మజ్ఞానియై స్వకులాచార ప్రవర్తనుడై పూర్వజ్ఞాన గరిష్ఠుడయాడు. వేషం జడవేషం. (లోకజ్ఞానం లేని మూఢపద్ధతి). కాలానుసారంగా ఉపనీతుడయాడు.

గురువు చెప్పేవి తన వివేకానికి మారకములుగా తలచి వాటిని వినక తిరస్కరించేవాడు. తొలి పుట్టువులో లేడి సంబంధంవల్ల కలిగిన దోషముచే అనేక దుఃఖాలు అనుభవించిన వాడు కనుక అందరూ ఆక్షేపించే పనులు చేస్తూ ఉండేవాడు.

యోగి ప్రచ్ఛన్న వృత్తితో ఉండకపోతే పరమతత్త్వ విచారణ కలగదని ఒకప్పుడు బ్రహ్మ చెప్పిన మాటననుసరించి మూఢవేషం, గ్రామ్యభాష, అస్పష్టముగా మాటాడడం, మురికి పట్టిన శరీరం, దుమ్ము క్రమ్మిన జుట్టు, బెదరుచూపులు, నీరుకారే దంతాలు, వెర్రి ఆటలు, వికారపు కేకలు, తప్పటడుగుల నడక – ఇలా ఉంటున్నాడు. కడుపుమీంచి చొంగకార్చుతూ, తుమ్ముతూ, ఉమ్ముతూ, మట్టిముద్దలు బంతుల్లాగా చిమ్ముతూ, మాసిన చింకి పాతకట్టి తిరుగుతూ, ఎవ్వరూ దగ్గరకు చేరనియ్యని రీతిగా ప్రవర్తిస్తూ

ఉండేవాడు. చదువు మానిపి విద్యార్థులను ఈడ్చుకుపోయి ఆటలాడించేవాడు. వేదవిద్వాంసులను చూసి వెక్కిరించి నవ్వేవాడు. అందరూ అసహ్యించేలాగ అసభ్య చేష్టలు చేసేవాడు. జాతిమత విచక్షణ లేక ఆకలికి ఎవరి యింటనో ఇంత ఆహారపదార్థం యాచించి తెచ్చుకుని తినేవాడు. నీచవేషం, నికృష్టగుణాలు కలవాడై ఏకాకిగా ఉండేవాడు. ఇలాగు బాల – ఉన్మత్త – పిశాచ భావాలతో ఉంటూ గుగ్గిళ్లు, ఆకులూ, కూరలూ తింటూ దేహయాత్ర నడుపుతూ ఉండగా తండ్రి దివంగతుడయాడు.

సోదరులు, బంధువులూ చేసే పొలం పనులు ఒకొక్కప్పుడు తానే ముందువెళ్లి ఆ పని చేసేవాడు. బలిష్ఠమైన శరీరం కలవాడై మోటు పనులు చేస్తూ ఆహారపదార్థాలకోసం వారి వారికి సహాయం చేస్తూ ఉండేవాడు. ఇలా ఉండగా ఒకనాడు –

వీరరాజు అనే రాజు వివేకశాలి సంసార దుఃఖాలచే నలిగి మోక్షముపై కోర్కె కలిగి సమస్తమూ విడిచి కపిల మహాముని వద్దకు వెళ్లడానికి సంసిద్ధుడై అందలం ఎక్కి వెళ్లుతూండగా చూసి దగ్గరకు వెళ్లాడు. అప్పుడు అందలం మోస్తూన్న రాజసేవకుడు జడభరతుడికి ఆహార పదార్థం ఆశ చూపి పల్లకీ కొమ్ము అందించగా అది మోయసాగాడు. కాని ఏదో ఆలోచన – అటూ యిటూ చూపు... అందలం ఎచ్చు తక్కువలుగా కిందుమీదుగా నడవడం గుర్తించి లోపల ఉన్న రాజు మోసేవారిని అదలించి సరిగా నడవండి అని అరిచాడు. అప్పుడా వాహకు లన్నారు

ప్రభూ! మా తప్పుకాదు. ఈ మనిషి ఎవడో – ఒకప్రక్క దూరి మోస్తూ సరిగా నడవకున్నాడు – అని అనగా రాజు ఆ జడబ్రాహ్మణుణ్ణి చూసి చిరునవ్వుతో అన్నాడు :



ఏమయ్యా! అంత బలిసి ఉన్నావు. అందలం మోసినవాడవు. ఎగుడూ దిగుడూ లేక నడవవద్దా? నడిచి నడిచి అలసిపోయావా? రాజు మాటను విని ఆ జడుడు – అలసిపోవడం నాకు తెలియదు. ఎలాగ నడుస్తున్నానో చెప్పలేను. నా శరీరం బలిసి ఉండడం కారణం? అలాగే అందలం నేను మోస్తున్నానా?...

కనిపిస్తున్నావు శిబిక ఒకప్రక్క నీ భుజంమీద ఉన్నదే. నీ మాట నాకు అర్థం కాలేదు.

'రాజా! నువ్వు అందలంలో ఉండడం – నేను మొయ్యడం ఇదంతా మిథ్య. ఎవరు ఎవరిని మోస్తూ ఉంటారో చెప్తాను విను.

భూమి పాదాల బరువును, పిక్కలను పాదాలు, తొడలను పిక్కలు, కడుపును తొడలు, కడుపు వక్షమును, వక్షము భుజాలను, భుజాలు అందలమునూ భరిస్తున్నాయి. అందలం నీ బరువును మోస్తూంది. నీతోపాటు అందలమును వారూ వీరూ మోస్తూన్నారు. నిన్ను, నన్ను, వీరినీ, సకల పదార్థమునూ, పృథివ్యాది పంచభూతాలు భరిస్తున్నాయి.

ఇక – సాత్వికం మొదలైన గుణాలు కర్మఫలాలు. ఆ కర్మలు మాయారూపాన అన్నిజంతువులందు పలురీతుల ఉంటాయి. ఆత్మ ఆ మాయకి అతీతం. అది అక్షరం (నాశం లేనిది). అతి శాంతం. త్రిగుణాలకు వశము కాదు.

హాని, వృద్ధి దేహాధీనములుగాని ఆత్మాధీనాలు కావు. కాబట్టి ఏ విధంగా నన్ను బలిష్ఠుడవని అన్నావో నువ్వు. ఇప్పుడు నేను చెప్పిన భూమి పాదాలు మొదలైనవి ధరించే బరువు విమర్శిస్తే యీ అందలం బరువు నేనూ నువ్వూ కూడా మోస్తూన్నట్టే అని భావించు. అలాగే జరుగుతూండగా నేను ఒక్కడనే బరువు మోస్తున్నానని ఎలా నిర్ణయించగలవు?

ఈ అందలం బరువు భూమి వృక్షపర్వతాలలో ఏ పదార్థమునందు పుట్టిందో చెప్పగలవా?

అని ఉపన్యసించి మౌనియై శిబికను మోస్తూ నడుస్తూ ఉండగా రాజు ఆగండని ఆపి దానినుంచి దిగి ఆ జడుని పాదాలకు మ్రొక్కి అన్నాడు.

మహాత్మా! శిబికను విడువు. తెలియక జరిగినది నాలో తప్పు; క్షమించు, ఎవరునువ్వు? ఎక్కడివాడవు. ఇలా మూఢపద్ధతిని తిరుగుతున్నావేమి?...

రాజు మాటలకు చెప్పాడు జడ బ్రాహ్మణుడు. రాజా! సోహం అనే వాక్యానికి అర్థం చెప్పడం అంత తేలికకాదు. జీవులలో దేశకాల పరిస్థితులననుసరించి చేసే కర్మలననుసరించి ధర్మాధర్మాలూ వాటికి తగిన సుఖదుఃఖాలూ అనుభవిస్తూ ఉంటారు అని అనగా –

సరే – నీవు చెప్పినది బాగానే ఉంది. కాని సోహం అనే దానికి ఊహించి చెప్పడం సాధ్యం కాదన్నావు. అదేదో చెప్పవలసిందిగా కోరుతున్నాను అని రాజు అడగగా జడభరతుడు చెప్పాడు.

రాజా! సోహం అనేది ఆత్మకే చెప్పవలసేది. దేహాదులకూ, పరమాత్మకు సమన్వయించడం సరికాదు. నాలుక, దౌడ, పెదవులు – అనే వాటి వర్తనచే ఆ శబ్దం వెలువడుతూంది. కనుక అహం అనేది విషయభూతం కాదు. కనుక ఆ దౌడ మొదలైనవి సోహమనే శబ్దానికి స్వరూపాలు కావు. కాలు చేతులు, కడుపు, తల మొదలైనవి గల శరీరం ఆత్మ అని నిరూపించడం అవివేకం.

నీకు నాకు, మిగిలిన లోకులకును పరముడై ముల్లోకాలలో ఏకాకారుడై ఉన్న సుచరిత్రుడు సోహం అనే మాటకి చెప్పదగినవాడు, అఖండ పరిపూర్ణ మహత్వముతో లోకములందు ఏకమై కలిసి ఉన్న పరమాత్ముణ్ణి కాక దేహమునందు సోహం అనేమాటను సరిపెట్టడం వివేకశీలుని లక్షణం కాదు.



రాజా! ఈ శిబిక దారువా? (కర్రా) వృక్షమా? దారువైతే నిన్ను ప్రజలు దారువెక్కావని అనరు. వృక్షమంటావా, వృక్షమెక్కావనరు. దారు సమూహముచే రూపొంది శిబిక అని పేరు పొందింది. ఆ విధంగా నిన్ను శిబికారూఢుడు అనే అనాలి.

చరాచర పదార్థాలు లోకసంజ్ఞచే భిన్నరూపములుగా కనిపిస్తాయిగాని ఏలాటి భిన్నరూపం లేని పరమాత్మకి వేరొక పేరు, సంజ్ఞ ఉండవు. నర సుర తిర్య గ్జంతువుల దేహాలు ఆత్మకాదు. అవి కర్మలననుసరించి ఏర్పడతాయి. ఏ కాలమునందును ఏలాటి మార్పు చెందనిది ఆత్మ. దానికి బాల్యాదిసంజ్ఞలు లేవు.

రాజా! తల్లిదండ్రులకు నువ్వు కొడుకు. కొడుకులకు తండ్రివి. భార్యకి భర్తవి. ప్రజలకు రాజు. మరి నిన్ను ఎవరనాలి? అన్ని అవయవాలకు పరుడవయితే నిన్ను 'అహం' అనవచ్చును. పరుడవు కానిచో నిన్ను ఏమనాలి? కాబట్టి తత్వం వేరుపరచి చెప్పవలసేదై ఉన్నది. మరి సోహం అనేది నీకు ఎలా అన్వయిస్తుందో చెప్పు – అని అనగా రాజు కలతపడిన మనసు కలవాడై అన్నాడు.

మహాత్మా! నీ తాత్వికోపన్యాసం వల్ల నా మనస్సు పరిపరి విధాల పరుగెత్తుతూంది. ఈ వికారమును పోగొట్టు. వివేకమునకు సంబంధించి నువ్వు చెప్పినది ఇలపై గల వారియందు ప్రత్యక్షమవుతూ ఉంది. అది అట్లుండనీ! పరమార్థమైన శ్రేయస్స్వరూపం నాకు తెలియవలసి ఉంది. ఈ విషయం పరమతత్త్వ బోధకుడైన కపిలమహామునిని అడిగి తెలుసుకోవలెనని వెళ్తున్నాను. నీవు కూడ అంతవాడవని అనుకోవలసి వచ్చింది. కనుక నిన్నే ఆచార్యుడుగా ఉపాసించదలచుకున్నాను. అనుగ్రహించి నా కోరిక తీర్చు.

అని కోరగా జడభరతుడు చెప్పాడు : రాజా! పరమార్థం గురించి చెప్పాలా? శ్రేయస్సు గురించి చెప్పాలా? శ్రేయం పరమార్థప్రదం కాదు. శ్రేయస్సు యొక్క లక్షణాలు పరిపరివిధాలుగా ఉంటాయి. ఇష్టదైవము నారాధించి అభీష్టసిద్ధిని పొందడం శ్రేయమంటే. రాజ్యభోగాలు ధనధాన్యాలు సతీసుతులు, బంధుమిత్రులు – ఇలాటివి పొందడం పరమార్థం అవుతుందా? యజ్ఞంచేసి దాని ఫలముగా స్వర్గానికి వెళ్లడం పరమార్థం అవునా?

యోగమూలముగా పరమధ్యానం చేస్తే జీవుడూ, పరమాత్ముడూ ఏకమవుతారు. పరమాత్మ దర్శనానికి హేతువు ధ్యానం.

కొందరు ధర్మప్రధానంగా ధనవ్యయం చేస్తారు. దానిచే వారికి ధర్మప్రాప్తి అవుతుంది. కొందరేవో కోర్కెలు ఫలించాలని ధనవ్యయం చేస్తే సిద్ధించేది కామ్యం. ఇలా తర్కిస్తే ఇవన్నీ కర్మ సంబంధములు అవుతాయిగాని పారమార్థికములు కావు.

అలాగే వేదాలు చెప్పిన చొప్పున యాగాలు చేస్తే అవి పరమార్థములుగా చెప్పరాదు. కేవల కర్మఫల ప్రదములుగా నిర్ణయించాలి.

ఘటమునకు కారణం మన్ను. ఘటం కార్యం. అది మన్నే అవుతుంది గాని మరేమవుతుంది?

ఆ రీతిగనే చేసే యజ్ఞాలు – అంతరించేవేగాని స్థిరములు కావు. మరి వాటిని పరమార్థముగా ఎలా నిర్ణయిస్తావు?

దేశకాలాలకు అధీనములై కర్మలవల్ల పుట్టే ఫలాలు నీటిబుడగల్లాగే అంతరించుకుపోతాయి వాటిని పరమార్థరూపముగా చెప్పనొప్పునా?

నరేంద్రా! పరమార్థరహస్యం సూక్ష్మీకరించి చెప్తాను విను సావధానంగా.



పరమార్థతత్వం నిత్యశుద్ధం. ఒకటిగా ఉండి అంతటా వ్యాపించి ఉంటుంది. శాశ్వతమైన సుఖస్థితిని కలిగిస్తుంది. కైవల్యమునందు విహరిస్తూ ఉంటుంది. మాయకి అతీతం, నిర్గుణం. జననమరణాలు లేనిది...

పేరు, జాతి, తన – పెర భేదం లేక అద్వైత రూపమై ఉంటుంది. వాయువు వేణురంధ్రాలలో షడ్జాదిస్వరాల వివిధ గతులతో ఒప్పునట్లు ఒక్కొక్కపుడది భిన్నత్వం వహిస్తుంది.

బ్రహ్మాది భేదరూపాలన్నీ ఆ పరమాత్మునివే కాని వేరుగా చెప్పదగినవి కావు. బాహ్యాభ్యంతర ప్రవృత్తులవల్ల ఆ ఏకపదార్థానికి రూపభేదాలు కలుగుతూ ఉంటాయి. సారం – అది పరతత్వం – ఏకరూపం.

రాజు అంతా విని చింతిస్తూ ఉండగా జడభరతుడు అద్వైత విషయబోధకి ఒక ఇతిహాసం చెప్పాడు.

బ్రహ్మ మానసపుత్రుడు ఋభుడు మునిపుంగవుడు. అతనికి పులస్త్య నందనుడు, నిదాఘుడు శిష్యుడు. వానికి అద్వైత విషయం తప్ప సమస్త సుజ్ఞాన విషయం ఉపదేశించాడు. తదుపరి పౌలస్త్యుడు గురుని శాసనమును అనుసరించి గృహమేధి అయ్యాడు.

నివాసం దేవికామహానదీ తీరమందున్న వీరనగరమునకు వెలుపల ఒక ఉద్యానవనములో భార్యాసమేతుడై ఉన్నాడు.

కొంతకాలం అయిన తరువాత ఋభుడు ఆ శిష్యునకు అద్వైత విషయం బోధించడానికి వచ్చాడు. ఆ సమయమునందు నిదాఘుడు వైశ్వదేవం నిర్వర్తించి వెలుపలకు వచ్చి గురువును చూసి చాలాకాలం అయినందువల్ల గుర్తించలేక అతిథి అనుకుని ఆదరముగా ఆహ్వానించి అర్ఘ్యపాద్యాదులు

నెరపి వంట అయింది. అలసినట్టు కనిపిస్తూన్నారు. భోజనం చెయ్యవచ్చు– అని అనగా ఋభుడన్నాడు.

నేను నీచమైన పదార్థం ఆరగించను. ఇప్పుడు సిద్ధముగానున్న ఆహార పదార్థాలు ఏమిటో చెప్పు...

'కమ్మని వాసన గల రస పదార్థాలూ, దోసెలూ మినప గారెలు, గోధుమపిండి వంటలూ ఉన్నాయని నిదాఘుడు చెప్పాడు.

ఇప్పుడు నువ్వు చెప్పినవన్నీ నాకు ఇష్టపడనివే. మంచి మృష్టాన్నపానములు లేకపోతే నే నారగించనన్నాడు ఋభుడు. వెంటనే నిదాఘుడు భార్యను పిలిచి చూడు. ఈయనకి ఇష్టమయ్యేట్టుగా రుచ్యములైన ఆహారపదార్థాలు వండు – అని చెప్పగా ఆ యిల్లాలు నేర్పుగా ఓర్పుగా వంటకములు చేసి ఆయనకీ భర్తకీ వడ్డించింది. భోజనాలు అయాయి. బ్రహ్మకొడుకు పులస్త్యుని కొడుకు విశ్రాంతిగా కూర్చున్నాడు. అప్పుడు నిదాఘు డడిగాడు.

ఆహార పదార్థాలు ఇష్టపడ్డాయా? బడలిక పోయిందా? ఆకలి తీరిందా? ఎక్కడినుంచి రాక? ఎక్కడికి పోక? నివాసం ఎక్కడ?... శిష్యుని మాటలకు ఆ గురువు చిరునవ్వుతో చూసి –

భరించరాని ఆకలితో ఉన్నవాడికి ఆహారం తృప్తి కలిగిస్తుంది. ఆకలే లేనివానికి ఆహారం ఏమిటి తృప్తి ఏమిటి? నాకారెండింటి సంబంధం ఎన్నడూ లేదు. పృథివి వలన కలిగిన ధాతు సమూహమును, జలమునూ జఠరాగ్ని దహిస్తుంది. ఆకలి, దాహం దేహ ధర్మాలు. ఆ వికారాలు నాకు మునుపు లేవు ఇప్పుడూ లేవు. కనుక నాకు తృప్తి అనేది ఎప్పుడూ ఉన్నదే. తుష్టి, పుష్టి అనేవి చిత్తధర్మాలు. విశిష్టచిత్తులయిన వారినడుగు. వాటిని వివరించి చెప్తారు. అవి పరమాత్మునకు లేవు. ఒక్కటేసారం. ఇది రుచి అది అరుచి.



నేను, నీవు, మిత్రుడు, శత్రుడు – అనే విచక్షణ లేక సర్వము అచ్యుతస్వరూపం అని ప్రవర్తించు. ఐహిక వాంఛలకు మనసియ్యకు – అని చెప్పగా నిదాఘుడు అయ్యా! ఎవరు నీవు? నీపేరేమి అని అడగగా నేను నీ గురుడను ఋభుడను. ఆత్మతత్త్వం ఉపదేశించాలని వచ్చాను. ఉపదేశించాను. సుఖివై ఉండు అని ఋభుడు వెళ్లిపోయాడు. ఆ విధంగా నిదాఘుడు ప్రవర్తించి ఆత్మసర్వాంతర్యామి అని తెలిసి బంధురిపు సమానబుద్ధియై ప్రవర్తించి ముక్తుడయ్యాడు. రాజా! నువ్వు కూడా అలా ప్రవర్తించు అని జడభరతుడు చెప్పగా విని రాజు బ్రహ్మతత్త్వ జ్ఞానియై ప్రవర్తించి విష్ణుసాయుజ్యం పొందాడు.

జడభరతుడు ఆ జన్మలోనే ఆత్మతత్త్వ జ్ఞానబలముచే ముక్తిని పొందాడు.

ఈ జడభరతోపాఖ్యానం చదివినా విన్నా మోహభ్రాంతులకు చిక్కక ఆత్మజ్ఞానం కలిగి చరితార్థులౌతారు.

* * *

## 4

ఇంకేమి చెప్పమంటావని పరాశరుడడగగా మైత్రేయుడు గురువర్యా! మన్వంతరాలు, మనుపుత్రులు, దేవతలు, సప్తఋషులు ఆ కాలములలో ఇంద్రులు – వారి చరిత్రలు వినాలని ఉన్నది – అని అనగా పరాశరుడు చెప్పాడు.

కడచినవి, రానున్నవి అయిన చతుర్దశ మన్వంతరాల చరిత్ర చెప్తాను విను.

స్వయంభువ స్వారోచిష ఉత్తమ తామస రైవత చాక్షుషములనే ఆరు మన్వంతరాలు చెల్లిపోయాయి. వర్తమానం వైవస్వత మన్వంతరం. కల్పాంత కథలవల్ల స్వయంభువ మన్వంతర చరిత్ర విన్నావు. ఇక స్వారోచిష మన్వంతర కథ చెప్తాను విను.

స్వారోచిష మన్వంతరములో పాండవాదులు సురలు. విపశ్చిప్తుడు ఇంద్రుడు. ప్రాణవాత – అగ్నివృష స్వర స్తంబక – ఊర్జకులు అనేవారు సప్తర్షులు. చైత్రచిత్ర మదన కింపురుషాదులు ఆ మనువు కొడుకులు.

ఉత్తమ మన్వంతరములో సుశాంకుడు ఇంద్రుడు. సుధామాదులు ద్వాదశ గణాలు దేవతలు. మునుపు నీకు చెప్పాను. వసిష్ఠనందనులు ఏడుగురు సప్తమహర్షులు.

నాల్గవ మనువు తమసుడు. అతని మన్వంతరంలో శిబి ఇంద్రుడు. హరసత్యరూపాదులు సురలు. కావ్యచైత్ర పృథుకావ్య వర్ణఅగ్నిపీవరజ్యోతి ధాతువులు సప్తర్షులు. ఖ్యాతిజానుజంఘాదులు ఆ మనువు కొడుకులు. వారు ధర్మాత్ములు. అనేక క్రతువులు చేసినవారు.

రైవత మన్వంతరమందు విభుడు ఇంద్రుడు. అమితాభాదులు దేవగణాలు. ఊర్ధ్వబాహుడు, దేవబాహుడు, హిరణ్యరోముడు, వేదవంశుడు, ధామకుడు, శ్రీమంతుడు, పర్జన్యుడు – అనే వారు సప్తర్షులు. బలబంధువు మొదలైన భుజబలశాలురు మను నందనులు.

మునుపు ప్రియవ్రతమహీపతి విష్ణువును గూర్చి తపస్సు చేసి స్వారోచిషుడాదిగా నలుగురు కొడుకుల తండ్రి అయ్యాడు. అతడి తపో మహిమచే వారు మనువులై భూపతులయ్యారు. రాజవంశాలు వారిచే విలసిల్లాయి.

ఆరవదైన చాక్షుష మన్వంతరమందు మనోజవుడు ఇంద్రుడు. పృథుకరేఖాదులు దేవతలు. సుమేధాదులు సప్తఋషులు. పూరుప్రముఖులు మను కుమారులు.



వర్తమాన మన్వంతరమున సూర్యనందనుడు వైవస్వతుడు రాజు. పురందరుడు ఇంద్రుడు. ఆదిత్యవసురుద్రులు దేవతలు. గౌతముడు, జమదగ్ని, కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు – సప్తర్షులు. ఇక్ష్వాకువు, నాభాగుడు మొదలుగా తొమ్మిదిమంది మను నందనులు. వారు వేర్వేరు వంశకర్తలై అశ్వమేధాదియజ్ఞాలు నిర్విఘ్నంగా చేసి సాటిలేని బలపరాక్రమాలతో సిరిసంపదలతో రాణించారు.

ఇంతకూ ఆధారం అప్రమేయమైన విష్ణుశక్తి అని గ్రహించు. శ్రీహరి వంశములు ఆయా మన్వంతరాలలో రూపాలు ధరించి సాత్విక గుణములతో జగాలను రక్షిస్తూ ఉంటాయి. సురలు, సిద్ధులు, ఆద్యులు, చరాచరభూతాలు, ఖేచరులు భూచరులు జలచరాలు వనచరాలు మృగాలు ఇలా జీవకోటి అంటే శ్రీవిష్ణుదేవుని విభూతిగా భావించు! సంభావించు! –

అని చెప్పి అనాగత మన్వంతర విషయం చెప్పనారంభించాడు.

సూర్యుడు విశ్వకర్మ పుత్రికను సంజ్ఞను పెండ్లాడి ఆమెతో వినోదించుచుండగా కొంతకాలానికి మనువు, యముడు అని ఇద్దరు కొడుకులు, యమున అనే కూతురు కలిగారు. తరువాత సంజ్ఞ సూర్యుని ప్రచండ కిరణాలకు ఓర్వలేక తన ఛాయతో ఒక యువతిని సృష్టించి పతి శుశ్రూషను జాగరూకతగా చేస్తూ ఉండు, నా పిల్లలను ఆప్యాయంగా పోషిస్తూ ఉండని చెప్పి అడవికి పోయి ఆమె గుర్రముగా మారి తపస్సు చేస్తూ ఉన్నది.

ఛాయ సంజ్ఞలాగే పతిని సేవిస్తూ అలరిస్తూ ఉండగా సూర్యుడు సంజ్ఞగా భావించి అనుకూలంగా అప్యాయంగా ప్రవర్తిస్తూ ఉన్నాడు. అలా ఉండగా కొంతకాలానికి ఛాయకు మనువు, శనైశ్చరుడు అని ఇద్దరు కుమారులు, తపసి అనే కూతురూ పుట్టారు. క్రమంగా పెరుగుతూండగా

ఛాయ తన పిల్లలను చూసేటట్లు సంజ్ఞ పిల్లలను చూడకపోగా ఒకనాడు యముడు కోపావిష్టుడై పినతల్లిని చూసి అన్నాడు.

తల్లివై ఉన్న నువ్వు పిల్లలనందరను సరిగా చూడక మాయందు పక్షపాతముతో ఉంటున్నావు ఏమిటీ బుద్ధి? ఎలా కలిగింది నీకు? అని అనగా ఛాయ కోపించి అనరాని, వినరాని పరుష వచనాలతో నొప్పించగా యముడు తాళలేక ఛాయను తన్నాడు. ఆ అవమానం భరించలేక ఛాయ నీ పాదాలు భారములగుగాక అని శపించింది. ఆ మర్నాడు సూర్యుడు వికృతములై ఉన్న యముని పాదాలు చూసి ఏమి కారణం? నీ పాదాలిలా ఉన్నాయి అని అడగగా యముడు చెప్పాడు.

నాయనా! నువ్వు కర్మసాక్షివని అందరూ అంటూ ఉండగా వింటున్నాను. మన ఇంట ఏమి జరిగిందో చెప్పాలని అడిగావు కనుక చెప్తున్నాను విను.

అమ్మలాగే ఉన్న యీమె అన్నదమ్ములమైన మమ్ము సమదృష్టితో చూడక వేర్పాటుగా చూడగా నేను అడిగాను. దానిచే కోపించి నన్ను తిట్టింది. నేను భరించలేక తన్నాను. ఈమె మా అమ్మలాగా ఉన్నది చూడడానికి. కాని ప్రవర్తనలో మా అమ్మలాగే లేదు. ఎవరో మాయలాడి. తెలిసో తెలియకో కొడుకులేమైనా అంటే కన్నతల్లి అల్లనల్లన సముదాయిస్తుందిగా! ఇలా శపిస్తుందా? ఇది తల్లి గుణమేనా? నేను తన్నానన్నది. నాకు యీమె యందు తల్లి భావం కలగలేదు. నా మనస్సాక్షిగా చెప్తున్నాను. ఈమె నాతల్లి కాదు. నేనీమె కొడుకునుకాదు. చిత్తగించు. ఇక మీయిష్టం. నాఅదృష్టం.

సూర్యుడు ఛాయాదేవిని పరిశీలనగా చూశాడు. కాంతా! ఎవరు నువ్వు? యమునిపై అంతనిర్దయగా ప్రవర్తించావు. కన్నతల్లి అలా శపిస్తుందా!



ఏమి కారణం? నువ్వు మాయలాడివనే నమ్మవలసి వచ్చింది. ఉన్నది ఉన్నట్టు చెప్పు. చెప్పవా నీకు తగిన శిక్ష వెయ్యవలసి వస్తుంది – అని అనగా ఛాయ 'పద్మబాంధవా! నేను సంజ్ఞను కాదు. నాపేరు ఛాయ. నీ కిరణాల వేడి భరించలేక సంజ్ఞ నన్ను తన ఛాయతో కల్పించి ఇక్కడ ఉంచి తాను అడవికి పోయింది. తపస్సు చేస్తుందట –

ఛాయ మాటలు విని సూర్యుడు మరేమీ అనలేక యముని పాదాలు యథాపూర్వముగా ఉండునట్లు అనుగ్రహించాడు. ఛాయవల్ల సంజ్ఞ ఉన్న అరణ్య నివాసం తెలుసుకొని వెళ్లి తానూ గుర్రం లాగా మారి ఆమెను మోహపెట్టి వినోదంగా ఉన్నాడు.

అలా ఉండగా అశ్వినీ దేవతలు, రేవంతుడూ పుట్టారు. తరువాత సూర్యుడు సంజ్ఞతో నిజ రూపానికి వచ్చి సుఖంగా ఉన్నాడు.

అంతలో విశ్వకర్మ త్వష్ట వచ్చి సంజ్ఞ బాధ సూర్యునకు చెప్పి ఒప్పించి అతని కిరణాలను హస్తయంత్రముతో సానపట్టాడు. వెయ్యి కిరణాలలో ఎనిమిదవ వంతు సానపట్టుతో ఒకింత వేడి తగ్గింది. సంజ్ఞ సహించగలిగింది.

తరువాత – విశ్వకర్మ సానపట్టినపుడు శివునకు త్రిశూలం, విష్ణువుకు చక్రం, కుబేరునకు ఖడ్గం, కుమారునకు శక్తి, వివిధ ఆయుధాలు ఆయా దేవతలకూ రూపొందించి ఇచ్చాడు. ఈ విధంగా వైష్ణవ తేజస్సు ఆయా దశలలో పలువిధాల భాసిస్తూ ఉంటుంది.

కొంతకాలానికి సూర్యుని వల్ల సంజ్ఞకు ఒక కుమారుడు ఛాయాశక్తితో సహా కలిగాడు. పేరు సావర్ణి. అన్నివిధాలా తన అన్నలకు సాటి అయిన లోకపావనమూర్తి.

ఆ సావర్ణి తపశ్శక్తితో విష్ణువు అనుగ్రహం కోరి మనువు కావాలని తపస్సు చేస్తున్నాడు. రసాతలాధిపతియై ఉన్న బలి ఇంద్ర పదవికై వాసుదేవుని ఆరాధిస్తున్నాడు. సుతపాదివింశతి గణాలు దేవగణాలు కావాలని తపస్సు చేస్తున్నారు. గాలవుడు, దీప్తిమంతుడు, పరశురాముడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కృష్ణద్వైపాయనుడు, ఋశ్యశృంగుడు సప్తమహర్షులు. నిర్మోహుడు, వీరబాహువు మున్నగువారు రాజులవుతారు. వారు సావర్ణి కొడుకులు. ఇలాగ ఆ మన్వంతరం కడచిన తరువాత –

దక్ష సావర్ణి మన్వంతరం ఆరంభం అవుతుంది. ఆ మన్వంతరంలో మహావీర్యుడు ఇంద్రుడు. ధారా మరీచి సుధర్మ గర్భాదులు దేవగణాలు. సవనుడు, భవ్యుడు, ధర్ముడు, ద్యుతిమంతుడు, దీప్తి, మేఘుడు, దీప్తకుడు, జ్యోతిష్మతి అనేవారు సప్తర్షులు. దివ్యకేతువు, మహాకేతువు మొదలైన ఆ మనువు కొడుకులు రాజులు.

తరువాతది బ్రహ్మ సావర్ణి మన్వంతరం. దానియందు శాంతి అనే వాడు ఇంద్రుడు. సుఖ సుఖాత్ముడు ధర్మాదులు నూర్గురు సురలు; సహ్యుడు, నాభాగుడు, సంకృతి, సత్యకేతువు మొదలుగా ఏడ్నూరు ఋషులు; సుక్షేత్ర ప్రముఖులు బ్రహ్మసావర్ణి కొడుకులు పదిమంది పరిపాలకులౌతారు.

తరువాతది విష్ణు సావర్ణి మన్వంతరం. దానియందు పృషడనేవాడు ఇంద్రుడు. విమాగకారుగమాదులు దేవగణాలు. శనైశ్చరుడు, సంస్తుతి, వహ్నితేజుడు, వపుష్మంతుడు అనుజ్జ్వలుడు, జ్వలనుడు, అనుభవ్యుడు – అనే వారు సప్తర్షులు. సుధర్మాదులు మను నందనులు పరిపాలకులు.

రుద్రసావర్ణి రుద్ర నందనుడు. ఆ మన్వంతరమందు ఋషధాముడు ఇంద్రుడు. హరితరోహితాదులు దేవతలు. తపస్వి మున్నగువారు సప్తర్షులు. దేవ ఉపదేవాదులు మనునందనులు ప్రభువులు.



పదమూడవ మనువు రేచ్యుడు. అందు సుత్రాముడు ఇంద్రుడు. ధర్మసుధర్మాదులు దేవగణాలు. నిర్మోహకాదులు సప్తర్షులు. ఆదిత్యాదులు మనువు నందనులు ప్రభువులు. పదునాలవ మన్వంతరమందు శుచి అనేవాడు ఇంద్రుడు. చాక్షుషాదులు దేవగణాలు. అగ్నిబాహుడాదిగా ఏడ్గురు సప్తర్షులు. గురుగంభీరముఖ్యాదులు మనునందనులు ధరణీపాలకులవుతారు.

ఈ మనువులు, ఈ ఇంద్రాదులు బ్రహ్మ పగటి సమయంలో భాసిల్లుతూ ఉంటారు.

నాలుగుయుగాలూ చెల్లగా, ఇతర వేదాలు ప్రమాద స్థితిలో ఉండగా సప్తర్షులు వచ్చి వేదవేదాంగాలను ప్రతిష్ఠించి సక్రమంగా నడిపిస్తారు.

ఇలాగు చతుర్దశ మన్వంతరాలూ, మనువుల సంధికాలాలూ వేయి దివ్యయుగాలు. బ్రహ్మకి ఒక పగలు అయినట్టు లెక్క. ఇదే ప్రమాణముతో రాత్రి. అపుడు పరమేశ్వరుడు బ్రహ్మరూపధరుడై జలధియందు శేషశయ్యపై నిజ మాయామోహముతో సమస్తభూతాలను తనలోనికి గ్రహించి యోగ నిద్రాముద్రితుడై ప్రభాత సమయం కాగానే మేల్కొని రాజసగుణముతో సృష్టిచేస్తాడు. మళ్లీ మనువులూ మనుతనయులూ ఇంద్రులూ, దేవతలూ, ఆ శ్రీహరి సాత్త్విక గుణ ప్రభావముతో జగాలను పాలిస్తారు.

కృతయుగములో శ్రీహరి కపిలాదుల రూపాలు ధరించి జీవలోకానికి జ్ఞానోపదేశం చేయడం, త్రేతాయుగములో చక్రవర్తి రూపాలలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి ధర్మాన్ని పాలించడం, ద్వాపరంలో వేదవ్యాసుడై వేదాల వ్యాప్తిని కలిగించడం, చేయడం పనిగా ఉండి కలియుగములో కల్కియై వేదశాస్త్ర మార్గాలకు ఆపద రానీక కాపాడుతాడు. ఇలాగు భూతభవిష్య ద్వర్తమాన కాలాత్ముడైన ఆ దేవుని ఆధీనమై సమస్తమూ విస్తరిల్లుతూ ఉంటుంది. అని చెప్పగా మైత్రేయుడు అడిగాడు.

గురుదేవా! ప్రతి ద్వాపరయుగము నందు శ్రీహరి వేదవ్యాసరూపాన వేదశాఖలను విస్తరిస్తాడనీ, ధర్మశాస్త్రాలను ప్రతిష్ఠిస్తాడనీ చెప్పావు. చెల్లిపోయిన యుగాలలో ఎవరెవరు వేదవ్యాసులయ్యారు? వేద విభాగం ఎలా చేశారు? శాఖలేవి? ఆ విషయం వినాలని ఉన్నది.

మైత్రేయుని మాటలు విని పరాశరుడు చెప్పాడు. మైత్రేయా! వేదశాఖలూ ఉపశాఖలూ చాలా ఉన్నాయి. వాటినన్నిటినీ వివరించి చెప్పడం ఆ నాలుగు యుగాలవారికి కూడా సాధ్యంకాదు. కాబట్టి నేను విన్నంత సంక్షేపంగా చెప్తాను విను –

భూజనులకు తేజస్సు, వివేకము, ధైర్యము చాలా తక్కువగా ఉంటాయి. వారికి అవి సంతృప్తిగా కలిగించాలని పుండరీకాక్షుడు ఏక రూపాన ఉన్న వేదమును నాలుగుగా విభజించాడు.

ఋగ్యజుస్సామాధర్వములని వాటికి పేర్లు. వాటిని శాస్త్రపురాణాది సంఖ్యలుగా, పదునెనిమిది విద్యలుగా బ్రహ్మమొదలుగా నావరకు – నా కొడుకయిన కృష్ణద్వైపాయనుడున్ను వేదవ్యాసరూపాలు ధరించి విస్తరింప చేశాము.

ద్రోణపుత్రుడైన అశ్వత్థామ ముందరి ద్వాపర యుగములో వేదవ్యాసుడౌతాడు. ఇలాగు ఆయా మన్వంతరాలలో ఒకొక్కడు వైష్ణవాంశతో వేదవ్యాసుడై వేదాలను ఉద్ధరిస్తాడు. నాకొడుకు కృష్ణద్వైపాయనుడు వైష్ణవమహితో విరాజిల్లుతూ ఉన్నవాడు కాకపోతే అలాటి కవిత్వ రచన అలాటి ఇలాటి వాడు చెయ్యగలడా?

మునుపు వాల్మీకి బ్రహ్మవాక్కు ననుసరించి రామాయణం ఏడుకాండలు అయిదు వందల సర్గలతో ఇరవై నాలుగు వేల శ్లోకాలతో



రచించాడు. అతనిలాగే కృష్ణద్వైపాయనుడు మహాభారతం హరివంశముతో సహా నూరు పర్వాలు సపాద లక్ష గ్రంథముగా రచించి జగత్ప్రసిద్ధం చేశాడు. అలాగ వ్యాస వాల్మీకులు ఆది కవులయ్యారు.

కృష్ణద్వైపాయనుడు బ్రహ్మనియోగముచే వేదమును నాలుగు భాగాలుగా చేసి ఋగ్వేదం పైలుడు, యజుర్వేదం వైశంపాయనుడు, సామవేదం జైమిని, అధర్వవేదం సుమంతుడు, పురాణేతిహాసాలు రోమహర్షణ నందనుడైన సూతుడు పఠించునట్లు నియమించాడు. వారు వారివారి శిష్య ప్రశిష్యులచే వాటిని చదివించగా వారి వారి పేర వెయ్యి శాఖలుగా విస్తరిల్లాయి.

పైలుడు ఋగ్వేదమును బోధాయణుడు మొదలైన శిష్యులచే చదివించగా వారిచే అది సమగ్ర శాఖలయింది.

వైశంపాయనుడు ఋగ్వేదమును ఇరవైయేడు శాఖలు చేసి శిష్యులచే చదివించగా వారు వారి శిష్యులకు అనువగునట్లుగా పలు శాఖలుగా విస్తరించారు.

వైశంపాయన శిష్యులలో చెప్పదగిన వాడు బ్రహ్మరాతముని కుమారుడు యాజ్ఞవల్క్యుడు. విశిష్టమైన తపశ్శక్తికల బ్రహ్మణ్యుడు. ఆ విధంగా గురుని దయకు, ప్రేమకు పాత్రుడయ్యాడు.

ఒకనాడు ఆ యాజ్ఞవల్క్యుడు వేదార్ధ విచారణ జరుగుతూండగా అక్కడ ఉన్న మునులందరూ వినేట్టుగా బిగ్గరగా అన్నాడు.

ఏడు రాత్రులలో మాగురువు బ్రహ్మహత్య చేస్తాడు. దానివల్ల అతనికి వచ్చే పాతకమును నేను పోగొట్టుతాను. అలాంటి మహిమ గలవాడను....

వాని మాటలు శిష్యులవల్ల వినిన వైశంపాయనుడు కోపం వచ్చినా తనపై ఎంతో భక్తి కలవాడని అప్పటికి శాంతించాడు. తరువాత

వేదాధ్యయనం యథాప్రకారం చేయిస్తూ వాని పెడసరపు మాటలకి ఓర్వలేక ఒకనాడు తన్నాడు. అది బ్రహ్మహత్యతో సమానమే. ఆ పాపం ఎలా పోతుందో మార్గం చూడండి? అని శిష్యులతో అనగా అపుడు యాజ్ఞవల్క్యుడు అది పోగొట్టే శక్తి కలవాడను నేనే. మీరు అలాటి శక్తి కలవారా? అని అనగా వైశంపాయనుడు కోపించి ఏరా! నా ముందు బ్రాహ్మణనింద చేస్తున్నావా? ఏమి నీ గర్వం? నిన్ను చూస్తే కోపం రగులుతూంది. నా ముందు ఉండకు. ఇంతవరకు నేను చెప్పిన వేదం కక్కిపోరా! – అనగా యాజ్ఞవల్క్యుడు పాదాభివందనం చేసి మీయందు నేనెంత భక్తి కలవాడనో మీకు తెలుసును. నామాట నాభక్తికి రూపం. అది గర్వం కాదు క్షమించండి – అని అన్నాడు. కానీ వైశంపాయనుడు శాంతించలేదు. సరే అని యాజ్ఞవల్క్యుడు రక్తరూపముతో వేదం కక్కి ఇంకొక దగ్గరకు పోయి గురుని బ్రహ్మహత్యా పాతకం పోవడానికి తగిన వ్రతాలు చేస్తూ ఉన్నాడు.

యాజ్ఞవల్క్యుడు కక్కిన వేదమును తిత్తిరి పక్షులు మింగగా ఆ శాఖలకి తిత్తిరులనే పేరు వచ్చింది.

(యాజ్ఞవల్క్యుడే తిత్తిరి పక్షియై వేదం కక్కినట్టు అదే తైత్తిరీయం అని ప్రసిద్ధమైనట్టు ఒక్కథ కలదు.) (తిత్తిరి పక్షులు మింగితే అవి మళ్లీ బయటికి ఎలా వచ్చినట్టు? – ఈ విషయం ఆలోచనీయం)

తరువాత యాజ్ఞవల్క్యుడు గురుని దోషం పోగొట్టి నిర్దుష్టమైన బుద్ధితో ప్రాణాయామం పాటిస్తూ తపశ్శక్తితో మహితాత్ముడు అయ్యాడు. సకల వేదమయుడైన సూర్యదేవుణ్ణి ఆరాధిస్తూ ఉండేవాడు. అలా ఉండగా సూర్యుడు గుర్రం రూపుతో వచ్చి వరం కోరుకో అని అనగా యాజ్ఞవల్క్యుడు అభివాదం చేసి దేవా! నా గురు వెరగని యజుర్వేదం నాకు ప్రసాదించు – అని ప్రార్థించాడు. సూర్యుడు కరుణించి శుక్ల యజుర్వేదం చదివించాడు.



ఆ వేదం పదైదు శాఖలై వాజి శాఖలుగా ప్రసిద్ధమయింది. కణ్వాదిమునులు ఆ శాఖల అధ్యయనం చేశారు.

జైమినిముని తాను నేర్చిన సామవేదం బహుశాఖలుగా చేసి శిష్యులచే చదివించాడు.

సుమంతుడు అథర్వవేదం బహుసంహితలుగా రచించి శిష్యులచే చదివించాడు.

వేదవ్యాస శిష్యుడైన సూతుడు పురాణాలను ఆఖ్యాన – ఉపాఖ్యానాలతో తన శిష్యులైన సుమతి, అగ్నివర్ణుడు, మిత్రుడు, శంఖపాలుడు, కృతవ్రణుడు, సావర్ణి అనే ఆర్గురిచే చదివించాడు. వారి వల్ల అవి భువనమంతటా వినవచ్చాయి.

బ్రహ్మాండము, వామనము, గారుడము, స్కందము, కూర్మము, భాగవతము, ఆగ్నేయము, మాత్స్యము, లైంగము, మార్కండేయము, కూర్మము, వైష్ణవము, శైవము, నారదీయము, భవిష్యద్బ్రహ్మవైవర్త వారాహములు అని పురాణాలు పదునెనిమిది. అవి సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశాభి చరితములనే అయిదు లక్షణాలు కలవై ఉంటాయి.

ఇప్పుడు నేను నీకు చెప్పుచున్నది వైష్ణవ పురాణం. ఇది వేద సమ్మతం. సకల భువన స్థితిగతులకు ఆధారభూతుడైన విష్ణుదేవునకు సంబంధించినది. సర్వలోక సమ్మాన్యము.

వేదాలు నాలుగు. వేదాంగాలు ఆరు. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అని వాటికి వ్యవహారం.

ఈ ఆరున్నూ, మీమాంస, న్యాయశాస్త్రం, ధర్మశాస్త్రం – పురాణాలున్నూ, చతుర్దశ విద్యలయ్యాయి. ఇలాగే ఆయుర్వేదం, ధనుర్వేదం, నీతిశాస్త్రం, అర్థశాస్త్రం కలిపి చతుర్దశ విద్యలయ్యాయని ఒక నిర్ణయం.

బ్రహ్మర్షులు, దేవర్షులు, రాజర్షులు – వీటిని చెప్పనర్హులు – అని చెప్పగా మైత్రేయుడు అన్నాడు.

సరే. వినవలసినవి విన్నారు. ఇక వినవలసిన విషయం.

పాతాళ సప్తలోకాలు, సప్త సముద్రాలూ, సప్తద్వీపాలూ, సప్త లోకాలూ గల బ్రహ్మాండభాండం నడమనున్న స్థూల సూక్ష్మరూపాలూ.... ఇలా ఉండే జీవులు కర్మబంధానికి కట్టువడి మరణించి యమునిచే వివిధ శిక్షలు అనుభవిస్తూ ఉంటారు. ఆ యాతన రాని విధి యేమైనా ఉందా? ఆ విషయం చెప్పవలసిందని మనవి. అని అనగా పరాశరుడు చెప్పాడు.

మైత్రేయా! ఒకప్పుడు కాళింగుడనే ముని నన్ను సేవిస్తూ ఉండేవాడు. అతని వినయ విధేయతలకి సంతృప్తి నొంది నేను మంత్రోదకముతో శిరసు స్పృశించి పూర్వజన్మ స్మృతి కలిగించగా అపుడా కాళింగుడు ఇపుడు నువ్వడిగినట్లే అడగగా చెప్పాడు. అదే యిపుడు నీకు చెప్పుచున్నది విను.

తొల్లి – నకులడనే ముని నరకయాతనలతో సతమతమవుతూన్న ప్రాణులను చూసి విచారించి సత్యలోకానికి వెళ్ళి జీవుల కర్మబంధ విషయం అడగగా పితామహుడు చెప్పాడు. ఆ విషయం – యమకింకర సంవాదం.

తప్పొప్పులు నిర్ణయించి ప్రాణుల ఆయుః పరిమాణము ననుసరించి తీసుకురావడానికి పాశహస్తులై కింకరులు బయల్దేరగా వారిలో నాయకుడైన కింకరుని లోనికి రప్పించి యముడు చెప్పాడు.

భువిలో విష్ణుభక్తులైన వారి గృహాలకు వెళ్లకండి. వైష్ణవులు పావనజీవనులు. వారికి ఏ పాపమూ అంటదు. కనుక వారు సర్వులకూ మాన్యులు. పుండరీకాక్షుని రాజస గుణముచే సంభవించిన బ్రహ్మకు నేను అనువర్తిని. ఆయన చెప్పిన చొప్పున ప్రాణులకు శిక్షలు విధిస్తూ ఉంటాను.



వైష్ణవులు మాత్రం నాకు అజేయులు. కాబట్టి వారి యిండ్లకు నువ్వు వెళ్లకు – కింకరులను వెళ్లనీయకు.

అని చెప్పగా కింకరుడు ప్రభూ! ఆ వైష్ణవుల వేషభాషలు, ప్రవర్తన, గుణాలు నాకు వివరించి చెప్పు అని అడగగా యముడు చెప్పాడు.

శత్రుమిత్రులందు సమబుద్ధియై నిజాచార వర్తనములను తప్పక ఆచరిస్తూ అల్పమైనా అధికమైనా పరద్రవ్య వాంఛ లేనివాడై ప్రవర్తించేవాడు వైష్ణవుడు. తనకు కలిగిన దుఃఖానికి దిగజారక ముప్పొద్దులా పుండరీకాక్షుణ్ని త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తిమంతుడు వైష్ణవుడు.

స్ఫటికం లాగా నిర్మల తేజోమూర్తి విష్ణువెక్కడ! మత్సర దోషదూషితులైన మానవులెక్కడ! మాత్సర్యాది దుర్గుణాలు లేక సర్వ మిత్ర బుద్ధితో మృదుమధుర వాకులై ప్రవర్తించేవారి హృదయాలలో ఆ యీశ్వరుడుంటాడు.

బలిష్ఠమైన చెట్టు పెరగడానికి మూలం సరసమైన భూమి.

పురుషుడు సౌమ్యుడై విలసిల్లడానికి ఆధారం హరికరుణ. యమ నియమాది యోగాభ్యాసములు, పరధన పరకాంతా పరాఙ్ముఖులు స్వపరభేద శూన్యులు, హరిపదసేవానిరతులు అయిన వారి వద్దకు వెళ్లకు కింకరా! శంఖచక్రగదాభయహస్తుడైన వాసుదేవుణ్ణి ఆత్మయందు తలచే వారంటే మనం బెదరిపోవలసిందే. సూర్యుని ముందు చీకటి ఉంటుందా!

హింస, పరుల సొమ్ము అపహరించడం, అసత్యనిష్ఠురభాషణ, దుష్కర్మాచరణం గల దుర్మతికి దామోదరుడు దూరంగా ఉంటాడు.

దుష్టాతిదుష్టుడై అర్థకాంక్షతో ఆత్మీయుల అర్థమును అపహరించే వానిపై శ్రీహరి ఆగ్రహావేశముతో ఉంటాడు తెలిసిందా! అని యముడు భీష్ముడనే ఆ కింకర నాయకునకు చెప్పినట్టు నకులమునికి బ్రహ్మ చెప్పాడు.

అదే నేను కాళింగునకు చెప్పాను. అది విని ఆనందముగ కాళింగుడు వెళ్లాడు. విన్నావా మైత్రేయా! నాకూ దేవభజనపరులకూ యమదండన ఉండదు.

అని చెప్పగా విని మైత్రేయుడు ఆచార్యా! సంసారమును జయించాలనే సంకల్పముతో దేవారాధన తత్పరులైన వారు ఎలాటి ఫలమును పొందుతారు? అని అడగగా మంచి ప్రశ్న వేశావు. మునుపు సగరుడు అనే ఇక్ష్వాకుల చక్రవర్తి ఇలాగే అడగగా ఔర్వుడు అనే మునివర్యుడు చెప్పాడు – విను చెప్తాను.

ఒకనాడు సగర చక్రవర్తి ఔర్వుడను ముని వద్దకు వెళ్లి నమస్కరించి అడిగాడు.

మహాత్మా! మాధవారాధన మహిమ ఏమి? ఆ ఆరాధకులు ఏ ఫలం పొందుతారు?

రాజా! మాధవారాధన మహిమ అప్రమేయం. ఐహిక జీవితమును ఇంపుగా వెళ్లించి అంతమందు పునరావృత్తి రహితమైన పరమపదం చేరుతుంది. అయితే – ముఖ్య విషయం.

మాధవారాధకులు తమ కులాచార ధర్మాలను సక్రమంగా పాటిస్తూ ప్రవర్తించాలి. అలాటి వర్ణాశ్రమాచర ధర్మపరులైన తన భక్తులనే శ్రీహరి ఆదరిస్తాడు. వారి పూజాపురస్కారాలు స్వీకరిస్తాడు.

యజ్ఞాదులచే జపింపదగినవాడు శ్రీహరి.

జపపరాయణులచే జపింపదగినవాడు శ్రీహరి.

శ్రీహరి సకలభూతమయుడు.



పరధనకాంక్ష, పరకాంతావ్యామోహం కలనైనా లేక, జీవహింస చెయ్యక ఎదుటివారిని ఏ దశలోనూ దూషించక, ద్వేషించక, సాధుజనులకు కీడు చెయ్యక, తనను ప్రేమించే వారిపై అలుగక, గురువులయందు భక్తి కలిగి బ్రాహ్మణులను సేవిస్తూ తన పర భేద బుద్ధిలేక సర్వసమబుద్ధితో ప్రవర్తించేవారి పూజలనే శ్రీహరి స్వీకరిస్తాడు. అదే ముఖ్య విషయం. మళ్లీ చెప్తున్నాను. సకల వర్ణాలవారూ తమ ధర్మాలను సక్రమంగా ఆచరిస్తూ శ్రీహరిని పూజిస్తే ఆ భగవానుడు సంతుష్టుడై ఆ పూజ స్వీకరిస్తాడు. తద్వ్యతిరిక్తమైతే ఫలం సున్న.

సగరుడు విని కైమోడ్చి మహానుభావా! వర్ణాశ్రమ ధర్మాలు వివరించవలసిందని మనవి – అని అనగా ఔర్వుడు చెప్పాడు.

**వర్ణాశ్రమ ధర్మాలు:**

చెయ్యవలసినవి చెయ్యరానివి తెలిసినవాడై దానం సత్పాత్రునికి ఇస్తూ దేవతార్చన నిత్య క్రియగ ప్రవర్తిస్తూ భూతదయ కలిగినవాడై అగ్నిహోమాదులు నిర్వర్తిస్తూ వేదాధ్యయనం విడువక కుటుంబ పోషణకై ధనకాంక్షతో యజ్ఞం చెయ్యడం, జీతం పుచ్చుకుంటూ వేదం చెప్పడం అనేవి చెయ్యక, స్వవృత్తితో ఆర్జించినవారినుంచి విప్రుని వల్లనైనా సరే ధనం స్వీకరిస్తూ సాధ్యమైనంతవరకు అన్ని ప్రాణులకు మంచిని చేయువాడై రత్నమునూ – రాతినీ సమదృష్టితో చూస్తూ, ఋతుకాలమునందే ధర్మపత్ని సమాగమం చేసే ధర్మబుద్ధి కలవాడు బ్రాహ్మణుడు.

యజ్ఞాలు చెయ్యడం, వేదాధ్యయనం, దానం చెయ్యడం, ధర్మంగా ప్రవర్తించడం, బ్రాహ్మణ భక్తి కలిగి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేస్తూ తన ఏలుబడిలో ఉన్న ప్రజలను తన పిల్లల్లాగా పోషిస్తూ శాస్త్రవిజ్ఞానం కలిగి ధర్మార్థకామాలను సక్రమంగా సాధిస్తూ ఉండడం క్షత్రియ ధర్మం.

బ్రాహ్మణ క్షత్రియగౌరవం, వేదాధ్యయనం, సత్పాత్రదానం, స్వకులాచారపాలన, పరధనాశ లేకుండడం, నిత్యనైమిత్తిక క్రియలను సక్రమంగా చేస్తూ ఉండడం, క్రయ విక్రయాలలో నిర్మల మనస్కుడై ప్రవర్తించడం, ధర్మపద్ధతిని అర్థం కూడబెట్టుతూ కృషి, వాణిజ్యం, పశుపాలన చేస్తూ ఉండడం వైశ్యధర్మం.

పై మూడు జాతుల వారియందు భక్తితో ప్రవర్తిస్తూ సేవించడం, కులాచారం తప్పక, యోగ్యత గుర్తించి దానం ఇవ్వడం, అందరియందు మైత్రి కలిగి ఉండడం, పరనింద, ఆత్మస్తుతి లేక ప్రవర్తిస్తూ ఉండడం శూద్ర ధర్మం.

మైత్రి, సత్యం, దయ, మంచితనం, వంచన చెయ్యక ఋజుమార్గాన నడవడం, పాత్రమెరిగి ఇవ్వడం, సర్వభూత సమబుద్ధి, సత్త్వరజస్తమో గుణాలకు లొంగకుండడం, శాంతగుణం – ఇవి నాలుగు జాతులకు ఉండవలసిన ముఖ్య ధర్మగుణాలు.

ఎంత దురాశ వచ్చినా ఎంత కీడు కలిగినా ఏలాటి ఆటంకాలు వచ్చినా తన కులాచార ధర్మాలు తప్పక ప్రవర్తించాలి అని బ్రహ్మావాక్కు. అని చెప్పి రాజా! ఇక ఆశ్రమ విషయం చెప్తాను విను – అని ఔర్వుడు సగరునకు చెప్పాడు.

**ఆశ్రమ విషయం**

సంప్రదాయానుసారముగా ఉపనయనం అయిన తరువాత బ్రహ్మచారి బ్రహ్మచర్యం పాటించాలి. దానికి పునాది వేదాధ్యయనం. ఆ అధ్యయనానికి తగిన గురువును ఆశ్రయించాలి.

పరమశాంతుడు, గుణవంతుడు, వేదశాస్త్ర పురాణాలు క్షుణ్ణంగా తెలిసి చెప్పగలవాడు, ఉభయవంశాలు పరిశుద్ధములై పేరొందినవై ఉన్నవాడు,



జితేంద్రియుడు అయిన వాడై ఉండాలి ఆ గురువు. బ్రహ్మచారి ఆ గురువు వద్దకు వెళ్లి గోత్రనామాలు చెప్పి పాదాభివందనం చెయ్యాలి. అతని మనసు ప్రసన్నమయ్యేట్టు ప్రసంగిస్తూ, ప్రవర్తిస్తూ ఉండి ఆయన చెప్పినపుడు వేదాధ్యయనం చేస్తూ ఉండాలి. గురువుకి వ్యతిరేకంగా ప్రవర్తించరాదు. తోడి విద్యార్థులతో అన్ని విషయాల్లోనూ అనుకూలంగా ఆదరంగా నడుచుకుంటూ ఉండాలి. స్నానం, సంధ్య, జపం మానక ప్రాతస్సాయంసమయాలలో అగ్నికార్యం చేస్తూ వేదం నేర్చుకుంటూ ఉండాలి. గురుని ఇష్టానుసారముగా భిక్షాశనం భుజిస్తూ ఏనాడున్నూ ఆ ఆహారపదార్థాలలో ఎచ్చు తక్కువలు, రుచి అరుచి ఎంచకూడదు. అలాగే భిక్షాశనం భుజిస్తూ వేదం చదువుకొనాలి. ఫల పుష్ప పత్రాలూ జలం, సమిధలూ, దుంపలూ తెచ్చి ప్రతిదినమూ గురువునకు సమకూర్చుతూ ఉండాలి. తానెంతో గొప్ప వంశమువాడను, ధనవంతుని కొమరుడను అనిగాని ఇంకేలాటి భేదభావం లేనివాడై అన్నివిధాలా తాను గురునకు తక్కువ వాడినే అని అలాగే ప్రవర్తిస్తూ వినయ విధేయతలు కలవాడై వేదాధ్యయనం చెయ్యాలి.

ఇలాగ బ్రహ్మచర్యం పాటిస్తూ వేదాధ్యయనం చేసి గురుదక్షిణ యథాశక్తిగా సమర్పించి అతని అనుజ్ఞను పొంది యథావిధిగా దార పరిగ్రహణం చేసి గృహస్థు అవ్వాలి.

ధర్మమార్గాన ధనం ఆర్జిస్తూ శక్త్యనుసారముగా గృహస్థ ధర్మాలు పాలిస్తూ గుణవంతులైన కొడుకులకు కన్నతండ్రియై పితృఋణమును; యజ్ఞాలుచేసి దేవఋణమును; అధ్యయనముచే ఋషి ఋణమును; బలిదానముచే భూతఋణమును తీర్చుకుంటూ సర్వులనూ ఆదరిస్తూ ప్రశాంత చిత్తుడై ప్రవర్తించాలి.

సన్న్యాసులు, బ్రహ్మచారులు, వేదవిద్యార్థులు, తీర్థయాత్రలు చేసేవారు, పరదేశీయులు, గతిలేక ఆకలితో అలమటించేవారు, బాటసారులు –

తనయింటికి వస్తే సవినయముగా వారి కెదురేగి లోనికి తోడ్తెచ్చి యథాశక్తిగా అన్నపానీయాదులతో వారిని ఆదరించాలి. గృహస్థుని సత్కారం బహుపుణ్య ఫలప్రదం. దానికి మించిన పుణ్యకార్యమే లేదు.

అతిథి వచ్చే సమయానికి ఇంట ఉన్న పదార్థాలతోనే అన్నపానీయాలు సంతరించాలిగాని ఇరుగు పొరుగుల నుండి అప్పు చేయకూడదు.

వచ్చిన అతిథి సత్కారం పొందక వెళ్లితే ఆ యింట గృహస్థు పుణ్యం అతిథితో పోతుంది. అతిథితో ఉన్న పాపం ఆ గృహస్థుకు చుట్టుకుంటుంది.

ఇలాగ గృహధర్మాల నన్నిటినీ సక్రమంగా పాటించిన గృహస్థు దైహిక జీవితం సుఖంగా గడిపి, అంతమందు పుణ్యలోకం చేరుతాడు.

గుణవంతులైన పుత్రులకు విద్యాబుద్ధులు నేర్పి సుఖంగా జీవనం గడిపి వయసు మీరగానే గృహస్థ ధర్మాలు వారికి బోధించి భార్యతో గృహస్థుడు వనవాసి అవ్వాలి.

మూడు సంధ్యల స్నానంచేస్తూ గడ్డంపెంచి, జడలు కట్టుకొని కాయలూ పళ్లూ ఆహారముగా నేలపై నిద్రిస్తూ ఉండాలి. దేవపూజ, దేవర్షి పితృతర్పణలూ సక్రమంగా చేస్తూ ఉండాలి. ఇలాగ ప్రవర్తించడం వానప్రస్థం. ఈ ఆశ్రమమందున్నూ అగ్నిహోమాలు చేస్తూ ఉండాలి. ఈ విధంగా చేసిన వానప్రస్థం తపశ్చర్యతో జీవితం వెళ్లించి పరమపదం పొందుతాడు.

ఇక సన్న్యాసి విషయం విను. పుత్రకళత్రమిత్రాది సంబంధం, భూమి పుట్రా తోటా దొడ్డి ఇల్లూ వాకిలీ అనే స్మరణ, ఇది నాది అనే భావం లేక మాత్సర్యాదులకు మనసున చోటీయక ఎవ్వరితోనూ వాచా కూడా సంబంధం ఉంచుకోక ఆకలి దప్పులకు లొంగక ఉండడం సన్యాసికి ప్రధాన ధర్మం. అందరితో మిత్ర భావాన మాటాడుతూ ఉండాలి. కోపావేశాలకు



లోను కాకూడదు. అలాగున మాటాడకూడదు. ఐహిక సుఖవాంఛ నిశ్శేషంగా విడిచిపెట్టాలి. ఒకనాడు గ్రామమునందు, అయిదు దినాలు నగరమందు నివసించి మూడు వర్ణాల యిళ్లలో భిక్షాశనం సంపాదించి ఆరగించాలి. వ్యామోహం, లోభం, కామ క్రోధాలు, మదమాత్సర్యాలు సూచనగానైనా లేనివాడై ఆత్మారాముడుగా ప్రవర్తించాలి. ఇలాగు నిర్మల చిత్తుడు తత్త్వ విద్యావివేక సంపన్నుడు సర్వసమబుద్ధి మోక్షకాంక్ష కలవాడై ఈశ్వరధ్యాన హృదయుడై ప్రవర్తించిన వాడు బ్రహ్మలోకవాసి ఔతాడు. అని చెప్పగా సగరుడు సరే! మునీంద్రా! నిత్యనైమిత్తిక క్రియలు చెయ్యవలసిన విధి వివరించు! అని కోరగా చెప్పాడా ముని ఔర్వుడు.

రాజా! ధర్మపత్ని యందు కలిగిన కుమారునకు జాతకర్మాదులు యథాప్రకారం చేసి నాందీముఖ శ్రాద్ధం ఆచరించి ఇద్దరిద్దరు బ్రాహ్మణులు సముచితాసనాలపై తూర్పు ముఖాలుగా కూర్చుండగా అభీష్ట పద్ధతిని వారిని అర్చించి భోజనం చేయించాలి.

యవలు, పెరుగు, తవుడు మొదలైన పదార్థాలలో ప్రాత స్సాయం సమయాలలో హోమం నిర్వర్తించాలి.

హోమపదార్థాలను పెద్దవ్రేలి మొదట ఉంచి, మిగిలిన వ్రేళ్ల కొనలతో అగ్నిలో పడేట్టు చెయ్యాలి.

పదునొకండవనాడు పురుడు తీరగా మంగళస్నానం చేసి శుద్ధి పుణ్యాహవాచనంతో గృహమంతా జలశుద్ధి చెయ్యాలి. తాత తండ్రులు, గురువులు, ఇష్టదైవం పేర్లలో ఏదో ఒక పేరు పెట్టాలి. ఆ పేరు అర్థం లేనిది, అపశబ్దం, అప్రసిద్ధం, రోత కలిగించేది, అమంగళాక్షరం, అతిదీర్ఘాక్షరం, కోపాక్షరం, అన్నీ గురువులూ లేక అన్నీ లఘువులూ కలది, అతి పరుషం (అనడానికీ, వినడానికీ) కానిదై సమాక్షర సహితమై ఉండాలి.

ఆ పేరుకి చివర బ్రాహ్మణునకు 'శర్మ', క్షత్రియునకు 'వర్మ', వైశ్యునకు 'గుప్త', శూద్రునకు 'దాస' అని ఉండాలని వేదోక్తి.

ఇలాగే ఉపనయనాదులున్నూ, ఆయా వర్ణధర్మాలున్నూ కాలాతిక్రమణం కాకుండా చెయ్యాలి.

ఉపనయనాధికారం గల బాలుడు అది అయిన తరువాత నాలుగు వేదాలున్నూ అర్థ సహితంగా తెలిసిన వాడు, శాస్త్రవేత్త, ప్రతిభావంతుడు, ప్రశాంతమనస్కుడు, దయాళువు, ఆచారపరుడు, క్రియాపరుడు, గుణవంతుడుగా గణనీయుడు అయిన గురువును ఆశ్రయించాలి. ఆ గురువును యథాకాలముగా సేవిస్తూ అతని దయకు పాత్రుడై శ్రద్ధగా బుద్ధిగా వేదాధ్యయనం చేయాలి. విద్య పూర్తికాగా యథాశక్తిగా గురుదక్షిణ ఇచ్చి అతని అనుమతితో గృహస్థు అవ్వాలి. తాను గృహిణిగా చేపట్టవలసిన కన్య తన వయస్సులో మూడింట ఒకవంతు వయసుకలది, ఉభయ వంశాలకూ కీర్తి తెచ్చే గుణవంతురాలు, సాధుచరిత్ర అయ్యింది ఉండాలి.

పుట్టుకతో అంగవైకల్యం కలది, బొద్దుగా ఉండేది, మిక్కిలి జుట్టు కలది, సరిగా జుట్టు లేనిది, నల్లనిది, రోమం క్రమ్మిన కాళ్లు చేతులు గలది, చెడు నడత కలది, రోగ పీడ కలది, దుష్ట స్వభావ, నీచ ప్రవృత్తి కలది, మిక్కిలి పల్ల వన్నె (గోరోజనం వన్నె) కలది, ఆచారం అనుసరించని, తలిదండ్రులకు వ్యతిరేకంగా ప్రవర్తించేది, మీసం కల మోము గలది, మగ గొంతు కలది, కరకు చూపు గలది, మిక్కిలి పొట్టిది, మిక్కిలి పొడవైనది, పీలగొంతు కలది, మిడిగుడ్లు గలది, మిక్కిలి పొడవు వెడల్పు గల చీలమండలు గలది, కాకిగొంతు గలది, పిక్కలపై రోమం గలది, తెలుపు లేని గోళ్లు కలది, ఎర్ర కళ్లది, ఉబ్బిన కణతలు గలది, భయంకరమైన ముఖం కలది అయిన కన్యను పెండ్లాడ కూడదు.



మిక్కిలి పొడవు లేక పొట్టియైనది, తెల్లని వెంట్రుకలు గలది, చేతులూ పాదాలూ సరిగా లేనిది, వంచన బుద్ధియైనది, కుంటి నడకది అయిన కన్యను పెండ్లాడకూడదు.

తల్లివంక, తండ్రివంక అయిదు తరాల వారి గొప్ప సంప్రదాయం, ఆచారం పరిశీలనగా తెలిసి సాంకర్యం లేని పక్షాన ఆ వధువును చేపట్టవచ్చు. అలాగు వర్ణాచారధర్మానుసారంగా సులక్షణయైన కన్యను పరిగ్రహించి గృహస్థ ధర్మములను తు-చ- తప్పక పాటిస్తూ ఇల్లు నడిపే గృహస్థు ఐహిక జీవితం సుఖంగా గడిపి అంతమందు దివ్యపదవాసి అవుతాడు. అని చెప్పగా విని -

సరే - మునీంద్రా! గృహస్థ ధర్మాల ననుసరించే పుణ్యాత్ముల ఆచార నియమాలు ఏవో వినిపించరూ అని అడగగా ఔర్వుడు

రాజేంద్రా! సదాచారవంతులైన గృహస్థులు ఉభయలోకాలలో మిక్కిలి సుఖజీవనులౌతారు. తొల్లి స్వాయంభువాది మనువులు, సప్తర్షులు, ప్రజాపతులు లోకోపకారకముగా సదాచారమార్గాలు కల్పించారు. కాబట్టి ఆ ఆచారాలను అవశ్యం పాటించాలి. విను చెప్తాను.

గృహస్థు వేకువజామున మేల్కొని గురుపాదములకు, ఇష్టులైన వారి పాదములకు మనసా నమస్కరించి శయనగృహం వెడలి తన గ్రామానికి నిరృతిభాగాన నూరు గజాల దూరాన వెళ్లి అక్కడ పగలు ఉత్తరాభిముఖుడు, రాత్రి దక్షిణాభిముఖుడై కూర్చుండి, బ్రాహ్మణులకు, అగ్నికి, గురువునకు ఎదురుగా కాక, మౌనియై ముసుగువేసుకుని మలమూత్ర విసర్జన చెయ్యాలి.

వీధిలో, ఊరి నడుమ, పైరుగల పొలములో, చెట్టు నీడన, ఆలమందలో, ఏటినడుమను, వల్లకాటిలోను, దుక్కిచాలులో, నీళ్ల మధ్యను మలమూత్ర విసర్జనం చెయ్యకూడదు.

వట్టి నేలపై చిక్కగా కసవు పరిచి దానిపై విడవాలి. పుట్టమన్ను, గోడమన్ను, నీళ్లలోని మన్ను, దుక్కిమన్ను, పొలంలోని మన్ను, పురుగుపట్టిన మన్ను ఆ శుద్ధికి ఉపయోగించరాదు.

పరిశుద్ధమైన నేలనుత్రవ్వి తానే ఆ మన్ను తీసుకొని నీటి బుడగలు, నురుగు, పురుగు, దుర్వాసన లేని నీటితో శుద్ధి చేసుకోవాలి.

శుద్ధి చేసుకునేటపుడు కేశవాదినామాలు చెప్పుకోవాలి. అలా శుద్ధి అయాక చేతులూ, శిరస్సూ, భుజాలు, వక్షం, కాళ్లు జలం చల్లుకొని శుద్ధి చేసుకోవాలి.

ఆ తరువాత – శిరస్నానం, సంధ్యోపాసనచేసి ఇంటికి వచ్చి దేవర్షి పితృతర్పణాలిచ్చి ఇష్టదేవతారాధన చెయ్యాలి. తదుపరి భూతబలులు చేసి అతిథికోసం వాకిట నిల్చుండాలి. ఆ నిల్చుండడం ఆవుదగ్గర పాలు పితుకునంతసేపు.

అతిథి వస్తే సవినయంగా లోనికి తోడ్కుని వెళ్లి ఆసనం, అర్ఘ్యం, పాద్యం – స్నానానికి తగిన ఏర్పాటు చెయ్యాలి. ఇష్టాన్నపానీయాలతో భోజనం చేయించాలి. విష్ణువే అలా అతిథిగా వచ్చాడు అని ఆ విష్ణువును సద్భావనతో ఆరాధించాలి. ముందు ఏ ఊరు? పేరేమి? ఇలాటి ప్రశ్నలు వెయ్యకూడదు. భోజనానంతరం విశ్రాంతిగా కూర్చున్న తరువాత యోగక్షేమాలడిగి తెలుసుకోవాలి.

అలాగే ఆకలితో చీకాకు పడుతూ వచ్చిన వృద్ధులను, బాలురను గర్భిణులను, కష్టజీవులనూ ఆదరంగా స్వాగతం చెప్పి అన్నపానీయాలతో వారికి సంతృప్తి కలిగించాలి.

అతిథులకు ముందు పెట్టక తాను భుజించి తరువాత వారికి పెట్టడం రౌరవనరకం కొనితెచ్చుకొనడం అవుతుంది.



స్నానం, తర్పణం, సంధ్య, జపం, దేవపూజ, హోమం, వైశ్వదేవం, అతిథి సమారాధన చెయ్యక భుజించడం మలభక్షణం చేసినట్టే అవుతుంది.

అన్నదానం చేసిన వానికి దేహ గేహ బలం, ఆరోగ్యం, పగవారివల్ల జరిగే అరిష్ట కృత్యాల వినాశం కలిగి అన్నివిధాలా శుభప్రాప్తి అవుతుంది. కనుక గృహస్థు కులాచారం ప్రకారం, స్నానసంధ్యాద్యనుష్ఠాన తర్పణం, భూతబలి, అతిథి సత్కారం చేస్తూ ఉండాలి. తాను పడమటి దిశగాకాక తూర్పు మొగముగా సుఖాసనం మీద కూర్చుండి పరిశుద్ధ పాత్రములయందు గుణభూషణయైన ధర్మపత్ని వడ్డింపగా దేవతా నివేదన చేసి ఆ ఆహారపదార్థాలను శిష్యపుత్రమిత్ర బంధువులతో కలిసి ఆరగిస్తూ ఉండాలి. పంచప్రాణాలకు ముందు నివేదించాలి. తరువాత ఆ ఆహారం భుజించాలి. తరువాత ముఖ హస్త పాదప్రక్షాళన చేసుకొని ప్రశాంత స్థలమున కూర్చుని భుజించిన ఆహారపదార్థాలు జీర్ణించే కోరికతో అగస్త్య బడబానల స్తోత్రం పఠించాలి. ఆపైన శాస్త్రగోష్ఠితో ప్రొద్దుపుచ్చాలి.

తరువాత – అపరసంధ్యావిధి నిర్వర్తించి ప్రాతఃకాలమునందు చుక్కలను, సాయంకాలమందు సూర్యుణ్ణి దర్శించి సంధ్యోపాసన చెయ్యాలి. తదుపరి రాత్రి సంపూర్తిగా భుజించి తాంబూలం వేసుకుని ఇష్టదేవతా ప్రార్థన చేసి – పానుపు చేరి నిద్రించాలి.

కుక్కిది, ఎచ్చు తక్కువ కోళ్ళున్నది, మరీ పొట్టిది, విరిగినది, మాసిపోయినది, అల్లిక సరిగాలేనిది, పల్చని నేత గలది, నల్లులున్నది అయిన మంచం నిద్రించడానికి పనికిరాదు.

మెత్తని దూదిపరుపు, తలగడ, పట్టెమంచం, చల్లగాలివచ్చే చోటు, తెర, ధూపవాసన – నిద్రకి అవశ్యకం –

తూర్పుదిక్కుగా లేక దక్షిణదిక్కుగా తలగడ ఉంచుకుని నిద్రించాలి. పడమట, ఉత్తర దిక్కులలో ఏదైనా దుర్భరమైన రోగానికి బీజం అవుతుంది.

పురుష నక్షత్రములైన జ్యేష్ఠ మొదలైన నక్షత్రములందు, బేసి సంఖ్య గల నక్షత్రముల నాళ్లలో, ఋతు దినాలలో తన యిల్లాలితో వినోదించాలి.

పరకాంతను, రజస్వలను, ఇంకొకనియందు మనసుగల మగువను, విచారావస్థలో ఉన్నదానిని, ఏడుస్తూన్నదానిని, ఆచారం తెలియని అబలని, కామం, ఇష్టం లేని దానిని, బాలింతను, తనపై మోహము లేనిదానిని, కలహకంఠిని, రతి పద్ధతి తెలియని రామను, జారను, చోరను, కుమతిని, కూటిపేదను, తాంబూలం ఇవ్వనిదానిని, వెయ్యనిదానిని, రోగపీడితను కలియకూడదు.

రతి తంత్రములలో నేర్పరి, తనపై భయభక్తులు గలది, సుకుమారి, సుందరాకార, సముచిత భాషిణి, వినయవిధేయతలు, వివేకము, శీలము, విద్య, నియమనిష్ఠలు గలది, ఆచారపరురాలు సత్కులమందు పుట్టినది అయిన యిల్లాలు గలవాడు అదృష్టవంతుడు.

అష్టమి, చతుర్దశి, పౌర్ణమి, అమావాస్య – రతికి తగవు. అలాగే పర్వదినాలు, సంక్రమణదినాలు, సంధ్యా సమయం నిషిద్ధములు.

రచ్చపట్టు, ముంగిలి, పశులశాల, స్మశానం, పుణ్యనది, పుణ్యస్థలాలు, నీరు, నాలుగుత్రోవలు కలిసే నడుమ రోడ్డు, ఏటిగట్టు, దేవాలయం, గ్రామం మధ్య, పగలు – స్త్రీని కలియకూడదు.

పరకాంతను కలనైనా స్మరింపక – ధర్మపద్ధతిని తన యిల్లాలితో వినోదిస్తూ గృహస్థై ఉన్నవాడు ఐహికాముష్మిక సుఖాలు పొందుతాడు. తద్విరుద్ధ పద్ధతిని ప్రవర్తించేవాడు వివిధ నరకయాతనల పాలవుతాడు.



ఇక – అవశ్యం కర్తవ్యం చెప్తాను విను. దేవతలను, బ్రాహ్మణుని, గోవును – మనసా నమస్కరించి ప్రాతస్సాయం సంధ్యోపాసన తప్పకచేస్తూ అగ్నిహోత్రం చేస్తూఉండాలి. తెల్లగా ఉదికి ఆరవేసి మడతచేసిన వస్త్రాలే కట్టుకుని మేల్ సొమ్ములు ధరించి కస్తూరి పరిమళచందనం పూసుకుని చిన్న పూదండ శిరసున తాల్చి తల, శరీరం శుచిగా శుభ్రంగా ఉండేట్టుగా ప్రవర్తిస్తూ అలాగే శుచిగా శుభ్రంగా ఉన్న పాన్పుపై శయనించాలి.

ఏ విషయమైనా ఏ సమయమయినా ఎక్కువగా మాటాడకూడదు. కోపతాపాలకూ, లోభమోహాలకూ గురి కాకూడదు. ఎట్టి పరిస్థితులలోనూ కల్లలాడకూడదు. ఎదుటి వారికి వినడానికి కష్టమైనా సత్యమునే పలకాలి. దూషణభాష లాడరాదు. పగలెన్నుకోరాదు. ఒంటెను వాహనముగా ఉంచుకొన రాదు. వానాకాలములో ఏటిదగ్గర, గట్టుననున్న చెట్టుక్రింద పరుండరాదు.

కులాచారం విడిచి ప్రవర్తించే వానితో, దొంగతో, వెర్రివానితో, పగవానితో, పాపపు పనులు చేసేవానితో, జారచోరులతో, అసత్య భాషణునితో, విటునితో, అప్పులవానితో, సత్కర్మలాచరింపని వానితో మైత్రి చెయ్యకూడదు.

ఒంటరిగా త్రోవలో పయనించకూడదు. పొంగి పొర్లుతూ ఉన్న ఏటిలో దిగి యీదకూడదు. కాలిన యింటి వద్దకు వెళ్లకూడదు.

మాటిమాటికి బిగ్గరగా నవ్వడం, పల్లుకొరకడం, అనరాని మాటలాడడం, విచ్చలవిడిగా తుమ్మడం, ఊరక తలగోకుకొనడం – దుష్టచేష్టలని తెలిసిన పెద్దలన్నారు.

ఊరక పుల్లలు విరవడం, పగబట్టి పైవారితో మాటాడడం, వడిగా పరుగెత్తడం, గోటితో గోరు తుంచడం చెడ్డపనులు.

మాటిమాటికి మీసం కొరకడం, పాదముతో నేల రాయడం, అరచేతులు పిసుకుకొనడం చెడుపనులు.

రాత్రి అమేధ్యములో గ్రహ తారకా నక్షత్రాలను చూడకూడదు. ఉదయిస్తూన్నపుడు, అస్తమిస్తూన్నపుడు సూర్యుణ్ణి, దిగంబరియైయున్న కాంతను, దగ్గరగా వెళ్లి పీనుగును చూడకూడదు.

ధూర్తస్త్రీ యింటియందు, తోటలలోను, నాల్గు దోవలు కలిసేచోట, స్మశానమందు, యుద్ధభూమిలో, అడవిలోను ఒంటరిగా రాత్రియందుండ రాదు.

ఎవ్వరూ లేని యింటియందు, ఎవ్వరూలేనిచోట ఉండరాదు. గురువు, బ్రాహ్మణుడు, దేవవిగ్రహం ఎదురైతే తొలగిపోవాలి.

హోమభస్మమును, ముండ్లను, మలమును, తెగిపడిన కేశాలను, ఎముకలను, ఎంగిలిని, స్నానానంతరం తడిసి ఉన్న నేలను ముట్టకూడదు. కొమ్ములూ కోరలూ ఉన్న జంతువుల వద్దకు మాటిమాటికీ వెళ్లకూడదు. ఎదురెండ, మంచు, ఎదురుగాలి తలకి తగిలితే వ్యాధి వస్తుంది. ధోవతి లేక ఇంటినుంచి వెలికి రాకూడదు. నిద్రించరాదు. జుట్టు విరబోసుకొని రాత్రివేళ వీధి గుమ్మములో నిల్చుండ కూడదు.

కయ్యం, వియ్యం తనకి తగినవారితోనే చెయ్యాలి. ఎవ్వరితోనూ పగ పెట్టుకోకూడదు.

బలవంతునితో పగ, బలహీనునితో చుట్టరికం, చాటుమాటుగా ఎవ్వరికైనా ధనమివ్వడం, కోరి కలహానికి కాలు దువ్వడం కాని పనులు.

కాలితో కాలిని తోమడం, కేశం విరబోసుకొని ఉండడం, ఇటూ అటూ నడుస్తూ భుజించడం, తాగడం, నిల్చుండి ఆచమించడం చెయ్యరాదు.



ఎండలోనా వానలోనా తప్పక గొడుగు ఉపయోగించాలి. రాత్రి అడవిలో వెళ్లేటపుడు ఏదైనా ఆయుధం పట్టుకుని వెళ్లాలి.

ఇలాగు నీతిపరుడై నిజకులాచారధర్మం వదలక ధర్మార్థకామముల యందు సమబుద్ధికలవాడై, పాపకర్మలు చెయ్యక భూతదయకలవాడై, అంతశ్శత్రువులకు లొంగక సదాచారసంపన్నుడై సాత్వికగుణం కలవాడై పరపీడ, పరనింద చెయ్యక త్రికరణ శుద్ధి కలవాడై ప్రవర్తించే పావన జీవనుడు జన్మాంతమందు పుణ్యలోక నివాసుడవుతాడు. అని చెప్పగా విని రాజన్నాడు –

భృగువంశ తిలకా! ఇంతవరకు వినవలసిందంతా నీ ముఖతః వివరంగా విన్నాను. ఇకపై పితృకర్మకాండ వినాలని ఉన్నది. దానిని వినిపించు! అని అనగా భార్గవనందనుడు చెప్పాడు.

మరణము సమీపించి, కనులు తేలవేస్తూన్న వానిని దక్షిణ దిశగా నేలపై పరుండబెట్టి ప్రాణావసాన కర్తవ్యముగ ఒక బ్రాహ్మణునకు గోదానం చెయ్యాలి.

అచ్యుత! అనంత! గోవింద! అని శ్రీనాథుడి నామం ఉచ్చరించి ప్రాణవాయువు పోగానే తత్కాలవిధులు సక్రమంగా నెరవేర్చాలి. అగ్ని సంస్కారాదులు వైదిక మార్గానుసారంగా తీర్చితే, తిలోదక పిండదానాలు యధావిధిగ చెయ్యాలి.

బ్రాహ్మణులకు పది దినాలు, క్షత్రియులకు పండ్రెండు దినాలు, వైశ్యులకు పదునైదు దినాలు, శూద్రులకు ఒక నెల సూతకం.

సూతకం తీరగా ఒకడిని నిర్ణయించి, మర్నాడు సపిండీకరణం శ్రాద్ధవిధి నిర్వర్తించి సంవత్సరం పూర్తి అయ్యేవరకు ప్రతిమాసం ఏకభోక్తగా

శ్రాద్ధం చేయాలి. తరువాత ప్రతిసంవత్సరం ఆ దినమందు శ్రాద్ధం చేస్తూ ఉండాలి.

పైతృక శ్రాద్ధమునకు ఆచార్యుడు వేదశాస్త్రవేత్త, సదాచారపరుడు, విష్ణుభక్తుడు అయినవాడుగా ఉండాలి.

భోక్త మేనల్లుడు, అల్లుడు, దౌహిత్రుడు, అతని తండ్రి, వియ్యంకుడు, శిష్యుడు, మాతాపితృభక్తుడు, గుణవంతుడు, దయాళువు – అయినవాడు – అవ్వాలి.

నాస్తికుడు, దురభ్యాసాలు కలవాడు, రోగి, చదువుసందెలు లేనివాడు భోక్త కాకూడదు.

అన్నివిధాలా యోగ్యులైనవారినే భోక్తలుగా నిర్ణయించుకోవాలి. తొలినాటి రాత్రి వెళ్లేవారిని నిర్ణయించి తన యింట ఆ రాత్రి స్త్రీ స్మరణ లేకుండా నిద్రించాలి. తెల్లవారిన తరువాత స్నానసంధ్యా ద్యనుష్ఠానం కాగా వారికి దక్షణాదికృత్యాలు నిర్వర్తించాలి. తదుపరి సముచితాసనాలపై వారిని ఆసీనులనుచేయాలి. (సంకల్పం చెప్పుకొని భోక్తలుగా వారిని నిమంత్రించి అక్షతలు ఇవ్వడం – క్షణం)

విశ్వేదేవారం ఇద్దరిని నిర్ణయించి వారికి తూర్పు ముఖంగాను, పితృదేవారం ముగ్గుర్ని నిర్ణయించి ఉత్తరాభిముఖంగాను కూర్చుండబెట్టాలి.

పితృ పితామహ ప్రపితామహులకు నిజనామ గోత్రాదులు చెప్పి ఆ ముగ్గురు భోక్తలను ఆ విధంగా అర్చించాలి. వారిని వసురుద్ర ఆదిత్య రూపులుగా సంభావించాలి. యధావిధిగా వారిని అర్చించి సముచిత పాత్రలలో అన్నం, పాయసం, అప్పాలు, పప్పు, కూరలు వడ్డించాలి. అగ్నికార్యం నెరవేర్చాలి.



ఆ సమయంలో అతిథి వస్తే భోక్తల అనుమతితో అతనిని ఆహ్వానించి స్నానాదికం అయిన తరవాత సహపంక్తిగా విష్ణువుగా భావించి కూర్చుండబెట్టాలి.

(అభ్యాగతస్స్వయం విష్ణుః = అతిథి విష్ణువు అని ఆర్యోక్తి)

ఆ విధంగా అందరికీ హస్తోదకం ఇచ్చి భోజనం చేయించాలి. ఇలాగు పైతృకం నిర్వర్తించాలి.

భోక్తలు భుజించేటపుడు మౌనంగా ఉండాలి. భోజనానంతరం పితృపితామహాదులకు పిండదానం చేయాలి. తరువాత తిలోదకాలిచ్చి భోక్తలు ముఖ హస్త ప్రక్షాళనం చేసినాక సముచితంగా దక్షిణ తాంబూలాలిచ్చి వారిని పంపి, వారి అనుమతినొంది వైశ్వదేవం, భూతబలి తీర్చి బంధుసమేతుడై కర్త భుజించాలి. ఇలా చేస్తే కృతార్థుడవుతాడు. ఈ విధికి తప్పినవాడు సకలనింద్యుడు, మలి జన్మ చండాలుడు అవుతాడు.

లేడి, దున్నపోతు, కుందేలు, మేక, దుప్పి, ముంగిస, చేప, మాంసముతో పితృకర్మ చేసే జాతులవారుపయోగించవచ్చు.

శ్రాద్ధకర్మకు యవలు, వడ్లు, చామలు, ఆవాలు, మినుములు, తిలలు, పెసలు, గోధుమలు, కొర్రలు – ఉపయోగించదగినవి.

ఉలవలు, కందులు, ఆళ్లు, సజ్జలు, అలచందలు, అనుములు, చోళ్లు, మునగకాయ, ఉల్లి, ముల్లంగి, గుమ్మడి, నేతిబీరకాయ, పుచ్చకాయ, నక్కదోసకాయ – శ్రాద్ధకర్మకు ఉపయోగించకూడదు. అలాగే గోగుకూర, పుల్లబచ్చలి, చెంచలికూర, పొన్నగంటి, నల్లతోటకూర – ఉపయోగించదగదు.

శ్రాద్ధకర్మ నిర్వర్తించిన తరువాత కర్త నగ్నుని చూడకూడదు. అని చెప్పగా మైత్రేయుడు గురువర్యా! నగ్నుడు అంటే ఎవడు? అని అడగగా పరాశరుడు చెప్పాడు.

చిన్ననాడు వేదాలు అభ్యసించి శాస్త్రాలు చదివి దేవతారాధన కావించి – క్రమంగా పెద్దవాడై, వేదాలను నిందించే పామరుడు నగ్నుడు. వేదాధ్యయనం చేసి వేదపద్ధతిని విడిచి దుర్వివేకంతో అన్యమతాల నాదరిస్తూ సంచరించే పాషండుడు నగ్నుడు. అలాటి వానితో మాటాడకూడదు. దీనికి ఒక ఇతిహాసం చెప్తాను విను. అది ఒకప్పుడు మా తాత వసిష్ఠుడు శంతననందనుడైన భీష్మునకు చెప్పినది. నేను చెవులారా విన్నది.

శ్రీకాంతుడు నరసింహుడై హిరణ్యకశిపుని వధించిన తరువాత – వాని కొడుకు హ్లాదుడు దేవతలపై కసితో సేనాసమేతుడై వెళ్లి ఇంద్రాదులను బాధించగా వారు పోయి శ్వేతద్వీపమునందున్న చింతామణి గుహలో శ్రీవిష్ణు నామజపం చేస్తూ ఉండగా శంఖచక్రధరుడై పీతాంబరుడు శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. ఇంద్రాదులు పుండరీకాక్షుని జూచి లేచి చేతులు జోడించి స్తుతించారు. హిరణ్యకశిపుని కుమారునివల్ల తమకు కలిగిన ఆపద విన్నవించి కాపాడు సర్వేశ్వరా! అని ప్రార్థించారు. వారి గోడు విని శ్రీకాంతుడు –

సురలారా! ప్రస్తుతం దానవులు శ్రౌతస్మార్తక్రియలు అత్యాదరముతో చేస్తూ నిజధర్మవర్తనులై ఉన్నారు. అలాటి వారిని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు.

వారు వేదవేదాంగ పద్ధతినీ, నిజకులధర్మమును విడిచి ప్రవర్తించేట్టు వారి శక్తియుక్తులు అంతరించేట్లుగా చేసి మీకు విజయం కలిగిస్తాను. అంతవరకు ఓర్చి ఉండండి. అని తనలోంచి ఒక పురుషుణ్ణి సృష్టించాడు. పేరు మాయామోహుడు. ఆ పురుషుణ్ణి సురలకు చూపి అన్నాడు.

ఈ పురుషుడు అసురులను వితండవాదముతో ముగ్ధులను చేసి ధర్మ కర్మ విముక్తులను చేస్తాడు. మీకు గెలుపు కలిగిస్తాడు అని చెప్పి అదృశ్యుడయ్యాడు.



ఇంద్రాదులు ఆ పురుషునితో తమ నివాసాలకు వెళ్లారు. ఆ పురుషుడు నెమలి రెక్కల విసనకర్ర – బోడితల దిగంబరుడుగా కనిపించేట్టు సన్నని పల్చని ఎరుపురంగు కట్టుబట్ట – కలవాడై తిరుగుతూ క్రమంగా నర్మదా నదీతీరాన ఉన్న దానవుల వద్దకు వెళ్లాడు. వారిచే తగిన మన్నన పొంది కూర్చున్నాడు. కొంతసేపు విశ్రాంతి...అందరినీ కలయజూచి ఇంపుగా సొంపుగా మాటలారంభించాడు. మీరు ఇహలోక సుఖాలా, పరలోక సుఖాలా కోరి యీ తపస్సు చేస్తున్నారు?

మహాత్మా! మాకు ఐహికసుఖవాంఛ లేదు. పారలౌకిక సుఖం కలిగే పద్ధతి ఏమో చెప్పవలసిందని దానవులు మనవిగా అన్నారు.

'మీకు నా మాటలమీద నమ్మకం ఉంటే చెప్తాను. వినండి. బ్రతికినన్నాళ్లు ఇక్కడ సుఖంగా బ్రతకడమే కావాలి. చచ్చిన తరువాత ముక్తి అంటే ఎక్కడ ఉందా ముక్తి? ఎంత తపస్సుచేసినా ఎంత చదివినా ఎక్కడో దైవం ఉన్నదనుకొనడం భ్రాంతి. వేదశాస్త్రాలు కల్లలు. యజ్ఞం చేస్తే గోవధ చేసినట్టే. ఆ పాపం తప్పదు. ముక్తి మార్గం తెలియాలంటే చెప్తాను వినండి. అధమాధమములైన వైదిక క్రియలు విడవండి అని అనేక విధాల వేదనిందావచనాలు పలకగా విని ఆ దానవులు మాయామోహ పురుషునికి మ్రొక్కి వేదమార్గం విడిచి దురాచారులై చార్వాక బౌద్ధమతాలు స్వీకరించి పాషండ వర్తనులయ్యారు. యజ్ఞాదులను నిందిస్తూ వైదికక్రియలకు స్వస్తి చెప్పారు.

అలా ఉండగా ఒకనాడా మాయాపురుషుడు యజ్ఞం చేస్తున్న ఒక సోమయాజుల వద్దకు తన దానవ శిష్యులతో వెళ్లి అన్నాడు.

ఏమయ్యా! జీవహింస చేస్తే పాపం అని వేదాలమాట చెప్పే నువ్వు దయమాని యీ జీవహింస చెయ్యడం దుష్టకర్మ కదా! 'అహింసోపరమోధర్మః

అహింస పరమధర్మం అనే మాటను స్మరించి యీలాటి చెడుపనులు విడిచి మా మాటలు మన్నించి మామతం స్వీకరించు! హోమాలవల్ల బ్రహ్మేంద్రాదులకు తృప్తి కలుగుతుంది అనే చెనటి వైదికుల మాటలు చాటుచేసి ప్రవర్తించడం మంచిది. ఎక్కడో ఉన్నారని దేవతలకూ, ఏనాడో చచ్చినవారికీ వారి పేరు చెప్తూ అన్నం పెట్టడం అర్థం లేనిపని. శ్రుతులూ స్మృతులూ యజ్ఞకర్మలూ పైతృకక్రియలు తపస్సులూ ఇవన్నీ నిరర్థకం – నమ్మదగినవి కావు. ముక్తి కోరేవారైతే మామతం స్వీకరించండి. అని బోధచేసి యజ్ఞాది క్రియలు మానిపించి పాషండమతం అవలంభించేట్టు చెయ్యగా అందరూ శ్రౌతస్మార్త క్రియలు విడిచి నాస్తికులై దైత్య దానవులు నాశనం అయిపోయారు. దేవతలు వైదికధర్మ మార్గాన ప్రవర్తిస్తూ జవసత్వాలు కలవారై అనాయాసంగా అసురులను వధించి మునపటిలాగా యజ్ఞభాగాలు పొందుతూ సుఖంగా ఉన్నారు.

విన్నావా! వేదాలూ యజ్ఞాలూ విడిచి పైతృకక్రియలను మరచి నాస్తికుడైన వాడు నగ్నుడు.

బ్రహ్మచర్యం మొదలు నాలుగాశ్రమాలలో దేనికీ ఒల్లక వేద వేదాంగాలను ఆక్షేపిస్తూ విష్ణుభక్తులను నిందిస్తూ ప్రవర్తించేవాడు నగ్నుడని వేదవాక్కు. అలాటి పాషండుణ్ణి చూస్తే సూర్యదర్శనం చేసి నమస్కరించాలి. వాడితో మాటాడితే దుష్టజన్మ అవుతుంది. స్నేహంచేస్తే వచ్చే పాపం చెప్పలేము. పాషండునితో మాటాడితే వచ్చే పాపానికి రూపముగా ఒక కథ చెప్తాను విను.

శతధనుడనే ఒకరాజు ధర్మపద్ధతిగా ప్రజలను పాలిస్తూ యజ్ఞాలు చేస్తూ ఉండేవాడు. అతని భార్య శైబ్య. పతిని దేవునిగా భావిస్తూ పరిచర్యచేస్తూ సాధ్వీరత్నముగా పేరుపొందింది. ఆ రాజు కార్తికమాసములో ఒకనాడు యజ్ఞంచేసి భార్యతో సహా గంగానదిలో స్నానంచేసి ఒడ్డున ఉన్న బ్రాహ్మణులకు



దక్షిణ ఇస్తూన్న సమయమందు తనకు విలువిద్య చెప్పిన ఆచార్యుని మిత్రుడు పీడావర్తుడు అనేవాడు పాషండుడుగా ప్రవర్తిస్తూ అక్కడకు రాగా రాజువాడితో సంభాషణ ఆరంభించాడు.

వాని సమాచారం తెలిసిన శైబ్య అక్కడినుంచి తప్పుకొని సూర్యదర్శనం చేసి నమస్కరించి విష్ణునామం మనసా చెప్పుకుంటూ భర్తరాక కోసం నిరీక్షిస్తూ ఉన్నది. అంతలో రాజు ఆ పాషండుడితో సంభాషణ ముగించి వచ్చి సతీసమేతుడై నగరం చేరాడు.

కొంతకాలం కాగా శతధనుడు మరణించాడు. అతని యిల్లాలు సహగమనం చేసి సుగుణమణియై కాశిరాజు కూతురుగా పుట్టింది. శతధనుడు పాషండ సంభాషణ ఫలితముగా విదిశాపురములో కుక్కగా పుట్టాడు.

కాశీరాజు పుత్రి తొలిజన్మ తెలివి కలదై తన భర్త ఎక్కడ పుట్టాడో అని ఆలోచించి విదిశానగరమందు శునకజన్ముడైనాడని తెలిసి విచారించింది. పెండ్లిచెయ్యాలని తండ్రి ఆలోచించగా ఇష్టపడక – ఒకనాడు విదిశానగరికి వచ్చి ఆ కుక్కను గుర్తించింది. ఎంతో విచారించి ఒకనాటి రాత్రి కుక్కదరికి చేరి చేతులు జోడించి మీవంటి పుణ్యాత్ముడు పాషండ సంభాషణ వల్ల ఇలాటి జన్మ ఎత్తవలసి వచ్చింది. దైవఘటన తప్పదుకదా? మహాత్మా! పూర్వజన్మజ్ఞానం లేక యిలా ఉండడం తగదు. ఇక యీ శరీరం విడిచిపెట్టు. నేను తొలి పుట్టువున నీ భార్యను – అని చెప్పగా ఆ కుక్క నిరాహారియై, కొన్నాళ్లకి తను త్యాగం చేసి కోలాహల పర్వతం దగ్గర నక్కగా పుట్టింది. ఆ విషయం తెలిసి ఆ యింతి అక్కడకు వెళ్లి కుక్కతో అనిన మాటలే చెప్పి వెళ్లిపోయింది. పుణ్యకాంత వాక్ప్రభావం వల్ల ఆ నక్క కొన్నాళ్లు నిత్రుపవాసం చేసి శరీరం విడిచి ఒక అడవిలో తోడేలై పుట్టింది. మళ్లీ కాశీరాజు పుత్రి వెళ్లి బోధించగ ఆ తోడేలు చచ్చి కోతిగా తర్వాత కొంగగా, నెమలిగా పుట్టి

వేటకాండ్ర చేజిక్కి కాశీరాజునకు కానుకయై అంతఃపురం చేరింది. రాజపుత్రి గుర్తించి ఆనందించి సాదరంగా పెంచసాగింది.

అలాఉండగా జనక చక్రవర్తి గంగాతీరాన అశ్వమేథయాగం చేసి గంగజలాలలో అవభృథస్నానం చేస్తుండగా కాశీరాజు పుత్రి నెమలిని తీసుకొని వెళ్లి ఆ గంగానదిలో మునిగింది. నెమలి మరణించి జనక చక్రవర్తి కొడుకుగా పుట్టింది.

రాజపుత్రి ఆనందంగా కాశికి వెళ్లింది. కొంతకాలం కాగా రాజకుమారి పెండ్లి నిశ్చయించి స్వయంవరం చాటించగా ఎక్కడెక్కడ ఉన్న రాజకుమారులు కాశీనగరానికి వచ్చారు.

సభలో అదరూ ఆసీనులై ఉండగా రాజపుత్రి గుర్తించి జనకనందనుని వరించి అతని యిల్లాలై చిరకాలం హాయిగా జీవితం గడిపింది. జనక నందనుడు తొలిపుట్టువు తెలివికలవాడై ధర్మప్రవర్తనుడై చల్లగా ప్రజలను పాలించి చివర కాంతా సమేతుడై, తను త్యాగంచేసి విష్ణుసాయుజ్యం పొందాడు.

అని పాషండ సంభాషణ వల్ల వచ్చే పాపం, అశ్వమేథమునందు అవభృథస్నాన విశేషం, పతివ్రతాపుణ్యాతిశయం పరాశరుడు శిష్యునకు వివరించి వినిపించాడు.

* * *

## 5

మైత్రేయా! ఇంక ఏమి వినాలని ఉంది? అని అడగగా మైత్రేయు డడిగాడు.

గురుదేవా! సూర్యచంద్రవంశీయులైన రాజుల చరిత్ర వేర్వేరుగా వినాలని ఉంది. అని మైత్రేయుడు అడగగా ఆ గురువు మంచి విషయం అడిగావు. వారి చరిత్రలు వింటే వంశాభివృద్ధి – పుణ్యం కలుగుతాయి. చెప్తాను విను.



### సూర్య చంద్రవంశ రాజుల చరిత్ర

సృష్టి తన పనిగా బ్రహ్మ విష్ణునాభిపద్మము నుంచి పుట్టాడు. బ్రహ్మ వేదాలకు ప్రభువు. ఆ విధముగా అందరికీ పూజ్యుడు. యోగులకు ఇష్టదైవం. పరబ్రహ్మ స్వరూపముగా చెప్పదగినవాడు. ఆ బ్రహ్మ కుడిచేతి బొటనవ్రేలి నుండి దక్షుడు పుట్టాడు. అతని కూతురు అదితి. కశ్యపుని భార్య అయింది. ఆ దంపతులకు జన్మించినవాడు దివ్యతేజశ్శాలి సూర్యుడు. సూర్యుని భార్య విశ్వకర్మ కూతురు సంజ్ఞ. ఆ దపంతుల కొడుకు వైవస్వతుడు. ప్రస్తుతం ఏడవ మనువుగా ప్రసిద్ధుడు. ఆ వైవస్వతునకు తొమ్మండుగురు కొడుకులు. ఇక్ష్వాకువు, నృగుడు, దృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, నభగుడు, దిష్టుడు, కరూశుడు, పృషధ్రుడు – అని వారి పేర్లు. వివిధ ద్వీపాలతో విరాజిల్లే భూమండలమునకు వారు పరిపాలకులయ్యారు.

వైవస్వతుడు భాగ్యరాశియైన సంతతి కలగాలని సంకల్పించి మైత్రావరుణులను గురించి పుత్రకామేష్టి చేశాడు. దానితో హోమ సంబంధమైన విధి సరిగా జరగక పుత్రునకు బదులుగా పుత్రిక కలిగింది. ఆ బిడ్డ పేరు ఇళ.

ఆ బిడ్డ మిత్ర వరుణానుగ్రహంవల్ల మగవాడుగా మారి సుద్యుమ్నుడు అనే పేరుతో పెరుగుతూ యౌవన మదముచే ఎవ్వరినీ లక్ష్యపెట్టక పరపురుషులు ప్రవేశించరాని గౌరీవనములో విహరించసాగింది. అంతట శంకరుడు కోపించి మునపటిలాగా స్త్రీ అవుగాక! అని శపించాడు. అలా స్త్రీ అయి చంద్రనందనుడైన బుధుని ఆశ్రమములో విహరించ నారంభించింది. ఆ కన్య నడకలు, నెమ్మోము తళుకు, చెక్కిళ్ల బెళుకు, చిరునవ్వుల మెరుపు చూసి బుధుడు మోహించాడని చెప్పనక్కరలేదు.

అలాగే ఇలాకన్య కూడ బుధుణ్ణి చూసి శృంగార చేష్టలు ప్రదర్శిస్తూ వలచి వలపించి దరిజేరింది. అలా ఆ తరుణ దంపతులు ఆనంద విహారముగా

ప్రవర్తిస్తూ ఉండగా వారికి ఒక కొడుకు కలిగాడు. 'పురూరవుడు' అని వానికి పేరు.

అంతట ఆ వనమందున్న ఋషులు విషయం గ్రహించి వైష్ణవం అనే యజ్ఞంచేసి ఇలను పురుషుణ్ణిగా చేశారు. పేరు సుద్యుమ్నుడే. ఈ మార్పు తెలిసి వసిష్ఠుడు మనువుకు బోధపరచి నగరానికి సుద్యుమ్నుణ్ణి రప్పించి పట్టాభిషేకం చేయించాడు. సుద్యుమ్నుడు రాజ్యసుఖాలనుభవిస్తూ ఉత్తరుడు, గయుడు, విదురుడు అనే ముగ్గురు కొడుకుల తండ్రి అయ్యాడు. సమయానుసారంగా ప్రథమనందనుడైన పురూరవునకు పట్టంగట్టి తపశ్చర్యకై అడవికి వెళ్లిపోయాడు.

మనువు కొడుకులలో పృషదుడనే వాడు గరుహత్య చేసి ఆ పాపఫలముగా శూద్రుడయ్యాడు. వాని పుత్రపౌత్రాదులంతా శూద్రులుగానే తర్లిపోయారు.

కరూశునికి చాలామంది కొడుకులు. సత్యపాలకులు, గుణవంతులు, బుద్ధిమంతులు – కరూశులుగా ప్రసిద్ధులు.

విష్ణుని కొడుకు నాభాగుడు. భూమండలమునంతనూ ఏలిన సుప్రసిద్ధ ప్రభువు. నాభాగుని కొడుకు బలంధనుడు. అతనికి వత్సప్రీతి, అతనికి ఉదారకీర్తి, ఉదారకీర్తికి ప్రాంశుప్రజాపతి, అతనికి ఖనిత్రుడు, అతనికి క్షుపుడు, క్షుపునకు వింశుడు, అతనికి ఖనేత్రుడు, అతనికి అతివిభూతి, అతివిభూతికి కరంధముడు, అతనికి అవేక్షి, అవేక్షికి మరుత్తుడు కొడుకులు.

మరుత్తుడు సామాన్యుడు కాడు. అమరాధిపుని మించిన బలవంతుడు – గుణవంతుడు. మనువంశానికి మంచిపేరు తెచ్చిన లోకమాన్య చరిత్రుడు. భూమండలమునంతనూ నిరాఘాటముగా ఏలిన ప్రతాపమూర్తి.



ఆ మరుత్తుడు ఒకప్పుడు అశ్వమేధయాగం చేశాడు. అది చెయ్యడానికి నిర్మించిన యజ్ఞశాల బంగరుమయం. సోమపానం చెయ్యడానికి అమరావతి నుంచి ఇంద్రుడు తనవారితో స్వయంగా వచ్చాడు. సురలు వచ్చి చెయ్యవలసిన పనులు చేసేవారయ్యారు. యజ్ఞం అయిన తరువాత దేవతలందరకు మోయలేని రీతిని బంగారు నాణెములిచ్చాడు. అలాటి యజ్ఞకర్తను అన్ని లోకాలూ స్తుతించాయన్నది సామాన్యోక్తి.

అ మరుత్తుని కొడుకు అరిష్యంతుడు. వాని కొడుకు దముడు. దముని సుతుడు రాజవర్ధనుడు. వాని సుతుడు సుధృతి. సుధృతి సుతుడు నరుడు. నరుని కొడుకు కేరళుడు. ఆ కేరళుని ప్రభుత్వముచే ఆ దేశం కేరళ దేశం అని పేరు పొందింది.

కేరళుని కొడుకు బంధుమంతుడు. వాని తనయుడు వేగవంతుడు. వాని కొడుకు బుధుడు. బుధుని సుతుడు తృణబిందుడు.

తృణబిందునకు ఇలబిల అని ఒక కూతురు. ఇలబిల కూతురు అలంబిక. అలంబిక అప్సరస అయింది. తృణబిందుడు అలంబికను పరిగ్రహించగా వారికొడుకై పుట్టినవాడు విశాలుడు. విశాలునికి వాసమైన పట్టణమే విశాల అని ప్రసిద్ధమయింది. విశాలపురం సిరిసంపదలకు ఆలవాలం.

ఆ విశాలుని కొడుకు హేమచంద్రుడు.

హేమచంద్రుని కొడుకు చంద్రుడు. వాని కొడుకు ధూమ్రాశ్వుడు. అతని కొడుకు సృంజయుడు. అతని సుతుడు సహదేవుడు. సహదేవుని కొడుకు గుణాశ్వుడు. ఆ రాజు కొడుకు సోమదత్తుడు. సోమదత్తుడు పది అశ్వమేధాలు నిర్విఘ్నంగా చేసి బ్రాహ్మణులకు కనకాభరణాదులు మోయలేనంత బరువుగా దక్షిణలిచ్చి సంతృప్తులను చేశాడు.

ఆ రాజు కొడుకు జనమేజయుడు. అతని సుతుడు సుమతి. ఇలా విశాల నగరాధీశులు విశిష్ట బలపరాక్రమాలూ, సిరిసంపదలూ, పరువూ ప్రతిష్ఠలు కలవారై నీతినియమాలతో పరిపాలనం చేసి చరిత్రలో ప్రసిద్ధులయ్యారు.

ఇది దిష్టవంశ చరిత్ర – ఇక చెప్పేది విను.

మనుసుతుడైన సంయాతి కూతురు సుకన్య. ఆ బుద్ధిమంతురాలు చ్యవనుడు అనే మునికి భార్య అయింది.

సంయాతి కొడుకు ఆవర్తుడు. పరమధార్మికుడు. అతని సుతుడు రేవంతుడు. అతడు కుశస్థలి అనే నగరమందు ఉండి రాజ్యపాలన చేశాడు. ఆ నరపతికి కొడుకులు నూర్గురు. వారిలో పెద్దవాడు కకుద్మి. కకుద్మి కూతురు రేవతి. కన్యారత్నం. రూపురేఖలు ఆ నాటి కన్యలెవ్వరికీ లేని – ఆ అతిశయ సౌందర్య వైభవమును చూసి తండ్రి యీ బాలకి అన్ని విధాల తగిన వరుడెలా వస్తాడు? సృష్టికర్తయైన ఆ బ్రహ్మను అగడవలసిందే అని కూతురుని వెంట ఉంచుకుని సత్యలోకానికి వెళ్లాడు.

ఆ సమయంలో బ్రహ్మ హాహాహూహులు అనే గంధర్వుల పాట వింటున్నాడు. చేసేదేమీ లేక కకుద్మి కూడ బ్రహ్మ సభలో ఒకచోట కూర్చుని పాట వింటున్నాడు. పాట అయింది. మెల్లగా బ్రహ్మ ముందుకు వెళ్లి నమస్కరించాడు. కూతుర్ని చూపి దేవా! ఇది నాకూతురు. పేరు రేవతి. దీనికి వరుణ్ణి సృష్టించి ఉంటావు ఎక్కడ ఉన్నాడు? అని అనగా బ్రహ్మ నీ ఉద్దేశం ఏమి? ధరణిపై ఎందరో రాజకుమారులున్నారు కదా! వారిలో ఎవనికి ఇవ్వాలని అనుకున్నావు? అని అడిగాడు. కకుద్మి ఎవరెవరినో చెప్పాడు. బ్రహ్మ చిరునవ్వు నవ్వి చెప్పాడు.



రాజా! నే చెప్పేది విను – నువ్వు చెప్పిన రాజులే కాదు. వారి కొడుకులూ, మనుమలూ కూడ కాలగర్భాన కలిసిపోయారు. యుగాలు దొర్లిపోయాయి. కలియుగం సమీపిస్తూంది.

నీ కొడుకులూ మనుమలూ నీ మంత్రులూ సామంతులూ ప్రజలూ వారి బంధువులూ అందరూ భూలోకంనుంచి వెళ్లిపోయారు. కనుక నీ కూతురితో భూమికి వెళ్లి అన్యోన్యం ఇష్టపడిన రీతిని ఏ వానికైనా యిచ్చి పెళ్లిజరుపు –

బ్రహ్మ మాటలు విని ఆశ్చర్యపడి కకుద్మి – దేవా! ఆశ్చర్యం! ఆశ్చర్యం! నీసన్నిధి నున్నాను కనక భూలోక వార్త తెలియలేదు. సరే. ప్రస్తుతం ఉన్నవారిలో నాకొమిరెకు తగిన వరుణ్ణి దయచేసి చెప్పు – మాట మన్నించు!....

అని అనగా బ్రహ్మ ఒకింతసేపు తలవంచి ధ్యానించి ఆనందముగా చేతులు జోడించి అన్నాడు.

రాజా! నీ పుత్రికి తగిన వరుడు ఉన్నాడు. లోకరక్షణ లక్ష్యముగా విష్ణువు ఇలలో అవతరించాడు. ఆ లోకనాథుని మాహాత్మ్యం చెప్తాను విను :–

కేశవుని తమోగుణం భూభారమును భరిస్తుంది ఏదో ఒక మూర్తి అయి. అలాగే జగత్ప్రళయం కూడా కలిగిస్తుంది. ప్రస్తుతం ధరణిలో భూభారం హరించడానికి అవతరించింది. ఆ తమోగుణం పేరు రాముడు. అతడు ఆదిమధ్యాంతశూన్యుడు. నిర్వికల్పుడు. ఆదిదేవుడు. అనంతుడు. త్రిగుణాశ్రయుడు. గుణాతీతుడు. సృష్టిస్థితిలయకారకుడు. ఏలాటి విచారం లేని శుద్ధమనస్కుడు. జననమరణాలులేని ఆకాశతత్త్వస్వరూపుడు. సర్వమంగళ మూర్తి. వేదాంతవేద్యుడు. యోగుల హృదయాలలో ప్రశాంతమూర్తియై

విహరిస్తూ ఉంటాడు. అప్రమేయుడు. ఇలాటివాడు అని చెప్పడానికి సాధ్యంకాని మహిమ గలవాడు. ఆ రాముడు యదువంశములో అవతరించాడు.

ఆ రాముడు బలభద్రుడు. నీలాంబరుడు. నాగలి, రోకలి ఆయుధాలుగా గలవాడు ఆ యాదవకుల రత్నం. నీ పుత్రికకు తగిన వరుడు. ఆయన విష్ణుదేవుడు. నీ కూతురు విష్ణుమాయాశక్తి. కాబట్టి యీ యిద్దరినీ దంపతులను చెయ్యడం అన్నివిధాలా సముచితమైన సత్కార్యం.

ఒకప్పుడు నీ పరిపాలనలో ఉన్న అమరావతికన్నా మిన్నగా ఎన్నదగి కుశస్థలిపురం ఇపుడు ద్వారవతి పేరున యాదవరాజధానిగా ఒప్పుతూంది. దానిలో యదువృష్ణిభోజాంధకులు సేవిస్తూ ఉండగా ఉన్న బలరామునకు నీ కూతుర్ని అప్పగించు! వెళ్లు! అనిచెప్పగా నమస్కరించాడు. కూతురితో భూలోకానికి వచ్చిచూశాడు. ఆ సమయంలో నరులు పొట్టిగా దుర్బలంగా స్వార్థం కోసం పాటుపడుతూ మూర్ఖంగా ఉండడం చూశాడు. అలా వెళ్లి వెళ్లి ద్వారకలో ప్రవేశించాడు. శుద్ధ స్ఫటిక సంకాశుడు, సీరపాణి, దివ్యతేజో విరాజమానుడు అయి ఉన్న బలరాముని చూసి స్వవిషయం చెప్పి మన్ననగా మాటాడి కూతురుని అప్పగించాడు. వెంటనే బలరాముడు మిక్కిలి పొడవై ఉన్న ఆమె శరీరమును నాగలితో పొట్టిదిగా చేసి దరిజేర్చుకుని హాయిగా గృహస్థజీవితం గడపసాగాడు.

కూతురి పెండ్లి అయిపోయింది. బరువు తీరిపోయింది. కకుద్మి తపశ్చర్యకై హిమగిరికి వెళ్లిపోయాడు.

రైతకుడు రాజ్యం చెయ్యక బ్రహ్మవద్దకు వెళ్లడం తెలిసి పుణ్యజనులనే రాక్షసులు ఏకమై కుశస్థలిని ముట్టడించారు. వారికి భయపడి అందున్నవారు నలుదిక్కులా చెదిరిపోయారు.



కకుద్మి సోదరులు పుణ్యజనులకు వెరచి నానా దేశాలచేరిరి. వారి వంశాలలో చాలా రాజవంశాలు పుట్టాయి.

నభగుని కొడుకు నాభాగుడు. బుద్ధిమంతుడు. పరాక్రమవంతుడు. భూమిని నీతినియమాలతో ఎదురులేకుండా ఏలిన మహారాజు.

నాభాగుని కొడుకు అంబరీషుడు. అతని సుతుడు విరూపుడు. అతడు చాలా యజ్ఞాలు చేసి దేవతలకూ, భూదేవతలకూ ఆనందం కలిగించిన వాడు. అతని కొడుకు పృషదశ్వుడు. అతని సుతుడు రథీరథుడు. ఆ రాజు ఉగ్రప్రతాపశాలి. ధర్మకర్మరతుడు. అతని వంశీయులు ఆంగిరసులు అనే పేరుతో పుడమినేలారు. వారికులంవారు ఇప్పుడూ ఉన్నారు.

ఇక – తరువాతి కథ. వైవస్వతుడు తుమ్మగా ముక్కు రంధ్రాలనుంచి ఒక బిడ్డడు పుట్టాడు. పేరు ఇక్ష్వాకుడు – ఆతని పేరు సూర్యవంశానికి వచ్చింది. అతనికి నూర్గురు కొడుకులు. వారిలో కుక్షి, వికుక్షి, దుందుడు అనే ముగ్గురనూ రాజ్యసేవయందు నియోగించి అయోధ్యరాజధానిగా ఇక్ష్వాకుడు తండ్రిని మించిన ధార్మికుడై అపరపరాక్రమముతో నేలనేలాడు.

ఆ ఇక్ష్వాకుడు అష్టకశ్రాద్ధం అనే పితృకర్మ చెయ్యడానికి సంకల్పించి మృగమాంసం తెమ్మని వికుక్షిని పంపించాడు. వికుక్షి అడవికి వెళ్లి పలు మృగాలను చంపి అడవిలో తిరిగిన బడలికచే, ఆకలిదప్పులచే బాధపడుతూ ఒక చెట్టు కిందికి చేరి చెవులపిల్లి మాంసం అలాగే కొంత భక్షించి కొంతసేపైన తరువాత నగరికి వచ్చి మాంసం తండ్రికి అందించాడు. కులగురువైన వసిష్ఠుడు అది అశుచిగా భావించి అన్నాడు.

రాజా! నీకొడుకు అడవిలో తిరిగి మృగాలను చంపి ఒకచోట చెవులపిల్లి మాంసం కొంత తిని మిగిలినది తెచ్చి నీకిచ్చాడు. ఎంగిలి పదార్థం పితృకర్మకి ఉపయోగించరాదు కదా!

గురువు మాటలు విని ఇక్ష్వాకుడు కోపించి కొడుకుకి చీవాట్లు పెట్టి స్వయంగా అడవికి వెళ్లి మృగాలను చంపి మాంసం తెచ్చాడు. వసిష్ఠాదుల మెప్పుతో పితృక్రియ నిర్వర్తించాడు.

* * *

వికుక్షి శశమాంసభక్షకు డయినందువల్ల శశాదుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. తండ్రి తరువాత పరిపాలకుడై ధర్మమార్గాన ఏలుబడి సాగించాడు. అశ్వమేధాలు నిరాటంకంగా చేశాడు. శత్రువన్న వాడిని నామరూపాలతో ఉంచలేదు – అలా శశాదుడు విరాజిల్లి పురంజయుడనే తన కొడుకుకి పట్టం కట్టి తపశ్చర్యకై అడవికి వెళ్లిపోయాడు.

పురంజయుడు ఏలాటి కష్టనష్టాలు లేని విశిష్టధర్మమార్గాన దొరతనం చెల్లించాడు. ఆ కాలంలో సురలకూ అసురలకూ ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధములో సురలు అసురులధాటి కాగలేక వైకుంఠానికి వెళ్లారు. విష్ణువును దర్శించి శిరసులు వంచి నమస్కరించి రాక్షసులవల్ల తమకు కలిగిన బాధను విన్నవించారు.

విష్ణువు వారి గోడు విని విచారించకండి. నాఅంశతో, తేజస్సుతో విరాజిల్లుతూన్న రాజు పురంజయుడు. వెళ్లి సహాయం కోరండి. మీ క్షేమం కోరి ఆ రాజు రక్కసులను ముక్కలు ముక్కలుగా ఖండిస్తాడు. వెళ్లండి – అని చెప్పగా ఇంద్రాదులు సాకేతనగరానికి వచ్చి పురంజయుని దర్శించి రాజా! రాక్షసులతో పోరు. నిలవలేక వైకుంఠానికి వెళ్లి విష్ణువును ప్రార్థింపగా నీ సహాయం మాకు క్షేమంకరం – అని ఆ స్వామి పంపగా వచ్చాము. మాకు అభయమిచ్చి మా స్థానాలు మాకు వచ్చేట్టు చెయ్యవలసింది – అని దీనంగా అన్నారు. వారి గోడు విని పురంజయుడు విచిత్రమైన నిర్ణయముతో అన్నాడు.



నూరు యజ్ఞాలు నిరాటంకంగా చేసి ముజ్జగాల దొరయై ఉన్న ఇంద్రుడు వృషభమైతే అతని మూపుపై నేను కూర్చుండి రక్కసుల నెదిరించి నిర్మూలించి మీకు గెలుపు కలిగిస్తాను...

సరే అన్నారు దేవతలు. శివుని ముందు నందిలాగా రాజుముందు ఇంద్రుడు వృషభమై నిల్చున్నాడు. వెంటనే రాజు మహావిష్ణువును మనసా భజించి ఆ వృషభాకకుత్థ్సుడై యుద్ధానికి వెళ్లి అసురులను చెండాడి వేల్పులకు గెలుపుతో పాటు పరమానందం కలిగించాడు. ఇలాగ పురంజయుడు వృషభ కకుత్థ్సుడై 'కకుత్థ్సుడు' అనే నామాంతరం కలవాడయ్యాడు.

కకుత్థ్సుని కొడుకు వేనుడు. అతని సుతుడు పృథువు. పృథువు కొడుకు విశ్వగుడు. అతని కొడుకు పృథుయశుడు. ఆ రాజు కొడుకు చంద్రుడు. చంద్రుని నందనుడు యౌవనాశ్వుడు. వాని కొడుకు శావస్తి. గొప్ప కీర్తి సంపాదించిన రాజు. వానిపేరుతో శావస్తి అనే నగరం చరిత్రకెక్కింది.

శావస్తి కొడుకు బృహదశ్వుడు. వాని పుత్రుడు కువలయాశ్వుడు. ఆ రాజు శ్రీహరి అనుగ్రహముతో ఎదురులేని రాజుగా ఇలనేలాడు.

దుందుడు ఉదంకుడనే మునిశాపం వల్ల రాక్షసుడై లోకానికి చీకాకు కలిగిస్తూండగా మునులు వచ్చి కువలయాశ్వునికి చెప్పారు. వెంటనే కువలయాశ్వుడు అసంఖ్యాకమైన సేనతో వెళ్లి దుందునీ, వాని బలగమునూ, కొడుకులనూ హతమార్చాడు. దృఢాశ్వుడు, చంద్రాశ్వుడు, కపిలాశ్వుడు అనే ముగ్గురు కొడుకులు మాత్రం బ్రతికి ఉన్నారు.

కువలయాశ్వునికి దుందుని పరిమార్చగల శక్తి విష్ణుభక్తి ప్రభావంవల్ల కలిగింది. ఆ విధంగా 'దుందుమారుడు' అనేపేరు పొందినవాడయాడు.

దృఢాశ్వుని కొడుకు హర్యశ్వుడు. అతని సుతుడు నికుంభుడు. ఐశ్వర్యానికీ విజయలక్ష్మికీ అతడు ఆశ్రయం –

అతని కొడుకు అహిపశ్వుడు. వాని కొడుకు కృతాశ్వుడు. వాని కొడుకు ప్రసేనజిత్తు. వాని కొడుకు యువనాశ్వుడు. అతడు ధర్మశీలుడుగా ప్రసిద్ధుడు.

కాని అతనికి చింత సంతతి లేదని. ఒకనాడు అనుకున్నాడు. ఏ కొరతలేని ఐశ్వర్యముతో లోకమునేలాడు. శత్రువులను అడవులకూ, కొండలకూ పంపించాడు. ముల్లోకాలలో కీర్తిచంద్రికలు వ్యాపించేశాడు. ఇవన్నీ ఎందుకనిపిస్తుంది సంతతి లేకపోవడం... సంతతి లేనివానిని లోకులు హీనంగా చూస్తారు. లక్ష్యపెట్టరు. వారికి పుణ్యగతి కలుగదు. అడవిమృగమై పుట్టడంకన్న బిడ్డలు లేనివాని బ్రతుకు నీచం.

ఇలా ఆలోచించి రాజ్యభారం మంత్రులకు అప్పగించి తపస్సు చేయడానికి భార్యాసహితమై అడవికి వెళ్లిపోయాడు. మునులు చూశారు. జాలిపడి వచ్చి పలకరించి రాజా! సర్వం విడిచి యిలా అడవికి వచ్చి కొడుకు కోసం మలమలమాడుతూ తపస్సు చెయ్యడం ఎందుకూ? ప్రార్థనలతో దేవతలను వేడడం నిష్ఫలం. మేము నీకు కొడుకు కలగాలని వైష్ణవమైన యజ్ఞం చేస్తాము. తప్పక శుభలక్షణ లక్షితుడైన కొడుకు కలుగుతాడు అని నచ్చచెప్పి తపస్సు నుంచి మళ్లించి పుత్రకామేష్టి చేశారు. సమాప్తి చేసిన నాటి రాత్రి మంత్రపూతమైన నీరు ఒకపాత్రలో ఉంచి దానిని వేదికపై ఉంచి, మేల్కొని ఉండలేక అక్కడక్కడ వాలి నిద్రించారు.

అర్ధరాత్రి – అందరూ గాఢనిద్రలో ఉన్నారు. యువనాశ్వుడు ఉపవాస శ్రమచే అలసిసొలసి దప్పికతో వేదిక కడకు వచ్చి దానిపై ఉన్న కలశం తీసి ఆ నీరు త్రాగి వెళ్లి పడుకున్నాడు.



ఇంచుమించూ వేకువజాము. మునులు గబగబలేచి వేదికదగ్గరకు వెళ్లి జలపాత్ర చూశారు. ఏముందీ... కోపించారు. సంతతి కలగాలని ఎంతో శ్రమపడి పుత్రికామేష్టిచేసి రాజపత్నికి ఇవ్వడానికి ఉంచిన మంత్రోదకం త్రాగిన ఆ చెనటి (మూర్ఖుడు) ఎవడో! చెప్పాలి. చెప్పకుంటే శపిస్తాము – అని గట్టిగా అనగా రాజు లేచి వెళ్లి శాంతించండి. ఉపవాసాయాసముతో అపరిమితమైన దాహం కలగగా శరీరం ఉడుకెత్తగా భరించలేక ఆ మంత్రజలం నేను త్రాగాను.

ఇక మునులేమంటారు? విచారించారు. రాజా! మాసంకల్పం తప్పక ఫలిస్తుంది. కాని అది వ్యతిరేకం అయింది. నువ్వు గర్భం ధరిస్తావు. బలవంతులలో మేటి అయిన కొడుకు పుట్టుతాడు.... అని తమ ఆశ్రమాలకు వెళ్లిపోయారు.

కొన్నాళ్లకు రాజు కుడివైపు కడుపు ఛేదించి మగబిడ్డడు బయటికి వచ్చాడు. ఆ సమయంలో దివినుంచి పుష్పవర్షం కురిసింది. దివ్యదుందుభులు మ్రోగాయి. గగనవాణి పొగిడింది. సురగణాలతో ఇంద్రుడు వారి వద్దకు వచ్చాడు. మునులను రప్పించాడు. వారిని చూచి యీ బాలుడు నన్ను, నా రాజ్యమునూ భరించడానికి సమర్థుడు కనుక మాంధాత – అని పేరు పెట్టుతున్నాను అని తన కుడిచేతి బొటనవ్రేలితో ఆ శిశువుచే అమృతం త్రాగించాడు. అదే ఉగ్గుపాలన్నమాట. అలా పన్నెండు సంవత్సరాలు అమృతం పట్టాడు. అలా పన్నెండు సంవత్సరాలు కాగా మాంధాత ఏడు దీవులతో అలరారుతున్న భూమిని కైవసం చేసుకుని ఏకచ్ఛత్రముగా పాలించే చక్రవర్తి అయ్యాడు. సూర్యుడి ఉదయాస్తమానాలకు నడుమ నున్న భూమండలమంతా మాంధాత క్షేత్రమని జనులు అనుదినం అభినందిస్తూ ఉండేవారు.

మాంధాత శశిబిందు పుత్రియైన బిందుమతిని చేపట్టి ముగ్గురు కొడుకుల తండ్రి అయ్యాడు.

పురుకుత్సుడు, అంబరీషుడు, ముచికుందుడు అని వారి పేర్లు.

తరువాత ఏభైమంది కూతుళ్ల తండ్రి అయ్యాడు. ఆ కొమ్మలందరూ బంగారుబొమ్మలవాలి. లేదా తళుకుబెళుకుల మెరుపులు, అందరూ మోహనాంగులే....

ఇలా సంతానవంతుడై మాంధాత చీకూచింతా లేక పరిపాలకుడై ఉండగా.... ఆ కాలంలో సౌభరి అనే ఒక ముని ఒక కొలను నీళ్లలోపల ఉండి తపస్సుచేస్తూ ఒకనాడు మగ-ఆడ చేపల విహారం చూసి

ఎందుకీ తపస్సు. ఒక భార్యతో ఆనందంగా గృహస్థ జీవితం గడపడం మేలు.

అని అనుకుని ఒకనాడు సరాసరి మాంధాత వద్దకు వచ్చాడు.

మాంధాత ఆదరంగా అర్ఘ్యపాద్యాదులతో సంభావించి సముచితమైన ఆసనమందు కూర్చున్నాక సవినయంగా అడిగాడు. మహానుభావా! ఏమిటి మీరాకకు కారణం?

సౌభరి రాజుమాట విని రాజా! నీవు దాతవుగా పేరు పొందిన వాడవని విని నిన్నొకటి అడగడానికే వచ్చాను. ఎవరు ఎప్పుడు ఏమడిగితే అవి యిచ్చి పంపకపోతే యిక్ష్వాకు వంశానికి మాయని మచ్చ.

అదికాక - ఉజ్జ్వలమైన పరాక్రమముతో భూమండలమునంతా ఏలుతూ సురలోకపతికి కూడ సమయానుసారంగా సహాయం చేసే వాడవుగా సుప్రసిద్ధుడవు. కనుక ఐహిక సుఖం కోరి నిన్ను అడగడానికి వచ్చాను.



క్షేత్రం తెలిసి విత్తు వెయ్యాలి. పాత్రమెరిగి దానమియ్యాలి...

అని అనగా మాంధాత - మునీంద్రా! అనుమానమా? నీ మనసులోని కోరిక ఏమో సెలవిస్తే తప్పక ఇస్తాను.

'రాజా! ఔచిత్యం అనౌచిత్యం తెలిసిన వాడవు - సత్యవచనుడవు. అని నమ్మి అడుగుతున్నాను. విను. నీ పుత్రికల్లో ఒకతెను ఇల్లాలిగా నాకు ఇవ్వాలని కోరిక. ఆ విధంగా నీ పేరుతో నేను గృహస్థునౌతాను.

ఆ సమయంలో సౌభరి తీరు, నడక బడలిక, మాసి తెలుపెక్కిన గడ్డం, పట్టుతప్పి నిడుపై సన్ననై ఉన్న శరీరం.

మాంధాత తనలో అనుకున్నాడు. ఏమి చెయ్యడం? ఆలోచించాడు. సన్న సన్నగా అన్నాడు. మా పూర్వులు కన్యలు మెచ్చిన వారికే యిల్లాండ్రుగా ఇచ్చారు. అంతేగాని ఎంత ఐశ్వర్యం ఉన్నా అందచందాలున్నా ఇచ్చేదిలేదు. నేను ఆ త్రోవనే వెళ్లదలచి ఉన్నాను. మునీంద్రా! నా మనవి విను.

వయసు మళ్లి శరీరం దిగజారి చిక్కి ఉన్న నిన్ను మోహనరూపు రేఖలున్న నా కూతుళ్లలో ఏ ఒక్కతైనా ఒప్పుకుంటుందా?

మాంధాత మాటలు విని సౌభరి నవ్వుతూ అన్నాడు. రాజా! మంచిమాట అన్నావు. నిజమే. నేను అలా ఉన్నాను. కాని నామాట విను. నన్ను నీకూతుళ్లు ఉన్నచోటికి తీసుకువెళ్లు. వారు నన్నుచూసి ఇష్టపడితే ఏ కూతురినైనా యిచ్చి పెండ్లిచెయ్యి. ఇష్టపడకపోతే నా వచ్చిన దారినే తిరిగిపోతాను.

రాజు మరి మాటాడలేక సరే అని అంతఃపురం కాపరిగా ఉన్న వానిని రప్పించాడు. ఈ మునీంద్రుణ్ణి కన్యకలున్న చోటుకు తీసుకువెళ్లు. వారిలో ఏ ఒకర్తె అయినా ఇతనిని చూసి అంగీకరిస్తే ఇద్దరికీ పెండ్లి

జరిపిస్తాను. అని అనగా వాడు కన్యకలున్న అంతఃపురానికి సౌభరిని తీసుకువెళ్లాడు. అక్కడికి వెళ్లగానే సౌభరి నరసురగణాలలో ఏ ఒకరికీ లేని అందచందాల రూపుతో మారిపోయాడు. అంతఃపుర రక్షకుడు కన్యలను రావించి చూడండి యీ ముసలి తాపసుణ్ణి. మీవద్దకు మీతండ్రి పంపగా తీసుకువచ్చాను. మీలో ఒకరిని భార్యగా ఇమ్మన్నాడాయన – మీలో ఎవరు ఇతనిని చూసి ఇష్టపడతారో చెప్పితే మీనాయన మీయిద్దరికీ పెండ్లి చేస్తాడు. చూడండి.

ఆ సుందరాంగులు సౌభరి రూపురేఖలు చూసి మురిసిపోయారు. నన్నంటే నన్ను – నేనంటే నేను – అని ఒకరికి మించి ఒకరు వాదాడసాగారు

కాపరి రాజువద్దకు వచ్చి ప్రభూ! నీకూతుళ్లు అందరూ ఆ మునిని చూసి ఒకరితో ఒకరు వాదిస్తున్నారు. నేనంటే నేను, అని – అని చెప్పగా మాంధాత ముని తపోమహిమకి అబ్బురపడి శుభముహూర్తాన యాభైమందినీ సౌభరికి ఇచ్చి పెండ్లిచేసి సమృద్ధిగా వస్త్రాదులిచ్చి ముని వెంట పంపించాడు.

సౌభరి భార్యలతో ఆశ్రమానికి వచ్చి దేవశిల్పియైన విశ్వకర్మను తల్చుకున్నాడు. అక్కడికక్కడ ఎదుట నిల్చున్నాడు అమరశిల్పి. అతనిని చూసి సౌభరి చెప్పాడు.

నేను గృహస్థునయ్యాను. నా భార్యలందరూ మహారాజపుత్రికలు. దివ్యభోగాలనుభవించినవారు. కావున వారికి నివసించదగిన రతనాలు పొదిగిన బంగారుగోడల మేడలు నిర్మించు.

'అలాగే' – అన్నాడు శిల్పి. ఉత్తరక్షణంలో దివ్యభవనాలు. వాటిలో హంసతూలికా తల్పాలూ, నిలువుటద్దాలూ, పెరళ్లలో పువ్వుల తోటలూ, నడబావులూ సర్వసమృద్ధిగా రూపొందించాడు. మునికి చెప్పాడు. సౌభరి చూసి సంతోషించి తన భార్యలను ఆ భవనాలలో ప్రవేశపెట్టాడు. మరి వారికి పనికత్తెలు ఉండాలిగా. ఒక్క క్షణం ఆలోచించాడు. తపశ్శక్తిచే



అప్సరలను రావించి భార్యలకు సేవికలుగా నియమించాడు. వారికి తగిన అమూల్యాభరణాలు కానుకలుగా ఇచ్చాడు. షడ్రసోపేతమైన ఆహారపదార్థాలతో ఏపూటకాపూట కలిగిస్తూ భార్యలతో ఆరగిస్తూ ఆనందిస్తూ కాలం గడుపుతున్నాడు.

అక్కడ మాంధాత – కందమూలాలూ, కాయలూ, పళ్లూ తింటూ కడుపుచిచ్చుతో నలుగుతూ ఒడలు దిగజారి ఉన్న తబిసికి కుసుమ సుకుమారమూర్తులనూ ఇష్ట భోజనాలతో తుష్టిగా పుష్టిగా ఉన్నవారిని కూతుళ్లను ఇల్లాండ్రుగా ఇవ్వవలసివచ్చింది. వారి స్థితి ఎలా ఉందో చూడాలని భార్యతో కొందరు పెద్దలతో సౌభరి ఉన్న అడవికి వెళ్లాడు.

దివ్యరత్నస్థగిత కాంచనభవనాలూ, విరబూచిన పూదీగలతో ఆరపండిన పండ్లతో కోకిలల కలరావాలతో నెమళ్ల క్రేంకారాలతో కనుపండువుగా వీనులవిందుగా ఉన్న తోటలో నవవికసిత పద్మాలతో ఒయ్యారపు నడకల రాయంచలతో చూడ ముచ్చటగా నున్న జలాశయాలు, ధనధాన్య సమృద్ధితో పరమానందమూర్తులైన నాలుగు వర్ణాలవారి నివాసాలు, దివ్యమంగళ వాద్యాలతో అమర గీతాలూ కలదై త్రిభువనలక్ష్మికి కాపురమై యున్న సౌభరిపురం కనిపించింది. దానిని చూడగానే మాంధాతకు సందేహం కలిగింది.

ఇదివరకిక్కడ ఊరనేదే లేదే. ఇప్పుడోపురం ఇంద్రపురమును తలక్రిందులు చేసే వైభవముతో ఒప్పారుతూ ఉండడం – ఇదేదో దేవతా సృష్టిలా ఉన్నది. దాని ప్రభువు ఎవరో? అని లోనికి వెళ్లి పౌరులవల్ల తెలుసుకుని ఆశ్చర్యముతో ఆనందముతో అల్లుకుపోయాడు.

'సౌభరి తపశ్శక్తితో ఏర్పడిన పురం ఇది' – అలా వెళ్లి వెళ్లి అల్లుణ్ణి చూసి నమస్కరించి అతని సూచననుసరించి సముచితాసనాసీనుడయ్యాడు.

ఇతరేతర కుశల ప్రశ్నలు అయ్యాక రాజు కూతుళ్లను చూస్తాను అని అనగా ఓ వెళ్లవచ్చు. వేర్వేరుగా మేడలలో ఉన్నారని చిరునవ్వుతో చెప్పాడు సౌభరి.

మాంధాత – అల్లనల్లన అడుగులు వేస్తూ ఒక మేడలోనికి వెళ్లాడు. కూతుర్ని చూశాడు. ఆశ్చర్యపోయాడు. ఆమె తన పట్టపురాణి మేడను మించిన వైభవముతో విరాజిల్లుతూంది. తూగుటుయ్యాలలో కూర్చుని నవరత్నస్థగిత సువర్ణాభరణలతో దివ్యాంబరధారిణియై ఉన్న కూతురుని చూసి తానిలాటి వైభవం కలిగించగలనా అని ముగ్ధుడయ్యాడు. తండ్రిని చూసి కూతురు చప్పున తూగుటుయ్యాల్లోంచి దిగి తండ్రి పాదాలకు దండ ప్రణామం చేసి లేచి తన కేళీసౌధానికి తీసుకుపోయింది. ఆసనాసీనుణ్ణి చేసి ఉచితరీతిని యోగక్షేమాలడిగింది. అందరూ క్షేమంగా ఉన్నారని తండ్రి సంతోషంగా సమాధానం చెప్పాడు. తరువాత అడిగాడు.

అమ్మా! నువ్వూ నీచెల్లెండ్రూ క్షేమంగా ఉన్నారా? నీభర్త మిమ్మందరినీ ఆదరాభిమానాలతో చూస్తున్నాడా? తక్కువ లేదు కదా! ఆహారపదార్థాలు సముచితరీతిని ఉన్నాయా? వస్త్రాలూ, సుగంధద్రవ్యాలూ సరిగా సమకూర్చుతున్నాడా? ఉన్నది ఉన్నట్టు చెప్పాలి.

కూతురు చెప్పింది – నాయనా! నువ్వడిగిన విషయమంతా సముచితంగా జరుగుతూంది. ఏలాటి అనుమానమూ వద్దు. అయితే నిన్ను చూడకపోవడం ఒక్కటే మాకు విచారం కలిగిస్తూ ఉంటుంది.

విశేషం ఏమిటంటే నవ మన్మథరూపముతో నా భర్తా మందిరము నందే ఉండి నన్ను ఆనందింపజేస్తూ ఉన్నాడు. ఇక సంపదకు ఏమి కొరత?

కూతురు మాటలు విని తండ్రి అరే! ఆ ముని ఎంత మందమతి? ఒక్కతెను ఆదరంగా చూస్తూ మిగిలిన వాళ్లని ఎడబెడతాడా? అని తత్తరపడి



సరే – వస్తానమ్మా అని రెండవ కూతురున్న మేడకి వెళ్లాడు. ఆమేడ మరీ ఒప్పుగా ఇంపుగా ఉన్నది. కూతురువల్ల ఉపచారం పొంది కుశలప్రశ్న వేశాడు. ఆ యింతి అక్కకన్న మిన్నగా తాను భర్తతో కాపురం చేస్తూన్నట్టు చెప్పగా విని సంతోషించి అక్కడి నుంచి మూడవ కూతురింటికి వెళ్లాడు – అలా అందరినీ చూసి పలకరించి అందరూ భర్తతో సమధికానందంగా భోగా లనుభవిస్తున్నామని చెప్పగా మాంధాత ఆశ్చర్యపడి సౌభరి తపో మహిమను మెచ్చి అతని వద్దకు వెళ్లి అన్నాడు.

మహాత్మా! నా కుమారికలు నిన్ను వరించి సుఖంగా ఉన్నారు. ఆడుబిడ్డలను మితిమీరి కన్నందుకు ఏలాటి బరువు – బాధ లేక ఆనందఫలం పొందిన వాడినయ్యాను.

అని అనేక విధాల ప్రసంశించి కూతుండ్రకు ధనకనకవస్తు వస్త్రాదులనిచ్చి అల్లుడితో చెప్పి తన నగరానికి వెళ్లిపోయాడు. సౌభరి ఆ రాజపుత్రికలతో హాయిగా ఉన్నాడు. కొంతకాలానికి వారియందు కొడుకులను కన్నాడు. వారు నూట ఏభైమంది.

ఆ కొడుకులకు సమయానుసారంగా ఉపనయనం, తగిన సంబంధాలతో వివాహంచేశాడు. వారి సాంసారిక జీవితాలూ క్రమంగా వారి కొడుకులూ వారి ఆటపాటలూ చూసి ఆనందిస్తూ సౌభరి చిరకాలం సాంసారిక జీవయాత్ర గడిపి – ఒకనాడు పరతత్త్వ చింత కలవాడై, ఐహికమైన మోహాలతను తెగగోసినవాడై...

ఔరా! మానవులు నిస్సారమైన సంసారమును సారవంతముగా పొగుడుతూ కళత్రపుత్రపౌత్ర జీవితవలయంలో చిక్కుకుని అంతం లేని ఆశతో ఉంటారేగాని శాశ్వతమైన పరమపదమును గురించి ఒక్కక్షణమైనా

ఆలోచించరే! ఎంత సిరిసంపద లనుభవిస్తున్నా నాకు చిత్తశాంతీ తృప్తీ కలగవే – ఇక అది కావాలి – ఇది కావాలి అనే ఆరాటంతోనే నామనస్సు పోరాటం సాగిస్తూంది.

నాకు ఆనాడు నీటిలో చేపల తగులాట చూసి మైథునవాంఛ కలిగింది. ఒక కన్యను కోరి వెళ్లగా ప్రక్క కన్నెలనూ చేపట్టవలసివచ్చింది. వారి కోసం గృహాలూ, పోషణకి ధనధాన్యాలూ, సేవకి దాసదాసీజనాలూ – కావలసి వచ్చింది. వాటికోసం నా తపశ్శక్తిని ధారపొయ్యడం అయింది. ఇక సంసార సంబంధం బంధం – కొడుకులూ కోడళ్లూ మనుమలూ ఇలా తెగ పెరిగింది. వారి రక్షణకి ఆస్తిపాస్తుల సంపాదన....... ఇలాగ కాలం వృథా అయింది. యోగం ఉన్నచోట భోగాలకు తావుండదు. భోగాలున్నచోట యోగం కలగదు. కాబట్టి రెంటినీ సమన్వయించి ఎవ్వరూ జీవితం నడపలేరు – అని ఆలోచించి సర్వం విడిచి భార్యలతో అడవికి పోయి చాలాకాలం తపస్సుచేసి పిదప సన్న్యసించి విష్ణుభక్తిపరాయణుడై కాలానుసారంగా శరీరత్యాగం చేసి మోక్షం పొందాడు.

ఈ సౌభరి కథ వ్రాసినా చదివినా వినినా సిరిసంపదలతో సుఖజీవితం – శరీరత్యాగం అయిన తరువాత మోక్షం కలుగుతాయి. అని పరాశరుడు మాంధాత పుత్రసంతతి చెప్పాడు.

మాంధాత కొడుకైన అంబరీషుని కొడుకు యువనాశ్వుడు. అతని సుతుడు హరిషుడు. వాని సంతతి అంగిరసులు అనే గంధర్వులు ఆరుకోట్లు. వారు పాతాళానికి వెళ్లి అక్కడ ఉన్న నాగరాజులను చిదగగొట్టి వారి అధీనములో ఉన్న రత్నాలనూ, కామినీ రత్నాలనూ బలాత్కరించి గ్రహించగా నాగరాజులు బయల్వెడలి పాలకడలినిచేరి కాలాత్ముడు, లోకారాధ్యుడు, సర్వమంగళమూర్తి, లోకాభిరాముడు, కరుణాసాగరుడు, పన్నగశయనుడు,



శంఖచక్రధరుడు, కోటి సూర్య ప్రభాభాసమానుడు, సౌభాగ్యలక్ష్మీ సమేతుడున్ను అయిన లక్ష్మీకాంతుణ్ణి ప్రార్థించగా యోగనిద్రలో ఉన్న శ్రీపతి మేల్కొన్నాడు. పన్నగపతులు స్వామికి దండప్రణామం చేసి తమ యిక్కట్లు గంధర్వులచే చెప్పించారు. అది విని లక్ష్మీపతి మన్నించి పన్నగసర్పాలను ఆదరంగా చూసి అన్నాడు.

పురుకుత్సుడు పరిపాలకుడుగా భూమిలో ఉన్నాడు. నాప్రభావం ఆ పరిపాలకునకు అంగరక్షగా ఉన్నది. మీరు వెళ్లి ఆ రాజును కోరండి. అతడు గంధర్వులను అవలీలగా సంహరించి మీకు మేలు కలిగిస్తాడు. వెళ్లండి –

నాగపతులు వెనుదిరిగి తమలోకానికి వచ్చి, ఒకచోట అంతా గుమికూడి ఆ రాజు వద్దకు ఎవరిని పంపడం? అని విచారిస్తూ ఉండగా ఒక ముని వచ్చి ఎవరిని పంపాలో నేను చెప్తాను వినండి.

పురుకుత్సుడు నర్మదా నదియందు అత్యధిక ప్రేమతో ఉన్నాడు. ఆ నర్మద కూడా అతనియందెంతో అనురాగంతో ఉన్నది. కనుక మీరు వెళ్లి ఆ నర్మదకు మీ బాధ చెప్పి ప్రార్థించండి. ఆమె కనికరించి పురుకుత్సుణ్ణి ప్రేరేపిస్తుంది. అంత రాజు వచ్చి మీపక్షాన నిలిచి శత్రువులను హతమారుస్తాడు అని చెప్పి ముని వెళ్లిపోయాడు. అనుకోకుండా ఆ సమయానికి నర్మద దివ్యకాంతగా మారి అక్కడకు వచ్చింది. పన్నగులామెను ప్రార్థించి తమ బాధ చెప్పుకున్నారు. వెంటనే ఆమె పురుకుత్సుని వద్దకు వెళ్లి ఆనందంగా పలకరించి పాతాళానికి తీసుకువచ్చింది. నాగపతులు పురుకుత్సుని యథోచితముగా సమ్మానించి రాజా! మహావిష్ణువు వాక్కు మాపగవారిని పరిమార్చి మాకు మేలుకలిగిస్తావని. ఆ మాట సఫలం చెయ్యవలసిందని వేడుతున్నాము.

వెంటనే పురుకుత్సుడు నాగవైరులను గంధర్వుల నెదిరించి సహజమూ విష్ణుప్రభావభరితమూ అయిన భుజబలముతో ఆరుకోట్ల గంధర్వులనూ హతమార్చి నాగులకు నిర్భరానందం కలిగించాడు. వారికేలాటి కష్టంలేకుండా చేసి వారి వలన స్వకులాభివృద్ధయ్యేట్లు వరం పొంది నిజపురానికి వచ్చి సుఖంగా ఉన్నాడు.

తమకెంతో ఉపకారంచేసిన నర్మదకి వరమివ్వవలెనని తలచి పన్నగవటులామెను పూజించి అన్నారు.

అమ్మా! నీపేరు చతుర్థీవిభక్త్యంతముగా చేసి చివర నమః చేర్చి ఉభయ సంధ్యలయందును భక్తితో స్మరించేవారికి సర్పవిషం సోకదు. నీదివ్య నామం ఉచ్చరిస్తూ భుజించేవారికి ఆ సమయంలో విషమిచ్చినా అది అమృతం అవుతుంది. అని వరమీయగా నర్మద సంతోషించి అంగీకరించి పురుకుత్సుని వద్దకు వెళ్లి అనురాగముతో అతనిని వరించింది.

ఆ ప్రేమదంపతులకు ఒక కొడుకు త్రసదస్యుడు. అతని సుతుడు అనరణ్యుడు.

అనరణ్యుడు ఒకప్పుడు యజ్ఞంచేస్తూ ఉండగా రావణుడు వచ్చి యజ్ఞం చెరచి అనరణ్యుణ్ణి చంపి వెళ్లిపోయాడు.

అనరణ్యుని కొడుకు హర్యాక్షుడు. అతని సుతుడు వసుమణుడు. వాని కొడుకు ప్రియారణుడు. అతని సుతుడు సత్యవ్రతుడు. సత్యవ్రతుడు వసిష్ఠుని శాపముచే త్రిశంకు నామముతో చండాలుడై ఉన్నాడు. ఆ కాలంలో పదిరెండు సంవత్సరాలు వాన లేక పాడిపంటలు కరవై పోయాయి. ఆనాటి దుర్దశలో త్రిశంకుడు అడవిలో మృగాలను చంపి వాటి మాంసం విశ్వామిత్ర పుత్రకళత్రాదులకు ఇస్తూ, గంగ ఒడ్డున ఒక మర్రిచెట్టు క్రింద వారికి నివాసం ఏర్పరచి యీ చండాలుణ్ణి అనుగ్రహించండని ప్రార్థించేవాడు.



అలా కొన్నాళ్లు కాగా విశ్వామిత్రుడు అతని వృత్తాంతం తెలుసుకుని కనికరించి పరమ పావనుణ్ణి చేసి సశరీర స్వర్గం కలిగించాడు. ఆ త్రిశంకుని కొడుకు హరిశ్చంద్రుడు.

హరిశ్చంద్రుడు సకలసంపదలూ విశ్వామిత్రునకు సమర్పించి సత్యవ్రతమును పాలించి సత్యహరిశ్చంద్రుడనే సార్థక నామధేయుడయ్యాడు. భుజబలముతో సప్త ద్వీపాలూ తనవిగా తన ఆజ్ఞ చెల్లేట్టు రాజ్యం చేశాడు. సాక్షాత్తూ శ్రీహరిలాగా చిరకాలం సర్వసమృద్ధిగా నేల నేలాడు. రాజసూయ, అశ్వమేథ – యజ్ఞాలు నిర్విఘ్నంగా చాలా చేశాడు. అంతమందు దేవలోకంలో ఇంద్రుని సింహాసనమునకు పక్కనే దివ్యసింహాసనాసీను డయ్యాడు. ధర్మానికి హరిశ్చంద్రుడు పురుషరూపం.

ఆ హరిశ్చంద్రుని కొడుకు లోహితాశ్వుడు. అతని సుతుడు హరిషుడు. హరిషుని కొడుకు చంచుడు. వాని కొడుకులు విజయుడు, వసుదేవుడు అని యిద్దరు.

విజయుని కొడుకు రురుడు. వాని కొడుకు వృకుడు. వాని తనయుడు బాహుడు. బాహుడు రాజ్యపాలన చేస్తూ ఉండగా వైహయులు ఆకస్మికంగా వచ్చి రాజ్యం ఆక్రమించుకోగా బాహుడు చేసేది లేక భార్యా సమేతుడై ఔర్వమహాముని ఆశ్రమానికి వెళ్లిపోయాడు. అప్పటికి అతని పట్టమహిషి నిండుగర్భిణి. ఒకనాడు ఆ యిల్లాలి సవతి తనకి సంతతి లేదనే విచారం, సవతికి సంతతి కలుగుతుందనే కోపం ఏకం కాగా విషం పెట్టింది. ఆ విషం గర్భమును స్తంభింపచేస్తుంది. అలా ఏడు సంవత్సరాలు కాగా వయసు చెల్లిన బాహుడు పరలోకగతుడయ్యాడు.

అంతట గర్భవతియైన పట్టమహిషి భర్తతో సహగమనం చెయ్యడానికి – సన్నద్ధురాలై చితిదగ్గరగా చేరగా మూడు కాలాలూ తెలిసిన

మహాముని ఔర్వుడు ఆశ్రమంలోనించి వెలుపలకు వచ్చి పట్టమహిషిని వారించి అన్నాడు.

అమ్మా! చితిలో ప్రవేశించకు. నీ కడుపులో ఉన్న బిడ్డ అసమాన బలపరాక్రమాలు కలవీరుడై విరోధియముడై భాస్కర సమతేజసుడై రాణిస్తూ ఏకచ్ఛత్రంగా నేలనేలుతాడు. ఎన్నో యజ్ఞాలు సురలకూ నరులకూ సంతుష్టిగా చేస్తాడు. చక్రవర్తి అవుతాడు. బలిష్ఠులైన కొడుకులు మిక్కిలిగా కలవాడౌతాడు. ఈ సాహసం విడిచి ధైర్యంగా ఉండు!

రాణి ముని మాటలకు ధృతి కలదై మరణం మాని పతికి పరలోక క్రియలు చేసి ఆ ముని ఆశ్రమమందే ఉన్నది. కొన్ని దినాలకు గరముతో (విషముతో) కొడుకును కన్నది. ఔర్వుడా శిశువునకు సగరుడు అని పేరు పెట్టాడు. జాతకర్మాది క్రియలు జరిపి చౌలోపనయనాదులూ విద్యాభ్యాసం శాస్త్రం, అస్త్రం, శస్త్రం – వీటికి సంబంధించిన శిక్షణ, రథగజ తురగాదులకు సంబంధించిన విద్యలు సక్రమంగా నేర్పాడు.

తరువాత – సగరుడు ఒకనాడు తల్లిదగ్గరకు వచ్చి అన్నాడు – జననీ – అడవులలో ఉండడం మనకెందుకు? మాతండ్రియెక్కడికి వెళ్లినట్టు?

కొడుకు మాట వినగానే ఆ తల్లికి కళ్లనీళ్లు కారాయి. మెల్లగా అన్నది:

నాయనా! ఏమిచెప్పేది. హైహయులు మూకుమ్మడిగా వచ్చి పోరాడి మీతండ్రిని అడవులకు పారద్రోలారు. అని చెప్పి తనకు సవతి విషం పెట్టడం, తండ్రి పరలోకగతుడవడం, ఔర్వుని చేయూత విషయం చెప్పింది. తల్లి మాటలు విని సగరుడు కోపించి –

సరే. ఆ దుష్టులను వధించి ముల్లోకాలలో కీర్తివ్యాపింపచేస్తానని ప్రతిజ్ఞ చేసి వెళ్లి ముందు హైహయులను యుద్ధానికి పురికొల్పి అందరినీ ముక్కచెక్కలుగా ఖండించాడు.



సగరుని బలపరాక్రమాలను చూసి శకయవనకాంభోజాదులు బెదిరి పారిపోయి వసిష్ఠుని శరణు కోరారు. వసిష్ఠుడు ఆలోచించి వారిని కులాచారాలు విడిచి గతి తప్పిన వారినిగా, బ్రతికిఉన్నా చచ్చినవారినిగా చేసి సగరునితో అన్నాడు.

రాజా! నీప్రతిజ్ఞ చెల్లిందికదా! హైహయులు చచ్చారు. వీరంతా చచ్చిన వారితోనే జమ. కాబట్టి వీరిని విడిచిపెట్టు. ఇంకొక ముఖ్యమైనది – వీరు నీకు భయపడి ప్రాణరక్షణ కోరుతూ నన్ను శరణుజొచ్చినవారు. శరణన్నవారిని కాపాడడం ధర్మంకదా. అదికాక నేను మీ వంశీయుల గురువును. నామాట మన్నించాలి అని అనగా సగరుడు గురువునకు నమస్కరించి కరుణించి ఆ రాజులను విడిచి మీమీ స్థానాలకు పొండి. నిర్భయంగా బ్రతకండి. అని ధైర్యం కలిగించి పంపించాడు.

ఆనాటి నుండి యవనులు బోడితలలవారు, శకులు సగం బోడి తలలవారు, పారదులు విరబోసిన జుట్టుగలవారు, ప్లవులు మీసాల గడ్డాలవారు, కాంభోజులు అధ్యయనం లేనివారు – అయి తమ తమ కులాచారాలు విడిచి బ్రాహ్మణులకు దూరమై మ్లేచ్ఛులు అయ్యారు.

ఇలాగ సగరుడు తండ్రి శత్రువులను దునుమాడి తన నగరానికి వచ్చి అభిషిక్తుడై ఏడు దీవుల నేలకు రేడై ఉండి వినతా కశ్యపుల కూతురు సుమతిని, విదర్భరాజు పుత్రిక సుకేశిని పెండ్లాడి రాజ్యభోగాలనుభవిస్తూ హాయిగా ఉన్నాడు.

కొంతకాలం అయ్యాక పుత్రకాంక్షతో భార్యల కోసము ఔర్వుని వద్దకు వెళ్లి తన కోరిక ఆయనకు చెప్పి సేవిస్తూ ఉండగా ఆ ముని ఒక భార్యకు వంశవర్ధనుడైన కొడుకు కలుగుతాడు, ఇంకొకతెకు అరవైమంది కొడుకులు కలుగుతారు అని చెప్పాడు. విదర్భరాజపుత్రి ఆ ఒక్క కొడుకుని

కోరింది. తథాస్తు అన్నాడు ముని. కాశ్యపి అరవైమందిని కోరింది. అట్లే అవుగాక అన్నాడౌర్వుడు.

(అరవైవేలమంది అని ఉంది పురాణంలో)

తరువాత – ముని అనుజ్ఞతో సగరుడు నగరానికి వచ్చాడు. కొన్నాళ్లకు సుకేశికి ఒక కొడుకు కలిగాడు. వాని పేరు 'అసమంజసుడు'. సుమతికి అరవైమంది పుట్టారు.

అసమంజసుడు పేరుకి తగినట్లే తమ్ములను వెంట ఉంచుకొని అసమంజసములైన పనులు చేస్తూ ప్రజలకూ తల్లిదండ్రులకూ బాధాకరు డయ్యాడు. తండ్రి ఓర్చాడు. యువకుడయితే బుద్ధిమంతుడు కావచ్చు అని ఉపేక్షించాడు. అసమంజసుడు యువకుడైన తరువాత ఇంకా దుర్మార్గు డయ్యాడు అలా ఉండగా వానికొక కొడుకు పుట్టాడు. మనుమణ్ణి చూశాను చాలునని సంతోషించి సగరుడు అసమంజసుణ్ణి వెడలగొట్టాడు.

అసమంజసుని తమ్ములు కూడ అన్నలాగే దుష్టచరిత్రులై లోకానికి చీకాకు కలిగించసాగారు. యజ్ఞాలు పాడుచెయ్యడం, తపస్సులు సాగకుండా చెయ్యడం ఇలాటి పనులు చెయ్యడం సురలు సహించలేకపోయారు.

శ్రీకాంతుని అంశతో అవతరించిన మహాతపస్వి కపిలుడు. ఆయన వద్దకు వెళ్లి సగరుని కొడుకుల దుష్ప్రవర్తన విన్నవించారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చెయ్యడానికి అవనియందు ఇలా అవతరించిన పద్మాక్షుడవు కనుక నీతో చెప్పవలసి వచ్చింది. ఇంకా ఆ దుష్టుల ఆటలలాగే సాగితే లోకాల గతి ఏమవుతుందో...

సురల మాటలు విని కపిల మహర్షి అన్నాడు – పాపకర్ములై యితరులకు కష్టాలు కలిగించే వారిని దైవమే పడగొట్టడం అవుతుంది.



ఎవ్వరూ వారిని చెరచడానికి సిద్ధపడ నక్కరలేదు. వారు వారు చేసిన పాపపుణ్య కర్మలఫలితం వారనుభవిస్తారు. కనుక అచిరకాలములో పాపకర్ములైన సగర నందనులు రూపుమాసిపోతారు. కాబట్టి మీరు బాధపడక వెళ్లండి అని వారిని పంపి తపశ్చర్యలో నిమగ్నుడయ్యాడు.

అంతట – సగరుడు అశ్వమేధం చెయ్యడానికి దీక్షపూని అశ్వరక్షణకు తన కొడుకులనందరినీ నియోగించాడు. అరవైవేలమంది గుర్రంవెంట పయనించారు.

కొంతదూరం వెళ్లిన తరువాత ఒకచోట దేవదూత ఒకడు వారిని మోసగించి యజ్ఞాశ్వమును భూమి బిలంనుంచి లోనికి మళ్లించి నాగలోకంలో తపస్సుచేస్తున్న ఆశ్రమంలో ఆయనకి ఎదురుగా ఉన్నచోట కట్టి వెళ్లిపోయాడు.

అంతలో సగరనందనులు తేరుకుని గుర్రం కనిపించకపోవడంతో ఇలపై నలుదిక్కులా వెదకి చివరకు భూమిని త్రవ్వి లోపల ప్రవేశించి తిన్నగా కపిల మహాముని ఉన్నచోటికి వెళ్లారు. అసాధారణ దీక్షతో కనులు మూసి తపస్సుచేస్తూన్న ఆ మహామునిని చూశారు.

ఆ మునికి ఒకింత దూరాన ఒక చెట్టుక్రింద ఉన్న యజ్ఞాశ్వమును చూశారు. కోపించి ఆయుధాలు జళిపిస్తూ దగ్గరగా వెళ్లారు. మన తండ్రి యజ్ఞానికి సంబంధించిన గుర్రమును దొంగిలించిన దొంగ వీడు. గుర్రముతో ఉండడానికి అక్కడ ధైర్యం చాలక ఇక్కడికి వచ్చి నిజమైన సన్న్యాసిలాగా నటిస్తున్నాడు. వీనిని చిదగగొట్టి మన గుర్రాన్ని తీసుకుపోదాం – అని అరుస్తూ ఉండగా కపిల మహాముని కళ్లు తెరిచి నిప్పు కణాలు రుప్పే చూపులతో చూశాడు. అంతే క్షణంలో అందరూ బూడిద అయిపోయారు.

తన కొడుకుల మరణవార్త తెలిసి సగరుడు విచారించి గుఱ్ఱమును తోలుకురమ్మని మనుమణ్ణి పంపించాడు. అంశుమంతుడు ఆ త్రోవనే నాగలోకానికి వెళ్లి కపిలుని దర్శించి నమస్కరించి నుతించాడు. కపిలుడు వాని నుతికి ప్రసన్నుడై వత్సా! గుఱ్ఱమును తీసుకుపోయి నీ తాత యజ్ఞం పూర్తి చేయించు!....

అని అనగా అంశుమంతుడు చేతులు జోడించి మహాత్మా! నా తండ్రులకు స్వర్గలోకనివాసం అనుగ్రహించే వరం ప్రసాదించు! అని ప్రార్థించాడు.

'నీ పౌత్రుడు భగీరథుడు అతి తపోనిష్ఠతో శివుని కృప వడిసి సురగంగను భూమికి రప్పిస్తాడు. ఆ గంగాజలకణాలతో ధరణి పరమ పావనమౌతుంది. అలాగే గంగా ప్రవాహం ఇక్కడికీ వస్తుంది. దాని తుంపరచే నీ తాతలు పవిత్రులై స్వర్గలోకవాసులౌతారు.

విష్ణుపాదమునుంచి పుట్టిన ఆ మహానది గాలి సోకినంతనే ఏలాటి పాపాలూ ఆఏటిలో కలిసిపోతాయి. ఆ పుణ్యనదీజలాలలో స్నానం సకల పాపహరం – గంగాజలం ఒక్కకణం అయినా శరీరమునందు ఎక్కడపడినా ఆ మనిషి పాపవిముక్తుడౌతాడు.... ఇక నువ్వు గుఱ్ఱమును తీసుకువెళ్లు. అని కపిల మహాముని చెప్పగా అంశుమంతుడు ఆనందించి గుఱ్ఱమును తెచ్చి తాతకు ఇచ్చాడు. తరువాత సగరుడు యథావిధిగా అశ్వమేధం పూర్తిచేశాడు. సగరతనయులచే రూపొందిన సముద్రునికి సాగరుడని పేరు వచ్చింది.

(సాగరము = సముద్రము)

ఆ అంశుమంతుడి కొడుకు దిలీపుడు. దిలీపుని సుతుడు భగీరథుడు. భగీరథుడు అసాధారణమైన తపస్సుచేసి దివినున్న సురనదిని భువికి రప్పించి ఆ నదికి తన పేరున పేరు కల్గించాడు. ఆ విధంగా గంగానదికి భాగీరథి అని పేరు వచ్చింది.



ఆ భగీరథుని కొడుకు సుహోత్రుడు. వాని కొడుకు నాభాగుడు. వాని కొడుకు అంబరీషుడు. వాని తనయుడు సింధుధ్వజుడు. వాని కొడుకు అయుతాయువు. అయుతాయువు సుతుడు ఋతుపర్ణుడు.

ఋతుపర్ణుడు అక్షవిద్యలో గట్టివాడు. జూదములో ఓడిపోయి దుర్దశలోఉన్న నలునకు ఆవిద్య ఉపదేశించి తిరిగి రాజ్యాధికారం వచ్చేట్టు చేశాడు. ఆ ఋతుపర్ణునకు సర్వకాముడు, అతనికి సుదాసుడు, అతనికి మిత్రసఖుడు కొడుకులు –

ఆ మిత్రసఖుడు రాజ్యంచేస్తూ ఒకనాడు వేటకు అడవికివెళ్లి భయంకరంగా గాండ్రిస్తూన్న రెండు పులులను చూసి అనుకున్నాడు. ఈ క్రూరమృగాల గాండ్రింపుల చేతనే చుట్టుప్రక్కల ఎక్కడా ఏ మృగమూ లేదు. బెదిరి ఎక్కడికో మరొక అడవికి పోయి ఉంటాయి – అని క్రూరశరముతో ఒకదానిని పడగొట్టగా అది రాక్షసాకారముతో క్రిందపడింది. అపుడు రెండవది – నాతోటి పులిని పడగొట్టావు. దీనికి తగిన ప్రతిక్రియ నీకు చేస్తాను చూడు అని రాక్షసాకారముతో అక్కడినుంచి వెళ్లిపోయింది. రాజు ఆశ్చర్యపడుతూ నగరికి చేరాడు.

కొన్నాళ్లయ్యాక సౌదాముడు కులాచార్యుడైన వసిష్ఠుడు పురోహితుడుగా ఒక యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞం అయిపోయిన నాడు వసిష్ఠుడు అనుష్ఠానార్థం దరిలో ఉన్న నదికి వెళ్లాడు. ఆ సమయంలో అడవిలో పగబట్టి వెళ్లిన రాక్షసుడు వసిష్ఠుడుగా మారి వచ్చాడు. రాజా! యజ్ఞం అయింది. ఇక నాకు భోజనం – నరమాంసంతో భోజనం – ఇది నా కోరిక – అని అన్నాడు. ఆశ్చర్యంగా రాజు ఒప్పుకున్నాడు. ఆ రాక్షసుడు వంట వండడానికి వేషగాడై

రాగా రాజు చెప్పాడు సరే అని. ఆ వంటవాడు ఒక మనిషిని చంపి వండి అది ఒక బంగారు పళ్లెములో పెట్టి రాజు ముందుంచి వెళ్లిపోయాడు.

ఒకింత సేపటికి వసిష్ఠుడు వచ్చి భోజనానికి కూర్చుండగా రాజు గురువుకి తెలియనట్టుగా నరమాంసముతో వండిన ఆహారపదార్థాలు పెట్టాడు. ముందుగతి తెలియనివాడై చేశాడా చెడ్డపని – వసిష్ఠుడు అది నరమాంసముగా గ్రహించి కోపించి పుణ్యమును సంపాదించడానికి ఘోరతపస్సు చేసే మాకు నరమాంసం భోజనముగా పెడతావా? ఇది రాక్షసులు చేసే పని – నేటినుంచి నువ్వు నరమాంసం భక్షిస్తూ రాక్షసుడవై ప్రవర్తించు అని శపించాడు రాజుని. అపుడు సౌదాముడు మునీశ్వరా! ప్రొద్దుట నువ్వే కదా యిలా ఆహారం కావాలన్న వాడవు. ఇంతలో మనసు మళ్లీ నన్ను శపిస్తావా? అని దీనంగా అన్నాడు. వసిష్ఠుడు దివ్యజ్ఞానదృష్టితో అసలు విషయం గ్రహించి

ఓ – అదా? సరే. యీ శాపం పన్నెండు సంవత్సరాలు కాగానే తీరుతుంది అని శాపవిముక్తి చెప్పగా రాజు మంచిది. అలాగే కానీ. నిరపరాధిని నన్ను నిష్కారణముగా శపించిన వాడవు. ఇక నువ్వు సూర్యవంశీయులకు ఆచార్యుడవు కాక విచారిస్తూ ఉందువుగాక! అని ప్రతిశాపం పలికాడు.

నీరు తీశాడు. పైకి జల్లబోయాడు. అంతలో రాణి మదయంతి ప్రభూ! ఆగు! గురువును శపించవచ్చునా? అని నివారించింది. దానితో రాజు మనసు విరిగినట్లై ఆ శాపజలాలు జల్లితే లోకానికి చీకాకు కలుగుతుందని తన పాదాలపై చల్లుకున్నాడు. ఆ నీటి ప్రభావం వల్ల రాజు పాదాలు కల్మష తెర గట్టినట్టు కళాకాంతీ లేనివి అయ్యాయి. దానిచే సౌదాముడు 'కల్మాషపాదుడు' అనే పేరుగల వాడయినాడు.



గురువు శాపంవల్ల ఆ రాజు రాక్షసుడై రాత్రివేళ అడవులలో ఉండి వచ్చిపోయే నరులను చంపుతూ వారి మాంసం తింటూ, పగలు నరుడుగా ప్రవర్తిస్తూ ఉండేవాడు.

అలా ఉండగా ఒకనాడు ఒక బ్రాహ్మణుడు భార్యతో కలిసి అడవిలో సుఖిస్తూ ఉండగా రాక్షసుడుగా ఉన్న రాజు చూసి ఆ బ్రాహ్మణుణ్ణి పట్టి మింగడానికి సంసిద్ధుడు కాగా బ్రాహ్మణపత్ని విలపిస్తూ అన్నది.

లోకం అంతా స్తుతించే కీర్తిగల వాడవు – కరుణామూర్తివి, ఇక్ష్వాకు వంశ భూషణుడవు బ్రాహ్మణుణ్ణి చంపవచ్చునా?...

నాకు భర్త అతడు. అతనిని పోగొట్టుకుని నేను సుఖపడేదెలాగ? బ్రాహ్మణ హత్య మహాపాతకం అని నీకు నేను చెప్పనక్కర లేదు. ఇది ఎంతో నీచకర్మ. అతనిని చంపకు! విడిచిపెట్టు. నా బొట్టు చెరపకు – అని ప్రార్థించగా ఆ రాక్షసుడు ఆమె మాటలు వినిపించుకో లేదు. ఆ బ్రాహ్మణుణ్ణి చంపి భక్షింపగా ఆ బ్రాహ్మణుని భార్య కోపించి

దుర్మార్గుడా! కలిసి సుఖించే సమయంలో నాకు పతి లేకుండా చేశావు కనుక నీ భార్యతో సుఖించడానికి నువ్వు సిద్ధపడిన వెంటనే చస్తువు గాక! అని శపించి అగ్నిలో ప్రవేశించింది. ఇలా రాజు చేసిన దారుణ కార్యానికి ఆ అడవిలో ఉన్న భూతాలు హాహాకారాలు చేశాయి.

అలాగు మునీంద్రుని శాపంవల్ల పంద్రెండు సంవత్సరాలు రాక్షసకృత్యాలు చేస్తూ లోకభీకరుడై ఉన్నాడు.

తరువాత వసిష్ఠాది మునులు వచ్చి పాపం, శాపం విముక్తి పొందేట్టు తగిన యజ్ఞంచేసి రాజును పుణ్యాత్ముణ్ణి చేశారు.

తరువాత రాజు రాజధానికి వచ్చి రాజ్యపాలన ఆరంభించాడు. ఒకనాడు పట్టమహిషిని మదయంతిని దరిజేర్చుకుని కామకళకి ప్రోత్సహించగా అడవిలో ఆనాడు బ్రాహ్మణుడి భార్య పలికిన శాపం చెప్పి పట్టు విడిపించుకుని దూరంగా వెళ్లిపోయింది. ఇక చేసేదేముందని రాజు విచారగ్రస్తుడయ్యాడు.

అలాగ కొంతకాలం ఉండి సంతానార్థం వసిష్ఠుణ్ణి ప్రార్థించి తన భార్యనప్పగించాడు. ఆ మునీంద్రుడు మదయంతిని ఆదరంగా చూసి అసామాన్యమైన శరీరబలం, పరాక్రమంగల కొడుకు పుట్టుతాడని దీవించి వెళ్లిపోయాడు.

మదయంతి గర్భమును ఏడు సంవత్సరాలు భరించింది. పురుడు కాలేదు. మరి భరించలేక ఒకనాడు అశ్మము (రాయి) తో గర్భమును పొడుచుకొనగా వెంటనే పురుడు – కొడుకు పుట్టాడు – వానికి అశ్మకుడు అని పేరు పెట్టారు.

ఆ బిడ్డడు క్రమంగా పెరిగి పెద్దవాడు కాగా కల్మాషపాదుడు రాజ్యం వానికి అప్పగించి తపస్సు చెయ్యడానికి వనవాసి అయ్యాడు.

అశ్మకుడు చల్లగా పరిపాలన చేసి అందరి మెప్పు పొందాడు. ఆ రాజుకి ఒక కొడుకు – వానిపేరు మూలకుడు. తండ్రి తరువాత మూలకుడు పరిపాలన చక్కగా చేశాడు. ఆ కాలంలో పరశురాముడు రాజులను సంహరిస్తూ అయోధ్యకు రాగా తెలిసి అశ్మకుడు స్త్రీ వేషధారియై కాంతల నడుమనుండగా పరశురాముడు వీడు స్త్రీ సముడు – పోనీ! అని తిరిగి వెళ్లిపోయాడు.

తరువాత అతనికి ఇలబిలుడు – అనే కొడుకు – వానికి ఖట్వాంగుడు, దిలీపుడు – అనే వారు పుట్టారు.



దిలీపుడు పట్టాభిషిక్తుడై రాజ్యం చేస్తూ ఉండగా దేవదానవులకు పోరు – ఆ పోరులో దేవతలు దానవుల నెదిరించలేక ఖట్వాంగుని తోడు చేసుకున్నారు. ఖట్వాంగుడు రణరంగాన నిలిచి దానవులను తెగవేయగా సురలు జయధ్వానంచేసి రాజా! ఏదైనా వరం కోరుకో! అన్నారు. 'నా ఆయుర్దాయం ఎంత?' అని రాజు అడగగా రెండు గడియలు – అన్నారు సురలు – అలా అయితే మీ వరం నా కెందుకు నన్ను ధరణికి పంపించండన్నాడు. సురలిచ్చిన విమానముతో నగరానికి వచ్చి ఐహిక క్రియలు విడిచి పరతత్త్వవేది అయ్యాడు. బ్రహ్మాదులకు కూడా సాధ్యంకాని పరమయోగ ప్రభావం పొంది ముహూర్తకాలములో విష్ణుసాయుజ్యం పొందాడు.

ఆ రాజు యోగవిద్యా సారస్యం మెచ్చి సప్తర్షులు ఒక్కొక్క సమయమందు అభినందిస్తూ ఉంటారు.

ఇక – తరువాత సూర్యవంశీయుల కథ...

దిలీపుని కొడుకు రఘువు. అతని సుతుడు అజుడు. అజుని కొడుకు దశరథుడు. దశదిశలా తన రథానికి అడ్డులేకుండా దివ్య పరాక్రమశాలియై ప్రవర్తించి దొరతనం నెరపిన చక్రవర్తి దశరథుడు. ఆ దశరథునకు మహావిష్ణువు లోకరక్షణ లక్ష్యముగా తన మూర్తి నాలుగు భాగాలుగా జన్మించాడు. ఆ మూర్తులే రామలక్ష్మణ భరతశతృఘ్నులు – అని పెరుగుతూ ఉన్నారు. వారిలో పెద్దవాడైన రాముడు విశ్వామిత్రుడి కోరికపై అతని వెంట వెళ్లి తాటక అనే రక్కసిని, సుబాహువనే రాక్షసుణ్ణి ఒక్కొక్క బాణముతోనే తెగవేసి మారీచుడనే అసురుణ్ణి ఒక బాణముతో సముద్రములో పడగొట్టి ఆ ముని యజ్ఞం కాపాడాడు. గౌతముని శాపముచే పాషాణమై అడవిలో పడి ఉన్న అహల్యను తన పాదధూళిచే తిరిగి అహల్యగా రూపొందించాడు. జనకుని వాక్కు

ననుసరించి నిండు సభలో శివుని విల్లు విరిచి సీతను పెండ్లాడి పరశురాముని మార్గమధ్యమున భంగపరచాడు. తన తలితండ్రుల ఆజ్ఞననుసరించి సీతతో, లక్ష్మణునితో వనవాసం చేసి ఋషులను రాక్షస బాధలనుంచి విముక్తులను చేశాడు.

విరాధుణ్ణి హతమార్చి శూర్పణఖ అనే రాక్షసకాంతను అదరగొట్టి ఖరదూషణాది రాక్షసులను దారుణ రణధరణిలో తెగనాడి కబంధుని ఖండించి వానర రాజైన వాలిని పడగొట్టి వాలి తమ్ముడైన సుగ్రీవుణ్ణి వానర రాజుగా చేశాడు.

రావణుడు మోసగించి ఎత్తుకపోయిన సీతను తెలిసికొని రమ్మని హనుమంతుని పంపించగా మారుతి వెళ్లి లంకలో ప్రవేశించి సీతను దర్శించి లంకను కాల్చి రావణునకు బుద్ధి చెప్పి కలత కలిగించి తిరిగివచ్చి సీతా వృత్తాంతమును రామునకు చెప్పెను. తరువాత – వానరరాజు సుగ్రీవుడు రప్పించిన వానరసైన్యముతో బయల్దేరి సముద్రముపై కొండలతో చెట్లతో ఆనకట్ట కట్టించి ఆవలకు చేరి లంకలో ఉన్న రాక్షసులను అనేకులను శ్రీరాముడు యమునింటికి అతిథులను చేశాడు. రావణకుంభకర్ణుల శిరస్సులను యుద్ధభూమికి బలిచేసి అగ్నిసాక్షిగా నిరపరాధియైన సీతను గైకొని రావణుని తమ్ముడయిన విభీషణుని లంకాధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేయించి తమ్మునితో భార్యతో సుగ్రీవాదులతో పుష్పక విమానారూఢుడై అయోధ్యకి వచ్చాడు.

శ్రీరాముడు రాజ్యం చేస్తుండగా లెక్కకు మిక్కిలి గంధర్వులు లోకాలకు చీకాకు కలిగించగా భరతుడు వారిని ఎదిరించి తెగనాడాడు. అలాగే శత్రుఘ్నుడు మధువనములో లవణుణ్ణి సంహరించి వాని స్థానం స్వాధీనం చేసుకున్నాడు.



ఇలాగు ఆ నలుగురన్నదమ్ములూ దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ చిరకాలం హాయిగా గడపి చివర కోసల రాజ్యమునందున్న అన్ని వర్గాల వారితో పరలోకానికి వెళ్లిపోయారు.

రాముని కొడుకులు కుశలవులు. లక్ష్మణుని కొడుకులు అంగదుడు, చంద్రసేనుడు. భరతుని సుతులు తక్షకుడు, పుష్కరుడు. శత్రుఘ్నుని తనయులు బాహుడు, శూరసేనుడు – ఈ ఎనమండుగురు ఎనిమిది దిక్కుల పరిపాలన ఎదురు లేకుండా చేశారు. వారిలో వంశకర్త కుశుడు.

కుశుని కొడుకు అతిథి. వానికి నిషధుడు, వానికి నలుడు, వానికి నభసుడు, నభసునకు పుండరీకుడు, వానికి క్షేమధ్వజుడు, వానికి దేవానీకుడు, వానికి అహీనుడు, వానికి పారియాత్రుడు, అతనికి దళుడు, దళునకు చలుడు, వానికి యుక్తుడు, వానికి వ్రజనాభుడు, వానికి శంఖుడు, వానికి సుషితాశ్వుడు, వానికి విశ్వసఖుడు, వానికి హిరణ్యనాభుడు – ఇలా ఆ వంశం పెరిగింది.

హిరణ్యనాభుడు యాజ్ఞవల్క్యునకు శిష్యుడై యోగవిద్యనేర్చి మహాత్ముడయ్యాడు. వాని కొడుకు పుణ్యుడు. అలాగ ధ్రువుడు, శీఘ్రుడు – వాని కొడుకు మరుడు. మరుడు యోగశక్తి అమితముగా కలవాడు. రాబోయే యుగములలో కూడా సూర్యవంశం పెరుగుతూ ఉండాలని తపోయోగముతో కలాపం అనే గ్రామంలో ఉన్నాడు.

ఆమరుని కొడుకు ప్రత్యాకుడు. వానికి సుగంధి, వానికి అమర్షణుడు, వానికి అహస్వంతుడు, వానికి విశ్వభవుడు, వానికి బృహద్బలుడు – కలిగాక ఆ బృహద్బలుడు భారతయుద్ధములో అర్జున పుత్రుడైన అభిమన్యునిచే పరలోక గతుడయ్యాడు అని ఇక్ష్వాకునందనుడైన శశాదుని వంశములో ప్రసిద్ధులైన రాజుల చరిత్ర చెప్పి పరాశరుడు ఇలా అన్నాడు.

ఇక్ష్వాకునందనుడు నిమి వెయ్యి సంవత్సరాలు పరిమితిగా ఒక యజ్ఞం చెయ్యడానికి సంకల్పించి కులగురువైన వసిష్ఠుని రప్పించి తన సంకల్పం చెప్పగా ఆ గురువు

రాజా! ఇంద్రుడు అయిదు వందల సంవత్సరాలపాటు చేసే యజ్ఞం చెయ్యడానికి నిశ్చయించి నన్ను హోతగా నిర్ణయించాడు. వెళ్లాలి కదా! అది పూర్తికాగానే వస్తాను. నీ యజ్ఞం చేయిస్తాను అని చెప్పాడు. నిమి ఏమీ అనలేదు. ఊరకున్నాడు. తన మాటకి రాజు సమ్మతించినట్టు భావించి వసిష్ఠుడు వెళ్లి యింద్రుని యజ్ఞం చేయించి అది పూర్తికాగా నిమి వద్దకు వచ్చాడు.

అప్పటికి నిమి గౌతముడు హోతగా యజ్ఞం చేస్తున్నాడు. వసిష్ఠుడు గౌతముణ్ణి కనులెర్రచేసి చూశాడు నేను కదా యీ వంశీయులకు గురువును. నీకు తెలియదా! హోతగా ఎందుకు ఒప్పుకున్నావు అన్నట్టు. తరువాత యజ్ఞశాలలోనికి వెళ్లి ఒకచోట నిద్రిస్తూన్న నిమిని చూసి నన్ను అలక్ష్యంచేసి, ఇంకొకనిచే యజ్ఞం చేయిస్తూన్న గురుద్రోహి. వీడు విదేహుడు అవుగాక అని శపించాడు. (శరీరంలేనివాడు). ఆ కేకకి రాజులేచి కోపించి నాయందు తప్పేమి? అదేదో చెప్పి శపించు – నిరపరాధులైన శిష్యులను నిగ్రహించి శపించే గురువెంత శాంతుడైనా ఆలాటి గురునియందు భక్తి యుక్తులు వదిలి శిష్యుడేమిచేసినా దోషం ఉండదు. కనుక నువ్వు కూడా విదేహుడవై నీచవృత్తిని ప్రవర్తించు! అని ప్రతి శాపం ఇచ్చాడు. శరీరం విడిచాడు. వసిష్ఠుడు శరీరం విడిచి తన తేజస్సును యోగవిద్యాబలముతో మిత్రావరుణుల యందు ఉంచాడు. కొన్నాళ్లకు ఊర్వశినిచూసి మోహించిన మిత్రావరుణుల తేజస్సు జారిపడి రూపం ధరించగా వసిష్ఠుని పునఃశరీర ధారణం అయింది.

నిమి శరీరమును గౌతమాది మునులు నూనెతో, గంధముతో పాకం చేసి ఆరంభించిన యజ్ఞమును పూర్తిచేశారు. ఇంద్రాది సురలు తమ తమ యజ్ఞభోగాలకు వచ్చి తీసుకొని సంతృప్తులై రాజు ఎక్కడ అని అడిగి జరిగినది తెలిసి తిరిగి శరీరం ఇవ్వడానికి మాటాడగా వారికి కనిపించక అక్కడే అల్లనల్లన తిరుగుతూన్న నిమి



సురలారా! మరి నాకా శరీరం వద్దు. అది (శరీరం) దుఃఖానికి మూలం – ఏలాటి దుఃఖానికిన్నీ కారణం శరీరమే. రోగాలకూ, భ్రాంతికీ, అశాంతికీ, అజ్ఞానానికీ ఆలవాలం శరీరం. అలాటి శరీరముతో మునుపు నేననుభవించిన దుఃఖాలు చాలు. మరి నాకు శరీరం అక్కర లేదు. నా కోరిక తీర్చండి.

అందరూ ఆదరించేట్టుగా లోకుల కన్నులలో ఒక రూపములో ఉండి, సమస్త వస్తువులనూ చూస్తూ ఉండేట్లు మీరంతా ఏక వాక్కుగా ఇవ్వండి –

ఇంద్రాదులు 'తథాస్తు' అని దివికి వెళ్లిపోయారు. నాటినుంచి నిమి అందరి కళ్లలో లీనుడై ఉంటున్నాడు. అందరూ కళ్లు మూయడం, తెరవడం, ప్రతివస్తువును పరిశీలించడం అనేది వారి కళ్లలో నిమి ఇమిడి ఉండడం వల్లనే ఏర్పడింది. ఇలా నిమి శాపం వల్ల విదేహుడు (దేహం లేనివాడు) అవడం మూలాన విదేహుడని లోకంలో వినవచ్చాడు.

రాజులేని రాష్ట్రంలో ప్రజలకు ఏవేవో బాధలు కలుగుతాయని గౌతమాది మహాశయులు నిమి కుడి భుజమును (మునపటి శరీరం భద్రపరచి ఉంచినారు కదా) మథించగా ఒక శిశువు పుట్టాడు. వానికి జనకుడని పేరు పెట్టారు. పట్టం కట్టారు. ఆ జనకుని ఏలుబడిలో ఉన్న దేశానికి విదేహ ప్రదేశం అని పేరు వచ్చింది.

జనకుని కొడుకు మిథిలుడు. ఆ రాజు నివాసంవల్ల నగరానికి మిథిల అనే పేరు ప్రసిద్ధమయింది. మిథిలుని వంశం క్రమంగా పెరిగింది. వారిలో సీరధ్వజుడనే వానికి చాలాకాలం సంతానం లేక చివరకు పుత్రకామేష్టి

చెయ్యాలని సంకల్పించి దానికి తగిన స్థలం నిర్ణయించి దున్నిస్తూ ఉండగా నాగటి చాలునుంచి ఒక శిశువు దర్శనమిచ్చింది.

ఆ శిశువు మహాలక్ష్మి అంశ. నాగటి చాలునకు 'సీత' అని పేరు – కనుక దానినుంచి ఉద్భవించిన ఆ బిడ్డకు సీరధ్వజుడు 'సీత' అని పేరు పెట్టాడు. ఈ రాజునకు 'జనకుడు' అనేది ప్రసిద్ధనామం.

ఆ జనకుని కొడుకు కుశధ్వజుడు. అసాధారణ బలపరాక్రమాలు కలవాడు. కాశీ నగరాధిపతియై పట్టం కట్టుకున్నాడు.

క్రమంగా కుశధ్వజునికి పుత్రపౌత్రప్రపౌత్రాదులతో వంశాభివృద్ధి కలిగింది. విశేషించి చెప్పవలసినది జనక వంశములో పుట్టినవారందరూ జనక నామధేయులై ప్రభుత్వం నడుపుతూ ఆత్మవిద్యాపరాయణులై ముక్తి పొందడం... ఇది పూర్వవంశరాజుల చరిత్ర – అని పరాశరుడు చెప్పగా విని చాల సంతోషం గురుదేవా! ఇక చంద్రవంశ రాజుల చరిత్ర సెలవియ్యవలసిందని మనవి అని అడిగాడు శిష్యుడు.

* * *

## 6

ఇలాగ మైత్రేయుడడగగా పరాశర మునీంద్రుడు చంద్రవంశరాజుల చరిత్ర చెప్పాడు.

అంతకూ సృష్టికర్తయైన నారాయణుని నాభి పద్మమునుంచి బ్రహ్మ పుట్టాడు. అతని మానసపుత్రుడు అత్రి. అత్రి కుడి కంటినుంచి బ్రహ్మాంశతో చంద్రుడు పుట్టాడు. చిన్నతనమందే చంద్రుడు చలించని మనసుతో దీక్షతో బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. ఆ తపస్సుకి మెచ్చి బ్రహ్మ లతలకు, వృక్షాలకు, ఓషధులకు, బ్రాహ్మణులకు, నక్షత్రాలకు, అత్యంతం స్రవించే



కిరణాలు గలుగునట్లు గాను అధిపతిగా వరం ఇచ్చాడు. తరువాత చంద్రుడు రాజసూయాది యజ్ఞాలుచేసి అశ్విని మొదలైన దక్షపుత్రికలను ఇరువది యేడుగురిని భార్యలుగా పరిగ్రహించాడు. సహజ సుందరాకారుడై సుధాకరుడైన ఆ చంద్రుడు వారితో వినోదిస్తూ ఆనందంగా పెరుగుతూన్నాడు. అలాటి వయసులో చంద్రుడు దేవగురువైన బృహస్పతి వద్ద శాస్త్రజ్ఞానం కోసం విద్యార్థిగా అతని యింటనే ఉన్నాడు. గురువునూ గురుపత్నిని సేవిస్తూ భక్తితో ప్రవర్తిస్తూ చదువు సాగిస్తున్నాడు. అలా ఉండగా ఒకనాడు గురువు ఇంద్రుడుచేసే యజ్ఞం చేయించడానికి అమరావతికి వెళ్లుతూ చంద్రా! నువ్వు యిక్కడే ఉండు. ఇంతకుమునుపు చెప్పిన పాఠాలు వల్లె వేస్తూ ఉండు అని చెప్పి వెళ్లిపోయాడు. చంద్రుడు అలాగే ఉండి గురుపత్నికి ఆవశ్యకమైన సహాయం చేస్తూ చదువుతూ ఉన్నాడు. గురుపత్నికి చంద్రుని రూపం, అందచందాలూ మానసికంగా మార్పు కలిగించాయి. ఆ సుందరి చక్కగా అలంకరించుకుని గోముగా నడుస్తూ చిరునవ్వు చూపులు తూపులుగా చంద్రునకు దగ్గరగా వచ్చి ఏవేవో చేస్తూ తిరగనారంభించింది. గురుదార తార అలా సవిలాసంగా తిరగడం, ఏవేవో సన్నసన్నగా అనడం చంద్రుడికి మనో వికారం కలిగించాయి. తార అప్పుడప్పుడు వచ్చి ఏవో నవ్వు మాటలాడడం, నవ్వించడం –

క్రమంగా కలిసి ఆనందించడంలోకి దిగింది తారాచంద్రుల విలాస వికారచేష్ట.

పరకాంత – పైగా గురుపత్ని – అనే ఆలోచన కూడా లేక చంద్రుడు తార విలాసాలకి లొంగిపోయి ప్రియురాలిని చేసుకున్నాడు. అడ్డూ ఆపు లేకుండా కామతంత్రానికి ప్రత్యక్షమూర్తులుగా ప్రవర్తించసాగారు తారాచంద్రులు.

అలా గడుస్తూ ఉండగా ఒకనాడు చంద్రుడు తారతో అన్నాడు. మన చేష్టలు గురువుకి తెలిస్తే మన బ్రతుకులు నడివీధి మెతుకులవుతాయి.

అప్పుడే అటూ ఇటూ విసవిసలూ, గుసగుసలూ వినవస్తున్నాయి. కాబట్టి మనం ఇక్కడి నుంచి మరెక్కడికైనా పోవడం మంచిది.

చంద్రుని మాట విని తార అన్నది – చంద్రా! మన్మథుడు నన్ను నీదానినిగా చేశాడు. ఇంకా నాకిక్కడ భర్త ఎవరు? నాకు యిల్లూ వాకిలీ సంసారం – ఏలాటి ఆశా లేదు. నీ గాఢాలింగనమే నా బ్రతుకు – పద! నువ్వెక్కడికంటే అక్కడికి నీ వెంట వస్తాను.

తార మాటలు విని చంద్రుడు సరే – అని తారను తన నివాసానికి తీసుకుపోయాడు. ఏలాటి లోపం లేని తీరున భోగాలనుభవిస్తూ ఉన్నాడు.

దేవగురువు ఇంద్రుని యజ్ఞం పూర్తిచేయించి అందరిచే సంతృప్తిగా సంభావన లందుకుని నివాసానికి వచ్చాడు. ఇల్లు చిలుక లేని పంజరంలాగా ఉంది. తార చంద్రునితో వెళ్లిపోయిందని తెలిసి విచారించి – కోపించి వెళ్లి ఇంద్రుడితో చెప్పాడు. ఇంద్రుడు ఆశ్చర్యాగ్రహాలకు లోనై ఒకింతసేపు ఆలోచించి మునులను కొందరిని ఆహ్వానించాడు. చంద్రుని నీచ కార్యం వారికి చెప్పి – వెళ్లండి నయాన భయాన చెప్పి తారను అప్పగించేట్టు చేయండి. కాదంటాడా కోపించి అదలించి తారను తీసుకురండి! అని పంపించాడు.

మునులు చంద్రుని వద్దకు పోయి తగిన సత్కారం, సంభాషణ అయిన తరువాత – ఒకింత నిష్ఠూర ధోరణితో బోధిస్తూన్నట్టు అన్నారు.

రోహిణీవల్లభా! ఎప్పటికపుడు శృంగార విలాసాలను, కువల యానందమును కలిగించే చల్లని గుణములను, సమయానుసారముగా దేవతలకు మేలు కలిగించే సద్బుద్ధి, గురువునందుండవలసిన భక్తి విడిచి గురుదారను తారను ఎత్తుకురావడం పాపకార్యం కదా! నువ్వు చేసిన యీ తప్పుపని తెలిసి యింద్రాదులు నీపై కోపమనస్కులై ఉన్నారు. ఎందుకీ రగడ! తారను విడిచిపెట్టు! నీకు లోకంలో వచ్చిన అపకీర్తిని మాపుకో!...



మునుల మాటలు విని చంద్రుడు 'నేను దేవమంత్రి భార్యను ఎత్తుకు వచ్చానని నన్ను నిందిస్తూ ఇంద్రుడు మిమ్ము పంపించాడా. ఆశ్చర్యం. తన పనులు ఎవరికీ తెలియవా? అలాటి ఇంద్రుడు నాకే బుద్ధి చెప్పడమా? గౌతమముని భార్యకై ఆశపడి వెళ్లి కోడికూత కూసి మునిని మోసగించి ఆయన భార్యను కలిసినవాడు చివరకు ముని శాపానికి గురియై ముడుచుకుపోయిన శరీరముతో ఇల్లుచేరిన ప్రబుద్ధుడు తగుమనిషిలాగా యీనాడు నాకు బుద్ధి చెప్తున్నాడా? అతడిచేష్టలు లోకానికి తెలియవా? వెళ్లండి. తారను విడిచేది లేదు – అని పరిహాసపు మాటలాడగా చేసేది లేక మునులు సిగ్గుపడి తిరిగి యింద్రుని వద్దకు వచ్చి చంద్రుడన్న మాటలు చెప్పారు. ఇంద్రుడు కోపించి దేవగణాలతో బృహస్పతితో పయనించి సత్యలోకానికి వెళ్లి తారాశశాంక వృత్తాంతం చెప్పారు. అది విని బ్రహ్మ కోపించి ఆలోచించి అన్నివిధాలా పెద్దలైన మునులను కొందరిని ప్రేరేపించి మీరు వెళ్లి నేను చెప్పానని చంద్రునకు చెప్పి తారను తీసుకురండి అన్నాడు. వారు వెళ్లి చంద్రునకు బ్రహ్మమాటలు చెప్పి గురుపత్నిని మాకు అప్పగించు, తీసుకువెళ్లి ఆయనకు అప్పగిస్తామన్నారు. వారి మాటలు విని చంద్రుడు చిరునవ్వు నవ్వి –

బ్రహ్మమాటలుగా మీనోట విన్నాను. మంచిదే. కాని తారను విడిచి పెట్టడం జరగనిపని. సాధించాలని అంతా కలిసి పోరాటానికి దిగుతారా? అదేదో కానీయండి చూస్తాను....

అని గంభీరంగా అనగా మునులు వెనుదిరిగి బ్రహ్మవద్దకు పోయి చంద్రుని మాటలు చెప్పారు. విన్నాడు బ్రహ్మ. ఏ ఉపాయము తోచక కిమ్మనక ఊరకున్నాడు.

అపుడంగీరసాదులు, మునులు ఆలోచించి ఇంద్రుణ్ణీ బృహస్పతిని ముందుంచుకుని కైలాసానికి వెళ్లారు. చంద్రుడు చేసిన దుశ్చర్య, తార

ప్రవర్తన శంకరునకు చెప్పారు. వారు చెప్పినది విని ఆగ్రహోదగ్రుడై దేవసైన్యముతో చంద్రునిపై దాడికి వెళ్లాడు. శంకరుని రాక తెలిసి చంద్రుడు రోషభీషణాకారుడై తన సైన్యమును సమకూర్చుకుని ఎదిరించాడు.

ఇక చెప్పేదేముంది? రెండు పక్షాలకూ యుద్ధం మహోద్ధృతంగా జరిగింది.

ఆ సమయంలో శుక్రుడు గురువుకి శత్రువు కనుక శుంభనిశుంభాది రాక్షసులను వారివారి సైన్యాలతో చంద్రుడికి తోడుగా పంపాడు. చంద్రుడు మరీ బలమూ ఉత్సాహమూ కలవాడై శంకరునితో పోరాడుతూన్న సమయంలో బ్రహ్మ వచ్చి వారి యుద్ధమును ఆపుతూ చంద్రుణ్ణి ఒకింత దూరముగా తీసుకుని వెళ్లి హితబోధ చేశాడు. చల్లచల్లగా నచ్చచెప్పాడు. ఒప్పించాడు. తారను యీడ్చుకువచ్చి గురువుకు అప్పగించాడు. శివుడు శాంతించి బ్రహ్మను ప్రశంసించాడు.

అప్పటికి తార గర్భవతి. బృహస్పతి గ్రహించి నీ గర్భాన ఉన్న శిశువు నా వల్ల కలిగినవాడు కాదు. వానిని ఎక్కడో ప్రసవించి విడిచిరా! అని తారను ఆజ్ఞాపించాడు. కాదనలేక తార వెళ్లి ఒక తోటలో ప్రసవించి శిశువును అక్కడ విడిచి వచ్చింది. ఆ శిశువు దివ్యతేజోవిలాసుడై మోహనాకారముతో ఉన్నాడు. వానినిచూచి వీడు నా కొడుకే. కాదు నా కొడుకు అని గురువు, చంద్రుడు కలహించగా – దేవతలు మునులూ వచ్చి కలహం వారించి తారను ఒకింత దూరంగా తీసుకువెళ్లి యీ బిడ్డడు గురుపుత్రుడా? శశికొడుకా? అని అడిగారు. ఆమె చెప్పడానికి సిగ్గుపడి తలవంచుకుని నిల్చుంది. అప్పుడు బ్రహ్మ ఒకింత దూరంగా తారను తీసుకు వెళ్లి బుజ్జగించి అడిగాడు.



చెప్పవమ్మా! సిగ్గెందుకూ? ఎవ్వరూ ఏమీ అనరు చెప్పు. ఈ బిడ్డడు చంద్రుని కొడుకా? గురుపుత్రుడా? చంద్రుడివైపు గురునివైపు చూస్తూ సందేహించకు –

బ్రహ్మమాటలకు తార తలవంచుకుని చంద్రనందనుడే అని అల్లనల్లన అన్నది. బ్రహ్మ గురునితో చెప్పాడు. సరే పోనీ! అని కొడుకుని విడిచి గురువు తారను తీసుకుని వెళ్లిపోయాడు. శివబ్రహ్మాదులు తమతమ నివాసాలకు వెళ్లిపోయారు. చంద్రుడా శిశువును ఆదరంగా ఎత్తుకుని చెక్కులు ముద్దాడి ఎత్తుకుని వెళ్లి తన భార్యయైన రోహిణికి అందించాడు.

'బుధుడు' అని పేరు పెట్టారు. రోహిణి ఆ బిడ్డణ్ణి కన్నతల్లి కన్న మిక్కిలి ప్రేమతో లాలించి పెంచసాగింది. ఆ పెంపకం చూసి చంద్రుడెంతో సంతోషించేవాడు.

అలా బుధుడు పెరిగి పెద్దవాడై తపస్సుచేసి అధికతేజోమూర్తియై గ్రహమండలిలో ఒకడయ్యాడు. మనుపుత్రియైన ఇళయందు కొడుకును కన్నాడు. ఆ బిడ్డ పేరు పురూరవుడు.

పురూరవుడు ఆదిశేషుని, ఆదివరాహమును, అష్టదిగ్గజాలనూ భూభారం వహించడం విషయంలో తక్కువచేస్తాడు. దానంలో కల్పవృక్షాలనూ చింతామణినీ సిగ్గు పరుస్తాడు. అందచందాలలో జయంతుణ్ణీ మన్మథుణ్ణీ చంద్రుణ్ణీ కించపరుస్తాడు. ధైర్యములో మేరు మందర పర్వతాలను నగుబాటు చేస్తాడు. సప్తద్వీపాలనూ తన ఆజ్ఞలో ఉంచుకుని తన చరిత్ర భావితరాలకు ఆదర్శముగా భూపరిపాలన చేస్తూ ఉన్నాడు.

ఒకనాడు ఉద్యానవనములో విహరిస్తూ ఒక గున్నమామిడి చెట్టు క్రింద విశ్రాంతిగా కూర్చుండగా ఒకింతసేపటికి చెలికత్తెలతో దివినుంచి

ఊర్వశి వచ్చి ఒకింత దగ్గరగా ఉండి సవిలాసంగా చూస్తూ ఉండగా చూచి పురూరవుడన్నాడు.

పద్మాక్షీ! ఎవరునువ్వు? నీ రూపురేఖలు దివ్యస్ఫూర్తితో ఉన్నాయి. నీ తీరు వేశ్యవని చెబుతూంది.

అని అనగా ఊర్వశి పురూరవుని అందచందాలకు మురిసి, కామవికారానికి లోనై బదులు పలికింది.

రాజా! నా పేరు ఊర్వశి. దేవకాంతను. భూమిపై కొన్నాళ్లు ఉండవలసి వచ్చింది, ఇలా వచ్చాను... నీకోసమే...

ఊర్వశిమాటలు విని పురూరవుడు కూడ మదనవశుడయ్యాడు. సుందరీ! మదనశరబాధ దుర్భరం అవుతూంది, నన్ను ఆనందపరచు! అని అనగా ఒకింత దగ్గరగా వచ్చి

రాజా! నా మాట మన్నించు. నా గొర్రెపిల్లలను రెండిటిని నువ్వు భద్రంగా పోషిస్తూ ఉండాలి. నీవల్ల వాటికి ఏ అపాయమూ రాకూడదు. నువ్వు దిగంబరుడవై నాకంటపడితే ఆ క్షణమే నిన్ను విడిచిపోతాను. నాకు ఆహారం నెయ్యి. దానికి లోపం రాకూడదు – ఇవి నా ప్రమాణ వాక్కులు...

నీ మాట దాటక ప్రవర్తిస్తాను అని పురూరవుడు మాటయిచ్చి ఊర్వశిని చేరదీసుకున్నాడు. ఇద్దరూ ఒకటై భోగానుభవముతో పరమానంద మూర్తులై ఉన్నారు. ఊర్వశి సురలోకం విడిచి నరలోకంలో ఉండడం వల్ల సురగణం భోగభాగ్యాలకు ఒకింత కొరత కలిగింది. విశ్వావసుడనే గంధర్వుడు ఆలోచించి వారికెడబాటు కలిగించాలని ఒకనాటి రాత్రి వారు ఏకాంతస్థల మందుండగా ఒక గొర్రెను ఎత్తుకుపోయాడు. ఆ గొర్రె పైనుంచి వినేవారికి విసువు కలిగేట్టు అరవ నారంభించింది. ఆ అరుపు విని ఊర్వశి రాజా!



ఎవడో దొంగ నా గొర్రె నెత్తుకపోయాడు. వెళ్లి తీసుకురా! అని అన్నది. పురూరవుడు దాని మాట వినిపించుకోలేదు. భోగపరుడై ఉన్నాడు. ఆ సమయంలో వస్త్రం విడిచి వెళ్లితే ఈ దేవవేశ్య తనను విడిచి వెళ్లిపోతుందని కలత. అంతలో మరొక గంధర్వుడు వచ్చి రెండవ గొర్రెను కూడా ఎత్తుకు పోయాడు. అది పైనుంచి విచారసూచకంగా అరవసాగింది. ఆ అరపు విని ఊర్వశి కోపించి రాజుతో అన్నది.

రాజా! నా కొడుకుల్ని దుర్మార్గులు ఎత్తుకుపోతూండగా అరిచిన అరుపు వినలేదా? కదలక మెదలక కూర్చున్నావు. ఇది నీచుల పని. నిన్ను కలిసి అనాథనయ్యాను. అని నోటికి వచ్చినట్టు తిట్టసాగింది. దాని పరుష వాక్కులకు కోపించి పురూరవుడు లేచి కత్తిని చేబూని దిగ్గన పైకెగిరి దుర్మార్గా! ఆగరా! అని అరిచాడు. చీకటి కనక తాను కట్టుబట్ట లేనివాడినని ఊర్వశి గ్రహించలేదని ఆ తొందరపాటున వెళ్లబోగా గంధర్వులు వెలుగు కలిగించారు. ఊర్వశి చూసి మొదట చేసిన శపథం ప్రకారం రాజును విడిచి దివికి వెళ్లిపోయింది. గంధర్వులా గొర్రెపిల్లలను క్రిందికి పడవేశారు. రాజు వాటిని తీసుకుని తిరిగి వచ్చాడు. ఊర్వశి కనిపించక పోవడముచే వెర్రివాడిలాగా మతి చెడి ఏమేమో అంటూ తిరగసాగాడు.

అలా తిరుగుతూ క్రమంగా కురుక్షేత్రం చేరి అక్కడ సరస్సులో చెలికత్తెలతో ఉన్న ఊర్వశిని చూశాడు. పరమానంద భరితుడై దరిజేరి కౌగలించుకున్నాడు. ఆవేశముతో అన్నాడు.

పువ్వుబోణీ! పువ్వు తావిలాగా కలిసి మనం సుఖంగా కాలం గడుపుతూ ఉండగా నువ్వు నన్ను విడిచిపోవడం తగునా? నన్నెడబాసిన నాటినుంచి నేను మతిచెడి ఉన్మత్త వేషముతో ఇలా తిరుగుతున్నాను. నా అదృష్టవశాత్తు కనిపించావు. నీ సంబంధముతో నన్ను కాపాడు.

పురూరవుడి మాటలు విని ఊర్వశి జాలిపడి అన్నది. రాజా! ఎదురులేక యీ జగమునంతనూ ఏలే రాజువు నీవు. ఇలా దీనావస్థకి చిక్కావంటే దైవసంకల్పం అనుకోవాలి – విచారించకు! అని ఆ రాత్రి పురూరవుణ్ణి సంతోషపెట్టింది. తెల్లవారింది. లేచి రాజుతో అన్నది.

మహారాజా! నీ అనురాగం ఫలముగా గర్భవతినైయున్నాను. అచిరకాలములో సుపుత్రుడు పుట్టుతాడు. ఆ సమయానికి నీ రాక కోరుతున్నాను. దయచేస్తావు కదా! అని అనగా సరే! అని రాజు నగరానికి వెళ్లిపోయాడు. ఊర్వశి తనకూ పురూరవునకూ గలిగిన సంబంధం – గంధర్వులు ఎడబాటు కలిగించడం వివరించి చెప్పింది. చెలికత్తెలు అంతా విని చెలీ! ఆ రాజు రెండవ మన్మథుడు. మా మనసులు కూడా ఆ మోహనాంగుని చూడగా ఊగులాడాయి. నువ్వు ఆ సుందరాంగుని విడువనేల? అతనితోనే మరి కొంతకాలం ఉండు – అని ప్రోత్సహించారు. వారి మాటలకు ఊర్వశి ముదమంది రాజుతో ఆనందంగా కాలం గడపసాగింది.

సంవత్సరం కాగానే ఊర్వశి ఒక కొడుకును కన్నది. అలా ఉండగా మరొక అయిదుగురు కొడుకులను కనే గర్భవతి అయింది.

అపుడు విశ్వావసుడు కొందరు గంధర్వులతో పురూరవుని వద్దకు వచ్చి రాజా! నీకూ ఊర్వశికీ ఎడబాటు కలిగించి ఎన్నో ఇక్కట్లు కలిగించాము. అవన్నీ మరిచిపో. కోరుకో వరం. సంతోషంగా ఇస్తాము – అని అనగా పురూరవుడు కోరాడు.

శత్రుభీకరమైన పరాక్రమం, రథ గజ తురగాది సమృద్ధ రాజసంపద, ఇంద్రియాలను జయించే శక్తి, మిత్రులనూ, బంధువులనూ, దీనులనూ ఆదరంగా పోషించే ఆర్థికస్థితి, ఊర్వశితో సహజీవనసౌఖ్యం – ఇలా కోరాడు. విశ్వావసువు తథాస్తు అని ఒక అగ్ని కుండిక ఇచ్చి



రాజా! ఇదిగో దీనియందున్న అగ్నిని మూడు భాగాలుచేసి యజ్ఞం చేస్తే నీ కోరికలన్నీ నెరవేరుతాయి అని చెప్పి వెళ్లిపోయారు. పురూరవుడు అగ్ని కుండిక ప్రక్కనుంచుకుని తనలో తాను విచారిస్తూ అనుకున్నాడు.

వరం కోరుకో! అని గంధర్వులనగా యీ అగ్ని కుండిక అడిగి తీసుకున్నానే గాని ఊర్వశిని నాకివ్వండి అని అడగలేకపోయానే, నా ప్రియత్వం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు అయింది. ఇక యజ్ఞాలెక్కడ? ఊర్వశి యెక్కడ! ఏమి బ్రతుకు! అనుకున్నాడు. ఆ అగ్ని కుంపటిని అడవిలో ఒకచోట విడిచి యింటికి పోయి అర్ధరాత్రియందు విచారిస్తూ అనుకున్నాడు.

ఔరా! ఎంత తెలివి తక్కువ తనం! గంధర్వులు ఇచ్చిన అగ్నికుండిక అడవిలో విడిచి వచ్చానే – పోయి అది తెచ్చి యజ్ఞం పూర్తి చేస్తాను.

అని అడవికి వెళ్లి చూశాడు. తాను విడిచిన చోట అగ్ని కుండిక కనిపించ లేదు. ఇటూ అటూ వెదకి చూడగా ఒకచోట ఒక జమ్మిచెట్టు దానిలో ఒక రావిమొక్క కనిపించాయి. ఓ! ఆ అగ్ని యీ చెట్టుగా మారి ఉంటుంది. అని మునులను రప్పించి వేదమాతృకమైన మంత్రం ఉచ్చరిస్తూ ఆ చెట్టును నరకడానికి సంసిద్ధుడయ్యాడు. ఆ పనికాగా ఆ మంత్రాక్షరాల సంఖ్యతో సరియైన అంగుళాల నిడుపున అరణి (మథించే కర్ర) ని కల్పించి అగ్నిని సృష్టించి అందరూ అభినుతించే రీతిగా యజ్ఞం నెరవేర్చాడు. దానిఫలముగా ఊర్వశి తనది అయింది. అలా కోర్కె తీర్చుకుని అన్ని లోకాలలో ఊర్వశితో విహరిస్తూ వచ్చి, రాజ్యం నీతియుక్తంగా జనరంజకంగా పాలిస్తూ ఉన్నాడు.

ఆదికాలమందు యజ్ఞాదుల కుపయోగించే వైవస్వతాగ్ని కాలాంతర మందు ఆహవనీయం, గార్హపత్యం, దక్షిణాగ్ని అని మూడు విధములయింది.

కొంతకాలానికి పురూరవునకు ఊర్వశియందు ఆయువు, ధీమంతుడు, అమానసుడు, విశ్వావసుడు, శతాయువు, చిరాయువు అనే కొడుకులు ఆర్గురు పుట్టారు.

అమానసుని కొడుకు భీమసేనుడు. వాని కొడుకు కౌంచనుడు. కౌంచనుని కొడుకు సుహోత్రుడు. వాని కొడుకు జహ్నుడు –

జహ్నుడు రాజులలో ఋషిగా ప్రసిద్ధుడు. ఆ రాజర్షి ఒకపుడు యజ్ఞం చేస్తూ ఉండగా గంగానది పొంగి ఆశ్రమమును కడిగి వేసింది. జహ్నుడు కోపించి యజ్ఞపురుషుణ్ణి తనలోనికి ఆహ్వానించి ఆ శక్తితో గంగ ఒక్క చుక్కైనా లేకుండా మింగివేశాడు. అపుడు ఋషులూ సురలూ బ్రతిమాలగా కరుణించి గంగాజలమును తన చేతినుంచి విడిచిపెట్టాడు. ఆ విధంగా గంగకు 'జాహ్నవి' అనే సార్థకనామం కలిగింది. జహ్నుడు యజ్ఞం నిరాటంకంగా పూర్తిచేశాడు. అతని కొడుకు జనకుడు. అతని కొడుకు బలాశ్వుడు. వాని కొడుకు కుశుడు, కుశునకు నలుగురు కొడుకులు.

కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తుడు, రజోవసువు – అని వారిపేర్లు.

వారిలో కుశనాభుడు ఇంద్రునితో సాటియైన కొడుకు కలగాలని అడవికి పోయి తపస్సుచెయ్యగా ఇంద్రుడు ప్రత్యక్షమై అనుగ్రహించి కొడుకై పుట్టాడు. (ఇంద్రాంశతో కొడుకు పుట్టాడు) వానిపేరు గాధి –

గాధి నీతినియమాలతో చక్కగా పరిపాలనచేస్తూ సంతతిలేక చింతిస్తూ అందరు దేవతలను పేరుపేరునా ఆరాధించగా చివరకు ఒక కూతురు పుట్టింది. ఆ బాలపేరు సత్యవతి.

ఆ కన్యను పెండ్లాడగోరి భృగు వంశీయుడు రుచికుడనే ముని వచ్చి గాధినడిగాడు. గాధి యీ ముసలి తపసికి పెళ్లా? అని నవ్వాడు – రుచికుడు వదలలేదు. కన్యాశుల్కం ఏమికావాలో కోరు! తెచ్చియిస్తాను. అని హెచ్చరించినట్లనగా సరే తెల్లని శరీరం, నీలి వన్నె చెవులు, వాయువేగం గాలి గమనం కల గుర్రాలను వెయ్యింటిని తెచ్చియిస్తే నా కూతురినిచ్చి పెళ్లి చేస్తానన్నాడు రాజు. రుచికుడు వెళ్లాడు. తురంగతీర్థం అనే క్షేత్రమందు వరుణుని ఆహ్వానించి తపస్సు చేసి వెయ్యి గుర్రాలనూ పొంది తోలుకువచ్చి రాజుకు ఇచ్చాడు. రాజు మరి పెదవి కదల్చలేక అనిన ప్రకారం కూతుర్ని రుచికునకిచ్చి పెళ్లి చేశాడు. రుచికుడు తపస్వియే అయి పెండ్లి చేసుకున్నా గృహస్థ ధర్మం సుష్ఠుగా నిర్వర్తిస్తూ, తపశ్చర్య జరుపుతూ భార్యతో హాయిగా ఉన్నాడు.



కొన్నాళ్లయ్యాక సంతాన కాంక్షతో ఒక మంత్రం మనసా ఉచ్చరిస్తూ చరువును ఋతుసమయంలో భార్యకు ఇవ్వడానికి సంసిద్ధుడయ్యాడు. అపుడు సత్యవతి భర్తకి నమస్కరించి – నా తల్లి కొడుకులేక కుమిలిపోతూంది. నాకు తమ్ముడు కలిగేట్టు ఆమెకి కూడా కొంత చరువు ఇవ్వవలసిందిగా ప్రార్థన. (అగ్నిలో హోమం చెయ్యడానికి పక్వం చేసిన అన్నం 'చరువు')

భార్య ప్రార్థన విని సరే – ఇస్తానన్నాడు రుచికుడు. ఆమెను రప్పించాడు. బ్రాహ్మణ క్షత్రియ సంప్రదాయానుసారముగా ఆయా మంత్రాలతో చరువును కల్పించి ఇద్దరికీ విభజించి యిచ్చి సమిత్కుశ ఫలాలకోసం అడవికి వెళ్లాడు. అపుడు తల్లి కూతురితో అన్నది.

లోకంలో అందరూ తమ కొడుకులు మంచివారుగా ఉండాలని కోరుకుంటారు. అలాగే నీ భర్త నీకు ఇచ్చిన ఆ పాయసం అలాటిది. నాకు ఇచ్చినది చూడు అలా కనిపించలేదు.

తన సోదరుడు సకల గుణవంతుడుగా ఉండాలని అక్కలు కోరడం సముచితం. కనుక నీకు నీ భర్త యిచ్చిన చరువు నేను, నాకిచ్చినది నువ్వా

మార్చుకుని ఆరగించాలని నామాట. అదికాక బ్రాహ్మణుడు బలపరాక్రమాలు కలవాడై ఉండడం ఆ జాతికి తగనిది. పైగా నిరర్థకం. క్షత్రియుడు అలా ఉండడం అవసరం. నాకు అలాటి కొడుకు కలిగితే రాజ్యం నిష్కంటకంగా పాలించే వాడవుతాడు. అది నీకు మేలే కదా!

తల్లి మాటలకి సత్యవతి మరేమీ మారు పలకలేదు. చరువు ఇద్దరూ మార్చుకుని ఆరగించారు. ఇళ్లకి వెళ్లిపోయారు.

అడవినుంచి రుచికుడు వచ్చి గ్రహించి ఏమి ఇలా చేశావు? చరువు మార్చుకుని నువ్వూ మీ అమ్మా ఆరగించారా? నీ గర్భం రుద్రమూర్తిగా పెరుగుతూంది. నేను చెప్పినదొకటి – నువ్వు చేసినదొకటి. క్షత్రియ కర్మలు చేస్తూ శస్త్రాస్త్రపాణియై మహానుభావుడయ్యే కొడుకు నీకు; వేదాంత వేది, తపశ్శాలి, బ్రాహ్మణాచార వర్తనుడు అయిన కొడుకు మీ తల్లికి కల్గుతారు.

ఇలాగ ముని అనిన మాటలు సత్యవతి హృదయాన నిప్పు మంటలాగా రగిలి మండించగా ఆ సాధ్వి భరించలేక అతని పాదాలపైపడి మహాత్మా! తెలిసీ తెలియని బుద్ధితో చేసిన తప్పు. మీ మాటదాటి ప్రవర్తించాను. నా మనవి. మీ కొడుకునందు అలాటి క్షత్రియగుణాలు లేని రీతిగాను, అవి మీ మనుమని యందుండేట్టుగాను అనుగ్రహించండి! అని ప్రార్థించగా రుచికుడు తథాస్తు! అన్నాడు.

కొంతకాలానికి సత్యవతి కొడుకును కన్నది. ఆ బిడ్డనిపేరు జమదగ్ని.

ఆమెతల్లి కన్నకొడుకు విశ్వామిత్రుడు.

తరువాత రుచికుడు తపోవనానికి వెళ్లిపోయాడు. సత్యవతి కౌశికి అనే నదిగా మారిపోయింది. జమదగ్ని ఇక్ష్వాకు వంశీయుడైన రేణువు అనే రాజు కూతురిని రేణుక అనే పేరుగల కన్యకను పత్నిగా పరిగ్రహించాడు.



ఆ దంపతులకు దుష్ట క్షత్రియ కాలరుద్రుడుగా విష్ణువు అంశతో ఒక కొడుకు కలిగాడు. పేరు పరశురాముడు.

విశ్వామిత్రునకు దేవతల కోరిక ననుసరించి శునశ్శేపుడనువాడు దత్తపుత్రుడయ్యాడు. ఆ శునశ్శేపుని కొడుకు దేవరాతుడు. విశ్వామిత్రుని కొడుకులు మధుచ్ఛంద కృత దేవాష్టక హారీతులు. వారు మహర్షి కన్యకలను పరిగ్రహించారు – అని చెప్పి పరాశరుడు తదుపరి ఇలా చెప్పాడు.

పురూరవుని పెద్దకొడుకు ఆయువు. వాని భార్య రాహుపుత్రి. ఆ దంపతులకు ఐదుగురు కొడుకులు కలిగారు.

నహుష క్షత్ర వృద్ధరంభ రజ్య నేనస్సులని వారిపేర్లు. వారిలో నేనుని కొడుకు సుహోత్రుడు. వాని కొడుకులు కృత్సమద, కాశ్య, కాశులు అనేవారు. రాజసూయాది యజ్ఞాలు సంతృప్తిగా చేశారు. వారిలో కృత్సమదుని కొడుకు శౌనకుడు. నాలుగు వర్ణాల వారితో చక్కగా నడిపించిన వాడు. కాశ్యుని కొడుకు దీర్ఘతపుడు – తపోనిధులలో ముందు చెప్పదగిన వాడు. అతని సుతుడు ధన్వంతరి. ధన్వంతరి కొడుకు కేతుమంతుడు. అతని సుతుడు దివోదాసుడు. అతడు కాశీపతియై చల్లని పరిపాలన సాగించాడు. ఆ రాజు కొడుకు త్రివర్ధనుడు.

ఆ త్రివర్ధనుడు కువలయం అనే పేరుగల గుర్రమునెక్కి పుడమిపై తిరుగుతూ ఆ విధంగా కువలయాశ్వుడు అనే పేరుతో ప్రసిద్ధుడయాడు.

అలాగే అతని తండ్రి వాత్సల్యముచే 'వత్సా! వత్సా!' అని పిలుస్తూ ఉండడం వల్ల, 'వత్సుడు' అనే పేర పెరిగి అతని దేశం వత్సదేశం అనే పేరు పొందింది. శత్రురాజులను నిర్మూలించడం వల్ల ఋతుధ్వజుడని – ఆ రాజుకి సార్థక నామాలు కలిగాయి.

ఆ కువలయాశ్వునకు మదాలస అనే పరమ పతివ్రతయైన భార్యయందు కలిగిన కొమరుడు అలర్కుడు.

అలర్కుడు లెక్కకు మీరిన సంవత్సరాల కాలం సకల జనానం దాశ్చర్యకరముగా నేల నేలాడు. ఆ కాలంలో అలర్కునకు సాటిగా చెప్పదగిన పరిపాలకుడు లేడు. ఆ అలర్కుని వంశం పుత్రపౌత్ర ప్రపౌత్రాదులతో పెరిగింది. తరువాతి చరిత్ర.

పురూరవుని మనుమడు రజి. వానికి లెక్కకు మిక్కిలిగా కొడుకులు కలిగారు. పరాక్రమ ప్రాభవానికి వారికి సాటి ఎవ్వరూ లేరు. పోరాడవలసి వస్తే ఇంద్రుణ్ణి కూడా రణరంగంలో మూడు చెరువుల నీరు తాగించే ప్రతాపశాలురు.

ఆ కాలంలో ఒకనాడు దేవదానవులు బ్రహ్మవద్దకు వెళ్లి తాతా! మాకు యుద్ధం జరిగితే గెలుపెవరిది? అని అడగగా పురూరవుని మనుమడు రజి ఎవరి పక్షాన ఉంటే గెలుపు వారిది – అని బ్రహ్మచెప్పాడు.

వెంటనే దానవులు తొందరగా రజి వద్దకు వచ్చి తమ పక్షాన ఉండి సహాయం చెయ్యవలసిందిగా కోరారు.

సరే, మీకు సహాయం చేశాననుకోండి. మీకు గెలుపు కలిగితే నన్ను మీరు ఇంద్రుణ్ణి చేస్తారా? అని రజి అడిగాడు.

మాకందరికీ పెద్ద – సమ్మాన్యుడు. అతడే మాకు ఇంద్రుడుగా ఉండదగిన వాడు. ఇపుడు మేము యుద్ధము చేసేది అతనిని ఇంద్రుణ్ణి చెయ్యాలనే. మరి నిన్ను చెయ్యడం ఎలాగ? అది కాదు. అని దానవులు వెళ్లిపోయారు. కొంతసేపటికి దేవతలు వచ్చి దానవుల్లాగే రజిని కోరారు. రజి అసురులతో అన్నట్టే సురలను అడిగాడు. దేవతలు ఒక నిమిషం ఆలోచించారు. అసుర బాధ తమకి లేకపోవడం ముఖ్య కార్యం. సరే అని



రజికి ఇంద్రపదవి ఇవ్వడానికి అంగీకరించారు. రజి దేవగణాలతో బయల్దేరి యుద్ధానికి వెళ్లి అసురులను జయించి సురలకు సంతోషకరుడయ్యాడు. అపుడు ఇంద్రుడు వచ్చి నమస్కరించి అన్నాడు.

ఆపదలో నున్న వానిని కాపాడిన వాడు, కన్నతండ్రి సమానులు. నీవు మమ్ము అసురుల బారినుంచి కాపాడిన వాడవు కనుక నా తండ్రి వంటి వాడవు. నేను నీకు కుమారుడను. రాజేంద్రా! మానవలోకంలో ఇంద్రుడు వయ్యావు నీకు వేరే యింద్రపదవి యెందుకు. కరుణించి నన్ను నాచోట ఉంచు! కొడుకు అడిగినది తండ్రి యివ్వాలి కదా!...

ఇంద్రునిమాటలు విని రజి – పగవాడైనా వచ్చి ప్రార్థిస్తే వాడు కోరినది యిచ్చి సంతోషంగా పంపడం ధర్మం. ఇంద్రుడంత వాడు వచ్చి దీనంగా కోరగా కాదనడం అధర్మం – అని అనుకొని మంచిది నీవు అమరావతికి వెళ్లు. మునపటి వలెనే ఇంద్రపదవితో ప్రవర్తించు! అని పంపి తను తన నగరానికి విచ్చేశాడు.

కలహాశనుడైన నారదుడు రజి కొడుకులకు దుర్బోధ చేసి రెచ్చకొట్టగా ఆ యింద్రపదవికై వారు అమరావతిపై దండెత్తారు. ఇంద్రుడు ఆలోచించాడు. స్వర్గం విడిచి పోయాడు. రజి కొడుకులు స్వారాజ్యం ఆక్రమించుకున్నారు. యజ్ఞభాగాలు దేవతలకు చెందనీక వారే ఆకర్షించ సాగారు. పరిపాలన చేస్తూ ఉన్నారు.

అలా కొంతకాలం అయిన తరువాత – ఇంద్రుడొకనాడు ఎవరికంట పడక దేవగురుని ఇంటికి వచ్చి ఆలోచన చేశాడు. విచారిస్తూ అన్నాడు.

గురుదేవా! యజ్ఞభాగంలో నాకు ఇసుమంతైనా అందక గోరుకాయ కాచినట్టై పోయింది. ఈ మారు యజ్ఞానికి వెళ్లినపుడు ఎవరికీ తెలియనట్లుగా దాచి పురోడాశం తెచ్చి నాకివ్వవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మన్నించు!

ఇంద్రుని మాటకు గురువు మనస్సు కరిగింది. వెంటనే దేవతలకు మేలు, పగవారికి కీడు కలిగించే అభిచారహోమం చేశాడు. దాని ప్రభావముచే రాజనందనులు దుర్వివేకులై యజ్ఞాలను చెయ్యక, ఎవరిచే చెయ్యనివ్వక, వేదాలనూ, వేదక్రియలనూ ద్వేషిస్తూ బ్రాహ్మణులను నిష్కారణంగా పట్టి పీకలు నులుముతూ ఇలా దుష్ప్రవర్తనులై చివరకు వారిలో వారు పగబట్టి తన్నుకుని చచ్చిపోయారు. ఆ విధంగా అమరావతి, ఇంద్రపదవి, సురరాజ్యం మళ్లీ ఇంద్రుని స్వాధీనమయింది. ఇంద్రుడు వచ్చి సుఖంగా ఉంటూ యజ్ఞాది వైదిక క్రియలను జరిపిస్తూ యజ్ఞభాగం గైకొంటూ ఆనందంగా ఉన్నాడు.

ఈ చరిత్ర విన్న వారికి స్థానభ్రష్టత్వం ఉండదు - అని చెప్పి ఇంకా ఇలా చెప్పాడు.

క్షప్రివృద్ధుని సంతతి మిక్కిలిగా విస్తరించింది.

దంభుడు సంతతి లేనివాడై తపశ్చర్యలో మునిగాడు.

నహుషునకు ఆర్గురు కొడుకులు యతి, యయాతి, సంయాతి, ఆయాతి, నియతి, కృతి - అని వారిపేర్లు.

యతి రాజ్యసుఖా లంగీకరించక యతీశ్వరుడైపోయాడు.

యయాతి రాజ్యాభిషిక్తుడై శుక్రుని కూతురైన దేవయానిని వృషపర్వుని పుత్రియైన శర్మిష్ఠను పరిగ్రహించి ఆనందంగా ఉండేవాడు.

యదువు, దుర్వసువు అనేవారు దేవయాని కొడుకులు. ద్రుహ్యుడు, అసువు, పూరుడు అనేవారు శర్మిష్ఠ కొడుకులు.

యయాతి శర్మిష్ఠను ఎక్కువ ప్రేమగా చూస్తూ దేవయానిని అంతగా చూడకపోవం తెలిసి శుక్రుడు అల్లుణ్ణి శపించాడు.



ముసలివాడవుదువు గాక! అని

ముసలితనం ఓర్వలేక యయాతి శుక్రుణ్ణి ప్రార్థించి అనుమతి పొంది ఒకనాడు కొడుకులందరనూ రప్పించి వారితో అన్నాడు.

ఈ ముసలితనం వల్ల భోగానుభవం లేక చింతకు గురయ్యాను. నా కోరిక తీరే వరకు మీలో ఎవరో ఒకరు మీ యౌవనం నాకిచ్చి యీ ముసలితనం తీసుకోవాలి. అలా తీసుకున్న వారికి రాజ్యాధికారం ఇస్తాను.

ముసలితనం ఎవరైనా అంగీకరిస్తారా? కడసారి వాడు పూరుడు తప్ప ఎవ్వడూ అంగీకరించలేదు.

యయాతి కోపించి ఒరే! మీ కొడుకులు రాజ్యార్హులు కాకపోదురు గాక! అని శాపమిచ్చి పూరునికి తన ముసలితనం ఇచ్చి వాని యౌవనం తాను గ్రహించి చిరకాలం యథేచ్ఛగా కామోపభోగాలు విశ్వాచి అనే అప్సరసతో సహా అనుభవించి ఒకనాడు తన మనసులో అనుకున్నాడు

ఇన్నాళ్లూ వివిధ భోగాలనుభవించాను. వెలితిలేదు. తలవెంద్రుకలతో సహా శరీరబలం జీర్ణించినా ముసలితనం వచ్చినా ఆశలు జీర్ణించవు. అవివేకులు ఆశకు చుట్టుకుపోయి వివిధ దుఃఖాలనుభవిస్తారు. వివేకులు ఆశలకు లొంగక సుఖశాంతు లనుభవిస్తారు.

నేను చాలాకాలం విషయసుఖాలతో గడిపాను. కాని యింకా ఆ కోరిక తీరకుండా నాలో గంతులు వేస్తూంది. ఇక చాలును. ఆ ఆటకట్టించాలి. ఈ సుఖాలూ, భోగాలూ అణచకుంటే ఆ ఆశ అడుగంటుతుంది. అడుగంటాలి. అని ఒక నిర్ణయానికి వచ్చాడు. పూరునకు యౌవనం ఇచ్చి వాని నుంచి ముసలితనం తీసుకున్నాడు. వానికి పరిపాలకుడుగా పట్టాభిషేకం చేశాడు. తపశ్చర్యకు అడవికి వెళ్లిపోయాడు.

పూరుడు నలుదిక్కుల గల రాష్ట్రాలకు వరుసగా తన అన్నలను పరిపాలకులుగా నియమించి అంతకూ అధినేతగా తానుంటూ రాజ్యపాలన చేస్తూ ఉండేవాడు. ఇక యయాతి కొడుకులలో పెద్దవాడైన యదువు వంశ కథ చెప్తాను విను –

**యదువంశ కథ**

చరాచర భూతకోటికి ధర్మార్థకామమోక్షాలను ప్రసాదించే నారాయణుడు అవతరించిన మంచి వంశం యదువంశం. పరమపవిత్రుడైన హరి కృష్ణుడనే పేరున ఆ వంశములో పుట్టి పెరిగిన ఆ పవిత్ర వంశం కథ విన్న వారికి పరమ శుభములు కలుగుతాయి. అని పరాశరుడు యదువంశ కథ వివరించి మైత్రేయునకు చెప్పాడు.

యదువుకి నలుగురు కొడుకులు. నాలుగు పురుషార్థాల్లాగా – సహస్రజిత్తు, క్రోష్టుడు, అనలుడు, నహుషుడు అని వారిపేర్లు. వారిలో సహస్రజిత్తునకు శతజిత్తుడు, వానికి హేహయ తాళజంఘ వేణుహయులని ముగ్గురు కొడుకులు.

హేహయునకు ధర్ముడు, వానికి కుంతలుడు పుట్టారు. కుంతలుని పేరుతో ఆ దేశానికి కుంతల దేశం అని పేరు వచ్చింది. కుంతలుని కొడుకు సభాజిత్తు. వాని కొడుకు మహిష్మంతుడు. మహిష్మంతుని పేర మాహిష్మతీ పురం అయింది.

మహిష్మంతుని కొడుకు భద్రశ్రేణి. వాని కొడుకు దుర్దముడు. వాని కొడుకు ధనకుడు. వాని కొడుకులు కృతవీర్యుడు, కృతాగ్ని, కృతధర్ముడు, కృతాజుడు.

కృతవీర్యుని కొడుకు వెయ్యిచేతులు గలవాడు. వాని పేరు అర్జునుడు. ఆ అర్జునుడు దత్తాత్రేయుని సేవించి యుద్ధములో గెలుపు,



తరుగని భుజశక్తి, పరిపాలనా దక్షత, సత్ప్రవర్తన – చివర విష్ణువుచే మృతి వరాలుగా దత్తాత్రేయుణ్ణి కోరాడు. అలాగే ఆ వరాలు పొంది సూర్యుడు లాగా ప్రకాశిస్తూ శత్రువులను గెలిచి దీన సంరక్షణ చేస్తూ – సప్తద్వీపాలతో సహా భూమిని ఏలాడు. అతని ఐశ్వర్యానికి ఏలాటి దెబ్బ లేదు – అలాగే అతని ఏలుబడిలో ప్రజలకు పేదరికం అన్నది తెలియదు. అందరూ ధనేశ్వరులే –

యజ్ఞాలు నిర్దోషంగా పదివేలు చేసి దేవతలకు సంతృప్తి కలిగించాడు. పుణ్యమూర్తిగా విరాజిల్లాడు.

ఆ కార్తవీర్యార్జునుడు ఒకనాడు కాంతలతో వెళ్లి నర్మదానదిలో జలకేళి సలుపుతూండగా యక్షకిన్నరగంధర్వాదులను జయించి లోక విద్రావణుడుగా ఉన్న రావణుడే ఆ ప్రాంతానికి వచ్చి సేనతో బస చేశాడు. స్నానం చేసి సంధ్యావందనం ఆరంభించాడు. అది తెలిసి కార్తవీర్యుడు వెయ్యి చేతులూ చాచి నదీజలం పొంగించాడు. ఆ పొంగడం వల్ల అటూ ఇటూ గట్టుపై ఉన్న చెట్లూ తీగలూ ముళ్లదొంకలూ ముమ్మరంగా కొట్టుకుపోయి రావణుడి మీద పడ్డాయి. దానితో కోపించి గట్టుకి వెళ్లి తన సేనతో కార్తవీర్యుణ్ణి ఎదిరించాడు. కార్తవీర్యుడూ అలాగే ఎదిరించి పశువును పట్టి యీడ్చినట్లు రావణుణ్ణి యీడ్చి కాళ్లూ చేతులూ సంకెళ్లతో బంధించి చెరసాలలో చాలాకాలం ఉంచాడు. తరువాత పులస్త్యుడు వచ్చి నయాన చెప్పగా విడిచిపెట్టాడు. ఇలాగ శత్రు భీకరుడై ప్రజాక్షేమంకరుడై కార్తవీర్యుడు చిరకాలం పరిపాలన సాగించాడు.

కాలావసానం సమీపించగా నారాయణాంశతో అవతరించిన పరశురాముని గొడ్డలి దెబ్బకి గురియై తను త్యాగం చేసి పరమపదం చేరాడు.

ఆ కార్తవీర్యునకు నూర్గురు కొడుకులు. వారిలో శూరసేనుడు, వృషసేనుడు, మధువు, జయధ్వజుడు అనేవారు ముఖ్యులు. వారిలో జయధ్వజుని కొడుకు తాళజంఘుడు. వానికి నూర్గురు కొడుకులు. వారిలో మొదటివాడు వీతిహోత్రుడు. వాని తమ్ముడు భరతుడు. భరతునకు వృషుడు, వృషునకు మధుడు, వానికి వృష్ణి – ప్రసిద్ధులు.

వృష్ణి పేరుతో వంశం పేరు పొందింది. ఇక యదుపుత్రుడు క్రోష్టుడు. వానికి వంశకారుడైన కొడుకు కలిగాడు. వాని పేరు ధ్వజినీశుడు. వాని కొడుకు స్వాతి. వాని కొడుకు ఋశంకుడు.

ఋశంకుని కొడుకు చిత్రరథుడు. వాని కొడుకు శశిబిందుడు. జగత్తునంతనూ ఏకధాటిగా పాలించిన చక్రవర్తి శశిబిందుడు. వానికి భార్యలు లెక్కకు మించినవారు. అందరినీ సమదృష్టితో చూస్తూ ఇష్టమైన వస్తువస్త్రాలను సమకూర్చుతూ సవిలాసంగా ఆనందపరుస్తూ ఉండే శశిబిందువుకి ఆ భార్యలయందు కొడుకులు పుట్టారు పదికోట్ల మంది. అందరూ విద్యావంతులూ బుద్ధిమంతులూ బలవంతులూ. వారి సహాయంతో శశిబిందుడు ఏడు దీవుల భూమినీ ఎదురులేకుండా పాలించాడు.

ఆ రాజు కొడుకులలో పెద్దవాడు పృథుశ్రవుడు. పట్టాభిషిక్తుడై నేల నేలాడు. వాని కొడుకు దముడు. వాని కొడుకు ఉశనుడు. ఉశనుడు ద్విజులకు సంతృప్తిగా దక్షిణలిచ్చి యజ్ఞాలు చాలా చేశాడు. వాటిలో చెప్పదగినవి పది అశ్వమేధాలు. వాని కొడుకు ఇతవుడు. ఇతవుని సుతుడు మధువు. వానికి అయిదుగురు కొడుకులు. పరాజితుడు, రుక్ముడు, పృథురుక్ముడు, జ్యామఘుడు, పలితహరితుడు అని వారిపేర్లు.

* * *



వారిలో జ్యామఘుడు శైబ్య అనే కాంతను పెండ్లాడి దానికి వశుడై అది వానికి లొంగుబాటుతో ఉండి రాజసంగా ఇద్దరూ కాలం గడుపుతున్నారు. భార్యలకు లొంగి తిరుగుతూన్న భర్తలలో ముందు చెప్పవలసినవాడు జ్యామఘుడే అని లోకులమాట. క్రమంగా రాజ్యపాలనకూడా భార్య చెయ్యడం – దానికి దాసోహం అని జ్యామఘుడు చేతులు కట్టుకుని బంటులాగ నడచుకునే దశకి దిగజారింది వాని బ్రతుకు.

ఎలా ఉన్నా సంతానం కలగలేదు. ఆలోచించాడు. భార్యతో సహా అడవికి వెళ్లాడు. తపస్సు ఆరంభించాడు. అంతట – శత్రురాజులు సేనలతో వచ్చి వాని నగరాన్ని రాష్ట్రాన్ని ఆక్రమించారు. ఆ సమాచారం చారులవల్ల విని ఏమంటావని భార్యనడగగా వెళ్లి వాళ్లని జయించి నగరం, రాష్ట్రం స్వాధీనం చేసుకుని రమ్మన్నది. వెళ్లాడు. వజ్రాయుధంలాటి బాణాలు ప్రయోగించి శత్రురాజుల సేననూ కంటపడిన వారినీ చిత్రవధ చేశాడు. వాని పరాక్రమం, బాణప్రయోగం తెలిసి నిలువలేక శత్రురాజులు పారిపోయి కొండగుహల్లో దూరిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. రాజు వారిని అలా విడిచి తిరిగి వస్తూ ఉండగా దారిలో ఒక రాజకన్య కనిపించింది. కన్నీరు ధారగా పయ్యెద తడిసి శోకమూర్తిగ ఉన్న ఆ ఇంతి రాజును సమీపించి తన తల్లిదండ్రులను చెప్పి ఏడ్వసాగింది. జ్యామఘుడామె నూరడించి ఆ రూపురేఖలకు వశుడై, ఓదార్చి యీామెను నగరికి తీసుకుపోయి శైబ్యతో చెప్పి అది గొడ్రాలు కనుక యీామెతో పెండ్లికి ఒప్పుకుంటుంది. అని రథమెక్కించి రాగా పౌరులూ మంత్రులూ – వారితో శైబ్య ఎదురు వచ్చి స్వాగతం పలికారు. శైబ్య భర్త ప్రక్కనున్న కాంతను చూసి కలతపడిన మనసుకి కోపం ధూపం వెయ్యగా చురచురలాడే చూపులతో చూస్తూ అన్నది.

ఎవరిది? ఎందుకు తీసుకు వచ్చావు? దీనిని మోహించావా? పెళ్లిచేసుకోవాలని అనుకున్నావా? ఈ ముసలితనంలో. అదిన్నీ. నేనుండగా... ఏమిటీ బుద్ధి...

శైబ్య మాటలకి జంకి గుండె గడగడ లాడగా బెదురుతూ చూసి అన్నాడు రాజు. ఇది కోడలు. మనింట ఉండవచ్చు అని తీసుకువచ్చాను. నీ కిష్టమైతే నీతో ఉంచు. కాదంటావా? ఇంకెక్కడికైనా నువ్వే పంపించు!

వెంటనే శైబ్య – ఏమయ్యా ఏమిటా మాయమాటలు నేను గొడ్రాలిని. నీకు మరో భార్య లేదు. మరి కొడుకెక్కడ నీకు? ఇది కోడలెలా అవుతుంది? అని అనగా రాజుకి ఏమి చెప్పడానికి తోచలేదు – ఒకింతసేపు అలా ఉండి చివరకు గుండె దిటవు చేసుకుని అన్నాడు –

నువ్వు ఇలా గొడ్రాలవయే ఉంటావా? నీకు కొడుకు కలగడా? కోడలుండదా?... శైబ్య చిరునవ్వుతో చూసి సరే! రండని మేడలోనికి తీసుకుపోయింది. సుఖంగా ఉన్నారు. కొన్నాళ్లకి గర్భవతి అయింది. చక్కని రూపురేఖలుగల కొడుకు పుట్టాడు. విదర్భుడు అని వానికి పేరు పెట్టారు. వాడు పెరిగి పెద్దవాడు కాగా తను తోడ్కునివచ్చిన రాచకన్నెను వానికి ఇల్లాలుగా పెళ్లి చేశాడు. రాజ్యాధికారం అప్పగించి తపశ్చర్యకై అడవికి పోయాడు.

పరిపాలకుడైన విదర్భుని పేరుతో ఆ దేశం విదర్భదేశంగా ప్రసిద్ధ మయింది. విదర్భునకు ఇద్దరు కొడుకులు. క్రథకైశికుడు, రోమపాదుడు అని వారి పేర్లు.

రోమపాదుని కొడుకు విభ్రుడు. వాని కొడుకు ధృతి. ధృతి కొడుకు కౌశికుడు. వాని కొడుకు చేది. చేది వంశీయులు చైద్యులు. ఆ దేశానికి చేది దేశం అని పేరు వచ్చింది.



క్రథకైశికునకు ఇందుమతి అనే కూతురు, కుంతి అనే కొడుకు కలిగారు. ఆ ఇందుమతి సూర్యవంశజుడైన అజునిభార్య అయింది. కుంతి ధర్మపద్ధతిగా ధరణిని పాలిస్తూ భోగభాగ్యాలనుభవిస్తూ ఉన్నాడు.

ఆ కుంతికి వృష్ణి, వానికి ధృతి, వానికి దాశార్హుడు, వానికి వ్యోముడు, వానికి అనుడు – వానికి పూరుహోత్రుడు, వానికి అంశుడు – వానికి సత్వతుడు కొడుకులు – సత్వతుని కొడుకు ఉత్వకుడు.

ఈ జ్యామఘుని వంశకథలు భక్తితో విన్నవారికి ఏ పాపాలూ అంటవు.

ఉత్వతుడి కొడుకులు భజ మాన దివ్యాంధ దేవావృధ మహాభోజ వృష్ణులని ఆర్గురు కొడుకులు. వారిలో భజమానునకు నిమి, వృక్షుడు, వృష్ణి, శతజిత్తు, సహస్రజిత్తు, యుతజిత్తు – అని ఆర్గురు కొడుకులు.

దేవావృధునకు బభ్రుడు, దేవవిభుడు కలిగారు. మహాభోజునకు భోజమూర్తులు పుట్టారు. వృష్ణికి కొడుకు సుమిత్రుడు. వాని కొడుకులు అమిత్రుడు, శిబి.

అమిత్రుని సుతుడు నిఘ్నుడు. వానికి కొడుకులు ప్రసేన సత్రాజిత్తులు.

సత్రాజిత్తు బ్రహ్మాండభాండము నావరించిన చీకటిని మటుమాయం చేసే వెలుగు గల వెయ్యికిరణాల వాడున్ను, కాలకర్తయు, పరాపర విద్యలచే సాక్షాత్కరించే వాడున్ను త్రిమూర్తి స్వరూపుడున్ను అయిన సూర్యభగవానుణ్ణి నిశ్చల శ్రద్ధాభక్తులతో తపస్సుచేసి ప్రసన్నుణ్ణి చేసుకున్నాడు. భాస్కరుడు ప్రత్యక్షమయాడు. ఆ దివ్యతేజోమూర్తిని చూడలేక సత్రాజిత్తు చేతులు జోడించి కనులు మూసుకుని

దేవా! నీ ప్రపండతేజోమూర్తిని చూడలేకున్నాను. కరుణించి ప్రసన్నమూర్తివై దర్శనమిమ్ము – అని ప్రార్థించగా సూర్యుడు ప్రసన్నమూర్తియై దర్శనమిచ్చాడు. నీ భక్తికి మెచ్చాను వరం కోరుకో అని అనగా దేవా! నీ కంఠంలోవున్న దివ్యరత్నం ఆ శమంతక రత్నం ఇవ్వవలసింది. అని సత్రాజిత్తు అడిగాడు. సూర్యుడు ఆ రత్నాన్ని ఇచ్చి అదృశ్యుడయాడు. సత్రాజిత్తు ఆ రత్నం కంఠమాలికలో చేర్చి కంఠాన ధరించి రాగా ఆ రత్నకాంతులు నలుదిక్కులా వ్యాపించి సూర్యభ్రాంతిని కలిగించాయి. అంతట ద్వారకా పురవాసులు సూర్యునిగానే భావించి వడివడిగా వెళ్లి శ్రీకృష్ణుణ్ణి చూసి దేవా! సూర్యదేవుడు వస్తున్నాడని చెప్పారు. త్రికాలవేదియైన కృష్ణుడు చిరునవ్వు మోముతో వారికి ధైర్యం చెప్తూ

సూర్యుడు కాదు. సూర్యునివల్ల ఒక రత్నం పొంది సత్రాజిత్తుడు దానిని మెడలో ఉంచుకుని వస్తున్నాడు. ఆ రత్నకాంతులు మీకు సూర్యభ్రాంతిని కలిగించాయి అని వారిని శాంతపరిచి పంపించాడు. సత్రాజిత్తు తన ఇంటికి వచ్చి సుఖసంతోషాలతో ఉన్నాడు.

ఆ మణి దినమునకు ఎనిమిది బారువుల బంగారం, ధనం ఇస్తూ ఉండగా సత్రాజిత్తు దానిని అతిథులకూ, అభ్యాగతులకూ, యాచకులకూ సంతృప్తిగా వినియోగిస్తూ నలుదిక్కులా పేరు పెంపులతో ప్రసిద్ధుడయాడు.

ఆ శమంతకమణి ప్రభావంచే అతివృష్టి, అనావృష్టి, క్రూరజంతు బాధ, శత్రుపీడ – ఇలాటి దోషాలు లేనిదై ఆ రాష్ట్రం అన్ని విధాలా ఆనందనిలయమై రాణిస్తూంది.

అలా ఉండగా కృష్ణుడు ఆప్తులను రావించి ఒకనాటిరాత్రి ఆలోచించాడు. రాజైన ఉగ్రసేనునివద్ద ఆ రత్నం ఉండడం సమంజసం కదా అన్నాడు. అందరూ సమ్మతిగా తలలూపారు. మళ్లీ సందేహించాడు.



బలవంతంగా అడిగి తీసుకొనడం సముచితం కాదని వెనుకకు తగ్గాడు. కృష్ణుడు ఆలోచించిన విషయం సత్రాజిత్తుకి తెలిసింది. మనసులో కలత రేగింది.

సరే –– ఇమ్మని కృష్ణుడు స్వయంగా అడిగితే ఇవ్వడమే. ఇవ్వనంటే విరసంగా ఏదో జరుగుతుంది. బలవంతులతో పగ బ్రతుకుకి చితుకు – అని తమ్ముణ్ణి ప్రసేనుణ్ణి రప్పించి శమంతకం ఇచ్చి ఇది కృష్ణునకియ్యాలి అన్నాడు ప్రసేనుడు. అన్నవద్ద అలాగే అన్నాడు గాని ఇవ్వక తన కంఠహారంలో కూర్చి సవిలాసంగా తిరగనారంభించాడు.

కొన్నాళ్లయాక – ఒకనాడు ప్రసేనుడు అశ్వారూఢుడై వేటకి అడవికి వెళ్లాడు. అక్కడ ఒకచోట కంటపడిన సింహం ప్రసేనుణ్ణి, గుర్రాన్ని చంపి వాని మెడలో ఉన్న మణిని తీసుకుపోయింది. కొంత దూరాన దానికి ఎదురుగా వచ్చిన జాంబవంతుడు దానిని చంపి శమంతకమణిని తీసుకుపోయి తన గుహలో ఉన్న కుమారునికి సుకుమారున కిచ్చాడు.

ప్రసేనుని చావు తెలిసి యాదవులు కృష్ణునిపై నిందాక్షతలు జల్లారు. శమంతకం పరిపాలకుడైన ఉగ్రసేనునికి ఇవ్వాలని కృష్ణుని ఆలోచన. మెత్తమెత్తగా అడిగితే యివ్వడని అడవికి వెళ్లాడు. మెడలో వేసుకుని వెళ్లిన సత్రాజిత్తు తమ్ముణ్ణి చంపి కృష్ణుడు మణిని తెచ్చుకున్నాడు – ప్రజలను దయతో ఏలేవాడు, దయలేక దారుణంగా నడుస్తూ ఉంటే ప్రజలకి ఏమి గతి?...

క్రమంగా ఈ నింద కృష్ణునిచెవిలో పడింది – కొంత సైన్యాన్ని వెంట ఉంచుకుని ప్రసేనుడు వెళ్లిన త్రోవ తెలుసుకుని అడవికి వెళ్లాడు. తిరిగి తిరిగి ఒకచోట చచ్చిపడిఉన్న ప్రసేనుని కళేబరాన్ని, వెంటవచ్చిన వారికి చూపి అడుగులు గుర్తించి ముందుకి వెళ్లాడు. ఒకచోట చచ్చిన

సింహం కనిపించింది. అక్కడి నుంచి అడుగుల జాడను ఒక కొండ గుహ వద్దకు వెళ్లి సైన్యాన్ని అక్కడ ఉంచి లోపల ప్రవేశించాడు. ఒకచోట వివిధ మణి ప్రభాభాసమానమై ఉన్న జాంబవంతుని భవనం కనిపించింది. లోపల ప్రవేశించాడు. అక్కడ ఒకచోట ఒకదాది చిన్నబాలుణ్ణి ఒడిలో ఉంచుకుని లాలిస్తూ అన్నమాట –

కుమారా! సింహం ప్రసేనుణ్ణి చంపగా సింహాన్ని జాంబవంతుడు చంపి తెచ్చిన ఈ శమంతకమణి ఇక నీదే – ఏడవకు బిడ్డా! ఏడవకు –

ఈ మాట విని కృష్ణుడు ఎదురుగా చూచాడు. సుకుమారుని మెడలో మిరుమిట్లు గొలుపుతూన్న శమంతకమణి... సూర్యబింబం వెలుగుతూన్నట్టున్నది. కృష్ణుడు ముందడుగు వేశాడు. ఆ కుమారుని మెడలో ఉన్న మణిని లాక్కున్నాడు. దాసి భయంతో వణుకుతూ బిగ్గరగా అరిచింది. లోపల ఉన్న జాంబవంతుడు వచ్చి కోపించి కృష్ణునితో ఇరవై ఒక్కదినాలు పోరాడాడు.

లోపల ఇలా యుద్ధం – పైన ఉన్న కృష్ణుడి సైనికులు ఒక వారం దినాలు ఉండి కృష్ణుడు రాలేదు. పరలోకానికి వెళ్లిపోయి ఉంటాడని విచారిస్తూ వెనుదిరిగి ద్వారకకు వచ్చి బంధుమిత్రులకు చెప్పారు. వారు భక్తితో చెయ్యవలసిన పారలౌకిక క్రియలు చేశారు.

శమంతకమణి మూలాన ఇలా అసహ్యంగా జరిగింది కథ –

అలా జాంబవంతునితో ఇరవై ఒక్కదినాలు పోరాడగా క్రమక్రమంగా తిండీ నిద్రాలేక – అప్పటికే శరీరం దిగజారిఉన్న జాంబవంతుడు మరి పోరాడలేక దీనంగా చూసి కృష్ణునితో అన్నాడు : నమస్కరించి చేతులు జోడించి –



మునుపు లంకలో రావణుని సైన్యం రామునిసేనతో పోరాడినపుడు కంట పడిన రక్కసుని ముక్కముక్కలుగా చిదిపి రామునిచే మన్నన కొన్నవాడను నాకు మనుష్యుడు ఒక లెక్కా? నా పేరు విన్నంతనే దేవదానవ సైనికులకు గుండెల్లో దడ పుట్టుతుంది. అలాటి నన్ను ఎదిరించి అదిమి నీరసపెట్టిన నిన్ను మానవుడనడానికి తగదు. నన్ను అనుగ్రహించడానికి యీ రూపాన వచ్చిన శ్రీమన్నారాయణుడవా?

అని అనగా కృష్ణుడు చిరునవ్వుతో చూసి తన సమాచారం చెప్పి పోరువలన కలిగిన బాధను పోగొట్టి మేను నిమరగా జాంబవంతుడు తొల్లిట జవసత్వాలు కలవాడై పరమానందంగా కృష్ణుణ్ణి తన మేడలోనికి తోడుకువెళ్లి ఆరాధించాడు. తన కూతురు జాంబవతినిచ్చి వివాహపద్ధతి పలికాడు. శమంతకంతో మరికొన్ని వస్తువులూ, వస్త్రాలు అరణంగా ఇచ్చాడు. అవన్నీ తీసుకుని కృష్ణుడు జాంబవతితో ఆనందంగా ద్వారకకు వచ్చాడు. కృష్ణుని చూచి పురవాసులు పరమానందభరితులై అభినందించారు. కృష్ణుడు జాంబవతిని మేడలోనికి చేర్చి – కిందికి వచ్చి సత్రాజిత్తును రమ్మని కబురంపించాడు. సత్రాజిత్తు వచ్చాడు. కృష్ణుడు శమంతకం సత్రాజిత్తున కిచ్చి జరిగినదంతా చెప్పాడు. నింద బాపుకొన్నాడు.

సత్రాజిత్తు ఆలోచించాడు. ఈ మణి ఎప్పటికైనా నాకు అపాయకరమే. ఏమి చెయ్యాలి! దీనిపై కృష్ణునకు కోరిక కలగనట్లు చెయ్యాలి. ఇప్పుడు వేసిన నిందకి ఎంత పగబట్టుతాడో...

పెద్దలచే చెప్పించి ఒప్పించి తన పుత్రికారత్నం సత్యభామను కృష్ణునకిచ్చి కళ్యాణం జరిపించాడు.

కృతవర్మ, అక్రూరుడు శతధన్వుని వద్దకు వెళ్లి చూశావా సత్రాజిత్తు ఏమి చేశాడో? మనలో ఒకరికి ఇస్తానని మునుపు చెప్పి సత్యభామను కృష్ణునకిచ్చి

పెళ్లి చేశాడు. ఈ పని మాకే కాదు నీకున్నూ సిగ్గు కలిగించేదే – దీనికి ప్రతిక్రియ వాడి వద్దనున్న శమంతక రత్నాన్ని అపహరించాలి ఎలాగ? వాణ్ణి హతమార్చడమే... ఏమంటావు? శతధన్వుడు వారి మాటలు విన్నాడు. ఒక్క నిమిషం ఆలోచించాడు. ఔను! అని తన ఒప్పుదల వారికి అప్పచెప్పాడు.

అలా ఉండగా కొన్నాళ్లయిన తరువాత – లక్కయింటనున్న పాండవులకు దుర్యోధనుడు హాని కలిగించాలనే దురుద్దేశంతో ఆ యింటికి అగ్నిని పెట్టే ప్రయత్నంలో ఉండడం తెలిసే ఆ ఆపదనుండి వారిని కాపాడాలని తలచి కృష్ణుడు ద్వారక నుండి వారణావతం వెళ్లాడు. శతధన్వుడు తెలుసుకున్నాడు. తగిన అదను అని ఒకనాటి రాత్రి సత్రాజిత్తుని ఇంటికి వెళ్లి ఇల్లాలు, కొడుకులూ గోలపెట్టుతూండగా అతనిని దారుణంగా చంపి శమంతకం తీసుకుని వెళ్లిపోయాడు. కృతవర్మ, అక్రూరుడు చేసిన దుర్బోధతో శతధన్వుడు ఈ దారుణ కర్మచేశాడని సత్యభామ అర్థం చేసుకున్నది. తగిన వీర భటులను వెంట ఉంచుకుని రథమెక్కి వడివడిగా తోలించి వారణావతం వెళ్లింది. కృష్ణుణ్ణి దర్శించి నమస్కరించి కన్నీళ్లు అరచేతులతో ఒత్తుకుంటూ దీనంగా చెప్పింది.

అర్ధరాత్రి శతధన్వుడు తన తండ్రియింటికి వెళ్లి చంపి శమంతకం తీసుకుపోయిన వృత్తాంతం – సత్యభామ చెప్పిన దానికి కృష్ణుడు ఆశ్చర్యపడి

భామా! అయినదేదో అయింది – విచారించకు. ఆ శతధన్వుణ్ణి హతమార్చుతాను – అని ధర్మజాదులకు చెప్పి రథారూఢుడై సత్యభామతో ద్వారకకు వచ్చాడు.

ఆ రాత్రి ఉగ్రసేనుడు, బలరాముడు మొదలైన తనవారివల్ల శతధన్వుని తులువతనం తెలిసి విచారించి – కోపించి అన్నాడు. సూర్య ప్రసాదితమైన ఆ రత్నం కారణంగా ప్రసేనుడు అరణ్యంలో సింహంచే



మరణించాడు. ఇప్పుడు సత్రాజిత్తు శతధన్వుని ఖడ్గానికి గురి అయాడు. అన్నదమ్ములిద్దరూ ఇలా దుర్మరణం పాలయారు. అని అన్నను చూసి

ఆ శమంతకమణి ముల్లోకాలకూ ఉపకారకం. ఇక మనవద్ద ఉండవలసిందే. ఆ దుష్ట శతధన్వుణ్ణి హతమార్చకపోతే మనకి అపకీర్తి వస్తుంది.

అని అనగా సరే. వాణ్ణి పరిమార్చి ఆ రతాన్ని కైవసం చేసుకుంటాను అని బలరాముడు ప్రతిజ్ఞ పలికాడు.

ఈ సమాచారం శతధన్వునకు తెలిసింది. భయంచే గడగడలాడాడు. ఎవ్వరికీ తెలియనట్లు ఏకాంతంగా కృతవర్మ దగ్గరకు వెళ్లి బలరాముడి ప్రతిజ్ఞను చెప్పి తనకు తోడు రమ్మన్నాడు. శతధన్వుని మాటకి కృతవర్మ వెటకారంగా నవ్వి నువ్వు కృష్ణునితో పగకి సిద్ధపడుతున్నావా? నేనే కాదు లోకమంతా ఏకమయినా ఆ పురుషోత్తముని ఎదిరించి ముందు నిలువ గలదా?... వద్దు వద్దు. దుర్వివాదం వద్దు. మొండిగా ఉంటావా? తగిన శాస్తి జరుగుతుంది... శతధన్వుడు తల తడుముకుంటూ అక్రూరుడి వద్దకు వెళ్లి తన దుర్దశ చెప్పి తోడు పడమన్నాడు. అక్రూరుడు కూడా కృతవర్మలాగే అన్నాడు. ఏమి ఈ దుర్బుద్ధి! కృష్ణునితో పగా? బ్రతికి ఉంటావా? కృష్ణు డెవరనుకున్నావు? సకల లోకకర్త, భర్త, సంహర్త – నీ అజ్ఞానం నిన్ను ఇలా ఆ పురుషోత్తమునితో పగకి నెట్టుతూంది. తొందరపడకు – బుద్ధిమంతుడవై ప్రవర్తించు! ఇక్కడ ఉండక చాటుగా ఎక్కడికైనా పో! అని అనగా అతని మాటకు కట్టువడి శతధన్వు డన్నాడు.

సరే. నా మాట. ఈ మహనీయ రత్నాన్ని ఆ కృష్ణునికి చెందకుండేట్టు ఎక్కడైనా దాచి ఉంచు. కాదంటావా? నీవే నీదిగా కాపాడుకో!... ఏమంటావు?

ఏమనేది? నువ్వు చెప్పినట్టు రహస్యంగా ఈ రత్నాన్ని దాచి ఉంచుతాను. నా దగ్గర ఉన్నట్టు కలలో అయినా నువ్వు ఎవ్వరితోనూ చెప్పకు – అని అక్రూరుడనగా – అలాగే అని తన చేతనున్న శమంతక మణిని అక్రూరునకిచ్చాడు.

శతధన్వుడు తిరిగి తన భవనానికి వస్తూ విన్నాడు కృష్ణుడు తన మీదికి వస్తున్నాడని. ఆ సమాచారం తెలిసి అదిరి బెదిరి ఒక గుఱ్ఱం ఎక్కి ఊరు విడిచిపోయాడు.

తరువాత – కృష్ణుడు, బలరాముడు తోడుగా బయల్దేరి దారుకుడు సరదాగా రథమెక్కి శతధన్వుని అనుసరించాడు. శతధన్వుని గుఱ్ఱం వాయువేగంతో పారిపోయి మిథిలానగరం పొలిమేర ఉన్న ఒక తోటలో ప్రవేశించి మరణించింది. వెంటనున్న కృష్ణుడు శతధన్వుని స్థితి గమనించాడు. అన్నను చూసి అన్నా! రథంపై నీ విక్కడే ఉండు. వాడిసంగతి చూస్తానని రథంమీంచి దిగి సింహంలాగా పరుగులంకించాడు. అల్లంతదూరాన కనిపించిన శతధన్వుణ్ణి నిలు! నిలు! అని హెచ్చరించి ముందడుగు వేశాడు. చక్రం విడిచాడు. అది రివ్వున ఎగిరివెళ్లి శతధన్వుని తల తెగవేసింది. కళేబరం కిందపడింది. కృష్ణుడు వెళ్లి ఆ శరీరాన ఉన్న నగలన్నీ వెదికాడు. శమంతకం కనిపించలేదు. వెనుదిరిగివచ్చి

అన్నా! వాని దగ్గర శమంతకం కనిపించలేదు – ఆశ్చర్యంగా ఉంది. అని అనగా బలరాముడు కోపించి

నాకు ఇవ్వవలసి వస్తుందని మోసపు మాటలాడుతున్నావా? పో! నీతో ఉనికి తగదు – అని చీకాకుగా పలికేడు. కృష్ణుడా మాటలకు బాధపడి అన్నా! వాని దగ్గర లేదంటే నేను మోసం చేశాననా? అలాటి పని నీ వద్ద చేస్తానా? ఎన్నడూ చెయ్యను ప్రమాణవాక్కుగా చెప్తున్నాను. ఆ శవం శరీరంపై



శమంతకం లేదు. నీకు కావాలంటే ఆ సూర్యుని కంఠహారాలన్నీ తెప్పించి యిస్తాను అని ఎంతో వినయం, నయం కలగలుపుగా అన్నాడు. కాని బలరాముడు మాటలు వినలేదు. మద్యపానమహిమ అది. నీతో ద్వారకలో ఉండడం ఇక నా వల్లకాదు. ఎక్కడికో పోతాను. నీ దారి నువ్వుపో! అని చురచుర చూసి నాగలి భుజాన ఉంచుకుని కోపంతో వడి వడిగా అడుగులు వేస్తూ పోయి పోయి మిథిలానగరం ప్రవేశించాడు. అక్కడ జనకచక్రవర్తిచే మన్నన పొంది నివాసం ఏర్పరచుకుని అతని ముఖతః అధ్యాత్మవిషయాలు వింటూ దుర్యోధనునకు గదాయుద్ధవిషయం బోధించే గురువై మూడు సంవత్సరాలున్నాడు.

కృష్ణుడు ద్వారకకు వచ్చి ఈలాటి నింద ఎలా వచ్చింది? దీనికేమి విరుగుడు? అని విచారిస్తూ ఉన్నాడు. కృష్ణుని విచారం తెలుసుకుని ఉగ్రసేనాదులు మిథిలకు వెళ్లి బలరాముని కలత తీరేట్టు బోధించి తిరిగి ద్వారకకు తీసుకువచ్చారు.

శమంతకమణిని అక్రూరుడు తనయింట భద్రంగా రహస్యంగా దాచి ఉంచాడు. అది దినానికి ఎనిమిది బారువుల బంగారం ఇస్తూ ఉన్నది. దానిని నిరర్థకంగా వెచ్చించక పరమేశ్వరార్పణంగా యజ్ఞాలు చేస్తూ యజ్ఞదీక్షగల క్షత్రియ వైశ్యులను చంపినవారు బ్రహ్మహత్యాపాపానికి కట్టుపడతారని పెద్దలవల్ల విన్నవాడు కనుక యజ్ఞదీక్ష తన రక్షగా అరవై సంవత్సరాలు ఏలాటి అపాయం లేక సుఖంగా ఉన్నాడు. ఆ రత్న ప్రభావం వల్ల ఆ దేశం ఎలాటి అరిష్టాలూ లేక ధనధాన్య సమృద్ధితో విలసిల్లింది.

కొన్నాళ్లు గడచిన తరువాత – భోజుడు మొదలైన రాజులు నీతీ నియమం లేక దొమ్మి యుద్ధంచేసి సత్విత్రప్రపౌత్రుడైన శత్రుఘ్నుణ్ణి చంపివేశారు. ఆ సంఘటనతో అక్రూరుడు భయపడి తనకి ఏ ఆపద

కలుగుతుందో అని ద్వారకలో ఉండలేక భోజసహితుడై కాశికి వెళ్లిపోయాడు. అక్రూరుని ఎడబాటు ద్వారకకు యాదవభూమికీ గొప్ప ఉపద్రవం కలిగించింది. అనావృష్టి, పాడిపంటలు లేక, రోగాలు కలిగి ప్రజలు బాధపడడం – ఇలా అనరాని వినరాని కనరాని ఉత్పాతాలకు విశేషించి ద్వారక నెలవయింది.

ఈ ఉత్పాతాలు చూసి కృష్ణుడు కలతపడి వృష్ణి భోజాంధకులను పిలిపించి విచారిస్తూ ఉపద్రవాలను ప్రస్తావించి ఏమి చెయ్యాలి ఈ బాధ పోవడానికి చెప్పండన్నాడు. అప్పుడు యదువృద్ధులలో ఒకడు నందకుడు చెప్పాడు.

మాధవా! అక్రూరుని తండ్రి శ్వఫల్గుణుడు, దేవతలతో సాటిగా చెప్పదగిన మహిమ గలవాడు. ఆయన ఉన్న దేశంలో ఏలాటి ఉత్పాతాలూ ఉండవు. కడచిన కథ చెప్తాను విను –

ఒకప్పుడు కాశీరాజు తన రాష్ట్రంలో అనావృష్టి మొదలైన ఉత్పాతాలు కలగగా శ్వఫల్గుణ్ణి తోడ్కుని వెళ్లి తనయింట ఆదరిస్తూ ఉంచాడు. అంటే అప్పటికప్పుడు రాష్ట్రమంతా ఉత్పాతరహితమై శుభశోభనమూర్తి అయింది.

అలా ఉండగా అప్పుడు గర్భవతిగానున్న కాశీరాజుభార్య గర్భం నందున్న శిశువు ఆడుబిడ్డ అయితే ఈ రాజుకి ఇచ్చి పెళ్లి చేస్తానని నిశ్చయించుకున్నాడు. కాని రాణి ప్రసవించలేదు. పన్నెండు సంవత్సరా లయింది. ఆ శిశువు తల్లి కడుపులో పెరుగుతూ ఉండగా రాణి ఆ బరువు భరించలేక బాధపడుతూంది. అలా ఉండగా ఆ శిశువు అన్నది తండ్రిని ఉద్దేశించి –

ఇంకా మూడేళ్లయినతరువాతగాని నేను బయటకి రాను. నేటినుంచి దినం ఒక ఆవును సదాచారసంపన్నుడైన బ్రాహ్మణునకు దానమిస్తూ ఉండాలి. అలా మూడేళ్లు గడవగా ఏలాటి శ్రమ లేక ఈమె ప్రసవిస్తుంది. నేను వెలుపలకు వస్తాను.



అలాగే చేస్తానన్నాడు రాజు. దినానికి ఒక ఆవు చొప్పున గురువుకి దానమిస్తూ ఉన్నాడు. మూడేళ్లు కాగానే రాణి సుఖప్రసవంగా కూతురిని కన్నది. ఆ పిల్ల పెద్దది కాగా దానిని శ్వఫల్గునకిచ్చి కాశి రాజు పెళ్లిచేశాడు. ఆ దంపతులకు కల్గినవాడు అక్రూరుడు. శ్రీహరిభక్తులలో అగ్రగణ్యుడు తల్లిదండ్రులు చేసిన పున్నెంవల్ల అతడున్న ప్రదేశంలో ఈతిబాధలుండవు దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఎల్లపుడును యజ్ఞాలు చేస్తూ ఉన్న పుణ్యపురుషుడు అన్ని పాపాలనూ బాపగలడు.

ఆ అక్రూరుడు చేసిన చిన్న తప్పు అదొక నేరంగా ఎంచరాదు. అది లోకానికి ఉపకరించేదిగా భావించాలి – అని నందకుడన్నాడు. కృష్ణుడు వెంటనే శపథవాక్కు పలికాడు. ఎన్నడు అతని ప్రాణానికీ ధనానికీ ఆశించనని – కొందరు బ్రాహ్మణులను పంపించి ద్వారకకు రప్పించాడు. ఆ శమంతక రత్న ప్రభావం అనే అనాలి. వెంటనే వానలు కురిశాయి. సస్యవృద్ధి కలిగింది. రోగాలూ దుర్యోగాలూ లేనివారై ప్రజలు సుఖజీవనులయారు. పాడి రెండింతలు పెరిగింది. ఇలాగ సకల దోషనివారణ అవడం తెలిసి ఆశ్చర్యపడి కృష్ణుడు తనలో అనుకున్నాడు.

నందిని, శ్వఫల్గుణుడు స్వల్ప పుణ్యులు. వారి కొడుకు అక్రూరుడు. ఇంత ఇనుమిక్కిలి పుణ్యమహిమ కలవాడా? ఇది అతనికి ఎలా కలిగింది? అది అలా ఉండనీ విడవక యజ్ఞాలు చేస్తూ బ్రాహ్మణులకు అపరిమితంగా దక్షిణలు ఇస్తున్నాడు? నాకు తెలియని రీతిగా వారికింత ధనం ఎలా కలిగింది? ఆ మహిమ, ఆ ధనప్రాబల్యం – కలగడానికి మూలం

శమంతకమే. సందేహం లేదు. అని అనుకుని ఒకనాడు ఆప్తులను పంపి అక్రూరుని రప్పించి వానితో పరిహాసాలాడుతూ అవీ యివీ ఆటలాడ నారంభించాడు. నవ్వుతూ నవ్విస్తూ ఆడి ఆడించి కొంతసేపు గడపి విశ్రాంతిని గొని అల్లనల్లన అన్నాడు – అక్రూరా! పుణ్యాత్ముడవయ్యా! నువ్వు, సూర్యుడిచ్చిన శమంతకమణి నీవద్ద ఉన్నది. లేకపోతే అన్ని యజ్ఞాలూ, దానాలూ, ధర్మాలూ చెయ్యడానికి తగిన ధనం నీకు ఎక్కడిది? చూడు నామాట విను. అది నీ దగ్గర ఉందన్నా నమ్మక, నా మీద అపనింద వేస్తున్నారు. నా మీద పడిన ఈ నిందను పోగొట్టాలి. ఆ మణి తెచ్చి నలుగురికీ చూపించడం కర్తవ్యం...

కృష్ణుని మాటలు విని అక్రూరుడు అదిరి బెదిరి – ఒకింత సేపటికి కుదిరి – తనలో అనుకున్నాడు.

ఆ మణి నా వద్ద ఉందని ఈ కృష్ణుడు గ్రహించాడు. ఇప్పుడు బయటపెట్టాడు. నేను దానినలాగే దాచి ఉంచితే లేదని తప్పుడు మాటలాడితే పోనిస్తాడా? అది ప్రాణం మీదికి తెచ్చుకోడమే. ఎందుకీ బాధ – అని తన పట్టుదట్టిలో కట్టి ఉంచిన శమంతకం కృష్ణున కిచ్చాడు.

ప్రభాత భాస్కర ప్రభాభాసమానమై, సామాన్యదృష్టితో చూడ రానిదై, అందం పొగడ్తలకు అలవాలమై ఉన్న శమంతక రత్నం శ్రీకృష్ణుని యొద్ద మరింత వెలుగుతూ కలకలలాడసాగింది. అక్కడ ఉన్న వారంతా ఆశ్చర్యంగా చూస్తూ జయధ్వనులు చేశారు. తరువాత అక్రూరుడు కృష్ణునితో అన్నాడు.

కృష్ణా! నీ దయ నాపై ఉన్నందువల్లనే ఈ దివ్యరత్నం నా వద్ద ఉండడం, విశేషించి సంపద కలగడం అయింది. కానిచో ఇలా జరుగుతుందా? ఈ రత్నం మీది ఆశతో ప్రసేనుడు, సత్రాజిత్తు, శతధన్వుడు చనిపోయారు. అదే బాధ నా మనసులో, ప్రాణహాని జరుగుతుందని. ఆ



బాధ నేటితో పోయింది. నేను నా వద్ద ఉంచుకొనడంలో లోకోపకారం కోసమే. నువ్వు అడిగితేగాని స్వయంగా వచ్చి నేను నీకివ్వదల్చుకోలేదు. దాచినపదార్థం అడిగితేగాని ఇవ్వరాదని పెద్దలమాట. అడిగావు సమర్పించాను. ఇక నాకు ఏ గొడవా లేదు, రాదు. నీ కోరిక ప్రకారం కానీ! నిన్ను మనసులో ఆరాధించే నీ భక్తుడను. నన్ను కరుణించు! కృష్ణా!

అని అనగా కృష్ణుడు ఆదరంగా మంచి మాటలతో ఆనందపరిచాడు. శమంతకంపైన గల ఆశతో బలరాముడు ఆ మణికోసమే ఊరు విడిచి వెళ్లిపోయాడు. తండ్రిసొమ్ము నాకు చేరాలి అని సత్యభామ కోరిక – ఈ గృహ కలహం ఎందుకు? ఆలోచించి కృష్ణుడన్నాడు.

అక్రూరా! ఇది బ్రహ్మచర్యాన్ని నిర్విఘాటంగా పాటించే వారివద్ద ఉండవలసేదిగాని గృహస్థుల ఇంట ఉండవలసేది కాదు. లెక్కకు మిక్కిలిగా ఉన్న కాంతలతో ఉన్న నా దగ్గర ఉండరాదు. నన్నే ఎంతో పేర్మితో చూస్తూ ఎడబాయని సత్యభామకు కూడా యిది తగదు. ప్రతిదినం మద్యపానం చేసే బలరామునితో ఉండకూడదు. కనుక – నిష్కల్మషుడవు, బ్రహ్మచర్యం విడువక పాలిస్తూన్నవాడవు, పరమభాగవతుడవు. నీవే వానిని ధరించు! అనాయాసంగా భరించు! అని తిరిగి ఇచ్చివేశాడు. అక్రూరుడు సంతోషంగా దానిని అందుకొని కృష్ణునితో చెప్పి తన నివాసానికి వెళ్లి కంఠమాలికలో చేర్చి ధరించాడు. తనకు కల్గిన నిందను ఈ విధంగా పోగొట్టుకుని కృష్ణుడు ప్రశాంతచిత్తుడై ఉన్నాడు. మునీంద్రా! ఈ కథ వినినవారు ఏలాటి అపనిందలు పొందక మంచిపేరు గలవారై పుత్రపౌత్రాభి వృద్ధితో ప్రమోదంగా జీవితం గడుపుతారు.

ఇక చంద్రవంశ శేషం చెప్తాను విను – అని పరాశరుడు చెప్పాడు.

అశిమిత్రుని కొడుకు శిని – శిని కొడుకు సత్యకుడు. అతని సుతుడు సాత్యకి. సాత్యకికి యుయుధానుడు అని మరొకపేరు.

అంధకుని కొడుకులు రుచికంబళ కుకురబర్హులు. అలా అంధకుని వంశంనందు పుట్టినవారు అంధకులుగా ప్రసిద్ధులయారు.

అనుని కొడుకు ఆనకదుందుభి – అతని సుతుడు పునర్వసుడు. వాని కొడుకు ఆహుకుడు. ఆహుకునకు దేవకుడు, ఉగ్రసేనుడు అని ఇద్దరు కొడుకులు. వృకదేవ, ఉపదేవ, దేవరక్షిత, శ్రీదేవి, శాంతిదేవి, దేవకి, సహదేవి అని ఏడుగురు కూతుళ్లు – ఆ కన్యకలందరిని వసుదేవుడు పరిగ్రహించాడు. ఉగ్రసేనునకు కంసుడు మొదలుగా పది మంది కొడుకులు.

భజమానుని కొడుకు విదూరథుడు అతని సుతుడు శూరుడు. శూరుని కొడుకు ప్రతిక్షత్రుడు. వాని కొడుకు భోజుడు. అతని సుతుడు హృదీకుడు. వాని కొడుకులు కృతవర్మ, ఆనందుడు.

శూరునకు మారిషయను భార్యయందు పది మంది కొడుకులు కలిగారు. వారిలో సుదేవుడు పేర్గాంచినవాడు.

వసుదేవుడు పుట్టిన సమయమందు దేవతలు మా ప్రభువు విష్ణువు ఈ మహాత్ముని కుమారుడై పుట్టి మాకు సిరి వైభవం విశేషించి కలిగించుగాక! అని ఆనక దుందుభివాద్యంతో అభినందించారు. ఆ విధంగా వసుదేవునకు ఆనకదుందుభి అనే పేరు కూడ ప్రసిద్ధం అయింది.

ఆ వసుదేవునికి చెల్లెండ్రు అయిదుగురు. పృథ, శ్రుతదేవ, శ్రుతకీర్తి, శ్రుతశ్రవ, రాజాధిదేవి – అని వారి పేర్లు.

కుంతి అనే రాజు సంతానం లేక కలతపడుతూ శూరుణ్ణి ఒప్పించి పృథను దత్తపుత్రికగా తీసుకున్నాడు. ఆమె పౌరవకుల మాణిక్యమైన పాండురాజు పత్ని అయింది. ధర్మరాజు వరంచే ఒక కొడుకుని, వాయుకృపచే



ఒక కొడుకుని, ఇంద్రవరంచే ఒక పుత్రుణ్ణి కన్నది. ధర్మరాజు, భీముడు, అర్జునుడు అని వరుసగా వారి పేర్లు. పెండ్లి కాకముందు సూర్యవరంచే ఒక కొడుకుని కన్నది. వాని పేరు కర్ణుడు, అంగదేశప్రభువుగా ప్రసిద్ధుడు.

ఆమె సవతి మాద్రి. దేవవైద్యులైన అశ్వినీ దేవతల వరంచే ఇద్దరు కొడుకులను కన్నది. నకులుడు, సహదేవుడు – అని వారి పేర్లు.

వృద్ధధర్ముడనే కరూశ దేశాధిపతి శ్రుతదేవను పరిగ్రహించాడు. వారికి అయిదుగురు కొడుకులు.

అవంతీరాజు రాజాధిదేవిని చేపట్టాడు. ఆ దంపతులకు ఇద్దరు కొడుకులు. విందుడు, అనువిందుడు అని వారి పేర్లు.

చేది రాజు దమఘోషుడు శ్రుతశ్రవను పెండ్లాడాడు. ఆ దంపతుల కొడుకు శిశుపాలుడు.

వైకుంఠంలో సనకసనందనాదులచే శాపానికి గురి అయిన జయవిజయులు మొదట హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా తరువాత రావణ కుంభకర్ణులుగా ఇలపై పుట్టి మహావిష్ణువు అవతారపురుషులచే మృతి చెందారు. వారి మూడవ జన్మ శిశుపాలుడు. దంతవక్త్రుడు. చిన్ననాటి నుంచి విష్ణువిరోధులై ప్రవర్తించి కాలానుసారంగా ఆ హరిచే ప్రాణాలు పోగొట్టుకున్నారు.

వసుదేవుడు, రోహిణి, దేవకి మొదలైన కాంతలను భార్యలుగా పరిగ్రహించగా రోహిణియందొక కొడుకు కలిగాడు. ఆ శిశువుపేరు బలరాముడు. అతనికి సంకర్షణుడు, బలభద్రుడు – ఇలా ఇంకా కొన్ని పేర్లు ఉన్నాయి.

దేవకీదేవికి కలిగిన ఆర్గురు కొడుకులను కంసుడు చంపాడు. ఏడవ గర్భం యోగమూర్తి విష్ణువు పంపగా వచ్చి ఆమె గర్భాన ప్రవేశించింది. లోపల ఉన్న శిశువును గొనిపోయి రోహిణి కడుపులో ఉంచింది. ఆ శిశువే బలరాముడు. అష్టమగర్భాన పుట్టినవాడు ఆ విష్ణువు. ఈ జన్మలో కృష్ణ నామంతో ప్రసిద్ధుడు.

యోగశక్తి యశోద గర్భాన జన్మించి కాళి అనే పేరు గలదై ఇలలో గల జనులచే పూజలు పొందుతూ ఉంది.

కృష్ణుడు పదారువేల నూట యెనమండ్రుకాంతలను ఇల్లాండ్రుగా చేపట్టారు. వారికి లక్ష ఎనభైవేల మంది కొడుకులు. వారి పుత్రపౌత్ర వర్గం లెక్కకు మిక్కిలి వర్ణింప నశక్యం. ఇలా యాదవవంశం విస్తరించింది.

మునుపు యుద్ధభూమిపై కొట్టుకుచచ్చిన దేవదానవులు యాదవ వంశంలో పుట్టారు. వారిలో చాలామంది సాధుబాధ చేస్తూ ఉండేవారు. వారి వంశాన పుట్టి కృష్ణుడు దుష్టశిక్షకుడుగా శిష్టరక్షకుడుగా ప్రసిద్ధుడైన పురుషోత్తముడు.

యయాతి రెండవ కొడుకైన దుర్వాసుని వంశం తండ్రి శాపంవల్ల కౌరవకులంలో కలిసింది. ద్రుహ్యవంశపు రాజులు మ్లేచ్ఛ కిరాత కృత్యాలతో నికృష్టులయారు. అనువంశ సంభవులు అంగ వంగ కళింగాది రాజ వంశీయులై విస్తరిల్లారు.

యయాతి అన్నివిధాలా బుద్ధిమంతుడైన కడసారి కొడుకు పూరుణ్ణి రాజ్యభారం వహించేరీతిగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

పూరుని కొడుకు జనమేజయుడు – అతని సుతుడు ప్రచిన్వంతుడు – ఇలా ఆ వంశం పెరిగింది. ఆ వంశీయుడే శంతనుడు. శంతనుని కొడుకులు



చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. చిత్రాంగదుడు చిన్న వయసునందే చిత్రాంగదుడనే గంధర్వునితో పోరాడి చనిపోయాడు.

విచిత్రవీర్యుడు కాశిరాజు కూతుండ్రైన అంబిక, అంబాలిక అనువారిని పెండ్లాడి వారితో విలాసంగా గడుపుతూ మితిమీరి ప్రవర్తించి క్షయరోగానికి చిక్కి దేవలోకానికి పోయాడు.

తరువాత – సత్యవతి మాట మన్నించి కృష్ణద్వైపాయనుడు అంబిక యందు ధృతరాష్ట్రుని, అంబాలికయందు పాండురాజును, విచిత్రవీర్యుని భోగస్త్రీయందు విదురుణ్ణి పుట్టించాడు.

ధృతరాష్ట్రునకు గాంధారియను భార్యయందు దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన కొడుకులు నూర్గురు పుట్టారు.

పాండురాజునకు కుంతియను భార్యయందు ధర్మరాజు, భీముడు, అర్జునుడు అని ముగ్గురు కొడుకులు, మాద్రియను చిన్న భార్యయందు నకులుడు, సహదేవుడు అనే కొడుకులు దేవాంశలవల్ల పుట్టారు. ఆ పంచపాండవులకు ద్రుపదరాజనందన ద్రౌపది ధర్మపత్ని అయింది. ఆమె యందు ధర్మరాజునకు ప్రతివింధ్యుడు, భీమునకు శ్రుతసోముడు, అర్జునునకు శ్రుతకీర్తి, నకులునకు శతానీకుడు, సహదేవునకు శ్రుతధర్ముడు అని కొడుకులు కలిగారు. వారికి ఉపపాండవులని వ్యవహారం. వారేకాక ధర్మరాజునకు గాధేయియందు దేవకుడు, భీమునకు హిడింబయందు ఘటోత్కచుడు, నకులునకు రేణుమతియందు నిరమిత్రుడు, సహదేవునకు విజయయందు సుహోత్రుడు కలిగారు.

అర్జునునకు ఉలూచియందు ఇలావంతుడు, చిత్రాంగదయందు బభ్రువాహనుడు, సుభద్రయందు అతిబలపరాక్రముడైన అభిమన్యుడు కలిగారు.

అభిమన్యునకు ఉత్తరయందు పరీక్షిత్తు కలిగాడు. ఆ పరీక్షిత్తు కురువంశ రాజ్యాధికారి అయ్యాడు.

పరీక్షిత్తు కొడుకు జనమేజయుడు. అతడు ధర్మశీలుడు. వేదవ్యాస శిష్యుడైన వైశంపాయనునివల్ల మహాభారతం విని అనేక యజ్ఞాలుచేసి ప్రస్తుతం రాజ్యం ఏలుతున్నాడు అని చెప్పి –

భూతకాలంలోనూ వర్తమాన కాలంలోనూ గల రాజుల వంశ చరిత్ర వగైరా చెప్పాను. ఇక భవిష్యత్తు రాజుల సమాచారం చెప్తాను విను.

జనమేజయునకు కొడుకు శతానీకుడు. అతడు కూడా తండ్రిలాగే ధర్మపద్ధతిని ప్రవర్తిస్తాడు. యాజ్ఞవల్కి వల్ల అధ్యయనం, కృపాచార్యునివల్ల అస్త్రశస్త్రవిద్య, శౌనకుని వల్ల ఆధ్యాత్మికవిద్య కూలంకషంగా తెలుసుకుంటాడు.

ఆ సూర్యచంద్రవంశీయులైన రాజులు కలియుగంలో కొంత కాలానికి క్షీణదశలో పడి బలహీనులై సామాన్యసంపన్నులై రాజ్యాలేలుతారు. అధర్మవర్తకంతో చివరకు చెడిపోతారు. వారి మంత్రులు రాజద్రోహులై రాజ్యాలు వశపరచుకుని పరిపాలకులౌతారు.

గంగా ప్రయాగమధ్య దేశాలలో పద్మవర్యులనే మాగధులు పట్టాభిషిక్తులైన రాజులను వెడలగొట్టి తాము ఏలుబడి సాగిస్తారు. నర్మదా తీరదేశాలను భ్రష్టాచార్యులైన బ్రాహ్మణులేలుతారు. చంద్రభాగాతీరా లందున్న కాశ్మీరదేశాలను హీనజాతులవారు పాలిస్తారు. వీరందరూ కాలానికీ వయస్సుతో తగిన గుణాలూ ప్రవర్తనా కలవారై ఉంటారు. రాజులు (పరిపాలకులు) అల్పమైన దయ, అల్పజ్ఞానం, అల్పవిద్య, అల్పాలోచన, అల్పైశ్వర్యం కలవారై ఉంటారు.



కోపం, దుర్వివేకం, క్రూరప్రవృత్తి, చపలత్వం, ఎదుటివారిని చులకనగా చూడడం, మనస్సులో ఏదో ఒక దానికి బాధపడుతూ ఉండడం చెడునడత, పెడసరపుతనం, పాపం – ఈ గుణాలు కలికాలం పోయేవరకు మానవులను దుష్ట పిశాచాల్లాగా ఆవేశించి ఉంటాయి. ధైర్యం, మనస్సు నిలకడ – అవసరమైన పరాక్రమం – అనేవి కలియుగమానవులకు ఉండవు. కలియుగమానవుల మాటలు పరమనీచంగా ఉంటాయి. సాధుత్వం, జాగరూకత, మర్యాద అనేవి వారెరగరు. బ్రతుకులు నడివీథి మెతుకులనే చెప్పవచ్చు. కోపం, నిందించడం వారికి పుట్టుసొత్తు.

గోహత్య, స్త్రీహింస, శిశుహత్య అనేవి కలికాలం జనులకు సహజగుణాలై ఉంటాయి. కలియుగమందలి జనులు పరధనపరకాంతా ప్రియులు, అల్పాల్పబలులు, జీవించిఉన్నా శవాల్లాటి రూపాలు గలవారు, అసత్య భాషణులు, నాస్తికవాదులు – ఎక్కువ సంఖ్యలో ఉంటారు. వేదాలకూ, యజ్ఞాలకూ స్థానం ఉండదు. బ్రాహ్మణులు క్రింది జాతుల వారిని సేవిస్తూ వారిచే ధనబలంతో బ్రతకవలసి వస్తుంది. అన్ని విధాలా బలంగల వాడే ప్రభువు. ధనధాన్యాలు సమృద్ధిగా గలవాడే మాన్యుడు. సభలలో ముందూ – వెనకా చూడక నోటికి వచ్చినట్లు నిర్భయంగా వాగే వాడే పూజ్యుడు. నౌకరి చేసే వాడే హితుడు – ఇలా ఉంటుంది కలియుగ ప్రభావం –

ఇంకా విను. ధనం ఉన్నవాడే గొప్పకులంలో పుట్టినవాడుగా గౌరవం పొందుతాడు. శరీరబలమే ధర్మం, అందచందాలే వివాహ కారణాలు. శౌర్యమే వ్యవహారానికీ ఉండవలసేది. అన్యాయమే వృత్తికి మూలం. దౌర్బల్యమే కిందికి దింపుతుంది. (బలహీనుడు అగ్రజాతిలో పుట్టినవాడైనా అధముడుగానే లెక్క) ఇలాగ యీ దోషాలు అన్ని జాతులలోనూ ఉంటాయి.

కలియుగమానవులకు ఆయుఃప్రమాణం నూటఇరవై సంవత్సరాలు. తేనె, కూరగాయలు, ఆకులూ, పువ్వులూ ఆహారం. నారబట్టలూ – అలాటి నేతబట్టలూ వస్త్రాలు. సంతానం మితిమీరి బహు కష్టాలకు మూలమవుతుంది. శ్రౌతస్మార్త క్రియలకు స్వస్తి పలుకుతారు. (వాటిని ఆచరించరు)

ఇలా ఉండగా ఇలపై ధర్మాన్ని స్థాపించడం లక్ష్యంగా సర్వలోక రక్షామణి భక్తవత్సలుడు శ్రీవిష్ణువు శంబళ గ్రామంలో ప్రధానుడు అనే బ్రాహ్మణునికి కుమారుడుగా జన్మించి దుష్టశిక్షణ చేస్తాడు. వేదాలకు మళ్లీ జీవం పోస్తాడు. సాధుసంరక్షణ చేస్తాడు. శ్రౌతస్మార్త క్రియలకు ప్రాణ ప్రతిష్ఠ ఆచరిస్తాడు. వర్ణాశ్రమ ధర్మాలకు సంరక్షణ కలిగిస్తాడు. ఆ అవతార పరమపురుషుని పేరు కలికి –

ఆ విధంగా కలియుగం తీరి కృతయుగ ధర్మం నాలుగు పాదాలతో నిర్బంధంగా ప్రవర్తించగా సురలు ఆనందంగా ధరణికివచ్చి నరులతో కలిసి సగౌరవంగా ప్రవర్తిస్తూ ఉంటారు. కలియుగ దోషాలకు అదిరి బెదిరి అడవులలో తపస్సు చేస్తూ ఉన్న సూర్యచంద్ర వంశీయులైన రాజులు తిరిగి రాజ్యాలు ధర్మబద్ధంగా ఏలే పరిపాలకులౌతారు.

మైత్రేయా! విష్ణువు అంశతో పుట్టి ధర్మపద్ధతిని భూమండలంగా పాలించిన భూపతులచరిత్రలను చదివినా, వినినా మేలు కలుగుతుంది. యజ్ఞంచేసే ఫలం వస్తుంది. సిరిసంపదలు సమృద్ధిగ కలుగుతాయి.

సూర్యచంద్రవంశాలలో పుట్టిన రాజులలో మాంధాత మొదలు కుశలవుల వరకు, యయాతి మొదలు సత్యదేవుని వరకు గలవారి చరిత్రలు చదవవలసేటి, వినవలసేటి వారి చరిత్రలు శుభకరాలు.

* * *



# 7

మైత్రేయా! నీవడిగిన రాజుల చరిత్రలు చెప్పడం అయింది. ఇంకేమి చెప్పాలి? అని పరాశరుడడగగా మైత్రేయుడు చెప్పాడు.

గురుదేవా! యాదవవంశంలో కృష్ణుడుగా పుట్టిన విష్ణువు – బాల్యం నుంచి చేసిన వేమేమో వినాలని ఉన్నది అంటే శ్రీకృష్ణావతార కథ – అని చెప్పగా పరాశరుడు చెప్పాడు.

## శ్రీకృష్ణావతార కథ

సరే, మంచికథ విను. వసుదేవుడు దేవకుని పుత్రికను ధర్మపత్నిగా ప్రతిగ్రహించాడు. ఆమె పేరు దేవకి – వివాహం కాగానే సోదరుడు కంసుడు దేవకికి సమృద్ధిగా అంబరాభరణాలు అరణంగా ఇచ్చి బంధువు లిచ్చిన కట్నాలూ కానుకలూ వాహనంపై సర్ది సోదరినీ బావనూ రథమెక్కించాడు. తానే సారథియై ఆమెను అత్తవారింటికి పంపుతున్నాడు. ఊరి పొలిమేరకు రథం వచ్చింది. రథంలో ఉన్న ముగ్గురూ, అంపకం పెట్టుతూన్న బంధువులూ ఆశ్చర్యం భయం కలగలుపుగా వాని హృదయాలను ఉఱ్ఱూతలూచేట్టు ఆకాశవాణి వినిపించింది.

'దేవకి ఎనిమిదవ కానుపుగ పుట్టే బాలుడు నీ ప్రాణాలనూ రాజ్యాన్ని అపహరిస్తాడు... ఈ మాట కంసుని గుండెని రెండుగా చీల్చిందని వేరే చెప్పనక్కర లేదు. ఒకింతసేపు చలనం లేక కొయ్యలాగా ఉండి తేరుకున్నాడు. కోపంతో రెచ్చిపోయాడు. తోడబుట్టువు – ఆడది అనే జ్ఞానం, ఆదరం లేనివాడై కత్తితీసి చెల్లెలి జుత్తుపట్టుకుని ముందుకి వంచి నరకబోగా చప్పున వసుదేవుడు చెయ్యి పట్టుకుని అన్నాడు.

ఏమయ్యా! నీ వంటి మేటిదొర – ఇలాగ దారుణమైన మారణ కృత్యం – అది ఎవరిని? చెల్లెలిని – ధర్మమా? న్యాయయా? మహాద్రోహం! ఎంత అవివేకం! ఏదో గాలిమాట విని స్త్రీ వధ – పదిమంది బంధుమిత్రుల

ముందు తెగనరకడానికి సిద్ధపడడం –– 'లోకం ఏమనుకుంటుందో ఆలోచించు! నిన్న పెళ్లి చేసి నేడు అత్తవారింటికి పంపుతూ ఏ తప్పూ లేని ఒప్పులకుప్పగు చెల్లెలిని కొప్పు పట్టి పీక కొయ్యడానికి సిద్ధపడుతున్నావు ఇది నీ జీవితానికి ఎంత మాయని మచ్చ! ఇదిగో నా మాట విను.

ఆకాశవాణి మాట నీకు ఆపద కలిగించేదిగా నువ్వు భావిస్తే ఆలాటి కలత అక్కరలేదు. దీనికి కలిగే బిడ్డలను పుట్టగానే నీకు నేను స్వయంగా అప్పగిస్తాను. నా యీ మాటకి పంచభూతాలు సాక్షి...

వసుదేవుని ప్రమాణవాక్కు విని కంసుడు మనసు మళ్లి చెల్లెలి ముంజుట్టు విడిచి ఇద్దరినీ తిరిగి తన నగరం లోనికి తీసుకువచ్చాడు. ఒక ఇంట ఉంచాడు. తగిన కాపరులను నియోగించాడు. అప్పుడప్పుడు చూసి వెళ్లుతూ ఉన్నాడు.

ఇలా ఉండగా ప్రజాభారంచే వాడిన మోముతో ఆ బాధ మనవి చెయ్యడానికి ఆదిత్య యక్షగంధర్వులు వెంటరాగా బ్రహ్మవద్దకు వెళ్లింది. వినయంతో మోమువంచి చేతులు జోడించి తనకు కలిగిన ప్రజాభార పీడ పోయే ఉపాయం చూడవలసిందని.

కంసుడు, శిశుపాలుడు, జరాసంధుడు, దుర్యోధనుడు, బాణాసురుడు, నరకుడు – మొదలైన దుష్టులనూ వారి అనుచరులనూ, సహచరులనూ పేరుపేరునా చెప్పింది. బ్రహ్మ విని అమ్మా! నీకు కలిగిన ఆ బాధ తీర్చడం నాలాటివాడికి అశక్యం. భక్తరక్షామణి, అన్నిటికీ కారణభూతుడైన శ్రీమహావిష్ణువు ఏమైనా చెయ్యగలడు. పద ఆ దేవునికి మనవి చేద్దాం. అని అప్పుడు పయనించి మునులతో, దిక్పాలురతో భూదేవిని తీసుకువెళ్లి శ్వేతద్వీపం చేరాడు. ఆ ద్వీపం ఆనందానికి రూపం, వేదధ్వనికి దీపం, దేవకాంతల సంగీతానికి సకలాపం – అది వైకుంఠానికి సమీపంగా ఉన్నది. వేల సంఖ్యను



సూర్యకిరణాల వెలుగును మించి వెలుగుతుంది. ఆ ద్వీపంలో నరసింహరూపుడై ఉన్న గరుడవాహనుణ్ణి దర్శించి దండప్రణామం చేసి స్తుతించాడు –

చంద్రశేఖర సంస్తుత్యా! నమస్తే చంద్రార్కలోచనా! చంద్రశైలాధారా! పీతాంబరా! కమలాక్షా! కమలామనోహరా! కమలవాసా! కమలనాభా! ధరణీధరాధారా! గరుడవాహనా! దశకంఠ సంహారా! దశతత్త్వబోధకా! మదనజనకా! కరుణతో మమ్ము కాపాడు –

కరుణాసముద్రా! కటాక్షించు! ఇదిగో భూదేవి దుర్మదాంధులను మోయలేక వంగి కుంగి బాధపడుతూంది. ఆ బరువు పోగొట్టి ఈ దేవికి సుఖస్థితి కలిగించు సర్వశక్తి సంపన్నా!

అని విన్నవించగా విష్ణువు బ్రహ్మను ఆదరంగా మన్నించి భూదేవిని చూసి చింతించకు! నీకు కల్గిన భారబాధను పోగొట్టుతాను అని అభయరూపంగా ఊరడించాడు. తన శరీరంనుంచి తెల్లని నల్లని రెండు రోమాలను తీసి ఇదిగో ఈ రెండు నా అంశతో రెండు పురుషమూర్తులుగా ధరలో అవతరిస్తాయి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాయి. దానితో భూభారం పోతుంది. ఇంద్రాది సురలు తమ అంశలతో ఇలలో సూర్యచంద్ర వంశాలలో క్షత్రియవరులుగా పుట్టి యుద్ధాలలో ధర్మవిరోధులైన పగవారిని మట్టుపెట్టి ధర్మోద్ధరణ చేస్తారు. నా భక్తులై సుఖంగా వర్ధిల్లుతారు.

నేను ఇలలో వసుదేవుని ఇల్లాలైన దేవకికి ఎనిమిదవ గర్భాన కొడుకునై జన్మిస్తాను. నా పేరు కృష్ణుడు. నా పనిగా భూభారాన్ని తీర్చుతాను. కంసాదులను రూపుమాపి లోకానికి క్షేమం కలిగిస్తాను.

తరువాత ఇంద్రాదులు బ్రహ్మమాటపై మేరువు చేరువకు చేరి కార్యపద్ధతి ఆలోచించసాగారు. భూదేవి అప్పుడే తన బాధ తీరినట్టు సంతోషించింది.

కలహాశనుడుగా బిరుదు పొందిన నారదుడు ఈ విషయమంతా కంసునకు చెప్పి వెళ్లిపోయాడు. వెంటనే కంసుడు చింతకి చిదికి మది చెడిన వానివలె ప్రవర్తిస్తూ దేవకీ వసుదేవులను కారాగృహంలో బంధించాడు. అలా ఉండగా హిరణ్యకశిపుని కొడుకులు ఆరుగురు విష్ణుమాయవల్ల వరుసగా దేవకి కన్న కొడుకులు అయారు. మునుపు తనన్న మాట ప్రకారం వసుదేవుడు వారిని వరుసగా కంసునకు అందించగా ఆ దుర్మార్గుడు వారిని అలాగే నరికి పారవేశాడు.

దేవకి ఏడవగర్భం ధరించగా లోకమంతా ఆనందమయం అయింది. భూదేవికి వింత వికాసం, విలాసం కలిగాయి. పద్నాలుగు లోకాలూ భక్తిని ప్రదర్శించాయి. ఆ సమయంలో విష్ణువు దేవతలు వినేట్టుగా ఇలా అన్నాడు యోగనిద్రతో –

భూభారాన్ని పోగొట్టడానికి చేశాడు. నా తామస గుణ ప్రవృత్తితో ఇలపై పుట్టడానికి దేవకి గర్భాన చేరి పెరుగుతున్నాడు. ఆ పిన్న పాపని నీవు తీసుకుపోయి వ్రేపల్లెలో నందుని సంరక్షణలో ఉన్న వసుదేవుని జ్యేష్ఠపత్ని రోహిణిగర్భాన చేర్చు. ఈ పని ఎవ్వరికీ తెలియకూడదు. కంసునికి భయపడి ఒదిగిఉన్న దేవకికడుపు దిగజారిపోయిందని అందరూ అనుకుంటారు. ఒక గర్భంనుంచి ఆకర్షించి ఇంకొకగర్భానికి చేర్చడంవల్ల ఆ శిశువుకి 'సంకర్షణుడు' అనే పేరుగలవాడై వెండికొండలాగ తెల్లని మేనివాడై జన్మిస్తాడు. ఆ విధంగా పెరిగి పెద్దవాడై భద్రంగా బలాతిశయంతో భాసిస్తూ బలభద్రుడుగా ప్రసిద్ధుడౌతాడు.

నేను వర్షాకాలంలో శుక్ల పక్షాన అష్టమినాడు అర్ధరాత్రిలో దేవకీదేవి పుత్రుడుగ జన్మిస్తాను. అదే సమయంలో నువ్వు యశోదకడుపున పుట్టు. నా శక్తి ప్రేరేపణవల్లా వసుదేవుడు నన్ను ఎత్తుకుని వ్రేపల్లెకు వెళ్లి యశోద ప్రక్కన ఉంచి నిన్ను తీసుకువచ్చి దేవకికి అందిస్తాడు. అంతట – ద్వారపాలకులు నీ యేడుపు విని వడివడిగా వెళ్లి కంసుడికి చెప్పగా ఆ మూర్ఖుడు వస్తాడు. నిన్ను రాతిపలకమీద పడవేస్తాడు. వెంటనే నువ్వు పైకెగిరి అష్టభుజ శక్తిమూర్తివై ఇంద్రాది సురల జయధ్వనులతో ఒప్పుతూ క్రమంగా శుంభ నిశుంభాది దానవులను సంహరించే ఘనకార్యం చేసి ముల్లోకాలకు క్షేమంకరి వవుతావు.



నానాస్థానాలలో భూతి, సన్మతి, క్షాంతి, వృద్ధి, ధృతి, లజ్జాపుష్టి, రుషానీతి ప్రశ్రయ, ఆర్య, దుర్గ, దేవగర్భ, అంబిక, భద్రకాళి, భద్రక్షమ, క్షేమంకరి – అనే పేర్లతో ప్రాతఃకాలమందు, అపరాహ్ణకాలమందు భక్తిభరిత హృదయులై సురామాంసోపహారాలు సమర్పిస్తూ నిన్ను ఆరాధించేవారికి అభీష్టఫలాలు ఇస్తూ ఉంటావు –

అని పంపగా యోగనిద్ర వెళ్లి దేవకిగర్భాన శేషమూర్తియై ఉన్న శిశువును కొనిపోయి అతిరహస్యంగా రోహిణిగర్భమందు ఉంచింది. కంసునివల్ల భయపడడంవల్ల దేవకికడుపు దిగజారిపోయిందని ఇక్కడ అంతా చింతించారు.

తరువాత, వసుదేవునిపుణ్యంవల్ల విష్ణుదేవుని మహిమచే దేవకి గర్భవతి అయింది. అది అష్టమగర్భం – పరమపావనం అని జగమంతా స్తుతించింది –

సకలలోకాలకూ తండ్రిగా సంరక్షకుడుగా విరాజిల్లుతూన్న కమలా మనోహరుడు దేవకిగర్భాన అర్భకుడై పుట్టడం జీవలోక సంరక్షణ కర్తవ్యం కదా!

శ్రీమహావిష్ణువు ఇక్కడ పుట్టిన సమయంనందే అక్కడ వ్రేపల్లెలో యోగనిద్ర నందునిల్లాలైన యశోదగర్భాన అవతరించింది.

పద్మాక్షుడు జన్మించిన సమయమందు గ్రహాలు వక్రగతి విడిచి ఋజుగతిగా ఉన్నాయి. కృష్ణజనన సమయమందు దేవకి సూర్యోదయంతో తూర్పు దిక్కులాగా భాసించింది. ఆమెతేజస్సు చూసి చూడలేనివారై ఇంద్రాదులు ఆకసం నుండి ఇట్లన్నారు

లోకాలన్నీ తన కడుపులో ఉంచుకున్న ఆదివిష్ణువు ఇపుడు నీ కడుపున చేరాడు. నీవు ఇపుడు జగన్మాత వవుతున్నావు. పరమపురుషుడు పుట్టే సమయంలో నీకు ప్రసవసంబంధమైన బాధ లేకపోవుగాక! అని అనేకవిధాల మంగళవాక్కులు పలికారు. ఆ సమయంలో

నల్లని మేను, పున్నమనాటి చందమామను పోలిన మోము, విశాలమైన వక్షంపై మచ్చ, తెల్లతామరలాంటి విశాలనేత్రాలు, కరుణను స్ఫురించే చూపులు, నడుమున పచ్చని పట్టుపంచ, మోకాళ్ల వరకు నిడుపుగా ఉన్న నాలుగుచేతులు గలవాడై లోకాలను పాలించే పరమపురుషుడు బాలుడై దేవకి గర్భంనుంచి ఉదయించాడు.


సకలభువన రక్షకుడైన పుండరీకాక్షుడు శంఖచక్రగదాభయహస్తుడై పుట్టిన సమయంలో అన్ని లోకాలూ ఆనందభరితములయ్యాయి. సాధుజనులు సంతుష్టులయ్యారు. చల్లగా గాలులు వీచాయి. యమున మొదలైన నదులు ప్రశాంతంగా ప్రవహించాయి. సముద్రాలు ఉప్పొంగాయి. గంధర్వుల పాటలూ అచ్చరల ఆటలూ ముచ్చటగా వినవచ్చాయి. దేవతలు పుష్పవర్షం కురిపించి దివ్యదుందుభులు మ్రోగించారు. యజ్ఞాలు సలక్షణంగా వెలిగే అగ్నులతో భాసించాయి. మేఘాలు మెల్లగా ఉరిమి చల్లగా వర్షించాయి.

ఆ సమయంలో దేవకీ వసుదేవులు ఆ దివ్యమూర్తి మహిమచూసి అపరిమితానందాశ్చర్యాలతో అలా చూసి మ్రొక్కి అన్నారు. దేవా! హరీ! సకలలోక సంస్తుత్యా! సకలజగన్నాథా! శ్రీనాథా! భూనాథా! నీవు మా బిడ్డడివై జన్మించడం మా అదృష్టం.



నీ తేజస్సు చూసి కంసుడు వచ్చి అదిరి బెదిరి మమ్ము బాధిస్తాడు. కనుక ఈ రూపం విడిచి సామాన్య మానవరూపంతో శిశువై ఉండు! అని అనగా హరి వారిని కరుణించి చూసి భయపడకండి! వాడి చలం, బలం హరించడానికే నేను ఇలా మీ బిడ్డడనై అవతరించాను.

అని ఆ రూపం ఉపసంహరించుకుని సామాన్యమానవ శిశువయాడు. తరువాత వసుదేవుడు ఆ బాలుని గొని బయల్దేరాడు. చెరసాలనుంచి బయటికి వచ్చాడు. సమయం నడిరేయి. ఆ దేవుని మాయాప్రభావంవల్ల నగరంలోనే కాక చెట్లపైనున్న పక్షులుకూడా గాఢనిద్రా ముద్రితములై పోయాయి. చెరసాలముందు కాపున్న భటులు, రాత్రి నగర వీధులలో తిరిగే రక్షకభటులు, కోటలో కాపువున్న కొలువుకాండ్రు – అంతా గాఢనిద్రావశులయినారు. వసుదేవుడు వెలుపలకు వస్తున్నపుడు తాళాలూ గడియలూ వాటంతట అవే విడిపోయాయి. అంతా విష్ణుమాయ!



ఆ సమయంలో దట్టంగా మెరుపులతో, ఉరుములతో మింటికీ మంటికీ ఏకాధారగా గాలివాన కురియసాగింది. త్రోవలో దేవకీబాలునిపై చినుకు పడకుండా వేయిపడగలగొడుగును అనంతుడు పైన పట్టాడు. అంత వాన కురుస్తున్నా యమున వసుదేవునకు మోకాలిబంటి నీటి రేవయింది. అలా అనాయాసంగా నదిని దాటి ఆవలి గట్టుకి చేరాడు.

శ్రీహరిభక్తులకు సంసారసాగరం అరకాలిబంటి అవుతుందంటే ఆ హరికి తండ్రియైన వసుదేవునకు యమున మోకాలిబంటి అవడం ఆశ్చర్యమా?

ఆ జడివానలో అంధకారబంధురమైన ప్రకృతి తోడుగా వసుదేవుడు వెళ్లుతూ యమునను దాటి స్నానాలరేవువద్ద నందాదులను కొంచెం దూరాన చూశాడు. పన్ను చెల్లించడానికి వారు కంసుడి దగ్గరకు వెళ్తున్నారు. తన సమాచారం వారికి చెప్పడం ఆ సమయంలో తగదని చూచీ చూడనట్లు చాటు మాటుగా నడిచి వ్రేపల్లెలో ప్రవేశించాడు. అలాగే నందుని మందిరానికి వెళ్లాడు. ఆ సమయంలో దుర్భరమైన ప్రసవవేదనతో యోగనిద్రామహిమచే మైమరిచి తనకి కూతురు పుట్టిందన్న తెలివికూడా లేక యశోద నిద్రాముద్రితయై ఉంది. వసుదేవుడు మెల్లమెల్లన నడిచి వెళ్లి ఆ ఆడుబిడ్డని తీసుకుని తన కొమరుని అక్కడ ఉంచి వెలుపలకు వచ్చాడు. వ్రేపల్లెలో ఆ చీకటిరేయిని తెలివిగా ఉందనలేము. నందునింట ఉంచి వెలుపలికి వచ్చిన వసుదేవుడు వెను తిరిగి వచ్చి యమునను దాటి చెరసాలలో ప్రవేశించాడు.

అంతలో కావలివారు లేచి లోనికి చూశారు. బిరబిర కంసుని వద్దకు పోయి దేవకి ప్రసవించినట్టు చెప్పారు. ఆ మాట విని కంసుడు నిప్పుతొక్కినట్లు ఉడికి ఉరికివచ్చి గండుపిల్లిలాగా పురుటింట దూరాడు.



కంసుని చూచి దేవకి వేడినిట్టూర్పు విడిచి కలత పడిన మనసుతో వణకుతూ కన్నీటిని అరచేత ఒత్తుకుని అన్నది.

అన్నా! నీ చెల్లెలినై ఆడుబిడ్డతో ఆనందం, మగకూనలతో ముచ్చట పొందలేని దౌర్భాగ్యురాల నయాను.

నా ముద్దులకొడుకులను ఆరుగురుని నిర్దాక్షిణ్యంగా మింగావు. ఈ ఆడుబిడ్డనైనా విడిచి నా కడుపుఉడుకు కొంత తీర్చు. అని ఎంతో చింతిస్తూన్న ఆ బాలింతరాలిమాటలు మూర్ఖుడు పెడచెవిని బెట్టి పురిటి పాపను దేవకి చేతుల్లోంచి బలిమితో లాక్కున్నాడు. చ[్రాతిమీద పడవేశాడు. ఆ పాప చప్పున పైకెగిరి ఆకాశంమీద భయంకారాకారంతో నిల్చి భీకరాయుధాలు ధరించిన ఎనిమిది భుజాల స్త్రీమూర్తియై వికారంగా నవ్వి అదలిస్తూ అన్నది.

ఏరా! నన్ను హింసించాలనుకున్నావా? అది నీ వల్ల అయేపనేనా మూర్ఖా! మునుపు ఆకాశవాణి పల్కినట్లు నిన్ను తెగనేసే మహాత్ముడు సకలసురరక్షకుడు దుష్టశిక్షకుడు పుట్టి వేరొకచోట పెరుగుతున్నాడు –

అని వాడు చూస్తూ ఉండగానే దేవగణాలచే గంధపుష్పోపహారాలతో పూజలంది అదృశ్యురాలయింది.

కంసుడికి ఏమీ తోచలేదు. పౌరుషం సన్నగిల్లింది. తెలివి తప్పి నట్టయింది. ఒకింత సేపటికి తెప్పరిల్లి వెనుదిరిగిపోయి తనకిష్టులైన, పూతన, ధేనుకాసురాది రాక్షసులను రప్పించి వారితో అన్నాడు.

రాక్షసవర్యులారా! నా బలపరాక్రమాలు మీకు తెలుసును., ఎదురు లేకుండా రాజ్యం పాలిస్తున్నాను. నన్ను చంపడానికి దేవతలు ఏదో ప్రయత్నం చేస్తున్నారని అస్పష్టంగా విన్నాను. నా పరాక్రమం వాళ్లకి తెలియదా?

ఇంద్రుడు నా మీదికి వచ్చి నాచే వెన్ను విరుగునట్లు తిని తిరిగి చూడక పారిపోయాడు. ఎన్నిమార్లో మీకు తెలుసును ఇప్పుడు నన్ను చంపుతాడా?

బ్రహ్మవిష్ణుమహేశ్వరాది సురనాయకులు కూడా నాముందు ఎండు గడ్డిపోచలు – అలాటి నాకు లోకంలో ఎదిరింపా? ఒక్క జరాసంధుడు తప్ప మిగిలిన రాజులంతా నా ప్రతాపాగ్నికి ఎండు సమిథలే.

ఇక – ప్రస్తుతం – మాట. మా దేవకికన్న ఆడుబిడ్డ అనినది. నన్ను చంపడానికి దేవుడట! ఎక్కడో పుట్టి పెరుగుతున్నాడట! – ఈ మాటే ఒకప్పుడు నారదుడినోట విన్నాను. మీరు చెయ్యవలసేది. ఈనాటినుంచి ఇలలోగల చిన్న బిడ్డలను నిర్దాక్షిణ్యంగా చంపివస్తూ ఉండండి – వెళ్లండి – అని అన్నాడు. వారు సరే అని పలు రూపాలు ధరించి ధరణిపై సంచరిస్తూ పసిపాపలను తెగనరికి వారి రక్తం తాగసాగారు.

తరువాత – కంసుడు అంతఃపురానికి పోయి దేవకీవసుదేవులను రప్పించి కల్లబొల్లి మాటలతో వారిని మన్నించి

కటకటా! చెయ్యరాని దారుణప్పని చేసి మీకు తీరని బాధ కలిగించాను. మీరు ఎంతో అమాయకులు – నా వల్ల అలా పసిపాపలను పోగొట్టుకోవలసి వచ్చింది. అయినదేదో అయింది. విచారించి లాభం లేదు. మన్నించండి. అంతా దైవంవల్ల జరిగేదే. అని చెరసాలనుంచి వారిని ఇంటికి పంపించాడు – వాని మనసు మాత్రం రగులుతూనే ఉంది.

తరువాత ఒకనాడు వసుదేవుడు వ్రేపల్లెకు వెళ్లాడు. నందుడు వసుదేవునకు చిన్ననాటి మిత్రుడు. నందుడు వసుదేవునకు ఆదరంగా ఆప్యాయంగా స్వాగతం పలికి యశోదచేతులలో ఉన్న కపట బాలకుణ్ణి అందించాడు. వసుదేవుడా బాలునెత్తుకుని ముద్దులాడి నందా! మీరు



అదృష్టవంతులు. చక్కనికొడుకు మీవాడయాడు. ఈ బాలుణ్ణి చూస్తూ ఉంటే నాకే ఎంతో ముచ్చట కలుగుతూంది. మీ మాట వేరే చెప్పాలా? ఈ పాపణ్ణిచూస్తే మీకెంత మోహమో నాకు అంతకు రెండింతలు కలుగుతూంది. మీకూ నాకూ ఈ బాలుడు సమానుడే –

నందా! ఒక మాట. రోహిణికొడుకు మీ వద్ద తిరుగుతున్నాడు. వానిని నీ కొడుకుగానే చూస్తూ పెంచుతూ ఉండండి. ఇంకొకమాట. కంసుడు పసిపిల్లలను చంపే దారుణకార్యం తలపెట్టాడు. ఆ దుర్మార్గునికి తెలియనట్టు మీరిక్కడి నుంచి వేరొక చోటికి విలాసం మార్చడం మంచిది. సంవత్సరాంతమందు కట్టవలసే పన్నులు వానికి కట్టిన తరువాత మధురకు ఇలా దగ్గరగా ఉండడం ఎందుకూ? అమాయకంగా అగ్గి దగ్గరకూ మోసగాడైన పరిపాలకుని వద్దకూ చేరితే వారివల్ల అపాయమే తప్ప మేలు కలగదు.

ఇలా వసుదేవుడనగా నందాదులు ఆలోచించి సరే అని అక్కడ నుంచి నివాసాలు మార్చి పసువులకూ తమకూ ఆహారం, నీరూ ఉన్నచోటికి పోయారు. హాయిగా ఉన్నారు.

అలా ఉండగా నందుని ఇంట అల్లారుముద్దుగా బాలకృష్ణుడు పెరుగుతూండగా తెలిసి కంసుడు పంపిన పూతన అని రాకాసి అందకత్తెగా రూపం మార్చుకుని నడురేయిని నందుని ఇంట ప్రవేశించింది. అంతా నిశ్శబ్దం... నిద్రలో ఉన్న బాలకృష్ణుణ్ణి మెల్లగా ఎత్తుకుని బుగ్గలు నిమిరి విషంపూసిన చనుబాలు తాగించింది. ఆ జగజెట్టి విషపుపాలతో పాటు దాని ప్రాణాలుకూడా పీల్చగా అది ఓ అని అరచి కిందపడింది.

కంసుడు పంపిన పూతన ఈ విధంగా బాలకృష్ణుడికి బలి అయిపోయింది. దాని అరపు గోకులంలో ఎసరు పుట్టించింది. గాఢనిద్రలో

ఉన్నవారు త్రుళ్లిపడి లేచి గుమిగా వచ్చి అక్కడ చచ్చిపడి ఉన్న రక్కసిని చూశారు. యశోదానందులు రక్కసి తొడపై ఆడుతూన్న బాలకృష్ణుణ్ణిచూసి లేపి ఎత్తుకుని ఆవు తోకతో దిగదుడిచి గోమయంతో తిలకం దిద్ది నారాయణ కవచం చదివి తమయింట ఒక ఉయ్యాలలో పడుకోపెట్టారు.

ఇంతవరకు ఇలాటి ఉపద్రవం ఏదీ ఇక్కడ జరగలేదు. ఇదేదో వింతగా చింతగా ఉన్నది అన్నారు గొల్లపెద్దలు.

ఉయ్యాలలోఉన్న ఆ కపట బాలుడు అక్కడికి దగ్గరగాఉన్న ఒక చిన్నబండిని కాలితో తన్నాడు. దానిలో యశోద భద్రపరిచిఉన్న పాలు, పెరుగు, వెన్న, నెయ్యి – ఇంక ఇంటికి కావలసిన పదార్థాలూ ఉన్న పాత్రలు కిందపడి పగిలిపోయాయి. అది చూచి అక్కడఉన్న గొల్లలపిల్లలు వచ్చి యశోదకి చెప్పారు. ఆమె వెళ్లి చూసి వాటినన్నిటినీ జాగ్రత్తగా తీసి పాత్రలలో వేసి దధి పుష్పాక్షతలతో ఆ బండిని పూజించి, బాలకృష్ణుణ్ణి చూసి అలిగింది.

అంతలో గోపకాంతల కడకు వచ్చి అమ్మా! యశోదా! నీ చిన్న పాపడు నిన్న కొండంత రక్కసిని చంపాడు. ఇంటి సామానులబండిని విరగదన్నాడు. వీడు ఇలాగే పెరిగి పెద్దవాడైతే ఎందరి కొంపలకి నిప్పు పెడతాడో!

ఇలాగ హెచ్చరికగా ముచ్చటలాడి వెళ్లారు. తరువాత వసుదేవుడు రోహిణి కొడుకైన బలభద్రునకు, దేవకీనందనుడైన కృష్ణునకు నామకరణం చేయించాలని సంకల్పించి కులగురువైన గర్గుని ఆహ్వానించి విషయం చెప్పి గోకులమునకు పంపించాడు. గర్గుడు నందుని మందిరానికి వెళ్లాడు. తనంతతాను చూడడానికి వచ్చినట్లు చెప్పాడు. యశోదానందులతో కొంతసేపు ముచ్చటించాడు. తరువాత – ఎవ్వరికీ తెలియనట్లుగా రోహిణీ నందనునకు రాముడని, దేవకీకుమారునకు కృష్ణుడని నామకరణం చేసి



వెళ్లిపోయాడు.

రామకృష్ణులు తెలుపు నలుపు శరీరాలతో శోభాయమానమూర్తులై యశోదానందుల పెంపకంలో గారాముగా పెరుగుతూ ఉన్నారు.

బాలకృష్ణుడు క్రమక్రమంగా ప్రాకడం, కూర్చుండడం, తల్లిచేయి పట్టుకుని అల్లనల్లన అడుగులు వెయ్యడం – ఎండిన ఆవుపేడ శరీరానికి పట్టించుకుని లేగలతో వీధులలో పరుగులెత్తడం, ఆ దూడలతోకలు పట్టుకుని అవి పరుగెత్తకుండా నిలబెట్టడం – ఇలాటి చేష్టలతో అన్ననుకూడా కలుపుకుని చిల్లరమల్లరగా నడవసాగాడు.

అంతకంతకు పెంకెచేష్టలుకూడా పెరిగాయి. ఇరుగుపొరుగు ఇళ్లలోదూరి ఆ ఇల్లాండ్రకు కనిపించక వారు ఉట్టిపై పెట్టిన పాలు వెన్న ఆరగిస్తూ దగ్గరకు వచ్చిన చిన్న గొల్లపిల్లలు మూతులకు రాసి పెరటిదారిన పారిపోతూ, మరి కొందరి ఇళ్లలో మరుగుతూన్న పాలకుండలలో కవ్వంతో పగలగొట్టి పారిపోవడం ఇటూ అటూ ఉన్నవారు గొల్ల జవరాండ్రు దగ్గరకు రాగా తుర్రున తూరీగలాగ ఎగిరి గంతులువేసి తల్లివద్దకు వచ్చి ఏమీ ఎరగనట్టు ఆమె అద్దాలలో కూర్చుని ముద్దులు చూపడం. ఇదీ బాలగోపాల కృష్ణుని శైశవచర్య.

అలా ఉండగా ఒకనాడు కృష్ణుని తన ఇంటిలో చూసి పారిపోగానే అటూయిటూ ఉన్నవారికి చూపి ఒక వ్రజభామిని నలుగురితో ఆలోచించింది కర్తవ్యం – అందరూ ఒక నిర్ణయానికి వచ్చి యశోద వద్దకు వచ్చారు. గట్టిగా ముదలకిస్తూ అన్నారు.

అమ్మా! యశోదా! ఏమిటమ్మా ఇలాటి కొడుకుని కన్నావు. వీడు మనిషేనా? మా ఇళ్లలో జొరబడి వెన్న తిన్నంత తిని ఉన్నది ఇంటినిండా

విరజిమ్మడం – ఇది ఇంత చిన్న వయసులో ఉన్న పిల్లలెవరైనా చేసే పనేనా? మమ్మల్ని ఇళ్లలో శాంతిగా బ్రతకకుండా చేస్తున్నాడు. నీకు తెలియదేమో ఇంకా యీ దుందుడుకు పిల్లవాడు చేసే చేష్టలు చెప్పలేము. చెప్పకుండా ఉండలేము. మీ ఆయన మాకందరికీ పెద్ద. మరి అతని భార్యకి, నీకు నీ కొడుకుపై ఏమని చెప్పగలం? అని కృష్ణుని వ్రేళ్ల ముద్రలున్న వెన్న బుంగలు చూపించారు. యశోద నిదానించి చూసి పోల్చింది. ప్రక్కనే ఉన్న చిన్నికృష్ణుణ్ణి చూసింది. అలుకతో పలికింది.

ఏమిరా! కాలసిన పదార్థాలన్నీ సమృద్ధిగా ఇంటిలో ఉండగా నువ్వు ఊరంతా తిరిగి అందరిళ్లలో జొరపడి అల్లరిచేస్తున్నావు. తల్లిదండ్రుల మాట దాటవచ్చునా? పాలూ, వెన్న, పెరుగూ, కవ్వం – వాటితో రచ్చ. ఇదా నీపని. ఇంటిలో ఉన్నట్టే కనిపిస్తావు. అన్ని ఇళ్లలోనూ అల్లరి చిల్లర పనులు చేస్తూ అంతలోనే మాయమవుతావు. నిన్నేమనాలి?

అని దామపాశంతో ఆ పెంకె కొమరుని నడుంచుట్టి కొన ఒక రోలుకు కట్టి – ఇక ఇలా ఉండు. అని వారిని పంపించి తాను లోనికి వెళ్లింది. బాలకృష్ణుడు అదురుతూ బెదురుతూ తల్లినీ, గొల్లపడుచులను చూస్తూ తల్లి కొట్టుతుందేమో అన్నట్టు నటిస్తూ అందరూ చూస్తూ ఉండగా ఆ రోలు ఈడ్చుకువెళ్లి ఇంటికి ఎదురుగా కొంతదూరాన ఉన్న రెండు జంట మద్దిచెట్ల నడుమనుంచి వెళ్లాడు. ఆ ఈడ్వడం మూలాన రెండు చెట్లూ విరిగిపడ్డాయి. ఆ పడడం పెద్దమోత. ఆ మోత గొల్లపల్లెలో భీకరంగా ప్రతిధ్వనించింది. ఆ సమయంలో అక్కడ ఉన్నవారంతా వడివడిగా వచ్చి పడి ఉన్న చెట్లనూ, రోలితో ఆడుతూన్న బాలకృష్ణుణ్ణి చూసి ఆశ్చర్యపడ్డారు. కొందరు గొల్లపడుచులు బిరబిర వెళ్లి ఓయమ్మా యశోదా! నీ గారాబు కొడుకు చూడు. ఏమి చేశాడో ఆ రోలితో వెళ్లి మద్దిచెట్లను పడగొట్టి





వాటిమధ్య ముద్దు మాటలాడుతూన్నాడు అంతచిన్నవాడు అలాటి పనిచెయ్య గలడా? నీ కొడుకు సామాన్య మనిషి కాడు. దయ్యమే. అని అరిచి చెప్పగా యశోద విని సంభ్రమాశ్చర్యాలతో అల్లుకుపోయి వడివడిగా కొడుకున్న చోటికి వచ్చి నడుముకీ రోలుకీ కట్టిన దామం (తాడు) ముడివిప్పి చిన్నికృష్ణుణ్ణి అక్కున జేర్చి శిరసుమూర్కొని, చెక్కిళ్లు నిమిరి ఆనందబాష్పాలతో అభిషేకం చేసింది. దామం ఉదరబంధనంగా కలవాడయాడు కనుక కృష్ణునకు అదొక పేరు. ఏది? దామోదరుడు...

ఆ దశలో గొల్లలు కలతపడ్డారు. మొన్నరాత్రి ఒక రక్కసి వచ్చి చచ్చింది. నిన్న బండ ముక్కచెక్కలయింది. ఈనాడు నిష్కారణంగా జంట మద్దిచెట్లు విరిగిపడ్డాయి. ఇదంతా భయంకరంగా ఉంది. అలాగే పసువులకు గరిక, నీరు పల్చగా ఉంది. అవి వాడిపోతే మన బతుకులు వాడిపోతాయి.

కనుక యీ దురవస్థ తప్పించుకోవాలి. అన్ని విధాలా మనకి క్షేమంకరమైన చోటికి పోవడం మంచిది. ఆలోచించగా బృందావనం మనకు అన్ని విధాలా వాసయోగ్యం అని నిర్ణయించుకున్నారు. ఆ రాత్రి గడిపి వేకువజామున లేచి పాలకుండలతో, వెన్న గిన్నెలతో, నేతి బుంగలతో కావళ్లు నింపి లేగలతో ఆలమందలను అల్లనల్లన నడిపిస్తూ ఆటలాడుతూ పాటలు పాడుతూ నడక సాగించి బృందావనానికి చేరారు.

అక్కడ యమునకు దగ్గరగా నివాసాలు ఏర్పరచుకున్నారు. అలాగే గోశాలలు నిర్మించారు. పచ్చగరిక హెచ్చుగా ఉన్నచోట ఆవులను మేపుతూ యమునలో నీళ్లు త్రాగిస్తూ శాలలో కట్టి పచ్చగడ్డి వేస్తూ కాపాడుకుంటున్నారు. ముచ్చటగా ఆడుతూ పాడుతూ ఆనందంగా గడుపుతున్నారు.

రామకృష్ణులు గొల్లపిల్లవాండ్రతో కలిసి గోవులనూ దూడలనూ కాస్తూ ఉన్నారు. రకరకాల ఆటలతో, పాటలతో, బంతులాటలతో బృందావనంలో ఆనందంగా ఉంటున్నారు.

అలా ఉండగా వర్షాకాలం వచ్చింది. ఆ కాలంలో యమున ఉవ్వెత్తుగా పొంగసాగింది. ప్రకృతి ప్రశాంతమయింది... క్రమంగా వాన వెలిసింది.

ఒకనాడు కృష్ణుడు బలభద్రునీ, గొల్లపిల్లలనూ ఆవులవెంట పంపి కొందరు బాలురతో తాను యమునగట్టుకి చేరి అక్కడ కడిమిచెట్ల నీడలో విహరిస్తూ ఉన్నాడు. ఆ సమయంలో –

కొంచెం దూరంగా యమునలోంచి మంటలూ విషపుగాలీ పైకి రావడం చూశాడు. ఆ మడుగులో కాళీయుడు అనేక ఒక విషసర్పరాజు – వానిఆర్భాటం అదంతా. ఆ విషపుగాలిచే ఆ ప్రాంతాన ఉన్న చెట్లూ, తీగలూ మాడి బొగ్గయి పోయాయి. ఆ నీరు త్రాగిన ప్రాణి బ్రతుకు సున్న. కృష్ణుడు



గ్రహించాడు. వీనిని ఇక్కడి నుంచి పంపించాలి అని అనుకున్నాడు. ప్రక్కనున్న చెట్టు ఎక్కి దాని కొమ్మ మీంచి మడుగులోకి దూకి నీరు కలతపెట్ట నారంభించాడు. ఆ ఎగసిన నీరు అగ్నిమంటలను రొప్పుతూ కిందా మీదా కలత పుట్టించింది. ఇదేమి? నీరు కిందు మీదవుతూందే. ఏదో చప్పుడు. ఎవడో నా ప్రదేశంలో నిప్పురువ్వుతున్నాడు అని కోపించి సేవకులతో, కాంతలతో కాళీయుడు మీదికి వచ్చాడు.

తోకతో వీపుచుట్టి కాలూ చేయీ కదలకుండా బంధించి విషాగ్నిజ్వాలలు రుప్పుతూ కోరలతో కరుస్తూ బాలకృష్ణుణ్ణి బాధించాడు. ఆ దశలో గట్టున చెట్టుకింద ఉన్న గోపబాలురు భయపడి పరుగు పరుగున పోయి నందయశోదలకు కృష్ణుని స్థితి ఏడుస్తూ చెప్పారు. ఆ దుర్వార్త విని యశోదానందులు ఉలికి బెంగపడి గబగబ యమున తీరానికి వచ్చారు. వారి ననుసరించి బలరాముడు, గోపబాలికలూ, గొల్లపెద్దలూ ఆవురు బావురు మంటూ వచ్చారు. భయంకరమైన పాముపడగతో చుట్టుకుని ఉన్న బాలకృష్ణుణ్ణి చూచి యశోదానందులు, చుట్టూ ఉన్నవారు ఏమి చెయ్యడానికి తోచక రోదించసాగారు. ఆ దశలో బలభద్రుడు వారిని ఓదార్చ లేక కృష్ణుణ్ణి చూచి అన్నాడు –

నీ మహిమ తెలియలేక తల్లిదండ్రులూ, చుట్టాలూ విలపిస్తున్నారు. చూడు ఎంతసేపా లీల? కృష్ణా! భూలోకంలో ఉన్న దుష్టులను సంహరించి ధర్మవర్తనులను సంరక్షించడానికి అవతరించిన ఆదినారాయణుడవు ఇక విజృంభించి ఆ పాము గర్వం అణచి బయటకి రా!

అన్న అన్నమాట విని ఆ చిన్నితమ్ముడు చిరునవ్వుతో చూసి శరీరం పెంచాడు. పాముకట్లు పటపటమని పేలిపోయాయి. వెంటనే కృష్ణుడు కాళీయుని తలలమీదికి ఎగిరి కాళ్లతో చిత్రవిచిత్రగతులతో నాట్యం

ఆరంభించాడు. రెండుచేతులతో రెండు తలలు పట్టి నడిమి తలపై నిలిచి పాదఘట్టనలతో పగిలేట్టు తన్నాడు. తలపగిలి నెత్తురుకారుతూ బలహీనుడైన కాళీయుడు ఒకింత వెలితిగా పీనుగయాడు. శక్తిహీనుడై అలా వంగి లొంగి ఉన్న భర్తను చూసి వాడిపోయిన మొగాలతో వాని భార్యలు నాగకాంతలు వచ్చి కృష్ణునకు నమస్కరించి అన్నారు

దేవా! వాసుదేవా! దేవకీనందా! సకలలోక రక్షాదక్షా! రక్షించు! రక్షించు! దేవా! లోకాలన్నీ ఆశ్రయించి ఉన్న నీ పాదాలబరువును అల్పబలుడైన ఈ నాగరాజు మోయగలడా? నీవు గజరాజువి. మా మగడు దోమ. మా మనవి మన్నించు! మా మగని తప్పు క్షమించు! మాకు పతిభిక్ష అనుగ్రహించు! అని దీనస్వరంతో ప్రార్థించగా కరుణించి కృష్ణుడు కాళీయుని తోకను వదిలాడు. కిందికి అడుగు వేశాడు. అపుడు నెత్తురు కక్కుతూన్న నోటితో చూచీ చూడలేని కళ్లతో, బొంగురుబోయిన గొంతుకతో కాళీయు డన్నాడు.

పద్మదళాక్షా! ఆనాడు నీ ఆజ్ఞని తలదాల్చి సముద్రంలోంచి నా భార్యలతో సహా వచ్చి నేనిక్కడ ఉన్నాను. నావల్ల కలిగిన తప్పేమి? కాగా మా జాతి పాపజాతి. నన్ను ఆ జాతిలో పుట్టించావు. మరి నేను ఆ జాతి ప్రవృత్తిని అనుసరించి కదా ప్రవర్తించేది. దానివల్ల తప్పేమి? సరే. ఏదో అయింది ఇక నేను ఏమి చెయ్యాలో ఆజ్ఞాపించు.


కాళీయుని మాటలకు కరుణించి కృష్ణుడు నువ్వు ఇక ఇక్కడ ఉండక నీ వారందరిని వెంటపెట్టుకుని సముద్రానికే పో. నీ పడగ మీద ఉన్న నా పాద చిహ్నాలు చూసి గరుడుడు నిన్ను ఏమీ బాధించడు. అని అనగా కాళీయుడు తనవారినందరినీ తనతో ఉంచుకుని మడుగునుంచి బయల్వెడలి సముద్రానికి చేరి దానిలో ప్రవేశించాడు.



తరువాత కృష్ణుడు మడుగు నుంచి వెడలి గట్టుకి రాగా గోపికలు, గోపకులూ పరమానందంతో కరతాళధ్వనులు చేస్తూ కౌగిలించుకున్నారు. యశోదానందులు చేరదీసుకుని శిరసు మూర్కొని వీపు నిమిరి ముద్దుపెట్టుకుని ఆనందంగా కౌగలించుకున్నాడు. అందరూ చిన్నికృష్ణుని సాహసకృత్యాన్ని ప్రస్తుతిస్తూ గోకులానికి వెళ్లారు.

ఇలాగు రామకృష్ణులు గోపబాలురతో కలిసి వింత వింతల పనులతో వారిని వినోదింపచేస్తూ, బాల్యచేష్టలుగా ప్రవర్తిస్తూ గోపాలకులై ఉన్నారు.

ఒకనాడు గోపబాలురతో కలిసి ఆలమందల వెంట వెళ్లి వెళ్లి ఒక తాటితోటకి చేరారు. పశువులను మేతకి విడిచి తాము తాటిచెట్ల క్రింద కూర్చున్నారు. ఒకింత సేపటికి గోపబాలురు వచ్చి ఇక్కడ మనం ఉండవద్దు. ఈ తాటితోటలో ధేనుకుడు మొదలైన రక్కసులున్నారని పెద్దలు చెప్తారు.



మరొకచోటుకి పోదాం లెండి అనగా రామకృష్ణులు బెదరకండి. ఇక్కడ రక్కసులున్నారా? అయితే వాళ్లని హతమార్చి ఈ తోపు అందరికీ ప్రవేశ యోగ్యం అయినట్లు చెయ్యాలి – అని అన్నదమ్ములిద్దరూ తోట లోపలకు వెళ్లారు. నలుదిక్కులూ మార్మోగేట్లు భీకరంగా అరవనారంభించారు. ఆ ఘోష విని ధేనుక ప్రముఖులైన రాక్షసులు గాడిదరూపాలతో వచ్చారు. కృష్ణుణ్ణి పలువిధాల బాధించసాగారు. అదిచూచి బలరాముడు తనమీదికి వచ్చిన రక్కసులను పట్టి తాటిచెట్టుకు దాపుచేసి గిరగిర తిప్పి కొట్టుతూ తుండెములుగా పడగొట్టాడు. అంతే ధేనుకుడు గాడిదరూపుతో వచ్చి కృష్ణుణ్ణి ఎదిరించగా కృష్ణుడు వాని కాళ్లు పట్టుకుని గిరగిర తిప్పి చెట్టుకి వేసి కొట్టి ఉసురు ఎగరగొట్టాడు. వాని చావుచూసి వెనుకనున్న రాక్షసులు అదిరి పారిపోయి ప్రలంబాసురుణ్ణి చేరి ధేనుకాసురుని చావు చెప్పారు. ఆ విషాదవార్త విని ప్రలంబుడు విచారించాడు. ఏదో ఉపాయంతో ఆ అన్నదమ్ములను దెబ్బకొట్టాలని ఆలోచిస్తూ ఉన్నాడు.

ఆ విధంగా తాటితోట రాక్షసులబాధలనుండి విముక్తి పొంది మనుజులకూ, పశువులకూ స్వేచ్ఛగా విహరించడానికి యోగ్యమయింది. రామకృష్ణులు ఆ తాళవనంలో ఆటపాటలతో తోడి గోపకులనూ, గోవులనూ సంతోషపరుస్తూ తాటిపళ్లు అందరికీ జారవిడుస్తూ వినోదంగా కాలక్షేపం చేస్తూఉన్నారు.

అలా ఉండగా ఒకనాడు ప్రలంబుడు, గొల్లపిల్ల వాని రూపంలో వచ్చి గోపబాలురతో కలిసి ఆటలాడుతూ బలరాముణ్ణి తన భుజాలపై ఉంచుకుని భయంకరమైన నిజరూపంతో పై కెగిరాడు. కాని బలభద్రుని మోయలేక దబ్బున కిందికి దిగి పట్టబోయాడు. ఆ దశలో కృష్ణుడు కనుసంజ్ఞ చెయ్యగా బలరాముడు ప్రలంబుని జుట్టు ఎడమచేత పట్టి మూడు ఊపులూపి



కిందపడగొట్టి కాలితో గుండె అదిమి పిడికిటితో తలమీద పొడిచాడు. ఆ పోట్లకు ప్రలంబుడు తల పగిలి నెత్తురు కక్కుకుంటూ చచ్చాడు. ఆ తీరున ప్రలంబుడు చావడం చూసి గోపబాలురు ఆనందంతో చిందులు తొక్కుతూ చప్పట్లు కొట్టుతూ బలభద్రుణ్ణి పొగిడారు. ప్రొద్దుపోయే సమయం కాగా అందరూ గోకులానికి చేరారు. బలరామునిచే ప్రలంబునిచావు తమ కొడుకులవల్ల విని గోపాలుర పెద్దలు ఆశ్చర్యానంద పరవశులయారు. ఇలాగ రామకృష్ణులు ఆశ్చర్యకరంగా, అందరికీ ఆనందంగా ప్రవర్తిస్తూ ఉన్నారు.

అలా ఉండగా శరత్కాలం వచ్చింది. అప్పుడు నందాదులు ఇంద్రప్రీతిగా యాగం చేయాలని సంకల్పించి దానికి ఉండవలసిన సామగ్రి సమకూర్చుకుంటూండగా కృష్ణుడు నందునితో అన్నాడు. ఏమి కోరిక? ఇంద్రునిగూర్చి మీరేదో చేయాలనుకుంటున్నారు?

అని అనగా నందుడు చెప్పాడు. ఇంద్రుని మాటపై మేఘాలు సమృద్ధిగా వాన కురుస్తాయి. దానివల్ల భూమి సస్యసమృద్ధితో రాణిస్తుంది. పంటలు సంతృప్తిగా ఉంటాయి. దానివల్ల ప్రజలంతా సుఖంగా జీవిస్తారు. దేవసంతర్పణలు ఏలోపం లేక జరపవచ్చు. ఆవులు పచ్చగరిక కడుపునిండా మేస్తూ కడవలనిండా పాలిస్తాయి. ఆ విధంగా ఏలాటి కొరత లేకుండా జీవితం గడుస్తుంది. కనుక లోకోపకారకంగా ఏటేటా ఇంద్రోత్సవం చేస్తూ ఉంటాం.

నందుని మాట విని కృష్ణుడు – ఇంద్రునకు కోపం వచ్చేట్టుగా ఒక మాట అన్నాడు.

అయ్యా! దైవం నిర్ణయించిన ప్రకారం జీవితాలు గడుస్తాయి. కాగా వారి వారికి ధర్మశాస్త్రం నిర్ణయించినట్లు నడవాలి. మనకి గోవులను పెంచి వాటి వల్ల బ్రతకడం ప్రధానం – ఆ విధంగా ప్రకృతికి సంబంధించి పర్వతాలు

మనకు దేవుడు. ఇల్లూ వాకిలీ విడిచి పక్షుల్లాగా అడవులలో తిరుగుతూ బ్రతికే మనకి పర్వతాలే పరమదైవాలు. కొండలు దుర్జనులను మృగరూపాలు ధరించి శిక్షిస్తాయి. సజ్జనులను రక్షిస్తాయి. కనుక పర్వతాలకీ, గోవులకూ – ప్రియంగా మనం యజ్ఞాలు చెయ్యడం మంచిది. ఇంద్రుడితో మనకేమి పని?

బ్రాహ్మణులు మంత్రాలు జపించాలి. కర్షకులు నాగలిని పూజించాలి. గోపాలకులు గోవులనూ, కొండలనూ పూజించాలి. అడవులలో నివసించే ఆలమందలను గోవర్ధనగిరి ప్రాంతానికి తోలుకువెళ్లి ఆ పర్వతానికి ఉత్సవం చేసి పొట్టేళ్లను చంపి బహువిధాలైన పూజలతో జాతరచేసి ఆగమ పద్ధతిని హోమం చేసి బ్రాహ్మణులకు పాయసం అప్పాలూ కూరలూ కలిపిన అన్నం విందు జరిపించాలి. వారి భోజనం అయిన తరువాత గంధపుష్పాక్షతలతో అలంకరించిన ఆవులతో గిరిప్రదక్షిణం చేస్తే మనకి శోభనం కలుగుతుంది –





అని చెప్పగా విని నందుడు ఆనందించి గోపాలకులకు చెప్పాడు. అందరూ ఏకవాక్కుగా అంగీకరించి కృష్ణుడు చెప్పిన చొప్పున గిరికి సంబంధించిన యజ్ఞం నిర్విఘ్నంగా చేశారు. తరువాత గోవులతో వృషభాలతో కలిసి ఆటలాడుతూ పాటలు పాడుతూ చప్పట్లుచరుస్తూ గిరి ప్రదక్షిణం చేశారు. అంతలో కృష్ణుడు కొండశిఖరాన తన రూపం అందరికీ కనిపించేట్టుచేసి వారికి క్షేమకరంగా ఫలాలిచ్చాడు. తరువాత అందరితో కలిసి గోకులానికి వచ్చాడు.

ఇంద్రుడు నందుడు చేసిన అపరాధానికి కోపించి ప్రతిక్రియ చెయ్యాలని సంకల్పించి మేఘగణంలో సంవర్తక మేఘాన్ని రప్పించి వెళ్ళు బృందావనం ప్రక్కనున్న గోకులంలో అందరికీ అపాయకరంగా ఎడతెరిపి లేక రాళ్లవాన కురిపించు అని పంపించాడు. ఆ మేఘం తనగణంతో కదిలి గోకులంపైన శిలావర్షం కురియనారంభించింది. మెరుపులు, ఉరుములు, పిడుగులు దశదిశలా ఆక్రమించాయి. ఆ ధాటికి గోకులం అవాచ్యమైన బాధకు గురికాగా చూసి కృష్ణుడు నందాదులకు ధైర్యం కలిగించి తనకు చేసే యజ్ఞం చెయ్యలేదని ఇంద్రుడు చేసిన చెడ్డపని ఇది. భయపడకండి అని అందరూ అచ్చెరువందగా ముచ్చటలాడుతూ గోవర్ధనగిరిని అవలీలగా మీదికెత్తి గొడుగులాగా పట్టాడు. అదే ఎడమ చేతిలో అవలీలగా అనాయాసంగా, తాటాకు గొడుగులాగా ఆ కొండ ఉండగా గో గోపీ బాలకులు దానికింద ఏ చీకాకూ లేకుండా హాయిగా ఉన్నారు. అలా ఏడు దినాలు ఏకధారగా సంవర్త మేఘం కురిసిన వడగళ్ల వాన ఏమీ చెయ్యలేకపోవడం చూసి ఇంద్రుడు సిగ్గూ చింత కలిగిన మనసుగలవాడై మేఘాలను వెనుకకు రప్పించాడు.

వాన వెలిసిపోయింది. చూచాడు కృష్ణుడు. అందరినీ బయటకు పంపించి కొండను మెల్లమెల్లగా ఆ చోటికి దింపాడు.

ఇంద్రుడికి కృష్ణచర్య అర్థమయింది. మనసు మారింది. కృష్ణ దర్శనానికి ఆనందంగా ఐరావతారూఢుడై వచ్చాడు. దర్శించాడు. ఆ సమయంలో ఎవ్వరికీ కనిపించక గరుడుడు గగనరంగాన నిలిచి ఎండ తగలనట్టుగా కృష్ణునకు గొడుగులాగా రెక్కలు విప్పిపట్టాడు.

ఇంద్రుడు దివినుంచి భువికి వచ్చి ఐరావతం మీంచి కిందికి దిగి సవినయంగా కృష్ణుని వద్దకు చేరి కౌగలించుకుని పలకరించాడు. సంభాషణ ఆరంభించాడు.

నందనందనా! అతి బలిష్ఠులైన దానవులకు కూడ కదల్చడానికి సాధ్యం కాని దేవతలకు చూడ శక్యం కాని ఆ కొండను అవలీలగా పెల్లగించి పైకెత్తి ఎడమచేత ఏడుదినాలు భరించి గో గోపికాగోపకులకు రాళ్ల వాన వల్ల ఏలాటి బాధా లేనట్లు కాపాడావు.

ఇలాటి ఆశ్చర్యకరమైన ఇంత చిన్నతనంలోనే చేశావు తిరిగి పెద్దవాడవయాక దుష్టశిక్షణ చిగురంటా చేస్తావని నాలో విశ్వాసం పెరిగింది. లోకాలు మెచ్చేట్టుగా గోవర్ధనగిరిని గొడుగులాగా పట్టి గో గోపీగోపకులను కాపాడావు కనుక నీకు గోవిందుడు అనే పేరొకటి నామభూషణం ఔగాక!

అలాగే అటు సురలకు సమయానుసారంగా సంరక్షకుడవు అవాలని నిన్ను ఉపేంద్రుణ్ణి చేస్తున్నాను. సమ్మతించు! అని ఐరావతాజ్ఞచే పవిత్రోదకాలు తెప్పించి కృష్ణుణ్ణి అభిషేకించాడు. ఆ విధంగా ఆ నాటినుంచి కృష్ణుడు గోవిందుడుగా, ఉపేంద్రుడుగా ప్రసిద్ధ నామధేయుడయాడు.

ఆ సమయంలో గోవులు ముందుకి వచ్చి కృష్ణునకు క్షీరాభిషేకం చేశాయి. దేవతలూ, యక్షులూ, గంధర్వులూ గగనాన నిలిచి పుష్పవర్షం కురిసి జయజయధ్వనులతో భేరీమృదంగాది వాద్యధ్వనులతో భూనభోంతరాలు మార్మోగించారు. తదుపరి ఇంద్రుడు ఏకాంతంగా కృష్ణునితో అన్నాడు.



కేశవా! భూభారం తీర్చడానికి నీవు ఇలపై జనించిననాడు నీకు తోడుగా వుండడానికి నా అంశతో కుంతికి ఒక కొడుకు పుట్టాడు. పేరు అర్జునుడు. సమయానుసారంగా వానికి యుద్ధాలలో ఏలాటి ప్రమాదం రానీక కాపాడుతూ ఉండు.

ఇంద్రునిమాటలు విని కృష్ణుడు మహేంద్రా! నే నెరుగుదును. అర్జునునకు నా చేయూత ఎప్పుడూ ఉంటుంది. అంతే కాదు పాండవులకూ, కౌరవులకూ కలహం చెలరేగుతుంది. అపుడు నేను పాండవపక్షాన ఉండి కౌరవులను కసి మసంగి పాండవులచే నేలనేలిస్తాను. వారికీర్తి శాశ్వతస్థాయి అయినట్టుచేస్తాను.

ప్రస్తుతం కంసాదులను కడతేర్చాలి. తరువాత పాండవులకు సమయం. దుష్టశిక్షణ – శిష్టరక్షణ – అర్జునుని కోసం నీవు కలత పడనక్కర లేదు.

అని అనగ ఇంద్రుడు ఆనందంగా కృష్ణుని కౌగలించుకుని వెళ్లి వస్తానని చెప్పి ఐరావతారూఢుడై అమరావతికి వెళ్లిపోయాడు.

కొంతసేపటికి గొల్లల పెద్దలు కృష్ణుని వద్దకు వచ్చి కృష్ణా! దేవతలు కూడా చెయ్యలేని పనులు ఇంత చిన్నవయసులో నువ్వు చెయ్యడం ఆశ్చర్యంగా ఉంది. అంతకంతకు తేలికగా పైకెత్తి గొడుగులాగా పెట్టి మమ్ము, మా పిల్లలనూ, ఆవులనూ రాళ్లవాననుంచి రక్షించావు. ఇది ఎవ్వరైనా చెయ్యగలరా? ఇలా గొల్లపల్లెలో మాతో కలిసి ఈ రూపాన తిరుగుతూన్న శేషుడవా? ఆ దేవుడవా? ఎవరు నువ్వు చెప్పాలి. ఈ గోవుల సాక్షిగా అడుగుతున్నాం. అని అనగా కృష్ణుడు కొంతసేపు ఊరకుండి తరువాత సన్నగా అన్నాడు.

నేను యశోదానందుల కొడుకుని. మీరు నాకు చుట్టాలు. ఏమిటి ఏదో వింతగా అడుగుతున్నారు. అలాటి మాటలు ఇటుపై అనకండి. అని వారి మనసులో మాయ కల్పించాడు. దానితో వారు నోళ్లు కదపలేక పోయారు. సంతోషంగా చప్పట్లు చరుస్తూ వెళ్లిపోయారు. ఇలాగ కృష్ణుడు గోకులంలో ఉంటూ బృందావనంలో ఆలమందలతోనూ గోపాల బాలకుల తోనూ సవిలాసంగా తిరుగుతూ ఉన్నాడు.

ఇలా అందరికీ ఆనందాశ్చర్యాలు కలిగించే లీలలతో గోకులాన కృష్ణుడుండగా

అది శరత్కాలం – ఆనాడు నిండుపున్నమి. పూర్ణచంద్రుడు గగనాన చలువవెన్నెల పరచి భాసిస్తూండగ సర్వప్రకృతి సమ్మోహనంగా కృష్ణుడు వేణువు పూరించాడు. షడ్జాది సప్తస్వరాలు – వాటి మూర్ధన – రాగాలు – తాళాలు – లయవిన్యాసం – స్త్రీపురుష రాగవిలాసం – రాగ సాంకర్యాన





పారవశ్యం – శ్రుతి సమ్మతంగా మ్రోయించిన ఆ వేణుగానానికి గో గోపికా గోపాలకులు పశుపక్ష్యాదులూ, లతాగుల్మవృక్షాదులూ ఆనంద ప్రకృతికి చిక్కి పరవశించగా – వల్లవ పల్లవాధరలు ఆ మోహనాకారుని యందు అనురాగపూర్ణహృదయులై తమవారి కెవ్వరికీ జంకక కృష్ణుడున్న చోటికి వెళ్లారు. కృష్ణుడు వారిని చేరదీసుకుని ఆటపాటలు చెప్పి వారికీ వారికీ పోటీ పెట్టి ఆడించడం పాడించడం. పొదరిళ్లలో దాగి చిన్న చిన్న కూతలతో వారిని బెదిరించడం – ఇలా వారితో గడపనారంభించాడు. క్రమంగా యువకుడయాడు.

అలా ఉండగా ఒకనాడు ఒక గోపిక మిగిలిన వారికన్న ముందు కృష్ణునివద్దకు వచ్చి మారుత్రోవను యమున ఒడ్డుకి తీసుకుపోయి ఇసుక తిన్నెపై కృష్ణుణిచే విహరించసాగింది.

అంతలో గోపికలు ఒకచోట కూడి కృష్ణుడు కనిపించడే! ఎక్కడికి వెళ్లాడు? చూడరే అని అందరూ విచారిస్తూ వెదకనారంభించారు. వారిలో ఒకతె ఒకచోట శంఖచక్రరేఖలుగల పాదాలను చూసింది. అది మిగిలిన వారిని కలిసి రారే! కృష్ణుని అడుగుజాడలు చూద్దురుగాని. ప్రక్కనే అడుగుజాడ లున్నాయి. ఎవర్తో తీసుకుపోయిందే మన కృష్ణుణ్ణి – గడుసుదే – ఏ పొదరింటనో సుఖపడుతూంది రండి చూద్దాం – అని ఆ అడుగుజాడలను బట్టి అందరినీ తీసుకువెళ్లింది. అలాగే యమున తీరానికి చేరి అక్కడ కృష్ణుణ్ణి చూశారందరున్నూ. పెన్నిధిని చూసిన పేదలాగా గోపికలందరూ కృష్ణుణ్ణి చూసి పరమానందభరితలై దరిజేరారు. అందరినీ చేరదీసుకుని చిరునవ్వుతో పలకరించాడు.

తరువాత – ఒకొక్క గోపికకు ఒకొక్క కృష్ణుడై మండలాకృతిగా నిలిపి ఆటలాడించాడు. అలా చాలా రాత్రి వరకు ఆటపాటలతో గడిపి

అందజేసే ఆలింగనాది క్రీడలతో ఆనందింపచేశాడు. తెల్లవారగానే అందరూ వారి వారి ఇళ్లకు వచ్చారు. ఇలా కృష్ణుడు వారిని ప్రతి రాత్రీ ఆనందపరుస్తూ ఉన్నాడు.



అన్ని జీవులతో కలిసి ఉండే ఆ మహాత్ముడు గోపికలతో కలిసి విహరిస్తూ ఉన్నాడనేది విపరీతవిషయం కాదు.

అలా ఉండగా అరిష్టుడనే రాక్షసుడు భయంకరంగా వృషభ రూపంతో గోకులానికి వచ్చి అరవసాగాడు. ఆ రక్కసుడు పసులమందలో ప్రవేశించి పలురీతుల గోవులను బాధించనారంభించాడు. వాడి బాధ భరించలేక గోపాలురు బెదురుతూ వచ్చి కృష్ణా! శరణు! శరణు! అని అరవగా విషయం తెలిసి వారికభయమిచ్చి మందలోఉన్న వృషభం కొమ్ములు పట్టుకుని వెలుపల కీడ్చాడు. ఆ రక్కసుడు విదిలించుకుని కొమ్ములతో



కృష్ణుని పొట్టపై పొడిచాడు. వెంటనే కృష్ణుడు కొమ్ములు పట్టి పైకెత్తి గిరగిర తిప్పి నేలమీద పడగొట్టాడు. ఆ దెబ్బతో వాడు ముక్కంటా, నోరంటా నెత్తురు కక్కుకుని చచ్చాడు. గోపకులు కృష్ణునిచుట్టూ చేరి చప్పట్లు చరుస్తూ నుతించారు. ఇలా రామకృష్ణులు గోకులంలో పెరుగుతూ ఉండగా ఒకనాడు నారదుడు కంసుని వద్దకు వెళ్లి అతనిచే సత్కారంపొంది విశ్రాంతిగా కూర్చుని వైష్ణవాంశలతో రామకృష్ణులు దేవకీనందనులై పుట్టడం, నందునింట పెరగడం, పూతనాదులు కృష్ణునిచే చావడం – మొదలైన రామకృష్ణుల విషయం చెప్పి వెళ్లిపోయాడు.


కంసుడు కోపంతో భీకరరూపుడై వసుదేవుణ్ణి అనరాని, వినరాని మాటలతో పొడిచి మనోవేదన కల్గించాడు. నందుని ఆలమందలను వీరభటులను పంపి తన వశం చేసుకున్నాడు. వృష్ణిభోజాంధకాదుల సంపదలు కైవసం చేసుకున్నాడు. నిరపరాధియైన తన తండ్రి ఉగ్రసేనుణ్ణి కారాగారంలో పడద్రోయించి క్రూరచిత్తులను కాపు పెట్టాడు... ఆలోచించాడు. యజ్ఞం పేరుతో రామకృష్ణులను రప్పించి బలవంతంగా చంపడం – లేదా నా వీరభటులచే చంపించడం లేదా పోరాడి చంపడం – చెయ్యాలి – అని అనుకుని అక్రూరుణ్ణి పిలిపించి

అక్రూరా! విష్ణువు అంశలతోనట దేవకీవసుదేవులకు రామకృష్ణులు పుట్టారట! వారు నందుని గోకులంలో పెరుగుతూ – నా వారిని చాలా మందిని చంపారు. అని నారదుడు వచ్చి చెప్పి ఇప్పుడే వెళ్లాడు. నా తండ్రి, ఇంకా నా వాళ్లుగా ఉన్నవాళ్లు, నా మేలు కోరేవారు ఒక్కరూ లేరు. నువ్వు ఒక్కడవే మంచివాడవు. నా ఆలోచన చెప్తున్నాను విను.

ధనుర్యాగం అని ఒక యజ్ఞం చెయ్యదల్చుకున్నాను. ఎల్లుండి ఆరంభిస్తాను. నువ్వు వెళ్లి ఆ యజ్ఞానికని రామకృష్ణులను, ఆ దుర్మార్గుణ్ణి

నందుణ్ణీ తీసుకురా! ఇక్కడ వాళ్లపని పట్టేస్తాను. నా దాకా ఎందుకు? చాణూరుడు, ముష్టికుడూ ఉన్నారే, వాళ్లచేతుల్లో ఆ రామకృష్ణుల బ్రతుకైపోతుంది. తరువాత దేవకీవసుదేవుల్ని, తండ్రే అయినా బద్ధవిరోధి అయిన ఉగ్రసేనుణ్ణి – ఇలా నా మేలు కోరని వారినందరినీ యమునింటికి పంపి ఎదురులేకుండా రాజ్యమేలుతాను. వెళ్లి గోకులానికి వెళ్లి యజ్ఞం మాట చెప్పి పాలు వెన్న నెయ్యి కావిళ్లతో పట్టించి నందుణ్ణి, రామకృష్ణులను తీసుకురా! అని అనగా అనుకోకుండా కృష్ణదర్శనభాగ్యం కలిగిందని ఆ సుబుద్ధి సంతోషించి రథారూఢుడై మధురనుంచి గోకులానికి ప్రయాణం సాగించాడు.

అంతలో కంసుని దూత కేశి అనేవాడు గుర్రంరూపుతో గోకులానికి వచ్చి పసులశాలలో ప్రవేశించి భీకరంగా అరవనారంభించాడు. అలా అలా





కృష్ణుని మీదికి వచ్చి రంపాల్లాటి పళ్లు కనిపించేట్టుగా నోరు తెరిచాడు. కృష్ణుడు తన చేయి దాని నోటిలో జొనపగా దాని పళ్లన్నీ ఊడి కింద పడ్డాయి. అలాగే కృష్ణుని చెయ్యి గుర్రం కడుపులోకి వెళ్లి తెగ పెరిగింది. దానితో పొట్టపగిలి నెత్తురు కక్కుతూ అశ్వరూపుడైన కేశి చచ్చి కిందపడ్డాడు. గోపకులందరూ ఎంతో ఆనందంగా చప్పట్లు చరుస్తూ కృష్ణుని చుట్టూ చేరి చిందులు తొక్కారు.

అంతలో నారదుడు ఒకింత పైన నిలిచి పద్మాక్షా! కళ్లారా చూశాను కడుపు నిండింది. దేవతలకు కూడా తేరి చూడరాని కేశి రాక్షసుణ్ణి అవలీలగా సంహరించావు. నీకు మరొక పేరు కేశవనామం. నేటినుంచి ప్రసిద్ధమవు గాక!

మరొకమాట! చూడు నాలుగు నాళ్లలో కంసునితో కలహం – అది కూడా చూడాలని. వస్తాను. సెలవ్ – అని వెళ్లిపోయాడు.

అక్రూరుడు రథారూఢుడై వస్తూ అనుకున్నాడు. శ్రీకృష్ణుని చూచే భాగ్యం కలిగింది. నా జన్మే కృతార్థం అయింది. తలచినంతనే పాపాలను పోగొట్టే సుజనవత్సలుణ్ణి చూడబోతున్నాను. ప్రహ్లాదాది భక్తుల వందనా లందుకుంటూ కనికరించి చూసే భక్తమందారుడికి నేడు నమస్కరించగలుగు తున్నాను. వేదాంత విద్యారహస్యాలను తనలో దాచుకున్న విద్వన్మణితో మాటాడబోతున్నాను. ప్రపంచ పరిస్థితిని తృణప్రాయం చేసే ప్రభువు మన్నన నేడు పొందగలుగుతున్నాను. సకలలోకాలను సంరక్షించే లోకేశ్వరుని సంరక్షణ నాకు కలుగుతూంది. ఎంత అదృష్టవంతుడనో – ఇది అందరికీ కలుగుతుందా!

ఇలా ఆనందిస్తూ క్రమంగా గోకులానికి వచ్చాడు – సాయం సమయం అది. రామకృష్ణులుతోడి గోపకులతో గోవులను తోలుకుని వచ్చి

సాలల్లో చేర్చారు. ఇక పాలుపితకడం తరవాయి. ఆ సమయంలో అక్రూరుడు శ్రీకృష్ణుణ్ణి దర్శించాడు.

అరుణారుణచ్ఛాయలతో అలరారే పాదాలవాడు, తెల్లతామరపువ్వు శిరోభూషణంగా ధరించినవాడు, గోధూళి అలమిన కుండలాలతో ఇంద్రనీల చ్ఛాయతో ఎసగులాడు వక్షంనందు పుట్టుమచ్చలచిహ్నం దానిపై వనమాల కలవాడు, దూడలను పిలిచి తల్లుల దగ్గరకు విడుస్తూన్నవాడు, ఒకచేత పాలగిన్నె, ఒకచేత కట్టుతాళ్లు పట్టుకుని నిల్చున్న ఆ కృష్ణుణ్ణి అక్రూరుడు దర్శించాడు.

ఆ ప్రక్కనే బలరాముణ్ణి చూశాడు. కైలాసగిరిపై కారుమబ్బులాగా కట్టపై నీలాంబరంగల ఆ రాముణ్ణి దర్శించి అక్రూరుడు

లోకక్షేమం లక్ష్యంగా భూభారం తీర్చడానికి మహావిష్ణువు రామకృష్ణులుగా అవతరించాడు. భువన రక్షాదక్షులైన ఆ దివ్యమూర్తులను దర్శించాను. నా జన్మ సఫలమయింది. అని అనుకుని రథం మీంచి దిగి సవినయంగా దరిజేరి కృష్ణునకు సాష్టాంగ నమస్కారం చెల్లించాడు. వెంటనే కృష్ణుడు ఆదరంగా అక్రూరుణ్ణి కౌగలించుకున్నాడు. తరువాత అక్రూరుడు బలభద్రునకున్నూ నమస్కరించగా అతడున్ను అక్రూరుణ్ణి కౌగలించు కున్నాడు. ఒకరినొకరు కుశల ప్రశ్నలడిగి ముగ్గురూ అక్కడినుంచి తమ ఇంటివెనుక ఒక శుభ్రమైనచోట కూర్చుని కొంతసేపు ఇష్టాగోష్ఠి నడిపారు. తరువాత స్నానం, భోజనం అయింది. మళ్లీ వేరే ఒకచోట కూర్చుని అన్నదమ్ములు మధురాపుర విశేషాలు అడగగా అక్రూరుడు చెప్పాడు –

సర్వజ్ఞుడవు పద్మనాభా! నీకు తెలియనిది ఏముంటుంది? అయినా అడిగావు కనుక మనవి చేస్తున్నాను. అవధరించు. అని కంసుడు



నిండుసభలో దేవకీవసుదేవులను అనరాని మాటలనడం, తండ్రి వయసు మళ్లినవాడు అనే ఆలోచనలేక ఉగ్రసేనుణ్ణి కాళ్లుచేతులూ బంధించి చెరలో ఉంచడం, ధనుర్యాగంపేరుతో మిమ్ము వధించాలని దుస్తంత్రంపన్ని తీసుకురమ్మని తనను పంపడం చెప్పాడు.

అక్రూరునిమాటలు విని కృష్ణుడు ఔను, నాకు ఆ నీచుని వృత్తాంతమంతా తెలుసును. వస్తాను. కంసుడి ప్రాణాలు మరి వాడిలో లేవనుకో! ప్రజలందరూ ఆనందించేట్టు ఉగ్రసేనునకు ఎల్లుండి పట్టాభిషేకం చేస్తాను – రేపు ప్రభాతసమయాన పాలు పెరుగు నెయ్యి సమృద్ధిగా కావళ్లలో నింపి గొల్లపెద్దలు ముందు వెళ్లిన వాళ్లతో నందుడున్నూ, నువ్వూ, అన్నా, నేనూ రథ ప్రయాణం – సరేనా. పడుకో!

అని లేచాడు. ఆ రాత్రి అందరూ నందుని మందిరమందే నిద్రించి తెల్లవారగానే లేచారు. కాలోచితకృత్యాలు తీర్చి పాలు మొదలైన పదార్థాల కావళ్లతో తగువారిని ముందు పంపి తాను, బలభద్రుడు అక్రూరునితో రథారూఢులు అయారు. రథం కదిలింది. గోపికలు చూశారు – అందరూ ఒకచోట చేరి కృష్ణునితో ఎడబాటు భరించలేక బాధ కాగా విచారించసాగారు. ఏకధారగా కారే కన్నీరు వారి వక్షఃస్థలానికి అభిషేకం అయింది. ఆ అవస్థలో ఒకరితో ఒకరనుకున్నారు.

ఏమే! ఆ నందనందనుడు మనకి ఇన్నాళ్లు ఆనందం కలిగించి కలసిమెలసి ఎడబాటులేక తిరుగుతున్నవాడు ఇప్పుడు మధురకి వెళ్లి పోతున్నాడంటే దయాదాక్షిణ్యం లేనివాడన్నమాట. మళ్లీ మనకి ఒకనాడైనా కనిపిస్తాడా? ఆ పట్నవాసుల అందకత్తెల చమత్కారపు మాటలు విని మనతో ఇంతకాలం కలిసి ఉండడం తల్చుకుంటాడా? ఆ దైవానికి కూడా దయలేదే! ఈ కృష్ణుణ్ణి విడిచి మనం ఉండగలమా! కృష్ణుడికీ మనకీ ఎడబాటు

కలిగించిన అక్రూరుడు క్రూరుడు గాని అక్రూరుడా! మనం తెగించి వెళ్లి కృష్ణుని కొంగుపట్టి మమ్మిలా ఏడిపించి వెళ్లి పోతున్నావా? మా గతి ఏమిటి? అని అన్నామనుకో! మన కులంపెద్దలు తెలిసి ఊరకుంటారా? ఈనాటి నుంచి మన గొల్లపల్లె చిన్నబోయి ఉంటుంది. మన బ్రతుకులూ అంతే! ఆ దేవుడికి కనికరం లేకుండా పోయిందే – అని విచారించి కొంతసేపు కృష్ణరథం కనిపించేవరకు అటుచూసి అది దూరంకాగా మెల్ల మెల్లగా నడుస్తూ వారి వారి యిళ్లకి చేరి ఎప్పటిలాగా ఉన్నారు.

అక్రూరుడు రథం వడివడిగా తోలుతూ యమున ఒడ్డుకి చేరగా అక్కడ ఒక మఱ్ఱిచెట్టుక్రింద రథాన్ని ఆపి కృష్ణా! మాధ్యాహ్నిక క్రియ తీర్చుకుని అరగడియలో వస్తాను అని రథం దిగి నదికి వెళ్లాడు. స్నానం చేసి ఆచమించి ప్రణవధ్యానం చేసి కనులు తెరవగా మల్లెపువ్వులాగా తెల్లని నెమ్మేను, పద్మపత్రాల్లాటి నేత్రాలు, నీలాంబరంతో భాసించే నడుము, రత్న కుండలాల చెవులు, అద్దాల్లాటి చెక్కిళ్లు, కడిమి పూమాలతో ఒప్పే కంఠం – అలాటి మూర్తిని అనంతుణ్ణి, గొడుగు పట్టినట్టు పడగలూ, వాటిచుట్టూ రంభాద్యప్సరసల స్తుతిగీతాలు, వాసుకి ప్రముఖ నాగరాజుల జయధ్వనులు -- చేతులలో నాగలి రోకలి – బలరాముడే! –

ఆ అనంతునికి ఒకింత ముందు నీలనీరదశరీరుడు వనమాలి పీతాంబరుడు అయిన కృష్ణుడు కనిపించాడు. ఆశ్చర్యంగా చూశాడు అక్రూరుడు. స్నానం చెయ్యడానికి నదిలోకి వచ్చారా?... రథంవైపు చూశాడు. రథంమీద ఏదో మాటాడుతూన్నట్టు కనిపించారా అన్నదమ్ములు. మళ్లీ అటూ ఇటూ చూశాడు. నీళ్లలో దర్శనం అయింది. సరే అనుకున్నాడు. మానసికంగా షోడశోపచారాలతో పూజచేసి నమస్కరించి రథంవద్దకు వచ్చాడు. రథం ఎక్కి తోలడానికి ఉపక్రమించగా కృష్ణుడన్నాడు.





ఏమిటయ్యా! అక్రూరా! నీ ముఖం చాలా శోభాయమానంగా కనిపిస్తూంది. యమునాజలాలలో ఏమైనా వింత...!

అక్రూరుడు కృష్ణుడిమాట విని కృష్ణా! నీకు తెలియని వింత ఏముంటుంది? నన్ను ధన్యుణ్ణి చేద్దామనుకున్నావు. నీ పురాతనరూపం చూపించావు... నీ దయకి పాత్రుడనైన నేను నిర్విచారంగా జీవితం గడపక దురాచారుడైన ఆ కంసునితో కలిసి బ్రతకవలసి వస్తూంది. ఏమనేది? తన ఇష్టం ప్రకారం నడవరాదు. శరీరసుఖం కోరకూడదు. ఇంకొకరికి సేవ చేస్తూ తిండి తింటూ బ్రతికేవాడు జీవన్మృతుడు...!

అక్రూరుని మాటలు విని కృష్ణుడు వాని మనసున కలిగిన చింత పోగొట్టి ధైర్యమూ, శాంతీ కలిగేటట్లు చేశాడు. రథం తొందరగా నడిచింది.

ప్రొద్దుపోయేసరికి మధురకు చేరారు. అపుడు అక్రూరుడు ఆ అన్నదమ్ములతో అన్నాడు.

మీరు రథంమీద కూర్చుని వస్తే కంసుడికి కోపం వస్తుంది. కనుక మీ కట్నాలు పట్టుకుని నడచిరండి. మీ తల్లిదండ్రులను చూడడానికి వెళ్లకండి. మీ వెళ్లడం తెలిసి ఆ దుర్మార్గుడు వారిని బాధిస్తాడు – అని కర్తవ్యం చెప్పి వారివద్ద శెలవు తీసుకుని తిన్నగా కంసుడి వద్దకు వెళ్లాడు. రామ దామోదరులు వచ్చారని చెప్పి తన యింటికి వెళ్లిపోయాడు.

కృష్ణుడు అన్నతో – అప్పుడే మధుర చేరిన గోప కుమారకులతో కలిసి రాజమార్గాన దివ్యమోహనమూర్తియై వెళ్లుతూండగా నగరవాసులు భక్తినీ, రక్తినీ ప్రదర్శిస్తూ చూపులతో స్వాగతం పలికారు.

అలా కృష్ణుడు వెళ్లుతూండగా మడత బట్టలు భుజాన ఉంచుకుని ఒక చాకలి ఎదురురాగా ఆ మూటలో ఉన్న బట్టలలో కొన్ని యిమ్మని అడిగాడు. ఆ చాకలివాడు పెడసరపు ధోరణితో జవాబు చెప్పాడు.

నీ మాటలు మా రాజు కంసుడు వింటే నా ప్రాణాలు పోతాయి. పో! పో! అని అనగా కృష్ణుడు చేయిచాచి వాని శిరసుపై ఒక్క చరుపు చరిచాడు. గప్‌చుప్‌గా చాకలి శవమై కళేబరం కింద పడింది.

కృష్ణుడు బట్టలమూట ముడి విప్పి జిలుగువన్నె పట్టుపంచ అన్న కిచ్చాడు. పసిడి జలతారంచు పచ్చని పట్టుపంచ తీసి తాను కట్టుకున్నాడు. మిగిలిన బట్టలు గోప కుమారుల కిచ్చాడు. తరువాత ముందుకి వెళ్లి పువ్వులమ్మే వాని ఇంటికి పోయి పూదండలడిగాడు. వాడు పిరికివాడు. భక్తితో కృష్ణుని పాదాలకు వంగి శిరసా నమస్కరించి లేచి పూదండలిచ్చి అన్నాడు.



దేవా! నీ వంటివారు రావడం. పువ్వులడగడం – నా అదృష్టం – తీసుకో ఇంకేమి కావాలో...

మరేమీ అక్కరలేదు. నీ వంశం వృద్ధి పొందుగాక! నీకీ జన్మలోనే మోక్షం కలుగుగాక – అని వరాలిచ్చి పోయి వస్తామని కృష్ణుడు బయటకి వచ్చాడు. రాచబాటలో ముందుకి పోతూ ఉన్నాడు. అంతలో ఎదురయింది ఒక కుబ్జ (అంగవికృతి గల ఆకృతిగల చిన్నది). వివిధ సుగంధ పదార్థాలతో చేసిన చందనం ఒక పాత్రలో ఉంచి తీసుకువస్తూంది. దానిని చూసి కృష్ణుడు నాకు కొంచెం చందనం ఇస్తావా? అని అడిగాడు. ఆ కుబ్జ కృష్ణుని మోహన రూపం చూసి ముగ్ధయై, రకరకాల వస్తువులు అంటే కస్తూరి, కుంకుమ పువ్వు, చందనం, జవ్వాది – ఇలాటివి కలిపి నూరి రోజూ కంస మహారాజుకి ఇస్తూ కట్నాలూ, కానుకలూ తీసుకుంటూ ఉంటాను. నీకు తెలియదేమో అందరికీ తెలుసు. ఇదే నా పని – నా బ్రతుకు – అనగా – కృష్ణుడు దాని గడ్డం చేతితో పట్టి, దాని రెండు పాదాలూ తన రెండు పాదాలతో తొక్కి మీదికెత్తి విడిచాడు. ఆశ్చర్యం! దివ్య సుందరాంగి అయింది – చిరునవ్వుతో చూసి సరే, ఈపూట మా ఇంటికి రావాలి – అన్నది. ఇప్పుడు కాదు, వస్తా – అని దాని చేతిలో చేయి వేసి నవ్వుతూ రాజమార్గాన వెళ్లి వెళ్లి కంసుని ధనుశ్శాలలోకి చేరాడు. అన్నతో – అక్కడ ఉన్న వారివల్ల యజ్ఞ విషయం తెలుసుకున్నాడు. ఎదురుగా గంధపుష్పాలతో ఉన్న విల్లు చూశాడు. దగ్గరగా వెళ్లి అనాయాసంగా దానిని మీదికెత్తి నారి మ్రోగించి వంచాడు. అంటే ఆ విల్లు పుటుక్కున రెండు ముక్కలయింది. (రామావతారంలో శివధనువును ఇలాగే కదా చేశాడు.) దానితో ఆయుధాగారం కాపరులుగా ఉన్న వీరభటులెదిరించగా వారిని చీల్చి చెండాడి భీకరంగా సింహనాదం చేశాడు. అపుడు చావగా మిగిలిన వారు పరుగెత్తి వెళ్లి రామకృష్ణుల దుండగం

కంసుడికి చెప్పగా విని కంసుడు రోషభీషణాకారుడై మల్లయుద్ధ వీరులైన చాణూరముష్టికులను రప్పించి వారికి నూతనాంబరాభరణాలిచ్చి రామకృష్ణులను ఎదిరించండి – వేర్వేరుగానైనా సరే. కుమ్మక్కుగానైనా సరే. ఎలాగైనా సరే నా పగవారిని రూపుమాపి నా మనోవ్యాధిని పోగొట్టండి. అలా చేస్తే ఈనాటినుంచి నా సిరిసంపదలకు నా వైభవానికీ మీ ప్రాపేకాపు – రేపు ఉదయ సమయమందు మీ మల్లురతో రంగమధ్యమందుండి ఆ గొల్ల పిల్లలను రూపుమాపండి.

కువలయాపీడం అనే మదగజం – దానిని మావటివాడు తీసుకు వచ్చి సభాభవనం ముఖద్వారం వద్ద ఉండమనండి. బలరామకృష్ణులు రాగానే ఆ ఏనుగుచే వారిని తొక్కించమని చెప్పండి. ఎందుకైనా మంచిది. మన సైన్యాన్ని తీసుకువచ్చే సేనాధిపతులు సిద్ధంగా ఉండాలనండి – వెళ్లండి అని వారిని పంపి అంతఃపురానికి వెళ్లిపోయాడు.

తెల్లవారగా స్నానం, రాచముస్తాబు – అయి రంగసమీపాన తుంగమంచం మీద కూర్చున్నాడు. ముందు వెనుక ప్రక్కల ఉండవలసిన చుట్టాలు, ఉద్యోగులు, మిత్రులు ఆసనాసీనులై ఉన్నారు. పౌరకాంతలు వాని వైభవాన్ని బంగారు మేడలనుండి చూస్తూ ముచ్చటగా మాటాడు కుంటున్నారు.

వసుదేవాది యాదవులు, నందాది గోపాలురూ సముచిత స్థానాల్లో ఉన్నారు.

చాణూర ముష్టికులు మల్లయుద్ధానికి తగిన వేషం ధరించి అనుచరులతో రంగమధ్యంనందున్నారు. కువలాయాపీడంతో మావటివాడు ముఖద్వారం వద్ద ఉన్నాడు. చతురంగబలం నలుదిక్కులా ఉన్నది. ఆ దశలో కంసుని అనుమతితో రామకృష్ణులు వచ్చారు. వారి వెంట కొందరు గోప కుమారులున్నూ.



కృష్ణునితో చాణూరుడు, రామునితో ముష్టికుడు ముష్టియుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. అక్కడ ఉన్న పెద్దలు అంత చిన్న వాండ్రతో ఈ బలిష్ఠులు వయసుకి పెద్దలున్నూ అయిన చాణూర ముష్టికులు యుద్ధం చెయ్యడమా అని కలతగా అనడం కంసుని చెవినపడి మరింతరోషం కలిగింది.

రామకృష్ణులపై మావటివాడు కువలయాపీడాన్ని ఉరికించగా అన్నదమ్ములిద్దరూ రెండుగుద్దులతో దానినీ, మావటివాణ్ణీ పడగొట్టారు. దాని దంతాలు పెరికి చెరొకటి పట్టుకుని ఉండగా కాలదండధరులై యిద్దరు యములు అక్కడి వచ్చారా? అని అంతా భ్రమపడ్డారు.

కృష్ణుడు చాణూరునితో బాహుయుద్ధానికి తలపడ్డాడు. ఇద్దరికీ చాలాసేపు పట్టువిడుపుతో భీకరంగా సాగింది. చివరకు కృష్ణుడు విజృంభించి చాణూరుని పాదాలు పిడికిట బిగించి నూరుమార్లు పైనుంచి మహావేగంగా త్రిప్పగా వాడినోట, ముక్కురంధ్రాల, చెవుల – నుంచి ధారగా రక్తం – శరీరం చీలి విరిగిన ఎముకలా కిందపడగా ప్రాణం అంతరించుకుపోయింది.

అదేవిధంగా బలభద్రుడు ముష్టికునితో పట్లుపట్టి శవం చేసి విసిరివేశాడు.

ఈ వైపరీత్యం తన కళ్లముందు జరగడం కంసుడికి రోషం పెచ్చు రేగిందని వర్ణించనక్కర లేదు. మంత్రులను చూసి అన్నాడు.

దేవకీవసుదేవులను చెరసాలలో బంధించి ఉంచండి. నా తండ్రి ఉగ్రసేనుడి తల తెగ నరకండి. యదువృష్ణిభోజాంధకారులను కొర్రులు నాటి బాధించండి. నందాదులను, గొల్లలను చిదగగొట్టి వాళ్ల ఆలమందలను ఆస్తిపాస్తులను కొల్లగొట్టండి. నేను బలరామకృష్ణుల పని పడుతాను అని, వాద్యాలు వాయించవద్దనీ చతురంగబలాన్ని రమ్మని ఆజ్ఞాపించగా అదంతా తెలిసి

కృష్ణుడు కంసుని మంచం మీదికి ఎగిరి కిరీటం పడగొట్టి తలకు వక్షానికి అదిమి ఒక తాపులో కిందికి త్రోసి కుప్పిగంతులు వేసి వీపుమీద తన్నాడు. ఇక చెప్పేది ఏముంది? వాడి ప్రాణవాయువు వాయువులో కలిసి పోయింది. కంసవధ ఇలా విచిత్రంగా ఏ ఆయుధంచేత కాకుండా జరిగింది.

పువ్వులవాన కురిసింది – దేవదుందుభులు మ్రోగాయి. గంధర్వుల పాటలు మనోహరంగా వినవచ్చాయి.

బలరాముడు కంసుని తమ్ముణ్ణి అలాగే కాళ్లూ చేతులూ కూడగట్టి మీదికెత్తి గిరగిర తప్పి కింద పడగొట్టాడు. ఆ దెబ్బతో వాడి ప్రాణాలు అన్న ప్రాణాల్లాగే అంతరించుకుపోయాయి. ఈ సంఘటన చూస్తూన్న యాదవులూ నందాదులూ పరమానందభరితులయ్యారు.

తరువాత రామకృష్ణులు దేవకీవసుదేవుల వద్దకు వెళ్లి పాదాభివందనం చెయ్యగా మహానందంతో వారు కొడుకులను కౌగలించుకుని

మీరు దేవతలకు కూడా అసాధ్యములైన పనులు చేస్తున్నారు. మా అదృష్టవశాత్తు కొడుకులుగా పుట్టిన ఆ వాసుదేవుడే మీరు. మీ మాయకు లోబడి మేము మిమ్ము గుర్తించలేక ఇలా ఉన్నాం. మాయందున్న మాయను పోగొట్టి భక్తితోను జీవితాలను పెనవేసి మాయందున్న అపరాధాలను బాపి రక్షించండి అని అన్నారు.

అపుడు కృష్ణుడు అలా అనకండి. మేము మీ పిల్లలం. ఆదరాభిమానాలతో మీరు మమ్మల్ని పెంచుకుంటూ ఉండాలి. అని తన మాయచే వారి వివేకానికి తెరగప్పి అలాగే అక్కడ ఉన్న బంధుమిత్రాదులను చూచి సముచిత రీతిని మాటాడాడు. అంతలో –



కంసుని అంతఃపురకాంతలు వచ్చి వల్లభుని కళేబరంపై పడి తలలూ వక్షములూ మోదుకుంటూ ఏడవనారంభించగా కృష్ణుడు దగ్గరగా వెళ్లి తగిన మాటలతో వారిని ఓదార్చి పంపించాడు.

ఒకప్పుడు యయాతిపలికిన శాపంవల్ల యాదవులకు రాజ్యాధికారం చెల్లదన్నది స్మరించి అలాటి కాంక్షలేనివాడై వెళ్లి చెరసాలలో బద్ధుడై ఉన్న ఉగ్రసేనుణ్ణి విడిపించి తీసుకువచ్చి కంసునకు పారలౌకిక క్రియలు వారిచే చేయించి రాజుగా పట్టాభిషేకం చేయించి అక్కడకు వచ్చిన రాజులనందరను పరికించి అన్నాడు.

ఈ క్షణం నుంచి యాదవులూ మిగిలిన వారూ నేనూ మా అన్న నీకు అనుకూలంగా ప్రవర్తిస్తూ ఉంటాం. ఏలాటి నదురు–బెదురూ లేక పరిపాలన సాగిస్తూ ఉండు – అని ఉగ్రసేనునికి ధైర్యం కలిగించి వాయువును ఆహ్వానించి

ఇంద్రునివద్దకు వెళ్లి నేనిమ్మన్నానని చెప్పి సుధర్మను అడిగి తీసుకురా! అని అనగా వాయుదేవుడు అమరావతికి వెళ్లి సుధర్మను తీసుకువచ్చి యిచ్చాడు. (సుధర్మ : దేవసభ)

ఉగ్రసేనుడు ఆ సభ మధ్య పీఠాన కూర్చుండి కృష్ణుని సహాయంతో పరిపాలన సాగిస్తూ ఉన్నాడు.

ఇలా కృష్ణలీలలు చెప్పగా విని మైత్రేయుడు మహాత్మా! శ్రీకృష్ణుని బాల్యలీలలు విని పరమానందభరితుడనయ్యాను. ఆ అవతార పురుషుని తరువాతి వృత్తాంతం, అలాగే బలభద్రుని చరిత్ర చెప్పవలసిందని కోరాడు.

* * *

పరాశరుడు చెప్పాడు.

అలాగే ఉగ్రసేనుణ్ణి యాదవరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేసి అతనిచే యజ్ఞాలు చేయించి అన్నదమ్ములిద్దరూ విద్యార్థులై అవంతిపురానికి వెళ్లి వేదశాస్త్ర విద్వాంసుడైన సాందీపునకు శిష్యులైనారు.

అరవైనాలుగు విద్యలూ అరవైనాలుగు దినాలలో నేర్వగా చూచి గురువు అబ్బురపాటుతో చూశాడు. ఈ శిష్యులు గురుదేవా? మీకు మేము ఏమి చెయ్యాలి? అది గురుదక్షిణగా స్వీకరించండి – అని అనగా సాందీపని

ఈ సముద్రం ప్రక్కనే ప్రభాసం అనే తీర్థం – దానిలో నా కొడుకు చిన్నవయసు వాడు పడి మరణించాడు. వానిని బ్రతికించి తీసుకురండి. అని అన్నాడు. వెంటనే కృష్ణబలరాములు అస్త్రశస్త్రాలు ధరించి సముద్రం దగ్గరకు వెళ్లగా సముద్రుడు – భయపడి ఘోషించాడు. పంచజనుడనే రాక్షసుడు శంఖం రూపుతో ఆ బ్రాహ్మణ బాలుణ్ణి చంపాడు… సముద్రుని ఘోష అర్థం చేసుకుని కృష్ణుడు అన్నను గట్టుపై ఉండమని చెప్పి సముద్రంలో ప్రవేశించి పంచజనుణ్ణి చంపి వాడి శంఖరూపమైన ఎముక ఘోషించేట్టు చేశాడు. ఆ నాదం రక్కసులకు భీకరం, వేల్పులకు ప్రమోదకరం అయింది.

తరువాత కృష్ణుడు యమలోకానికి వెళ్లి తన రాక యమునకు చెప్పి గురుపుత్రుణ్ణి తీసుకువచ్చి గురువుకి అప్పగించాడు. తదుపరి అన్నదమ్ములు గురునకు నమస్కరించి సెలవు తీసుకుని మధురకు వెళ్లారు.

అంత – జరాసంధునకు కంసవధ తెలిసింది. వాని భార్యలు అస్తి ప్రాప్తి అనేవారు తన కూతుండ్రే. కృష్ణునివల్ల వాళ్లకి వైధవ్యం – సహించ గలడా? ఇరవైమూడు అక్షౌహిణులబలంతో మధురమీదికి వచ్చాడు. రామకృష్ణులు చాలా తక్కువ సైన్యంతో ఎదిరించవలసి వచ్చింది – తగిన విల్లు, అమ్ములూ, ఆయుధాలు లేవు.



అంతలో దివినుంచి అక్షయమైన బాణాల అమ్ముల పొదులు, శార్ఙ్గం అనే విల్లు, కౌమోదకి అనే గద కృష్ణుని ముందు, బలిష్ఠమైన ముసలం (రోకలి) హలం (నాగలి) బలరాముని ముందు పడ్డాయి. వాటిని ధరించి రణరంగానికి వెళ్లారు. దారుణంగా రణం సాగించారు. జరాసంధుడు ముందూ వెనకా చూడక రణరంగం విడిచి పారిపోయేట్టు చేశారు. ఇలాగు జరాసంధుడు పదునెనిమిది మారులు దండెత్తివచ్చి, రామకృష్ణులచే చావుదెబ్బలు తిని పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు.

ఆ తరువాత – నారదుడు ప్రేరేపించగా కాలయవనుడనే ఒక యవనప్రభువు మధురమీదికి దండెత్తి రావడం తెలుసుకుని కృష్ణుడు ఆలోచించి ఎవ్వరికీ ప్రవేశం శక్యం కానట్టుగా ఒక నగరం కల్పించాలని సంకల్పించాడు – సముద్రంలో

నూరుయోజనాల వైశాల్యం, ప్రాకారం, అగడ్తలు, చక్కనిపూదోటలు, కోనేళ్లు – లెక్కకు మిక్కిలిగా సుందర మందిరాలూ గల నగరం ఏర్పరచి దానికి ద్వారక అని పేరు పెట్టాడు. మధురలో ఉన్న వారినందరినీ అక్కడికి పంపించి చతురంగ బలాలతో బలభద్రుడు సంరక్షకుడుగా నియమించాడు.

కాలయవనుడు గొప్పసేనతో మధురమీదికి వచ్చాడు. కృష్ణుడు ఆలోచించాడు. వీడిని ఉపాయంచే చంపాలి.

ఏ ఆయుధంలేక రిక్తహస్తాలతో కాలయవనునివద్దకు వెళ్లి తన పేరు చెప్పి నేను పరుగెత్తుతూ పోతూనే ఉంటాను. చేతనైతే వెంటతగిలి పట్టుకో అని పరుగు లంకించాడు. యవనరాజు వెంట వెంట వెళ్లాడు. అలా వెళ్లి వెళ్లి ఒక కొండగుహలో ప్రవేశించాడు. వెంట వెళ్లాడు కాలయవనుడు.

ఆ గుహలో ఒక విశాలమైన వేదిక – దానిపై ముసుగు వేసుకుని పడుకున్నాడు ముచికుందుడు అనేరాజు. ఆయన కొంతకాలం క్రితం

దేవదానవులకు జరిగిన యుద్ధంలో దేవతలపక్షాన ఉండి రాక్షసులను తునుమాడి దేవతలవల్ల రెండు వరాలు పొందాడు.

యుద్ధశ్రమ తీరేట్లు చాలాకాలం సుఖనిద్ర పొందడం.

నిద్రలో ఉండగా వచ్చి బలాత్కారంగా లేపిన వారు తన కోపదృష్టిచే వెంటనే చనిపోవడం –

అలా నిద్రలోఉన్న ముచికుందుణ్ణి చూసి కాలయవనుడు కృష్ణుడే అనుకుని ఎడమకాలితో తన్నాడు. ఆ తాపుతో ముచికుందుడు మేల్కొని కోపించి చూడగా ఆ చూపులోంచి వచ్చిన కోపాగ్నిజ్వాల తగిలి యవనరాజు నిలువుగా కాలి బూడిదయై కిందపడ్డాడు. చాటుగా ఉన్న కృష్ణుడు ముచికుందుని ముందుకు వచ్చాడు.

ఎవరు నువ్వు? అని రాజు ప్రశ్న.

వసుదేవుడు అనే యాదవుని కొడుకును – నన్ను కృష్ణుడు అని అంటారు – ఆ మాట విని ముచికుందుడు చప్పున లేచి కృష్ణునకు సాష్టాంగంగా నమస్కరించి స్తుతించాడు.

దేవదేవా! దేవదానవ యుద్ధం అయిన తరువాత ఇంద్రుని మాటపై ఈ కొండగుహలో నిద్రించడానికి నేను వస్తూ ఉండగా గార్గ్యుడనే ముని నన్ను చూచి

రాజా! ద్వాపరయుగాంతమందు భూభారం తీర్చడానికి మహావిష్ణువు యదువంశంనందు దేవకీ వసుదేవుల కొడుకుగా జన్మిస్తాడు. కృష్ణుడు అనే పేరుగలవాడు. 'నీకా దేవుని దర్శనం అవుతుంది. శుభప్రదు డౌతావు' అని చెప్పాడు. శ్రీకృష్ణా! దయచేశావా?





ముచికుందుని మాట విని ముకుందుడు ప్రసన్నుడై అన్నాడు. రాజా! నా మాటవల్ల దివ్యభోగాలనుభవించి మంచి వంశంలో పుట్టి వైభవం పూర్వజన్మ జ్ఞానం కలిగి నీకిష్టమైన లోకంలో ఉండు. తరువాత జన్మాంత మందు మోక్షం పొందు – అని వరాలిచ్చి బయటికి వచ్చి వెళ్లిపోయాడు.

రాజు వెలుపలకు వచ్చి నలువైపులా చూశాడు. స్వల్పంగా ఉన్న జనసమూహాన్ని చూశాడు. ఓ – ఇక కొన్నాళ్లకి కలియుగం ఆరంభం అని తెలుస్తూంది. స్వజనం మధ్య ఉండలేను అని అసహ్యించుకుని గంధమాదన గిరికి పోయి తపశ్చర్యను ఆరంభించాడు.

కృష్ణుడు శత్రువులను పరిమార్చి వారి సంపదలను సంగ్రహించి తెచ్చి తాతకిచ్చాడు. ఆ విధంగా కృష్ణసంరక్షణంలో యాదవవంశం అభ్యుదయాభివృద్ధి గలదై రాణించింది. అలా ఉండగా

ఒకనాడు బలభద్రుడు కృష్ణునితో చెప్పి గోకులం వెళ్లాడు. యశోదా నందులకు నమస్కరించి గోపకులను పలకరించి కానుకలిచ్చి గోపికలకు వస్తువస్త్రాలనిచ్చి ఆనందంగా విహరిస్తూ ఉండగా ఒకనాడు

వరుణుడు వచ్చాడు. బలరామునకు వివిధ మణిమయభూషణాలిచ్చి ఇష్టాగోష్ఠి జరిపాడు. కొంతసేపయిన తరువాత బలరాముడు అడిగాడు.

ఏమయ్యా! ఒక కాలంలో నీ నుంచి వచ్చిన వారుణిని (మద్యం) సేవిస్తారు కొందరు పెద్దలు – దానివల్ల కలిగే ఫలమేమి?

వరుణుడు చెప్పాడు. దేవదానవులు అమృతంకోసం పాల సముద్రాన్ని తఱుస్తూఉండగా అమృతంకన్న ముందు వచ్చింది అది. రోగాలను పోగొట్టుతుంది. బలవృద్ధిని కలిగిస్తుంది. ఆనందంగా విహరించేట్టు చేస్తుంది. దానిని సేవిస్తూనే కదా దేవదానవులు పరమానందంగా కాలం గడుపుతున్నారు. సురను సేవించనివారిబ్రతుకు ఒక బ్రతుకా? నువ్వు కూడా నేటినుంచి సురాపానం చేస్తూ ఉండు! అని కొనియాడి వారుణి కుఱం బృందావనమందున్న ఒక చెట్టు తొర్రలో ప్రతిష్ఠించివెళ్లి వెళ్లిపోయాడు. ఆ మద్యగంధం ఆ ప్రాంతానికి అభినవశోభను కూర్చింది.

ఒకనాడు బలరాముడు తనవారితో ఆ ప్రాంతమందు తిరగడానికి రాగా ఆ మద్యగంధం గాలికి ఎగిరి బలరామునికి ఆసక్తిని కలిగించింది. వెంటనే అలావచ్చినవైపు వెళ్లి వేప వృక్షం తొర్రలో ఉన్న వారుణీ కలశం తీసుకున్నాడు. ఇది వరుణుడు ఉంచినదే అని భావించాడు.

యమునాతీరమందున్న బృందావనంలో గోపికలతో కలిసి సవిలాసంగా మద్యపానం చేశాడు.

కొందరు గోపికలు కూడా మద్యపానం చేసి వింత పలుకులతో విలాసాలతో విర్రవీగుతూన్నట్టు నటించనారంభించారు. కొంతసేపు వారితో



వినోదించి అలసి సొలసి జలక్రీడకు సంకల్పించి మదిరాపానమత్తుడై వెళ్లలేక యమునను తనకు దగ్గరగా రమ్మని ఎలుగెత్తి పిలిచాడు. రాలేదు. దానితో కోపించి

ఓ యమునా! ఇదిగో చూడు నా చేతితోగాని, దీనితో నీ బ్రతుకు వెయ్యి బారలు వేస్తాను. నా పిలుపు వినిపించలేదా? అంత మదించి ఉన్నావా? – అని లేచి యమున గట్టుకి వెళ్లి నాగలిని నీళ్లలో ముంచి లాగేడు. పెద్ద ధ్వని. అది విని వేల్పును పైనుంచి ఆశ్చర్యంగా చూస్తూ నిల్చున్నారు. అంతట యమున పెద్దపెద్ద పాయలై బృందావనంలో ప్రవేశించింది. బలరాముడు భార్యయైన రేవతితో గోపికలతో ఆ నీళ్లలో జలక్రీడలాడుతూండగా వారి ఆటలు సహించలేక యమున నిజరూపంతో ఎదుట నిల్చి బ్రతిమాలింది. సరే. భయపడకు. వెళ్లు! అని – జలక్రీడలు ఆపి బృందావనంలో రేవతితో వినోదిస్తూ ఉన్నాడు.

ఇలా వినోదిస్తూ ఉండగా ఒకనాడు వరుణుడు నల్ల కలువవన్నె తలపాగ, కనక రత్నకుండలాలు, నీలాంబరం, తెల్లని పట్టుగొడుగు ఇచ్చి వెళ్లగా బలరాముడు ఆనందించి వాటిని ఉపయోగిస్తూ రెండు మాసాలు గోకులంలో గడిపి కృష్ణ సందర్శనకు హలంతో ద్వారకకు వెళ్లాడు.

ఆ కాలంలో విదర్భదేశాధీశుడు కుండినపురంలో నివసిస్తూన్న వాడు భీష్మకుడు అనేరాజు. అతనికి పెద్దకొడుకు రుక్మి. ఒకే ఒక్క కూతురు. పేరు రుక్మిణి. ఆమె రూపరేఖావిలాసాలకు ముమ్మరించి ఎందరో రాకుమారులు తనకంటే తనకని అడిగించేవారు. కాని ఎవ్వరికోరికా తీరలేదు. కృష్ణుని వరించాలని రుక్మిణి నిశ్చయం. రుక్మిణిని పరిగ్రహించాలని కృష్ణుని సంకల్పం -- కాని ఆమె పెద్దన్న రుక్మి – శిశుపాలునకివ్వాలని పట్టుదల గలవాడై ఉన్నాడు. కబురంపాడు రమ్మని. జరాసంధాదులతో

కలిసి శిశుపాలుడు కుండినపురానికి వచ్చాడు. స్వయంవరవార్త విని కృష్ణుడు బలభద్రుడు మొదలైన అన్నదమ్ములతో తగిన బలగంతో బయల్దేరి కుండినపురానికి వచ్చి కొంచెం దూరంగా అందరినీ ఉంచాడు.

ఆచారం ప్రకారం రుక్మిణి బ్రాహ్మణసుమంగళులతో దాసీ జనంతో ఊరి వెలుపలనున్న దుర్గాలయానికి వచ్చి ఆరాధన చేసి రాజమార్గానికి రాగా కృష్ణుడుచూసి ఆమెను పరిగ్రహించి రథం ఎక్కించాడు. ఆ వార్త తెలిసి ఆమె అన్న శిశుపాలాదులతో కలిసి కృష్ణునితో యుద్ధానికి సిద్ధపడ్డాడు.

జరాసంధుడు, దంతవక్త్రుడు, సాల్వుడు, శిశుపాలుడు మొదలైన వారు మంచుతో మబ్బులు భాస్కరుణ్ణి ఎదిరించినట్టు కృష్ణుణ్ణి ఎదిరించారు.

బలరాముడు, సాత్యకి, కృతవర్మ మొదలైన యాదవసింహాలు విజృంభించి జరాసంధాదుల చతురంగబలాలను తూకుతూకుగా చిదగ గొట్టారు. ఆ దెబ్బతో జరాసంధాదులు తిరిగి పారిపోవలసి వచ్చింది. శిశుపాలుడు చేసేది లేక సిగ్గుపడి నిజపురానికి వెళ్లిపోయాడు.

రుక్మి వదలలేదు. కృష్ణుణ్ణి సంహరించిగాని నగరంలోకి వెళ్లనని ప్రతిజ్ఞ పలికి ఎదిరించాడు. అపుడు కృష్ణుడే తలపడి వాని సైన్యానికి దైన్యం కలిగించి రుక్మిని పట్టుకుని బావా! ఊరకే హాస్యం సుమా అని వాడి తల అక్కడక్కడ గొరిగి విడిచిపెట్టాడు.

ఇలా విజయలక్ష్మితో సహా రుక్మిణిని తీసుకువచ్చి ద్వారకలో సలక్షణంగా పెండ్లాడాను. (ఈ వివాహానికి 'రాక్షస వివాహం' అని సంజ్ఞ) (వధువును బలాత్కరించి తెచ్చి పెండ్లాడుట)

కొంతకాలానికి ఆ దంపతులకు మన్మథాంశతో ఒక కొడుకు. అచ్చంగా మన్మథుడు లాగా ఉంటాడు. పేరు ప్రద్యుమ్నుడు. ఆ శిశువు



పుట్టిన ఆరవనాడు రాత్రి శంబరుడనే రాక్షసుడు వచ్చి పురుటింట చొచ్చి శిశివునెత్తుకపోయి సముద్రంలో పడవేశాడు. (వానిచే మరణం – అని అశరీరవాణి. ఆ పని జరగరాదని శంబరుడు చేసిన పని యిది)

ఆ శిశువును ఒక చేప మింగింది. ఆ చేపను జాలరి వాడు పట్టి శంబరుని కూతురికిచ్చాడు. అది తరగగా దానికి దాపున ఉన్న శిశువును చూచి ఆశ్చర్యపడుతూ ఉండగా నారదుడు వచ్చి

లలనా! ఈ పిల్లవాడు శ్రీకృష్ణునికొడుకు. జాగ్రత్తగా పెంచు. అని చెప్పి పోయాడు. ఆ మగువ అలాగే అని రహస్యంగా పెంచి పెద్దవానిని చేసింది. కాగా శంబరునికే విషయం తెలిసిపోరాడగా ప్రద్యుమ్నుడా రక్కసుని చీల్చి చెండాడేడు. అంతవరకు సంరక్షణ చేస్తూన్నమహిళ మాయావతి ప్రద్యుమ్నుణ్ణి ద్వారకకి తీసుకువచ్చి అంతిపురంలో ప్రవేశించింది.

అక్కడ ఉన్న కాంతలందరూ ఆ సుందరాంగుని చూచి ఆశ్చర్యపడుతూ అలాగే మాయావతిని చూస్తూ ఎవరు వీరని అనుకుంటూండగా రుక్మిణి చూసి ఎవరీ యువకుడు. ఆనాడు శివుని కంటిమంటకే మరణించిన మన్మథుడిలా పుట్టాడా? ఏ తల్లికన్నదో ఈ నవ మన్మథుణ్ణి. నా కొడుకు బ్రతికి ఉంటే ఈ వయసులోనే ఉంటాడు కదా! అని విచారిస్తూ ఉండగా నారదుడు వచ్చాడు.

అమ్మా! పుట్టిన ఆరవనాటి రాత్రి శంబరుడనే రాక్షసుడెత్తుకుపోయిన నీ కొడుకే ఈ యువకుడు. అని ప్రద్యుమ్న వృత్తాంతం చెప్పాడు.

కృష్ణుడు ఆ ఆదిదేవుడు విష్ణువు. నీవు ఆ లక్ష్మీదేవివి. ఈ యువకుడు మన్మథుడు – ఈ యువతి రతి – ఇది మీ చరిత్ర. మీ మహిమ ఎవరు తెలుసుకోగలరు? వస్తా – అని చెప్పి వెళ్లిపోయాడు.

తరువాత – కృష్ణుడు మాయావతీ ప్రద్యుమ్నులవివాహం చేయించాడు.

ఆ రుక్మిణియందు చారుధేష్ణుడు, చారుదేహుడు వీర్యవంతుడు సుషేణుడు చారుగుప్తుడు భద్రచారుడు సుచారుడు మహాచారుడు అనే కొడుకులు పుట్టారు. కడసారి సంతానం ఆడుబిడ్డ – పేరు చారుమతి.

తరువాత ప్రద్యుమ్నుడు స్వయంవరంలో రుక్మి కూతుర్ని పెండ్లాడాడు. ఆ దంపతుల కొడుకు అనిరుద్ధుడు. రుక్మిణి రుక్మి మనుమరాలికీ అనిరుద్ధుడికీ వైభవంగా పెండ్లి చేయించింది.

తరువాత – ఒకనాడు ముఖ్యులైన దేవతలతో ఇంద్రుడు ఐరావతా రూఢుడై ద్వారకకు వచ్చాడు. ఇంద్రుని రాక పురరక్షకులచే తెలిసి కృష్ణుడు బలరామాదులతో వెళ్లి ఎదుర్కొని ఆదరంగా తోడితెచ్చి బంగరు గద్దెపై ఇంద్రుని సముచితాసనాలపై మిగిలిన వేల్పులను ఆసీనులం జేసి ఆచారం ప్రకారం మర్యాద చేశాడు. ఇంద్రుడు ఆనందించి కృష్ణుని అభినందించి అన్నాడు.

దేవా! లోకాలకు క్షేమంకరుడవు. అలాగే భూలోకానికి క్షేమం కలిగించాలని యదువంశాన అవతరించిన వైకుంఠవాసుడవు. నీ దయచే గదా లోకాలు హాయిగా ఉంటాయి. దేవతలూ సోమయాజులూ యజ్ఞాంశాలను అగ్నిముఖాన ఆరగిస్తూ ఉంటారు. ఆ అదృష్టం ప్రస్తుతం అంతరించుకుపోయింది. ఆ విషయం విన్నవిస్తున్నాను ఆలించు!

భూపుత్రుడు నరకాసురుడు. తనలాటి దుష్టదైత్యులతో ప్రాగ్జ్యోతిషం అనే నగరంలో ఉన్నాడు. లోకాలను రకరకాల దుశ్చేష్టలచే ఏడిపిస్తున్నాడు. తానే యజ్ఞపురుషుడననీ యజ్ఞభాగం తన కివ్వాలనే శాసిస్తూ యజ్ఞాలు సాగకుండా చేస్తున్నాడు. అందమైనకన్య కంటపడితే ముందూ వెనుక లాలోచించక వెంటనే బలాత్కరించి ఎత్తుకుపోతున్నాడు. అలా ఎందరినో ఎత్తుకుపోయి భవనాలలో నిర్బంధించి ఉంచాడు. సిద్ధసాధ్యాదులను కూడా అసాధ్యమైన పరాక్రమ ప్రభావంతో దిక్కుదిశా లేకుండా చేశాడు.



జలాన్నిచ్చే వరుణుని తెల్లపట్టు గొడుగును, దివ్యరత్నమయ మయిన మందరగిరి శిఖరంను, అమృతమూర్తులైన మాతల్లి కుండలాలను ఎత్తుకుపోయాడు. నా రాజ్యానికి ప్రధామైన ఐరావతంను ఎత్తుకుపోవాలని చూస్తున్నాడట! దుష్టనిగ్రహం శిష్టానుగ్రహం చేసేవాడవు కనుక నీకు తెలుపవలసి వచ్చింది. దయచేసి వారి వలన ఇక లోకానికి ఏలాటి ఉపద్రవం కలగనట్టు చెయ్యవలసిందని విన్నవిస్తున్నాను.

అని అనగా కృష్ణుడు కనికరించి ఓదార్పుగా చూసి ఇంద్రుని చేయి తన చేత కావించి అన్నాడు :

మహేంద్రా! మనసులో విచారానికి చోటివ్వకు. లోకాలన్నీ తోడువచ్చి – రణరంగంలో ఆ దుష్టరాక్షసుణ్ణి సంహరిస్తాను. లోకాలకు వాడివల్ల కలిగిన అగచాట్లు అంతతో అంతరిస్తాయి. కనుక ధైర్యంగా ఉండు! వెళ్లు. అనగా ఇంద్రుడు ఆనందమూర్తి అయాడు. వెంటనే కృష్ణుడు తల్చుకోగా గరుత్మంతుడు వచ్చి కృష్ణునిముందు నిల్చున్నాడు. కృష్ణుడు సత్యభామతో గరుడవాహనారూఢుడై బయల్దేరాడు. ఇంద్రుడు ఐరావతారూఢుడై అనుసరించాడు. అందరూ ప్రాగ్జ్యోతిషపురం వెళ్లారు. ఇంద్రుడు కృష్ణునితో చెప్పి తనలోకానికి వెళ్లిపోయాడు. కృష్ణుడు నగరవాసులైన రాక్షసులకు భయంకరంగా శంఖం పూరించాడు. నరకుడు మురుణ్ణి హయగ్రీవుణ్ణి తగిన సేన తోడుగా యుద్ధానికి పంపించాడు. వాళ్లు వచ్చి కృష్ణునితో పోరాడి తమ అనుచరులతో సహా కృష్ణుని ఆయుధాగ్ని జ్వాలలకు ఆహుతి అయిపోయారు. కొన్ని వేలమంది సైనికులతో తన సహచరులు యుద్ధంలో మరణించడం విని నరకుడు కోపించి రోషించి భీకరమైన చతురంగబలంతో దారుణాయుధపాణియై వచ్చి కృష్ణునిపై ఏకధారగా అస్త్రశస్త్రాలు వర్షించాడు. కృష్ణుడు వాటిని అవలీలగా తన వింటినుంచి ప్రయోగించిన ప్రత్యాయుధాలతో చెదరగొట్టి చక్రాన్ని ప్రయోగించి నరకుని శిరసుతెగవేశాడు.

అంతలో పుత్రమరణం తెలిసి భూదేవి శోకమూర్తియై కృష్ణుని వద్దకు వచ్చింది. అల్లనల్లన బొంగురుపోయిన కంఠంతో అన్నది.

పద్మాక్షా! మునుపు హిరణ్యాక్షుని వరాహరూపాన దునుమి నన్ను సముద్రంలోంచి పైకి ఎత్తినపుడు నీ అనుగ్రహంచే కలిగిన కొడుకు వీడు. వీనిని చంపవచ్చునా? ఏవో తప్పులు చేయవచ్చు. వాటిని క్షమించి సన్మార్గాన నడిపించవచ్చు గదా! అని అనగా కృష్ణుడన్నాడు.

వసుంధరా! నా యందు సద్భావం, భక్తీ లేని వారు ఆత్మీయులైనా సరే నేను సహించేది లేదు – కంసాదులేమయారో నన్ను సర్వాత్మనా నమ్మి ధ్యానించేవారు పైవారైనా సరే ఆదరిస్తాను. అందుకు సాక్షులు ప్రహ్లాద విభీషణులు. కనుక – లోకానికి అపకారి అయిన నరకుడు కొడుకయినా క్షమించదగదు. నేను దుష్టశిక్షణ శిక్షరక్షణ ధర్మస్థాపన లక్ష్యాలతో అవనిపై అవతరించాను. నీకు తెలియదా? అని అనగా భూదేవి సరే. అయినదేదో అయింది. నరకునికొడుకుకి పట్టం కట్టి పరిపాలకుడుగా నియమించు! అని నమస్కరించింది.

అలాగే అని కృష్ణుడు నరకపుత్రుణ్ణి రాజ్యాధికారిని చేసి నరకు డపహరించించిన అదితి కుండలాలను భూదేవి తెచ్చి ఆనందంగా వెళ్లింది.

తరువాత – కృష్ణుడు నగరంలో ప్రవేశించి చెరలో ఉన్న పదారువేల మంది రాచకన్యలను అమూల్యరత్నాభరణాలను మేల్జాతి ఏనుగులను గుర్రాలను నరకుని కింకరులచే తనే ద్వారకకు పంపించాడు. వరుణుని గొడుగు వరుణునకు పంపించి మందరగిరి శిఖరం ఆ గిరికి హత్తించి సత్యభామతో అమరావతికి వెళ్లి తన రాక తెలుపుతూ పాంచజన్యం పూరించాడు. ఆ ధ్వని విని గ్రహించి ఇంద్రుడానందంగా ఎదురువచ్చి



స్వాగతంపలికి లోనికి గొనిపోయి గురునిచే అర్ఘ్యాదులిప్పించాడు. కొంతసేపు కృష్ణుడు ఇంద్రునితో వివిధ విషయాలు మాటాడి కుండలాలు అదితికి స్వయంగా యివ్వాలని ఆమె ఉన్నచోటుకి ఇంద్రునితో వెళ్లాడు. నమస్కరించి కుండలాలను ఆమెకిచ్చి నరకాసురునిచావు ఆమెకి చెప్పాడు. ఆమె ఎంతో సంతోషించి అన్నది.

భూతేశా! భూతాత్మా! భూతనాథస్తుతా! సర్వేశా! సర్వజ్ఞా! సర్వవినుతా! నిర్ద్వంద్వా! నిరుపమా! నిశ్చలా! నిగమార్థ గోచరా! అవ్యయా! అచ్యుతా! ఆదిదేవా! త్రిదశనాథా! త్రిలోకదేవా! త్రివిక్రమా! పరమపురుషా! పరాపరా! పరహితార్థా! కమలాక్షా! కమలేశా! కమలరాశి నివాసా! నరసింహా! నరవంద్యా! నరకదమనా! భక్తరక్షకా! భవనాశా! భవ్యరూపా! నిగ్రహానుగ్రహ విధేయా! నిత్యనిపుణా! కరుణతో నన్ను కాపాడు. అని భక్తితో ప్రార్థించింది.

కల్పవృక్షం నాశ్రయించి కట్టుకునే గోచీ అడిగినట్లు ఆనాడు నిన్ను ముక్తి కోరక కొడుకుగా నా కడుపున పుట్టమని కోరాను.

అదితి మాటలు విని కృష్ణుడు కనికరపు చూపుతో చూసి చిరునవ్వు మోముతో అన్నాడు.

అమ్మా! ఇలా ఎందుకంటావు. పుణ్యచరిత్రవు, దేవతల కన్నతల్లివి. పరమ పతివ్రతగా ప్రసిద్ధురాలవైన పుణ్యరాశివి. నీకు మోక్షం పెద్దా?

ఆ సమయంలో శచీదేవి సత్యభామను తీసుకువచ్చి అత్తకి ఆమె విషయం చెప్పగా ఆమె కోడలిని ఆదరించి అన్నది –

అమ్మాయీ! నా అనుగ్రహంవల్ల చాలాకాలం ముసలితనం అంద వికారమైనరూపం లేక సౌభాగ్యవతివై భోగభాగ్యాలనుభవిస్తూ హాయిగా ఉండు. అని వరమిచ్చింది.

తరువాత – తల్లి మాటపై కృష్ణుణ్ణి ద్వారకకు వెళ్లడానికి అంగీకరించగా కృష్ణుడు బయల్దేరాడు. అలా గరుడునిపై నందనవనం ప్రాంతానికి వెళ్లాడు. దివ్యకుసుమపరిమళంతో తుమ్మెదలఝుంకారంతో మందవాయువు సత్యాకృష్ణులకు స్వాగతం పలికాడు. సత్య ఆనందంగా ఆశ్చర్యంగా ఆ దివ్యవనం – దానిలో పారిజాతవృక్షాన్ని చూసింది. కృష్ణునితో అన్నది. ఈ పారిజాతం నందనవనానికి దివ్యాలంకారంలాగా ఉన్నది కదా! తరగని కమ్మని తావితో ఉండే ఈ పారిజాతకుసుమాలు నిత్యం సఖులూ తానూ కొప్పున ధరిస్తూ ఆనందిస్తూన్న ఇంద్రసుందరి శచీదేవి ఎంత అదృష్టవంతురాలు! ఇంద్రునికన్నా మిన్నగా భోగాలిచ్చే వాడవు నీవని అనుకోడమేగాని నీ భార్యనైన నాకు ఆ ఇంద్రుని భార్యకు గల ఇలాటి దివ్యకుసుమధారణం వంటి భోగం నాకు లేదు కదా! ఇదిగో నా కోరిక.

ఈ పారిజాతవృక్షాన్ని తీసుకుపోయి నా మేడ పెరడులో నాటితే ప్రతిదినం చెలికత్తెలు దీని పువ్వులు పెట్టి నా కొప్పులో ముడుస్తూఉంటే నాకు గలిగే సంతోషం సంతృప్తీ చెప్పగలనా? అలాగే అప్పుడపుడు రుక్మిణి, జాంబవతి మొదలైన నా సవతులకు పళ్లేలతో ఇన్ని పువ్వులు పంపుతూ ఉంటాను. వాళ్లు అవి తీసుకొని నా ఆధిక్యానికి సిగ్గుపడుతూ ఉండాలి. మరి నా ఈ కోరిక తీర్చితే ఇంకా నీ మీద నాకు మనసు – నాపై నీకు ప్రత్యేకంగా ప్రేమ ఉన్నట్టు భావిస్తాను...

సత్యమాటలు విని కృష్ణుడు పారిజాతాన్ని తీసుకుపోవడానికి నిశ్చయించి నందనవనంలో ప్రవేశించి సమూలంగా ఆ వృక్షాన్ని పెల్లగించేందుకు సంసిద్ధుడుకాగా వనపాలకులు వారించి ఏమయ్యా! ఈ చెట్టు పుష్పాలు దేవరాజు భార్య శచీదేవి ముడుచుకోవాలి గాని మానవాంగనలకి యోగ్యత లేదు. ఈ విషయం తెలిస్తే ఇంద్రుడు అలిగి ఏమి చేస్తాడో! అతనితో స్నేహం కావాలంటే ఈ చెట్టువైపు చూడక నీ



దారిన పో. అని అనగా కృష్ణుడు ఏమీ అనక నవ్వుతూ ఊరకున్నాడు. అప్పుడు సత్యభామ అన్నది.

చాలించండి మీ మాటలు. ఎక్కడ ఇంద్రుడు ఎక్కడ శచి – ఎక్కడ పారిజాతం. ఇది సముద్రంలోంచి వచ్చింది. అన్ని లోకాలవారికీ దీనిపై అధికారం ఉంది. కాగా నా భర్త ఈయన. సామాన్యుడుగా చూసి ఇలా వాగుతున్నారు మీరు. మీ ఇంద్రుడికీ, మీ దేవతలకూ ఆరాధ్యుడైన మహానుభావుడు వీరంతా ఇప్పుడే యిక్కడ ఈయనని ఆరాధించడం మీ శచికి తెలియదా? తన మగడు అంత భుజబలం పరాక్రమం ఉన్నవాడైతే నా మగనిని ఎదిరించి ఈ చెట్టు దర్శించుకోమను. అనవసరమైన గొణుగు ఎందుకు?...

ఆ వనపాలకులు వడివడిగా వెళ్లి సత్యమాటలు శచికి చెప్పారు. ఆమె కోపించి తన భర్తకి చెప్పింది. ఇంద్రుడు కోపించి చతురంగబలాలతో కృష్ణునిమీద యుద్ధానికి వెళ్లి ఎదిరించాడు. యుద్ధం మహోద్ధతంగా జరిగింది. కృష్ణుడు లోకభీకరంగా పాంచజన్యం పూరించి విల్లుసారించి ఏకాధాటిగా శరప్రయోగం చేశాడు. దేవబలాలు విజృంభించి దివ్యమంత్ర ప్రయోగంతో అస్త్రప్రయోగం చెయ్యగా కృష్ణుడు అలాగే తానూ ప్రత్యాస్త్రాలు ప్రయోగించి సురలను యుద్ధపరాఙ్ముఖులను చేశాడు. అలాగే గరుత్మంతుడు కూడా ముక్కుతో కాళ్లతో సురసైనికులను చీల్చిచెండాడు. అంతలో ఇంద్రుడు ఐరావతారూఢుడై తగిన సైనికులతో వచ్చి వజ్రాన్ని కృష్ణునిపై ప్రయోగించాడు. అది కృష్ణుని ముందుకి వచ్చి ఏమీ చెయ్యలేక ప్రక్కకి తప్పుకున్నది. అంత –

కృష్ణుడు చక్రం తీశాడు. దానితో లోకం అంతా ఆక్రోశించింది. ఆ విషయం తెలిసి శచీదేవి వచ్చి శిరసు వంచుకుని చేతులు జోడించి కృష్ణుణ్ణి వేడుకున్నది.

దేవా! ముకుందా! కృష్ణా! జగతీధరా! కేశవా! వాసుదేవా! పద్మనాభా! పద్మాక్షా! ఈ దేవపతి తప్పులు పట్టించుకోక నాకు దయచేసి పతిభిక్ష ప్రసాదించు! అని ఎంతో వినయ భక్తిభావంతో నమస్కరించింది.

శచీదేవి ప్రార్థనకి కృష్ణుడు ప్రసన్నుడై ఆదరించాడు. అలాగే చల్లని చూపులతో ఇంద్రుణ్ణీ ఆదరించాడు. అల్లనల్లన అన్నాడు.

ఇంద్రా! అంత కోపంతో వచ్చావెందుకు? ఈ చెట్టు నాదయితే నీ సంపదకి ఏమైనా లోపమా? దీని పువ్వులు సత్యభామకి మనోహరాలు. వాటికోసం ఈ పని జరిగింది. దీనిని ద్వారకకు తీసుకుపోతాను. ఈమె కోర్కె తీర్చాలి. వనపాలకులు చెప్పినది విని ఆలోచింపచక ఇంత కోపంతో... ఏమి పని?...

కృష్ణునిమాటలు విని ఇంద్రుడు వాసుదేవా! మానవలోకంలో ఉండవలసేది కాదీ దివ్యవృక్షం. నీ మాట కాదనలేక అంగీకరించవలసి వచ్చింది. తీసుకువెళ్లు. నీ అవతారసమాప్తి అయిన వెంటనే ఈ చెట్టు నందనవనానికి చేరాలి. అని అనగా అలాగే అవుగాక! అని కృష్ణుడు పారిజాత వృక్షంతో ద్వారకను చేరి శంఖం ఊదాడు. లోపల ప్రవేశించి ఆ చెట్టును సత్యభామ ఇంటనున్న ఉద్యానవనం నడుమ ప్రతిష్ఠించాడు.

తరువాత నరకుని నగరంలో ఉన్న తను తీసుకువచ్చిన పదారువేల కన్యకలను సుముహూర్తాన పరిగ్రహించి వారికి వేర్వేరుగా భవనాలూ ఆహారపదార్థాలూ దాసదాసీజనం, అంబరాభరణాలు సమృద్ధిగ కలిగించి అందరికీ అన్ని రూపాలతో తాను ఆనందం కలిగిస్తూ ఉన్నాడు.

కొంతకాలానికి ఆ కాంతలయందు ముప్పది రెండువేలరెండు వందలమంది కొడుకులు పుట్టారు.



అలాగే రుక్మిణికి ప్రద్యుమ్నాదులు. సత్యభామకు భానుకాదులు, జాంబవతికి సాంబాదులు నాగ్నజితికి భానువిందాదులు. ఇలా అష్ట మహిషులయందు ఆనందంగా కృష్ణుడు కాలక్షేపం చేస్తున్నాడు.

బలి కొడుకు బాణుడు శంకరుని గూర్చి తపస్సు చెయ్యగా శంకరుడు ప్రత్యక్షమై వానికి కోరినవరాలిచ్చి నగరపాలకుడుగా ఉండడానికి కూడా అంగీకరించాడు.

వెయ్యిచేతులూ కౌమారత్వమూ వాని ముఖ్యవరాలు.

బాణుడు అసురనాయకుడై శోణపురం రాజధానిగా అందుండి దొరతనం నెరపుతున్నాడు. వానిని ఎవ్వరూ ఎదిరించలేక ఎక్కడెక్కడ ఉన్న అసురులూ వచ్చి బహుమతులు ఇచ్చి సహచరులు అనుచరులు అయిపోయారు.

క్రమంగ పేరు ప్రఖ్యాతిగల బాణునికి గర్వం ముదిరి యుద్ధకాంక్షతో ఇంటినుంచి బయల్దేరి పుర రక్షకుడై ఉన్న శంకరుని వద్దకు వెళ్లి విన్నవించాడు.

త్రిపురాంతకా! వేయిచేతులూ అసాధారణమైన భుజబలం ప్రసాదించావు యుద్ధం చేద్దామంటే ఎవ్వడూ కనిపించడాయె. చేతుల తీరు దుర్భరమై ఉన్నది. దయచేసి యుద్ధానికి సిద్ధపడవలసిందిగా మనవి –

బాణాసురుని ప్రగల్భవాక్కు విని పార్వతీదేవి బాణా! కొంచెం ఓర్చుకో నీ మయూర కేతనం కిందపడగా – నీ కోరిక తీరే ఘోరరణం సంప్రాప్తం ఔతుంది. వెళ్లు. అని అనగా బాణుడు వెనుదిరిగి వచ్చి తన మేడపై కూర్చుండి జెండావైపు చూస్తూ ఎప్పుడు పడుతుందా అని జపం చేస్తూ కాలం గడుపుతున్నాడు.

అలా ఉండగా ఒకనాడు మయూరధ్వజం నేలగూలింది. చూసి బాణుడు సంతోషించాడు. అలా ఉండగా పార్వతీసహితుడై పరమేశ్వరుడు

సురాసురకాంతలతో ఉద్యానవనంలో విహరిస్తున్న సమయం. బాణు నందన ఉషాకుమారి తనకింకా తగిన పతి రాలేదని విచారిస్తూ ఉండగా చూసి గౌరీదేవి అన్నది.

బాలా! వైశాఖ శుద్ధ ద్వాదశినాటి రాత్రి కలలో నిన్ను కలిసి అలరించిన వాడు నీ పతి అవుతాడని వరమిచ్చినట్టు అనగా ఉష ఆనందించింది.

కాగా గౌరీదేవి చెప్పిన నాటిరాత్రి అపరమన్మథుడీ యువకుడు కలిసి ఉషను శృంగార విలాసాలతో ఆనందపరిచి అదృశ్యుడయాడు. తెలివి వచ్చిన ఉష తన శరీర పరిస్థితిని చూసుకున్నది. నిజమే – ఆ తల్లి చెప్పినట్లు జరిగింది. కాని నాకు నేటిరాత్రి కలలో కనిపించి అలరించినవాడే నా పతి కావాలి. ఈ పని ఎలా అవుతుంది? అని విచారించి – మంత్రి కుంభాండుని కూతురు చిత్రరేఖను రప్పించి జరిగినది చెప్పి నా కోరిక తీర్చు అన్నది. చిత్రరేఖ ఉషకి బహిఃప్రాణం.

సఖీ! నేనుండగా విచారమెందుకు? ఒక్కవారం గడువు కావాలి. ముల్లోకాలలోఉన్న ప్రసిద్ధులైన యువకులను చిత్రపటాలలో నీకు చూపుతాను. వాటిలో నీ ప్రియుడు ఉంటాడు. చెప్పవచ్చు. తరువాత – వెళ్లి వానిని తీసుకువచ్చి నీ వివాహం చేయిస్తాను – అని వెళ్లి అలాగే చిత్రపటాలు వ్రాసి తెచ్చి ఉష ముందుంచింది.

ఉష ముందు స్వర్గం – తరువాత – పాతాళం – చిత్రపటాలనూ వివరాలనూ చూసి తిప్పి వేసి మానవలోకయువకులను పరిశీలిస్తూ ద్వారక – అనిరుద్ధుడు – అంతఃపురం సమాచారం తెలుసుకుని సిగ్గుతో చిరునవ్వుతో చిత్రలేఖకు చూపింది. చిత్రలేఖ నవ్వి ఊ… గడుసుదానవు అదృష్టవంతురాలవు. తీసుకువస్తాను. అని ఆ రాత్రే ఆకాశమార్గాన ద్వారకకు వెళ్లి అనిరుద్ధునిభవనం ప్రవేశించి నిద్రలోఉన్న అతనిని అలాగే మాయాశక్తితో



గాలిలో తీసుకువచ్చి ఉషకి అప్పగించింది –

తరువాత – ఉషానిరుద్ధులు అంతఃపురంలో ఆహారవిహారాలతో ఆనందంగా ఉంటున్నారు. కొన్నాళ్లు గడిచాయి.

ఎలా తెలిసిందో బాణుడికి కన్యాంతఃపురంలో అన్యపురుషుడెవడో ఉన్నాడని కోపించి వీరభటులతో వచ్చాడు. అనిరుద్ధుడు ఖడ్గపాణియై విజృంభించి బాణుని వీరభటులను యమపురికి పంపించాడు. తరువాత బాణుడే కలిసి నిశితాస్త్రప్రయోగంతో అలయించి నాగపాశబద్ధుణ్ణిచేసి కూతురితో సహా అనిరుద్ధుణ్ణి చెరలో ఉంచాడు.

* * *

నారదుడు – కలహాశనుడు. ద్వారకకు వెళ్లి కృష్ణుణ్ణి దర్శించి పార్వతి బాణపుత్రికతో అనిన మాట – ఆ తరువాత అనిరుద్ధుణ్ణి బాణుడు నాగపాశబద్ధునిచేసి చెరలో ఉంచినంతవరకు జరిగనదంతా చెప్పి వెళ్లిపోయాడు –

వెంటనే కృష్ణుడు బలభద్ర ప్రద్యుమ్నాదులు రణకోవిదులు వెంటరాగా గరుడవాహనుడై శోణితపురానికి వెళ్లి లోకభీకరంగా పాంచజన్యం పూరించాడు. ఆ శంఖధ్వనికి జగమంతా తల్లడిల్లింది. అంతలో శివుడు పురరక్ష ఒక జ్వరశక్తిని కల్పించి పంపించాడు. అది వచ్చి మంత్రించిన భస్మం బలభద్రునిపై చల్లింది. ఆ భస్మం మీద పడగానే బలరాముడు ఉడుకెత్తి స్మృతి తప్పి కిందపడ్డాడు. కృష్ణుడు చూశాడు. కోపం, సంతాపం కమ్మిన మనసుతో అన్నను లేవనెత్తి కౌగలించుకున్నాడు. దానితో బలరాముడు తెలివి వచ్చి లేచి ఒక్క సింహనాదం చేశాడు. కృష్ణుని శక్తికి సురలు ఆశ్చర్యపడి కొనియాడారు.

వెంటనే కృష్ణుడు తన ఆత్మశక్తితో శీతజ్వరం కల్పించి పంపగా అది వెళ్లి శివజ్వరాన్ని పట్టుకుని లాక్కుని వచ్చి కృష్ణుని ముందుంచింది. ఆ జ్వరం కృష్ణునకు చాగిలి మ్రొక్కి శరణు! శరణు! కాపాడు – అని ప్రార్థించగా కృష్ణుడు కనికరించి భయపడకు! అని అభయహస్తంతో కాపాడాడు. రెండు జ్వరాలనూ చూసి అన్నాడు.

హరిభక్తిలేని మూఢులను పట్టి పీడిస్తూ ఉండండి – అని పంపగా ఆ రెండున్నూ, విష్ణుభక్తిలేనివారిని ఆవేశించి పీడించనారంభించాయి.

తరువాత బాణాసురుని ఆజ్ఞననుసరించి దైత్య వీరభటులు శస్త్రాస్త్ర పాణులై వచ్చి ఎదిరించగా కృష్ణబలరాములు నిశితాస్త్ర జ్వాలామాలలతో దైత్యసేనను స్వరూపనాశనం చేశాయి. అంత – శంకరుడు కొడుకులతో ప్రమథులతో వచ్చి కృష్ణునెదిరించగా ఇద్దరికీ యుద్ధం కొన్నాళ్లు దారుణంగా జరిగింది. కాగా ఒకనాడు శంకరుడు బాణాసురుణ్ణి ప్రోత్సహించాడు. నా చేతుల దురద పోయేట్టు యుద్ధం జరగాలన్నావు. వెళ్లు – కృష్ణుణ్ణి ఎదిరించు. నీ కోరిక తీరుతుంది –

వెంటనే బాణాసురుడు తగిన సేనతో కృష్ణుణ్ణి ఎదిరించగా పోరు ఘోరంగా జరిగింది. కృష్ణుడు చక్రం ప్రయోగించి రెండుచేతులు మిగిలేట్టుగా బాణుని చేతులను తెగనేశాడు. అంతట శంకరుడు వచ్చి వాసుదేవా! బాణుని ప్రాణాలు తియ్యకు. నా భక్తుడు. నా మాట మన్నించు! సరే అన్నాడు. బాణుణ్ణి ప్రాణాలతో విడిచి కారాగారంలో ఉన్న ఉషానిరుద్ధులను తోడ్కొని ద్వారకకు వచ్చాడు... అంతా సుఖంగా ఉన్నారు.

కాశీపురాధీశుడు పేరు పౌండ్రకవాసుదేవుడు. తనకు సాటి ఏ రాజు లేడనే గర్విష్ఠి. పేరుకి తగినట్టు శంఖచక్ర చిహ్నాలుకూడా కల్పించుకుని పరిపాలన చేస్తూ ఉన్నాడు. వాని లక్షణాలు చూసి ఇతర రాజులు హేళనగా



మాటాడుకునేవారు. వానికి కృష్ణునిపై పగ కలిగింది. అన్ని విధాలా తనకి వశుడయి ఉండాలని చెప్పవలసేమాటలు చెప్పి ఒక దూతని కృష్ణుని వద్దకు పంపగా వాడు వచ్చి సభలో కృష్ణుని చూసి అన్నాడు.

నందనందనా! శంఖచక్రాలు గదా ఖడ్గాలూ కౌస్తుభం, పీతాంబరం – కలిగిఉన్న వాసుదేవుడను నేను. నాపేరుతో నువ్వు ఉండడానికి నీకు యోగ్యత లేదు. కాబట్టి వాటిని విడిచి నన్ను అనుకరించే బుద్ధి కలిగి ప్రవర్తిస్తూ ఉండు. కాదంటావా? ఈశ్వరాదులు తోడుగా వచ్చినా దారుణ రణంలో నిన్ను తెగనేసి ఆ చిహ్నాలన్నీ ఎగిరిపోయేట్టు చేస్తాను.

అని మా రాజు కాశీపతి పౌండ్రకవాసుదేవుడు అనే పేరు వాడు నీకు చెప్పవలసిందనగా వచ్చి చెప్పాను. ఏమంటావు?

అని అనగా కృష్ణుడు చెప్పాడు. ఆ దారుణ రణం ఏదో చూసి చేసి ప్రాణాలు విడవ వలసి వస్తే నా చిహ్నాలు అప్పుడు విడుస్తాను. వెదకబోయిన తీగ కాళ్లకి తగిలిందన్నట్లు మీ రాజు సమాచారం చూడాలనే అనుకుంటున్నాను. ఏదో కారణం ఉండాలి కదా కయ్యానికి. తానే ముందుకి వచ్చాడు కనుక నేను ఎదిరించవలసిందే. పోయి చెప్పు. ఎల్లుండి వచ్చి చెయ్యవలసేది చేస్తానన్నానని –

కృష్ణుని మాటలు విని ఆ దూత తిరిగి వెళ్లి తన రాజుకి కృష్ణుని మాటలు చెప్పాడు.

తరువాత – కృష్ణుడు బలభద్ర సాత్యకి ప్రముఖ యాదవ వీరులను ద్వారకకు కాపరులుగా ఉంచి చక్రాద్యాయుధపాణియై గరుడవాహనుడై కాశి వెళ్లాడు. లోకభీకరంగా శంఖధ్వని సారించాడు. ఆ ధ్వని విని పౌండ్రుడు తన సైనికభటులను కృష్ణునిపైకి పంపగా వారు కృష్ణునిపై వివిధాయుధ

ప్రయోగం చేశారు. కృష్ణుడు రోషభీషణాకారుడై ఆ ఆయుధాలను సముచి తాస్త్రప్రయోగంతో ఎగరగొట్టి పౌండ్రుని సైనికులను తెగనేశాడు.

తన సేన సర్వనాశనం అయిందని తెలిసి పౌండ్రకవాసుదేవుడు కోపించి రథారూఢుడై రణరంగానికి వచ్చాడు. అచ్చంగా వేషమంతా వాసుదేవుని వేషమే. వానిని చూచి చిరునవ్వుమోముతో కృష్ణుడన్నాడు.

దూతచేత నాకు వార్త పంపావు. ఆ పని నెరవేర్చడానికే వచ్చాను. నిలు! నిలు! అని చక్రం ప్రయోగించాడు. అంతే ఎండుపుల్ల అగ్గిమంటకి ఆహుతి అయినట్టు పౌండ్రకవాసుదేవుడు కృష్ణుని చక్రానికి బలి అయిపోయాడు. పైనున్న దేవతలు పరమానందంతో కృష్ణ స్తుతిచేశారు. తరువాత కృష్ణుడు ద్వారకకు రాగా పౌండ్రకుని కొడుకు కృష్ణునిపై పగబట్టి అది తీర్చుకోవాలని శివుని గూర్చి పన్నెండేళ్లు తపస్సు చేశాడు. శివుని వల్ల ఒక శక్తిని వరంగా పొంది ద్వారకకు వచ్చి ప్రయోగించాడు. కృష్ణుడది తెలిసి చక్రాన్ని విడువగా అది పౌండ్రకుని కొడుకునీ వాడు ప్రయోగించిన శక్తినీ ముక్కచెక్కలు చేసింది.

ఇలాగ కృష్ణుడు చేసిన పనులు అతిమానుషములు. అలాగే బలభద్రుడు చేసిన పనులున్నూ వర్ణనాతీతములు.

దుష్టశిక్షణ శిష్టరక్షణ, ధర్మస్థాపన లక్ష్యంగా ఇలపై అవతరించి ఆ విష్ణువు చేసినదంతా ధార్మికం... ఆత్మబంధువైనా సరే అధర్మమార్గాన ప్రవర్తించాడంటే వానిని సమూలంగా నాశం చేసిన ధర్మమూర్తి కృష్ణుడు. దేవాదులకు కూడా అచ్చెరువునూ, ఆనందాన్నీ కలిగించే పనులు చేశాడు.

దుష్టశిక్షణ చేసి భూభారం తీర్చడం లక్ష్యంగా నారాయణుడు ద్వాపరయుగాంతంలో కృష్ణుడుగా యదువంశాన జన్మించాడు. పాండవులకూ, కౌరవులకూ ఆస్తిపంపకం నెపంతో కలహం కలిగించి ఉభయపక్షాలనూ యుద్ధానికి సంసిద్ధులను చేశాడు. ఇరువర్గాలకూ తోడుగా ఇలపైగల రాజులు



వచ్చారు. మొత్తంత 18 అక్షౌహిణుల బలం. తన – పర అనే భేదం లేనివాడై అర్జుననకు సారథియై పదునెనిమిదిదినాలు పోరు ఘోరంగా జరిగేట్లు చేశాడు. సర్వనాశనం అయింది.

అలాగే యాదవులను చూస్తూ పరస్పరం వైరం కలిగించి వారిలో వారు కొట్టుకు చచ్చేట్టు చేశాడు. చివర తనూ, అన్న బలరాముడూ పరమపదానికి వెళ్లిపోయారు.

అని చెప్పగ మైత్రేయుడు : మహాత్మా! ఆపదలలో ఉన్నవారిని ఆదుకునే కృష్ణుడు తన వంశీయులకు కలహం పుట్టించి చంపడం ఏమి? బలరామ పద్ధతి ఏది? అది యేదో వివరించవలసిందని కోరుతున్నాననగా పరాశరుడు చెప్పాడు.

యాదవులు ఇంద్రాదులకు కూడా తేరిచూడరాని బలపరాక్ర మాదులతో మితిమీరి ప్రవర్తించడంచూసి ఒకనాడు కృష్ణుడనుకున్నాడు.

మితిమీరి ప్రవర్తిస్తున్న యాదవులను అంతమొందిస్తే గాని భూభారం తీరదు. ఆ పని చెయ్యవలసిందే – అని అనుకుంటూ ఉండగా దుర్వాసుడు కృష్ణదర్శనం చెయ్యాలని ద్వారకకు వచ్చి ద్వారంవద్ద నిలిచి తనరాక కృష్ణునకు చెప్పవలసిందని అక్కడ ఉన్న యాదవకుమారులతో అన్నాడు. వారాపని చెయ్యక దైవనిర్ణయం సాంబుడికి గర్భవతివేషం వేసి దుర్వాసుని ముందుకి తీసుకువచ్చి అయ్యా! దీనికి కొడుకు ఎప్పుడు పుట్టుతాడు? అని అడిగారు. దుర్వాసుడు అసలు విషయం గ్రహించి కోపం ప్రకటించే చూపుతో చూసి చెప్పాడు.

దీనికి కొడుకు పుట్టడు. ఇనపరోకలి దీని కడుపులోంచి వస్తుంది. వెంటనే యుద్ధం ఆరంభమవుతుంది. దాని మూలంగా ఘోరయుద్ధం జరుగుతుంది. యదువంశం అంతా నశిస్తుంది. నా మాట బ్రహ్మ కూడా

తప్పించలేదు. వీడు ఆడది కాదు. గర్భవతి వేషం ఇది. పొండి మూర్ఖులారా! అని వెనుదిరిగి వెళ్లిపోయాడు. ఆ యాదవకుమారులు భయభ్రాంతులై కృష్ణుని వద్దకు వెళ్లి జరిగినది చెప్పారు. ముని శాపానికి ఎదురీత చెయ్యగలడు కాని చెయ్యడానికి ఇచ్ఛగించక ఆశ్చర్యంగా చూశాడందరినీ. ఏమీ తెలియనట్టు. తరువాత పౌరులూ బంధువులూ వచ్చి ప్రార్థించారు. కాని మారుమాటాడక కూర్చున్నాడు.

కొలది దినాలలో సాంబుడి కడుపు నుంచి దుర్వాసుని కోపానికి రూపమా అన్నట్టు ఉగ్రరూపంతో రోకలి బయటికి వచ్చింది. దానిని యదుకుమారులు ఉగ్రసేనుడి ముందుంచారు. ఆ ముసలి ఏమి చెయ్యగలడు? విషయం తెలిసి అందరిలాగే విచారించాడు. కొంతసేపయాక మంత్రులతో చెప్పాడు. దీనిని సానపట్టి ఆ పొడి సముద్రజలాలతో కలిపి వెయ్యండి. ఎవ్వరికీ ఏ ప్రమాదముండదన్నాడు. మంత్రులు అలాగే చేయించి ఆ పొడి సముద్రంలో కలిపించారు. అది తీరానికి పొంగింది. అక్కడ తుంగ దట్టంగా మొలిచింది.

అరగదీసిన రోకలిముక్క అవశేషం. అరగదీయడానికి సాధ్యంకాక దానిని సముద్రంలో పడవేయించాడు. దానిని ఒక చేప మింగింది. జాలరి ఆ చేపను పట్టుకుని కడుపు కోసి లోపల ఉన్న రోకలిచిగురు ముక్కను ఒక వేటగాడికివ్వగా వాడు దానిని తన బాణంకొసకి అతికించి పదిలంగా ఉంచుకున్నాడు.

ఇక – ద్వారకలో దుర్నిమిత్తాలు. కుక్కలూ, నక్కలూ ఇండ్లపై ఎక్కి అరవడం, కాకులు గుడ్లగూబలూ కలిసి ఇళ్లలో కుయ్యడం. పట్టపగలు మింట చుక్కలు కనిపించడం – అకాల మేఘాలూ, వాటిలోంచి పడే నెత్తురు, పురవీథిలో క్రూరమృగాల సంచారం – భయంకరంగా కూతలూ, గ్రహాలు వక్రంగా సంచారం – ఆవిరితో అగ్గిమంటలూ...



ఇవన్నీ యదువంశ వినాశాన్ని సూచిస్తున్నాయి. అలా ఉండగా ఒకనాడు ఉద్ధవుడు కృష్ణునివద్దకు వెళ్లి ప్రసంగించాడు.

కృష్ణా! నీకు తెలియనిది ఉండదు. అయినా చెప్తున్నాను. ద్వారకలో దుర్నిమిత్తాలు చాలా కనిపిస్తున్నాయి. మరి నీ పుత్రమిత్రాదుల సంరక్షణ మాట ఏమి?

ఉద్ధవా! ద్వాపరయుగం అయిపోవచ్చింది. భూభారం తీర్చడానికే నా రాక! యుద్ధాలలో ఆ దుష్టులను చంపాను, చంపించాను. మిగిలినది ఒకింత యాదవవంశం. దీనినే అంతమొందించాలి. చేజేతులా నేనది చెయ్యడం లోకధర్మ విరుద్ధమని తంత్రం వేశాను. మునిశాపం. దానిని మళ్లించలేనా?... కాదు. వీళ్లంతా గతితప్పి ఉన్నారు. అంతా సద్గతి పొందాలి – ఇక నీ మాట. నన్ను మనసా ధ్యానిస్తూ ఉండు. నీకు ముక్తి కలిగిస్తాను. నేనూ ఈ నరరూపం విడిచి దివ్యపదానికి వెళ్లిపోతాను. తరువాత, ద్వారక సముద్రజలాలలో కలిసిపోతుంది. ఈ వాక్యాలు పరమ రహస్యాలు. వెళ్లు! అని పంపించాడు కృష్ణుడు.

ఉద్ధవుడు గంధమాదనం పోయి బదరికాశ్రమంలో నర నారాయణ స్థానం నందుండి తపశ్చర్య ఆరంభించాడు.

ఒకనాడు దేవదూత అమరావతినుంచి వచ్చి కృష్ణుణ్ణి దర్శించి ఇంద్రుని మాటలుగా ఏకాంతంగా చెప్పాడు.

పద్మనాభా! భూభారం తీర్చడానికి మానవుడవై ఇలపయిన అవతరించావు. వారికీ వీరికీ కలహాలు కలిగించి యుద్ధాలు మహోద్ధతంగా నడిపించావు. ఆడవాళ్లు తప్ప మగపురుగు లేనట్లు చేశావు. ఇక మిగిలిన వారు మీ యాదవులు. వారినికూడా అంతమొందించి పరమపదానికి

చేరవలసిందిగా కోరుతున్నాను. కాలగమనం లెక్కించాలి కదా నీవు నూరేండ్లకు మించి అవనిలో ఉండడం భావ్యమా?

ఇలా ఇంద్రుని మాటలు వినిపించిన ఆ దూతను చూసి కృష్ణుడన్నాడు.

ఇక ఏడు దినాలలో యాదవ వంశనాశం అవుతుంది. అది కాగానే పరమపదానికి చేరుతానని ఇంద్రునకు చెప్పు అని ఆ దూతను పంపించగా వాడు వెళ్లి ఇంద్రునకు చెప్పాడు.

తరువాత – యాదవులు విష్ణుమాయా ప్రేరితులై ప్రభాసతీరంలో స్నానంచేసి మహోత్సవం పేరుతో మద్యం తాగి మత్తెక్కి మాటకి మాటా మీరి బాహాబాహి కచాకచి ముష్టీ ముష్టి – పోరాడడమే కాక అస్త్రశస్త్ర ప్రయోగం దానితో చాలక సముద్రం ఒడ్డున ఉన్న తుంగ తీసి దానితో బాదుకొనడం కృష్ణమాయ. ఆ దెబ్బ వజ్రంలాగా తగిలి అందరూ ప్రాణత్యాగం చేశారు.

శంఖచక్రగదాశార్ఙ్గాలు కృష్ణునకు ప్రదక్షిణంగా తిరిగి వైకుంఠానికి వెళ్లిపోయాయి. తరువాత కృష్ణుడు అన్నతో రథమెక్కాడు. దారుకుడు అల్లనల్లన రథం నడిపించి సముద్రతీరానికి చేర్చాడు.

బలరాముడు ఒకించుక అలసినట్లు అనిపించి ఒక చెట్టు కిందికి చేరి కూర్చున్నాడు. అంతలో అతని ముఖంలోంచి శేషుడు నిజస్వరూపంతో అవతరించి సముద్రజలాలలో ప్రవేశించాడు. సముద్రుడు సముచిత రీతిని ఉపచారం చేశాడు. వాసుకి మొదలైన నాగపతులు వచ్చి స్వాగతం పలికారు. శేషుడు వారిని ఆనందంగా చూసి వారితో అమరలోకానికి వెళ్లిపోయాడు. అపుడు కృష్ణుడు దారుకుని చూచి

దారుకా! నువ్విక ద్వారకకు వెళ్లు నేను మరి రాను. పైలోకానికి వెళ్లిపోతాను. నువ్వు వెళ్లి ఉగ్రసేనుడు ఇంకా ఉన్నవారూ వినేట్లు చెప్పు.



యాదవులు కొట్టుకు చావడం, బలభద్రుని నిష్క్రమణ, నా పరమపద ప్రాప్తి. వివరించు –

అర్జునుడు వచ్చి మా స్త్రీలను తీసుకు వెళ్లుతాడు. అతడు వెళ్లగానే ద్వారక సముద్రంలో కలిసి పోతుంది. వజ్రుడు వజ్రధరునితో కలిసి యాదవులకు పరలోక క్రియలు నిర్వర్తించి పరలోకానికి వెళ్లుతాడు. ఇక – నీవు నాపై ఎంతో భక్తి కలవాడవు – నీకు పరమపదం ప్రసాదిస్తున్నాను.

కృష్ణుని మాటలు విని దారుకుడు పునఃపునః ప్రణామాలు చేసి ద్వారకకు వెళ్లాడు.

* * *

దారుకుని పంపించి కృష్ణుడు ఒకవృక్షం క్రింద యోగాసన పద్ధతిని కూర్చున్నాడు. అంతలో 'జరుడు' అనే మ్లేచ్ఛుడొకడు అటకు వేటకై వచ్చి కృష్ణుని పద్ధతిని చూసి మృగమని భ్రాంతిపడి మీదుగా బాణం ప్రయోగించాడు.

(శ్రీకృష్ణుని పాదం మృగం చెవిలాగా ఆననం సంబంధంగా అల్లనల్లన కదులుతూంది) దగ్గరగా వచ్చి చూశాడు శంఖచక్రశార్ఙ్గగదాధరుడు, శ్రీవత్సలాంఛనుడు, పీతాంబరుడు – శ్రీకృష్ణుడు – ఆ కిరాతుడు వంగివంగి ఆనందంగా నమస్కరించగా కృష్ణుడు వాని భక్తికి ప్రసన్నుడై పరమపద నివాసం అనుగ్రహించాడు. వెంటనే దివ్యపురుషులు తీసుకువచ్చి ఆ కిరాతుణ్ణి ఎక్కించి తీసుకుపోయారు.

ఒకింతసేపటికి గరుత్మంతుడు రాగా శ్రీకృష్ణుడు యోగాసనం చాలించి గరుడ వాహనుడై సురల అభినందనలకు ఆనందిస్తూ స్వస్థలానికి వెళ్లిపోయాడు.

దారుకుడు నగరంలో ప్రవేశించి వసుదేవునకు ఉగ్రసేనునకు పౌరులకు చెప్పాడు యాదవమృతి – బలరామునిగమనం, కృష్ణుని స్వస్థానగతి – విని వారంతా ఎంతో చింతకు లోనైయుండగా ఆ సమయంలో కృష్ణుని చూడాలనే కోరికతో అర్జునుడు వచ్చాడు. దారుకుడు యాదవకుల మృతి మొదలైనవి చెప్పగా అర్జునుడు మిగుల దుఃఖించి ఉగ్రసేన వసుదేవులతో కలిసి బలభద్రవాసుదేవుల కళేబరాలు చూసి మనసులో అనుకున్నాడు. ఇలలో సృష్టిస్థితిలయాలకు కర్తయైన వాసుదేవుడు సముద్రతీరాన ఒక కిరాతుని బాణానికి గురియై ప్రాణం విడిచాడా? అకటా? అని వివరించాడు.

తరువాత రుక్మిణీ సత్యభామాదులు ఎనమండ్రు కృష్ణునితో సహగమించారు. అట్లే రేవతి అగ్నికి తన తనువునర్పించి బలభద్రుననుగమించింది. దేవకీవసుదేవులూ ఉగ్రసేనాది బంధువులూ అలాగే వెళ్లిపోయారు. అర్జునుడు వజ్రునిచే యాదవులకు పరలోక క్రియలు చేయించి ద్వారావతికి వచ్చాడు.

ఆశ్చర్యం! అందరూ చూస్తూ ఉండగా పారిజాతం రివ్వున ఎగిరి గాలిలో కలిసి అమరావతికి పోయింది. ద్వాపరం ముగిసింది. కలి ప్రవేశం లక్షణాలు కాననయాయి.

అర్జునుడు ద్వారకలో ఉన్నవారిని వెడలించి ఒక రమ్య ప్రదేశమందు ఉంచాడు. ఆ సమయంలో కృష్ణుని అంతఃపురంతప్ప మిగిలినదంతా సముద్రజలాలలో కలిసిపోయింది.

వాసుదేవుడు భక్తవత్సలుడు కనుక – అక్కడ ప్రత్యక్షమై ఉంటాడు. ఆ విధంగా ద్వారక పుణ్యక్షేత్రం అయింది. అది విష్ణువు విహారస్థలంకనుక పాపనాశం, సకలసుఖసంస్థానం అయింది. ద్వారకావాసులఇళ్లు ధనధాన్య



సమృద్ధితో కలకలలాడుతూ ఉంటాయి. ఆ క్షేత్రాన్ని దర్శించడానికి వెళ్లిన మానవునకు మాధవుడు మోక్షప్రదాత అవుతాడు.

తరువాత అర్జునుడు శ్రీకృష్ణునిభార్యలతో ప్రయాణించాడు హస్తినాపురానికి – విల్లమ్ములు ఎప్పుడు సిద్ధంగా ఉన్న సవ్యసాచి అర్జునుడు. కొంతదూరం గడచాక అడవిలోంచి వెళ్లవలసి వచ్చింది. అలాగ వెళ్లుతూ ఉండగ ఇటు అటూ ఉన్న కొండపల్లెల బోయలు మూకలుగా వచ్చి అడ్డుపడి అర్జునునితో అన్నారు –

పెద్ద విల్లూ వేషం – మునపటి కాలం అనుకున్నావా! ఈ ఆడవాళ్లని ఎత్తుకుపోతున్నావా? ఆగు! ఆగు! – అని కృష్ణకాంతలను తమవశం చేసుకున్నారు. అర్జునుడు కోపించి గాండీవం ఎక్కుపెట్టబోయాడు. కాని చేతులకు శక్తి లేకపోయింది. తరుగులేని బాణాలుండే అమ్ముపొదిని చూశాడు. ఒక్కటీ లేదు. అస్త్రమంత్రం ఒకటీ జ్ఞప్తికి రాలేదు. ఏమిది? కృష్ణునితోనే పోయిందా నా బ్రతుకు గౌరవం!... ఆ బోయలు కాంతలనందరనూ ఎత్తుకుపోయారు.

అర్జునుడు ఏమీ చెయ్యలేకపోయాడు. విచారిస్తూ అడవిలో పోతూండగా వ్యాసుడెదురయాడు. అర్జునుడు ద్వారకలో జరిగినది అడవిలో కిరాతులవల్ల జరిగినవి చెప్పి చిన్నబోయివుండగా వ్యాసభగవాను డన్నాడు.

కాలప్రభావం అర్జునా! పైనున్నవాడు కిందపడతాడు. మధుకైటభులతో పోరి విష్ణువు కిందపడలేదా? సూర్యచంద్రాదులు ఒక్కొక్కనాడు రాహు కేతువులకు చిక్కరా! వృత్రాసురునితో పోరలేక ఇంద్రుడు అమరావతిని విడిచిపోలేదా? భీష్మునితో కలహించి పరశురాముడు చెయ్యి ముడుచు కోవలసి వచ్చింది కదా! ద్రోణభీష్మాది మహాయోధులు నీ బాణాలకు బలి

కాలేదా? వారు శక్తీయుక్తీ లేనివారని అనగలమా? అర్జునా! ఈ శరీరం ఏదో ఒక సమయంలో ఉసురు తప్పి కింద పడవలసేదే. అలాటి శరీరానికి ఏదో జరిగిందని జరుగుతుందని విచారించకు!

కృష్ణుని భార్యలు కిరాతులచే పరాభవం పొందారా? బాధపడకు. మునుపు వారికి తగిలిన బ్రాహ్మణ శాపఫలం అది. చెప్తాను విను –

అష్టావక్రుడు ఒక బ్రాహ్మణుడు. మేరుగిరి దరి. ఒక సరస్సులో ఉండి స్నానంచేస్తూ తపస్సు చేస్తూ ఉండగా రంభాదులు అప్సరసలు విలాసయాత్రగా అక్కడకు వచ్చి తమ ఆటపాటలతో అష్టావక్రుని దయకి పాత్రులై రంభాదులు అమరపురికి పోయారు. కొందరు అక్కడే ఉండి

స్వామీ! మేము విష్ణుదేవుని భార్యలం అయేట్టు వరమియ్యవలసిందని వేడగా ద్వాపరయుగంలో యదువంశంలో ఆ దేవుడు అవతరిస్తాడు. పేరు కృష్ణుడు. ఆయనకి భార్యలవుదురుగాక! అని ముని వరమిచ్చాడు. ఆ మర్నాడు ముని కొలనులో ఉండి స్నానం చేస్తూండగా చూసి ఆ కాంతలు అతని నీరసశరీరం నవ్వించగా ముని కోపించి మీరు కృష్ణుని పరోక్షాన బోయల చేతులచెరలో పడుదురుగాక! అని శపించాడు. ఆ కాంతలు భయపడి క్షమించు అని ప్రార్థించగా సరే – మానభంగంకాక ప్రాణత్యాగం చేసి అమరపురికి వెళ్లుదురుగాక! అన్నాడు. విన్నావా అర్జునా! ఆ మునిమాట జరిగింది. ఆ ఇంతులు ప్రాణంవిడిచి మర్యాదగా సురలోకానికి వెళ్లిపోయారు.

సవ్యసాచీ! కలియుగం ప్రవేశించింది. ఇక మీరీ నేలపై ఉండరాదు. తపస్సుచేసి పరలోకానికి పోవాలి. ఈ మాట ధర్మనందనునకు కూడా చెప్పు. అని ఆ దివ్యమౌని వెళ్లిపోయాడు. అర్జునుడు వజ్రునితో హస్తినకు వచ్చాడు.



శ్రీకృష్ణునివృత్తాంతం – వ్యాసుడు తనకు చెప్పినది అన్నకు చెప్పాడు. వెంటనే ధర్మరాజు అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తునకు కౌరవ రాజ్యానికి పట్టం కట్టి ద్రౌపదీ భీమార్జున నకులసహదేవులతో తపోవనానికి వెళ్లాడు.

అని కృష్ణచరిత్ర చెప్పగా విని పరమానంద భరితుడై మైత్రేయుడు పరాశరునితో అన్నాడు –

గురువర్యా! నీ దయవల్ల వాసుదేవునకు సంబంధించిన విషయం అంతా విన్నాను. హరిభక్తి కలవాడను అయాను. ఇక కలియుగధర్మాలు – జగత్ప్రళయలక్షణాలు వినిపించ వలసిందని మనవి –

మైత్రేయుని మాట విని పరాశరుడు చెప్పాడు.

**కలియుగధర్మం**

మైత్రేయా! కలియుగంలో ధర్మం ఒక్క పాదంలోనే నడుస్తుంది. కనుక ధర్మానికి నీడలేదు.

కలియుగంలో వైదికాచారాలు యజ్ఞాలు తప్ప దేవతార్చన, అగ్నిహోత్ర విధి వివాహయోగ్యమైన దాంపత్యక్రియ తొలగిపోతాయి. గురుశిష్య వర్తన అవమానకరంగా ఉంటుంది. విష్ణుభక్తి వేదాంత విషయం, వర్ణాశ్రమ ధర్మాలూ ఏహ్యామై పోతాయి.

కులహీనులకు కన్యకల నప్పగిస్తారు వధువుగా. అది ధనాశ ప్రధానంగా నడుస్తుంది. లేదా కన్యక స్వతంత్రించి స్వయంవరపద్ధతిని ఆ పని చెయ్యవచ్చు. వర్ణసాంకర్యం కలుగుతుంది. బలవంతుడే ప్రభువు. పేరుకి బ్రాహ్మణులే దీక్షితులు. ఏ దేవతనైనా భజించడానికి సిద్ధపడతారు. తాము చెప్పినదే ప్రాయశ్చిత్త కాండ. వారు పల్కినదే శాస్త్రం – వారి నిర్ణయం

నీతి – ధనం కలవాడే రాజు. కల్లలాడువాడే నేర్పరి. పాప ప్రవర్తనులే భాగ్యవంతులు.

కూటికోసం కులసతులను విడచి కులమర్యాద పాటించక మగవాళ్లు కులం తక్కువ వారి కన్నెలను పెళ్లాడుతారు. నాలుగు డబ్బులు వస్తాయంటే కొండంతాశతో అధమాధముణ్ణి అయినా ఆశ్రయించడానికి అగ్రజాతుల వాళ్లు సన్నద్ధులవుతారు. కులానికీ గుణానికీ కలియుగంలో మన్నన ఉండదు.

స్త్రీలు పతిభక్తిలేనివారై తమ ఇచ్ఛ వచ్చినట్టు ప్రవర్తిస్తూ ఉంటారు. పిల్లలను ఎక్కువగా కని పేదరికంతో బాధపడుతూ ధనసంపాదనకై చెడు మార్గాన నడుస్తారు. తల్లిదండ్రులను అత్తమామలను అన్నదమ్ములను – చివరకు కన్నబిడ్డలను కూడా విడిచి స్వేచ్ఛాజీవనులై రెండు వంశాలకూ మాయని మచ్చ కలిగిస్తారు. ఒకేమారు రెండు చేతులతో తలగోకుకుంటారు. అబద్ధాలపుట్టలై పరుషవాక్కుల నోళ్లతో కలియుగాన ప్రవర్తిస్తూ ఉంటారు.

బ్రాహ్మణులు స్నానం, సంధ్య, జపం – వేదపాఠం విడిచి దురాచార పరులై కులజాతి ధర్మాలనొల్లక నీచంగా ప్రవర్తిస్తూ ఉంటారు.

పరిపాలకుల అన్యాయప్రవర్తనవల్ల వానలు కురియవు. ఆ విధంగా పంటలు కనిపించవు.

వైశ్యులు లాభంకోసం వర్తకం చెయ్యడమే గాని పరులకు తోడ్పడడానికి కాదు.

శూద్రులు – పైజాతుల వారికి వేదశాస్త్ర ధర్మాలు (బ్రాహ్మణులకు) బోధించే గురువులౌతారు.

ధనకాంక్షతో జనులు క్రింది జాతి వారిని ఆశ్రయిస్తారు.



తల్లిదండ్రులయందు భక్తిలేక కొడుకులు అత్తవారి గుమ్మాలలో అల్లాడుతూ ఉంటారు వారి ప్రాపకం కోసం,

కలియుగం చివర – కాంత అయిదారేళ్లకే కొడుకునుకన్న తల్లి ఔతుంది. పండ్రెండు సంవత్సరాలకే ముసలిది అయి ఇరవై యేళ్లు నిండగానే మరణిస్తుంది. పురుషుడు కూడా ఇరవై యేళ్లకే పైలోకానికి వెళ్లిపోతాడు. వేదశాస్త్రాలు రూపుమాసిపోతాయి. పాషండమతం తెగ పెరుగుతుంది. ఆదిదేవుడైన హరిని సేవించక అల్పదైవాలను ఆరాధిస్తూ ఉంటారు. బ్రాహ్మణులు శూద్రుల్లాగా ప్రవర్తిస్తారు. నీచజాతులు అన్ని విద్యలకూ ఆధారాలవుతాయి. ఉత్తమ క్షత్రియజాతి ఊరూ పేరూ లేకుండా పోతుంది. మ్లేచ్ఛులు పరిపాలకులౌతారు. పుణ్యాత్ముడికి అచిరకాలంలో యమదర్శనం అవుతుంది. పాపకర్ముడు చిరకాలం జీవిస్తాడు. అల్పబుద్ధి, అలాగే అల్పమైన ఐశ్వర్యం తప్ప – మంచిబుద్ధి, నిండుగా ఐశ్వర్యం ఉండవు.

అయితే చెప్పవలసే విశిష్టవార్త ఏమిటంటే కృతయుగాదులలో ఎంతో ప్రయత్నిస్తేగాని మేలు కలగదు. కలియుగంలో అది సులభంగా కలుగుతుంది. దీనికొక కథ చెప్తాను విను. ఒకపూట మునులంతా కూడి తక్కువగా ధర్మక్రియలు – ఎక్కువగా ఫలం – ఇది ఎలా సాధ్యం అవుతుంది? అని చర్చించారు. సమాధానం తోచలేదు – లేచారు. పదండి వ్యాసభగవానుణ్ణి అడుగవచ్చు అని బయల్దేరి గంగదరికి వెళ్లాడు. ఆ సమయంలో నా కొడుకు గంగలో స్నానం చేస్తున్నాడు. మునులు చూసి గట్టున ఉన్న చెట్ల నీడలలో కూర్చున్నారు. వ్యాసుడు వారిని చూసి స్నానం చేస్తూ వారి రాకకు కారణం తెలుసుకొని అన్నారు గట్టిగా

'కలి స్సాధుః శూద్ర స్సాధుః స్త్రియ స్సాధుః'. కలి సాధువు, శూద్రుడు సాధువు, స్త్రీ సాధువు – అని ముమ్మారని అనుష్ఠానం నెరవేర్చి వారి వద్దకు

వచ్చాడు. అభివాద ప్రత్యభివాదాలు పలకరింపులూ అయాక మునులు అన్నారు.

స్నానంచేస్తూ శూద్రులు, కాంతలు, సాధులు – అని ఏమో అన్నావు – ఏమిటా మాటల తత్త్వం? అని అనగా చిరునవ్వుతో వ్యాసుడు చెప్పాడు.

కృతయుగంలో భక్తితో పది సంవత్సరాలు ధ్యానం చేస్తే వాసుదేవుడు సంతుష్టుడౌతాడు. త్రేతాయుగంలో ఒక్క సంవత్సరం యజ్ఞం చేస్తే మాధవుడు అనుగ్రహిస్తాడు. ద్వాపరపయుగంలో నెల దినాలు భక్తితో పూజిస్తే శౌరి సంప్రీతుడౌతాడు. కలియుగంలో నిర్మలమైన భక్తితో మనసారా ఒక్కనాడు భజిస్తే చక్రధరుడు ఆనందిస్తాడు. ముందు చెప్పిన మూడు యుగాలలో ఎంతో శ్రమపడి సేవిస్తే వచ్చేఫలం అంత సంతృప్తి కలిగించదు. కలియుగంలో అల్పమైన శ్రమతో అధికమైన సత్ఫలం కలుగుతుంది. కనుక మేలైనది కలియుగం –

వేదాలు చదివి దీక్షాపరులై యజ్ఞాలుచేస్తూ ఉత్తమవ్రతాలు ఆచరిస్తూ దేవతలను అతిథులనూ ఆరాధిస్తూ బ్రహ్మచర్యం, కులాచారం తప్పక పాటిస్తూ బ్రాహ్మణులూ క్షత్రియులూ వైశ్యులూ శుచిగా ప్రవర్తించాలి. ఇప్పుడు చెప్పిన వాటిలో ఏ ఒక్కటి విడిచినా ఆ జాతులవారికి పుణ్యఫలం రాదు – ఇక శూద్రుడు బ్రాహ్మణసేవ చేస్తే పుణ్యఫలం అధికంగా పొందుతాడు. ఒకవేళ చెయ్యకపోయినా వానికి పాపం అంటదు.

మంచి చెడు కర్మలు, తాగవచ్చు కూడదు అనే కట్టడి. ఇది తినవచ్చు తినకూడదు అనే నియమం శూద్రునకు లేదు. పైజాతులవారు వాటిని పాటించాలి.

ఉపవాసాలు, తపాలూ జపాలూ యజ్ఞాలూ దానధర్మాలూ అనే నిర్ణయం శూద్రునకు లేదు. అవి చెయ్యకపోయినా వానికి పుణ్యగతులు కలుగుతాయి.



ఇక స్త్రీ విషయం –

మనసు, మాట చేసేపని ఒక్క తీరుగా ఉంటూ అనుకూలగా పతిని సేవించే స్త్రీ అనాయాసంగా తనతో పతినికూడా పుణ్యలోకానికి చేర్చుతుంది. ఆ మగువ సాధువని నా పలుకు. యజ్ఞాలూ జపాలూ తపాలూ వ్రతాలూ మామూలు చెయ్యకపోయినా పరిశుద్ధమైన మనసుతో అనుకూలవతియై పతిని భక్తితో సేవించే ఇల్లాలు సాధువు.

అని చెప్పగా మునులంతా ఎంతో సంతోషించి మహానుభావా! మేము అడగవలసినవి అడగనక్కర లేకయే నీ ఉపన్యాసం వల్ల మా సందేహం తీరిపోయింది. అంతేకాదు. నీ మాట లోకానికి ఒక ధర్మపాఠంకూడా అయింది.

అని వ్యాసునికి నమస్కరించి తమ తమ నెలవులకు వెళ్లిపోయారు.

తరువాత పరాశరుడు మైత్రేయా! కలియుగంలో హరిభక్తి దివ్యమంత్రం. కనుక శ్రీహరి అనుగ్రహం పొందడానికి దివ్యసాధనమైన ఆ మంత్రాన్ని నిశ్చలమైన భక్తితో మనసా జపిస్తూ ఉండు – అని చెప్పగా చేతులు జోడించి మైత్రేయుడు గురుదేవా! పరమ పవిత్రమైన శ్రీహరిచరిత్ర విన్నాను. ధన్యుడను అయాను. ఇక నా మనవి.

కల్పాంతంనందు జగానికి అపాయం ఎలా కలుగుతుంది? వాసుదేవుడు ఏమిచేస్తాడు? – ఆ విషయం వినిపించవలసిందని –– అనగా పరాశరుడు చెప్పాడు.

బ్రహ్మకు మహాయుగాలు ఒక వేయికాగా ఒక పగలు అయినట్టు లెక్క. ఆ మర్నాడు హరి తమోగుణమూర్తియై రుద్రరూపం ధరిస్తాడు. చరాచరజగమంతా శక్తి క్షీణిస్తుంది. నూరు సంవత్సరాలు వాన కురియదు. దానిచే భూతకోటికి ప్రాణాపాయం కలుగుతుంది. అరాజకాలు ఎక్కువవుతాయి.

సూర్యుడు వేయికిరణాలలో అధికమైన ఏడుకిరణాలతో నీటినంతనూ పీల్చుతాడు. ముల్లోకాలలో ఎక్కడా ఒక్కనీటి చుక్కైనా ఉండదు. ఆ ఏడు కిరణాలు కొంచెం కిందికి దిగగానే ఆ వేడికి ముజ్జగాలూ బూడిద బుస్సన లయిపోతాయి.

అప్పుడు శ్రీహరి తాబేటి వీపు చిప్పలాగా రూపు గలవాడై ప్రళయాన్ని జ్వాలలు రేగేట్టు చెయ్యగా శేషుడు పాతాళలోకాన ఉన్న జీవరాశిని దగ్ధం చేస్తాడు. ఆ దశలో అగ్ని, వాయువు కలిసి విజృంభించగా మహర్లోకాన ఉన్న సనకాది మునులు ఆ మంటలను ఓర్వలేక అక్కడి నుంచి జనలోకానికి వెళ్లిపోతారు. ఆ సమయంలో రుద్రరూపుడై విష్ణువు తన ఊపిరి నుంచి సంవర్తన మేఘంను పుట్టించి మెరుపులతో ఉరుములతో ఏకధారగా వర్షం కురిపిస్తాడు. ఆ వర్షం అగ్ని మంటలను చల్లార్చి భువర్లోక పర్యంతం వ్యాపించి అంతా జలమయం చేస్తుంది.

అప్పుడు హరి తన ఊపిరిచే పెనుగాలి పుట్టించి నూరేళ్లు ఆ గాలిని అంతటా వ్యాపింప చేస్తాడు. తరువాత హరి ఆ వాయువును తనలోనే తీసుకుని శేషశాయియై వేయి యుగాలు యోగనిద్రలో ఉంటాడు. అలా ఉండగా సనకసనందనాదులు వచ్చి ఆ దేవుని వాసుదేవతత్త్వాన్ని కీర్తించగా ఆ రాత్రి గడచిన తరువాత మేల్కొంటాడు. రాజసమూర్తియై బ్రహ్మరూపాన ఉండి ప్రజా సృష్టి చేస్తాడు. మైత్రేయా! దీనికి నైమిత్తికప్రళయమని సంజ్ఞ. ఇక – ప్రాకృతప్రళయ విషయం చెప్తాను విను. ఒకప్పుడు మా తాత (వసిష్ఠుడు) లోకాల తాత ముఖతః విన్నది అది.

మునుపు చెప్పిన నైమిత్తికప్రళయంలాగే నూరుసంవత్సరాలు వాన కురియదు. లోకాలకు మహోపద్రవం జరుగుతుందని వేరే చెప్పనక్కర లేదు. ఆ దశలో పంచభూతాలకు సంబంధించిన గుణాలు ఒక దానితో



ఒకటి కలిసి చివరకు అన్నీ మహత్తుకి బలి అయిపోతాయి. బుద్ధికి ఆధారం మహత్తు. ఆ మహత్తుతో సహ ప్రళయం సంభవించి అన్నీ సముద్రంలో కలిసిపోతాయి. అప్పటికే సముద్రాలన్నీ కలిసి ఒకటిగా ఉంటాయి. సారం – అంతా ప్రకృతిలో లీనమైపోతుంది. ఈ విధంగా ఇది ప్రాకృత ప్రళయం అని పేరు పొందుతుంది.

ఆ ప్రకృతితత్త్వం అవ్యక్త పురుషునిలో కలుస్తుంది. ఆ మహాత్ముడు శుద్ధుడు, అక్షరుడు, భవ్యుడు, ఏకాకి, సర్వవ్యాపి అయిఉంటాడు. ఆ పురుషుడు సర్వాత్ముడైన పరమాత్ముని అంశవల్ల సంభవించినవాడు. ఆ పరమాత్మునకు నామరూపాలూ జాతీ అనేవి ఉండవు – లేవు. (జాతి – జననం) జ్ఞానమయుడు సత్తామాత్రుడు. పరముడు. బ్రహ్మ, ఈశ్వరుడు అని చెప్పదగిన వాడు. ఆ పరమాత్ముడే విష్ణువు. అలాటి విష్ణువునందు నిశ్చలమైన భక్తి కలవారికి పునర్జన్మ ఉండదని అననేల? ఆ విష్ణువునకు లయం లేదు. సర్వవ్యాపి. సర్వసంస్తుత్యుడు... ఇక ఇంకొక ప్రళయ విషయం చెప్తాను విను అని పరాశరమునీంద్రుడు మైత్రేయునకు చెప్పాడు.

**ఆత్యంతిక ప్రళయం**

ఆధిభౌతికం, ఆధ్యాత్మికం, ఆధిదైవికం అని మూడు విధాలైన తాపాలు అన్ని జంతువులను ఏడిపిస్తూ ఉంటాయి. అవి (ఆ బాధలు) శారీరికాలు (శరీరానికి సంబంధించినవి), మానసికాలు (మనస్సునకు సంబంధించినవి) అని రెండు విధాలు. ఆధ్యాత్మికం శారీరం, మహారోషం, క్రోధం, మదం – అనేవి మానసములు.

శరీర సంబంధమైనది ఆధ్యాత్మికం. ఇతరులవల్ల కలిగే బాధలు ఆధిభౌతికాలు. వాయువు – అగ్ని మొదలైన వాటివల్ల కలిగినవిగా గ్రహించి వాటిని ఆధిభౌతికాలన్నారు. ఇలాటి తాపత్రయం శరీరికి గర్భవాసం,

జననం, ముసలితనం, అజ్ఞానం, మరణం, నరకం – ఇలాటి వాటికి సంబంధించి వివిధ దుఃఖాలను కలిగిస్తూ ఉంటుంది. వీటివల్ల భరించరాని దుఃఖం కలుగుతుందని చెప్పనక్కరలేదు. ఆ దుఃఖాలను గురించి చెప్తాను విను.

ఒక స్త్రీగర్భంనందు అది నివాసం – అది ఎలాటిదో చెప్తాను ముందు. మలమధ్యను మావితోపుట్టి మిక్కిలి వంకరగా వీపు, గుండె, కంఠం కలిసి ఆ తల్లికడుపులో అణగి ఉంటుందా శిశువు. చేతులూ కాళ్లూ కూడగట్టుకుని ఆ శరీరాన్ని చుట్టుకుని ఉంటాయి. అరటి పువ్వులాగా ముడుచుకుపోయి ముద్దకట్టి మూత్రంలో పడిఉంటుంది. వేడి, చలవ, వగరు, చేదు, పులుపు. ఇలా వివిధరుచుల ఆహారం ఆ తల్లి ఆరగిస్తే ఆ పదార్థాల చేదు వగైరా తాను అనుభవిస్తూ బాధపడుతూ ఉంటుంది. పెరుగుతూ సమయానుసారంగా ప్రజాపతి పంపించి గాలికొట్టగా కడుపులో తలకిందులాపడి ప్రసూతి వాయువు విసురు వల్ల బయటకి వస్తుంది.

వెలుపలిగాలి తగలగానే జ్ఞానం ఎగిరిపోతుంది. శరీరం ఇరుసులలో పెట్టి ఆడించినట్టు, రంపంతో కోసినట్టు, ముళ్లతో గుచ్చినట్లు నొప్పి బాధపడుతూ ఉంటుంది. గోకు కొనడానికి, ఒత్తిగిలి పడుకొనడానికి శక్తిలేక బాధపడవలసి వస్తుంది. ఆహారానికీ, తాగడానికీ ఇతరుల సహాయమే దిక్కు. ఈగలూ, దోమలూ కుట్టితే ఆ బాధ అనుభవించవలసిందే గాని ఆ శిశువు ఏమీ చెయ్యలేదు.

క్రమక్రమంగా పెరుగుతూ ఇతరుల అదలింపులూ బెదిరింపులూ అనుభవించవలసిందే. ఆధిభౌతికతాపాలకు కంది అజ్ఞానానికి ఆటపట్టై తన్ను తానెరగక మూఢవృత్తితో బ్రతకవలసి ఉంటుంది.



యౌవనం వచ్చిన తరువాత మత్తుడై ధర్మవిరోధాలైన అర్థ కామాలకు లొంగి దురాశతో చెయ్యరాని పనులు చేస్తూ బ్రతుకు వెళ్లిస్తాడు.

ముసలితనం రాగా పళ్లూడి జుట్టుపండి దృష్టి తగ్గి వెన్నెముక వంగి శక్తి అంతరించి కఱ్ఱ పట్టుకుని నడవవలసి వస్తుంది. చెవుడు, మాటాడడానికి శక్తి చాలక గుటకలు వేస్తూ ఉండడం. తిండి, నిద్ర తగ్గిపోవడం – ఇలాటి దురవస్థలో పడతాడు అన్నీ అణిగిపోయినా ఆశలు మాత్రం వదలవు.

చివర – పడరాని రోగాల పాలబడి కుటుంబాన్ని వదలలేని దుఃఖంతో యమభటుల చేతుల్లో పడతాడు. తను చేసిన పాపకర్మలకు నరకంలో యమకింకరులచే పడరాని శిక్షలకు లోబడి ఏడుస్తాడు. అవి అయిన తరువాత మళ్లీ ఏ తల్లి కడుపులోనో పడడం, పుట్టడం, పెరగడం, కష్టాలనుభవించడం ముసలితనం – చావు – ఇదే వరస –

పుట్టడం, చావడం, మళ్లీ పుట్టడం ఇదే వరస. కర్మఫలం అది.

ధనం ఆర్జించడం, దానిని కాపాడుకోవడం, వినియోగించడం ఈ పనులలో దుఃఖమే కాని సుఖం ఉండదు.

కలిమి కష్టాల ప్రోవు అని చెప్పాలి గాని సుఖాలమయం అని అనరాదు.

కర్మలు దుఃఖానికి బీజాలు. వాటిఫలం పుట్టుతూ ఉండడం – చస్తూ ఉండడం – ఈ జ్ఞానం నరునకు కలగదు. ఈ దుఃఖం పోగొట్టు కొనడానికి దివ్యాయుధం అని విష్ణుసహస్రనామ పారాయణ అని జ్ఞానులు చెప్పారు.

శ్రీహరిదయను పొందడానికి కర్మ – జ్ఞానం అనేవి సాధనాలని ఆగమోక్తి. జ్ఞానం – ఆగమ విహితమైన కర్మాచరణం – ఏదీలేక బ్రతుకు సుఖంగా గడవాలి, మోక్షం రావాలి అని అరిస్తే వస్తాయా?

భగవంతుడు – అనే పదానికి అర్థం చెప్తాను విను. సంభవం, భర్త – అనే రెండున్నూ భకారానికి అర్థం. పుట్టించి నడిపించి లయ మొందించే శక్తులు మూడున్నూ కలవాడు భగవంతుడు.

విజ్ఞానం, ఐశ్వర్యం, సంపద, యశస్సు, వైరాగ్యం, వీర్యం – అనే ఈ ఆరున్ను 'భగం' అనే పదానికి అర్థాలు. ఇవే షడ్గుణాలు. ఇవి కలవాడు భగవంతుడు అని విద్వాంసుల నిర్వచనం – ఈ ఆరుగుణాలతోఉన్న ప్రపంచంలో తను – తనలో ప్రపంచం ఉన్నవాడు భగవంతుడు – అని విబుధుల నిర్ణయం.

ఈ భగవన్నామం పరబ్రహ్మ స్వరూపియైన వాసుదేవుణ్ణే చెబుతుంది గాని మరే దేవతకు చెల్లదు. ఈ విషయం మునుపు కేశిధ్వజుడు అనే రాజర్షి ఖాండిక్యుని తండ్రికి చెప్పాడు. అని చెప్పగా మైత్రేయుడు

గురుదేవా! కేశిధ్వజుడు, ఖాండిక్య జనకుడు అనగా ఎవరు వారు? యోగనిమిత్తం వారికి కలిగిన వాదం ఏమో వివరించవలసింది – అని అడగగా పరాశరుడు చెప్పాడు.

జనకుని వంశీయుడు అమితధ్వజుడు. అతనికి ఖాండిక్యుడు, కృతధ్వజుడు – అని ఇద్దరు కొడుకులు. తండ్రి తరువాత వారిద్దరూ రాజ్యం సమంగా పంచుకుని అనుభవిస్తూ ఉండగా కృతధ్వజుని కొడుకు కేశిధ్వజుడు తపోధనుడు, ఆత్మవిద్యాపరాయణుడు, బలపరాక్రమశాలి అయి ఈ సంసారాన్ని అవిద్య వల్ల తరిస్తాను అని తండ్రి తరువాత రాజ్యం ఏలుతూ భోగాలనుభవిస్తూ ఉన్నాడు.

అలా ఉండగా ఖాండిక్యుని తండ్రి కర్మపద్ధతిని రాజ్యం ఏలుతూ పగబట్టి ఖాండిక్యుని గెలిచి కేశిధ్వజుడు వాని సిరిసంపదలు తనవిగా



చేసుకున్నాడు. చేసేది లేక ఖాండిక్యుడు నగరం విడిచి మంత్రులూ తానూ అరణ్యవాసి అయిపోయాడు. కేశిధ్వజుడే సర్వరాజ్యాధిపతి అయాడు.

ఆ కేశిధ్వజుడు ఒకనాడు ఒక యజ్ఞం చెయ్యగా ఆ యజ్ఞానికి సంబంధించిన ఆవు ప్రక్కనున్న అడవిలో ఒక పులి నోటపడి పోయింది. అది తెలిసి రాజు చింతామగ్నుడు అయాడు.

ఆ దోషానికి ప్రాయశ్చిత్తం ఏమని ఋత్విజులనడగగా మాకు తెలియదు. కశేరుడనే జ్ఞాని ఉన్నాడు. అతనినడగమన్నాడు. రాజు వెళ్లి అడగగా భార్గవుణ్ణడగమన్నాడా ముని. రాజు పోయి భార్గవుణ్ణి అడగగా శునకుణ్ణి అడగమన్నాడు. కేశిధ్వజుడు వెళ్లి అడగగా శునకుడు చెప్పాడు.

రాజా! గోవధకి ప్రాయశ్చిత్తం సామాన్యమైనది కాదు. అయినా నీ శత్రువైన ఖాండిక్యుడు వివరించి చెప్తాడు. ఎంతో తెలిసిన ధీమంతుడు. అని చెప్పగా

కేశిధ్వజుడు ఏలాటి సందేహంలేక తన పగను అణచి కృష్ణాజిన ధరుడై మృగశృంగకరుడై రథారూఢుడై ఖాండిక్యుని దగ్గరకు వెళ్లాడు. ఒకింత దూరాన ఉండగా ఖాండిక్యుని మంత్రులు మునపటి పగ తలంచి రాజుతో అన్నారు. రాజా! మన శత్రువు ఖడ్గధారియై ఒంటరిగా వచ్చాడు. చంపి పారవేస్తాం అని శస్త్రాస్త్రధరులై ఎదుర్కొనగా వారిని చూసి కేశిధ్వజుడు

ఆగండి నేను పోరాటానికి రాలేదు. ఆ పగ మరిచిపొండి. నేను చేసిన యజ్ఞానికి సంబంధించిన ఆవు పులిచే చచ్చింది. ఆ పాప ప్రాయశ్చిత్తానికి శునక మహాముని చెప్పిన చొప్పున ఖాండిక్యుని వలన తెలుసుకోవాలని వచ్చాను. అని అనగా మంత్రులు – చాలించు నీ ఉపన్యాసం. ఏదో నెపంతో మాటాడుతున్నావు. యజ్ఞం, గోహత్య! ధర్మాలున్నూ – శత్రువు ఒంటరిగా

కనిపిస్తే చంపవచ్చని రాజనీతి – అని ఆక్షేపించారు. అప్పుడు ఖాండిక్యుడు మంత్రులకు బోధించి తొందరపడి దోషం చేస్తే దానివల్ల వచ్చేసుఖం అల్పం. దానికోసం పుణ్యలోకసుఖాన్ని బుద్ధిమంతుడు వదులుకోడు. అదికాక – తగిన తోడులేక వచ్చిన శత్రువును పట్టిచంపడం ధర్మ విరుద్ధం – పాపానికి దీపం – కాగా కేశిధ్వజుడు మంచి చెడ్డలు తెలిసిన వాడే. నన్ను ధర్మసందేహం అడిగి తీర్చుకోవాలని వచ్చినట్లు చెప్తున్నాడు కనుక చేరదీసుకో వచ్చును. ఎదిరించదగదు.

అని మంత్రులను శాంతపరచి వారితో ఎదురువెళ్లి కేశిధ్వజుని పలకరించి తోడ్తెచ్చి తగిన మర్యాదతో మాటాడాడు. అప్పుడు కేశిధ్వజు డన్నాడు తన వచ్చినపని చెప్పి ప్రాయశ్చిత్తవిధి చెప్పవలసిందని –

అతని మాట విని ఖాండిక్యుడు వేదోక్త విధిని వివరించి చెప్పాడు. అతని బోధ విని కేశిధ్వజుడు తిరిగివచ్చి ప్రాయశ్చిత్త విధి నాచరించి సాంగోపాంగంగా యజ్ఞం చేసి ఋత్విజులకూ సభ్యులకూ యథోక్త దక్షిణ లిచ్చి, దీనులకూ అనాథలకూ కోరిన ధనధన్యాదులిచ్చి తృప్తులను చేశాడు.

ఒకనాడు అనుకున్నాడు. నాకు ప్రాయశ్చిత్త విధి తెలిపి కృతకృత్యుణ్ణి చేసిన ఖాండిక్యునకు ఇష్టమైనవి ఆనందంగ సమర్పించాలి – అని మంత్రులనూ భటులనూ వెంట ఉంచుకొని ఖాండిక్యుని వద్దకు వెళ్లి –

అయ్యా! మన పగను తలపక – ప్రాయశ్చిత్త విధి నాకు తెలిపి పుణ్యాత్ముణ్ణి చేశావు. ఆ విధంగా గురువైన నీకు గురుదక్షిణ సమర్పించాలని వచ్చాను. నీ కేది ఇష్టమో అడగవలెను – అని అన్నాడు.

అతని మాట విని ప్రక్కనున్న ఖాండిక్యుని మంత్రులు మునుపటి నీ రాజ్యం ఇమ్మని కోరుకో! అన్నారు మెల్లగా. వారి మాట విని నవ్వి ఖాండిక్యుడు



ధనం సంపాదించడం, రాజ్యానికి ఆశపడడం ప్రధానులమతం – నా కా కోరిక లేదు. పరమార్థయోగం ఇతనివల్ల తెలిసి బ్రహ్మపదం చేరుతాను – అశాశ్వతాలైనఫలాలు నాకిష్టం లేదు –

అని కేశిధ్వజుని చూసి అన్నాడు. మహాత్మా! నా కోరిక విను. మోక్షం పొందడానికి తగిన యోగమార్గం నాకు తెలుపు...

ఖాండిక్యునిమాట విని కేశిధ్వజుడు అయ్యా! రాజులకు పగలేని రీతిగా దొరతనం నెరపడం, భోగాలనుభవించడం ప్రధానం అవి ఒల్లక యోగమార్గం అడగడమేమిటి. అని అనగా ఖాండిక్యుడన్నాడు :

రాజా! అజ్ఞానానికి మూలం సిరి సంబంధం. పాపాలకు రూపాలు చేసే పనులు. వాటి ఫలితం భరించరాని కష్టాలు. సారం రాజ్యం అజ్ఞాన కారణం. కనుక – దివ్యమైన మోక్షమార్గోపదేశం చెయ్యవలసిందని కోరుతున్నాను. ఇదికాక ఏమి ఇచ్చినా స్వీకరించను...

ఆ మాట విని కేశిధ్వజుడు చెప్పాడు. అవిద్యవల్ల మృత్యువునెపుడు గెలుస్తానో అని అదే స్మరణవల్ల రాజ్యసంపద నాకు ఈశ్వరప్రసాదంగానే కనిపిస్తూ ఉంటుంది. ఆత్మకాని వస్తువును ఆత్మగా భావించడం, తనకు రాని సొమ్ముకోసం ఆరాటపడడం – ఈ రెండూ అవిద్యకు బీజాలు. పాంచభౌతికమైన ఈ శరీరమందు దేహి అజ్ఞానానికి లొంగి అహంభావంతో ప్రవర్తిస్తూ ఉంటాడు. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు – ఇదే ధ్యాసతో మమకారం పెంచుకుంటూ బ్రతుకు గడిపేవాడు దుర్వివేకి. ఉపభోగాలకాసపడి ప్రయత్నించడం – చెయ్యరాని కర్మలు చెయ్యవలసి వస్తుంది. ఆ కర్మలు పురుషునకు తెగని బంధాలు.

పృథివీ తత్త్వ ప్రధానమైన ఈ దేహం పృథివికి (భూమికి) సంబంధించిన పదార్థాలచేతనే వృద్ధి పొందుతుంది. ప్రాణి లెక్కకు మిక్కిలిగా

ఎన్నో సంసార సంబంధాల బంధాలతో చిక్కుపడి వాసనలు అనే పరాగానికి లొంగి మోహారణ్యంలో తిరుగుతూ ఉంటుంది. బాటసారి కళ్లలో పడిన దుమ్మును వేడినీళ్లతో పోగొట్టుకున్నట్టు కర్మసంబంధమైనఅజ్ఞానం ఆత్మబోధవల్ల పోతుంది. అజ్ఞానం విడువగా మోక్షం కలుగుతుంది. చల్లనినీరు అగ్నిచే వేడెక్కినట్లు మమకారానికి చుట్టుకుపోయిన ప్రకృతిగలశరీరికష్టాలకు చిక్కుతాడు. కనుక కల్మషాన్ని పోగొట్టేది, మోక్షమార్గాన్ని చూపేది అయిన యోగాన్ని నేర్చుకోవాలి. అది మోక్షాన్ని సాధిస్తుంది. అని అనగా ఖాండిక్యుడన్నాడు –

నిమి వంశంలో నీ కన్న మిన్నగా చెప్పదగిన జ్ఞానధనుడు పుట్టడు. కనుక నీవే ఆ యోగవిద్యను నాకు బోధించాలి. ఆ విధంగా నన్ను కృతార్థుణ్ణి చెయ్యాలి. అని అనగా కేశిధ్వజుడు ప్రసన్నహృదయుడై చెప్పాడు.

రాజా! బంధమోక్షాలకు హేతువు చిత్తం. విషయసుఖాలకు అది లాగుతూ ఉంటుంది. దానిచే చిక్కులకూ చీకాకులకూ కట్టు పడవలసి వస్తుంది. ఆ వాంఛలకు లొంగకపోతే మోక్షప్రాప్తి అవుతుంది. కనుక మనస్సును చెదరనీయక బ్రహ్మధ్యానంపై అంకితం చేస్తే ముక్తి సాధ్యం అవుతుంది. ఇనుము సూదంటు రాయికి వశమైనట్లు బ్రహ్మధ్యానంచే ఆత్మభావం కలుగుతుంది. ఆత్మభావం విషయవాంఛలకు లొంగక సన్మార్గాన నడుపుతుంది. అలా స్థిరచిత్తంతో బ్రహ్మధ్యానం నిరంతరం చేస్తూ ఉండడమే యోగం. ఆ యోగవిద్యయందు నిశ్చలబుద్ధిని ప్రయోగించి వర్తించే వాడే దివ్యయోగి. మోక్షం అతనికి అరచేతిఉసిరిక. బ్రహ్మతత్త్వం తెలిసిన బ్రహ్మణ్యుడతడే – అలాగ యోగాభ్యాసంలో ఉండగా ఎప్పుడైనా ఆటంకం కలిగినా మలిజన్మలో తప్పక ముక్తి పొందుతాడు.



ఎవరినుండి ఏదీ తీసుకొనక, మిక్కిలి శుచిగా ఉండడం, అహింస, బ్రహ్మచర్యం, దొంగతనం లేకుండడం – కలవాడై యోగాభ్యాసుడు అయి, ఆ యోగఫలం కోరకూడదు.

నియమం, శౌచం, తపస్సు, వేదపఠనం, నాలుక కోరికలు విడవడం, బ్రహ్మదర్శనం (ధ్యానం) – దీనికి 'యమ' యోగం అని సంజ్ఞ. పైన చెప్పినది – కామ్య ఫలకాంక్షతో చేస్తే తప్పక సిద్ధిస్తాయి. సందేహం లేదు.

సకలాసనాలలో భద్రాసనం అలవాటు చేసుకుని దానితో యోగం అభ్యసిస్తూ పంచగుణాలనూ మనసునూ జోడించి బ్రహ్మధ్యానప్రవృత్తితో ఉండడం 'యమం' అని వచనీయం –

ప్రాణవాయువులను తన వశం చేసుకుని బ్రహ్మతత్త్వాన్ని తెలిసి ప్రవర్తించే యోగం ప్రాణాయామయోగం అని తత్త్వవిదులన్నారు.

ఊర్ధ్వముఖంగా ఉన్న ప్రాణవాయువును అధోముఖంగా ఉన్న అపానవాయువును సమానస్థాయిలో ప్రవర్తింపచేసేది లంబనయోగం.

ఆ లంబనయోగంతో శబ్దాదులకు వశీకరమైన ఇంద్రియ సమూహాన్ని తన వశం చేసుకొనడం ప్రత్యాహారం అనే యోగం అవుతుంది.

ఈ యోగాలన్నీ ఆ కేశవుణ్ణి తెలియడానికి స్థూలయోగాలు. సూక్ష్మయోగం ఏదో తెలియదు.

అని చెప్పగా ఖాండిక్యుడు సరే. ఆ హరిని ఏ విధంగా భావన చేసి యోగి ముక్తిని పొందునో ఆ విషయం చెప్పవలసిందని అడగగా కేశిధ్వజుడు చెప్పాడు.

దివ్యమూర్తియైన విష్ణువు యోగిచిత్తం నందుంటాడు. ఆ మూర్తి స్థూలరూపం, సూక్ష్మరూపం – అని రెండు విధాలు. పర + అపర సంజ్ఞగలవి ఆ మూర్తులు.

బ్రహ్మభావన, కర్మభావన, బ్రహ్మకర్మభావన అని భావన మూడు విధాలు. విష్ణుమూర్తి భేదాలను ఈ మూడు భావనలచే చూడవచ్చు. ఆ భావనలను వివరిస్తాను విను.

సనకాది మునీంద్రులు బ్రహ్మభావనాపరులు. ఇంద్రాదులు కర్మభావనా నిరతులు. బ్రహ్మాదులు బ్రహ్మకర్మభావనా రతులు.

ఈ మూడు భావనలచే నిరంతరం శ్రీహరిని ధ్యానయోగంతో ఆరాధించే పద్ధతి ధారణ అనే యోగం అవుతుంది.

జంగమస్థావరాత్మకమైన ఈ ప్రపంచం ఆ ఈశ్వరుని స్థూలరూపం. నరసుర పతుల రూపాలతో ఉండేది హరి సూక్ష్మరూపం.

స్థూల సూక్ష్మరూపాలతో ఒప్పే వాసుదేవుని పై చెప్పిన మూడు భావనలతో నిర్మల మనస్కుడై ధ్యానించేవాడే ధ్యాని అని చెప్పదగినవాడు.

విష్ణుశక్తి చరాచరజగమునందు సమంగానే ఉంటుంది. భిన్నాభిప్రాయంగల అవివేకులు వేరు రీతిగా మాటాడుతారు.

ఇప్పుడు నేను చెప్పిన యోగవిద్యతో జీవితం గడిపేవారి హృదయాలలో శ్రీహరి ఉండి వారి కిల్బిషాలను అణచి సుఖం కలిగిస్తాడు. చివర తన వద్దకు తీసుకుంటాడు.

అని సంగ్రహంగా యోగవిద్యనుగూర్చి చెప్పగా సంతోషించి ఖాండిక్యుడు రాజచంద్రా! నీ ఉపదేశంతో నా మనస్సు ప్రసన్నమయింది. పద్మాక్షునిపై నిల్చింది. అని అభినందించగా కేశిధ్వజుడు ఆనందంగా నిజపురానికి వెళ్లాడు. ఖాండిక్యుడు తన కుమారునకు పట్టంకట్టి యోగ విద్యాభ్యాసంలో సకల సుఖాలు పొంది ఆనందంగా ఉన్నాడు.



కేశిధ్వజుని తండ్రి మిథిలకు పోయి సత్కర్మలతో పద్మాక్షుని ఆరాధిస్తూ చాలా యజ్ఞాలు చేశాడు. వాసుదేవానుగ్రహంతో దివ్యభోగాలనుభవిస్తూ హాయిగా ఉన్నాడు.

అని పరాశరుడు మైత్రేయా! సర్గ ప్రతిసర్గాదుల మన్వంతరాల వృత్తాంతం చెప్పాను. ఇంక ఏమి నీ వినవలసేది! అని అనగా మైత్రేయుడు గురుదేవా! వినవలసినవన్నీ విన్నాను. మనసు నిర్మలమై శాంతగుణ భాసురమయింది. నాలో ఉన్న సందేహాలు పోవాలని మిమ్మల్ని అడగడం – మీరు శ్రమపడి చెప్పవలసేది చెప్పి వాటిని పోగొట్టడం అయింది. మీకు నా వల్ల కలిగిన శ్రమకు నన్ను క్షమించండి – అని అనగా పరాశరుడు కరుణతో చూసి నువ్వు నాకు చేసిన సేవ వల్ల దేవతలకు కూడా సిద్ధింపని శ్రీవిష్ణుపురాణం నీకు ఆనందంగా చెప్పడం అయింది. ఆలాటి పుణ్యం నాకు కలిగించావు శ్రమ కాదు.

దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, పన్నగులు, కిన్నరులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, నాలుగు వర్ణాలవారు, నదీనదాలు, సముద్రాలు, వనాలు, పంచభూతాలు, గ్రహనక్షత్రాలు, అగ్నులూ, మన్వంతరాలు, వేదశాస్త్రపురాణాలు విష్ణుమూర్తులే. ఈ చరిత్ర విన్న వారు సకల శుభాలూ పొందుతారు. ఇన్నింటా వినుతింపదగిన విష్ణుపురాణాన్ని వ్రాసినా చదివినా చదివించినా వినినా పూజించినా శుభప్రాప్తి అవుతుంది. భక్తవత్సలుడైన ఆ పద్మాక్షుడు ఇష్టఫలాలను ప్రసాదిస్తాడు.

విష్ణుపురాణాన్ని భక్తితో చదివినా విన్నా అశ్వమేథం చేసి అవబృథ స్నానం చేస్తే వచ్చే ఫలం వస్తుంది. పుణ్యక్షేత్రాలలో స్నానం, ధ్యానం, దానం చేసిన ఫలం లభిస్తుంది.

అగ్నిహోత్రారాధన ఒక సంవత్సరం చేస్తే వచ్చే ఫలం ఒక్కమారు విష్ణుపురాణం చదివినా విన్నా వస్తుంది.

జ్యేష్ఠమాసంలో శుక్లపక్షద్వాదశి నాడు యమునలో స్నానంచేసి మధురవెళ్లి విష్ణువును ఆరాధిస్తే వచ్చే పుణ్యఫలం విష్ణుపురాణపఠనంవల్ల కలుగుతుంది. శ్రావణమాసంలో విష్ణుపురాణంనందలి కథలను కొన్నింటిని చదివినా దుస్స్వప్నదోషం పోతుంది.

సూర్యగ్రహణసమయంలో యమునలో స్నానం చేసి వైదికులైన బ్రాహ్మణులకు గోదాన భూదానాలు ఇస్తే వచ్చే ఫలం విష్ణుపురాణం వ్రాసిన వారికి వస్తుంది.

విష్ణుపురాణకథలు వినేవారికి పాపాలు పోతాయి. ఆరోగ్య భాగ్యాభివృద్ధి, కీర్తి, హరిభక్తి కలుగుతాయి.

నేను పులస్త్యమహామునివల్ల ఈ పురాణం విని నీవంటి తపోధనులకు చెప్పే ధన్యచరిత్రుడనయాను. శమీకుడు నీ వల్ల విని దీనిని కృతయుగంలో అందరికీ వినిపిస్తాడు. కనుక ఈ పురాణం కలికాల దోషాన్ని పోగొట్టి జగన్నుతం అవుతుంది. నీవు మహానుభావుడవు. నీ జననం పవిత్రం అయింది. లక్ష్మీనాథుని భక్తిని ఏమరక ప్రవర్తిస్తూ ఉండు.

అని ఈ విధంగా పరాశరమునీంద్రుడు మైత్రేయునకు వేదమూలమైన విష్ణుపురాణాన్ని పూర్తిగా వినిపించాడు.

*ఇది కవికులరత్న*
*కుమారసరస్వతీ పదలాంఛన*
**యామిజాల పద్మనాభస్వామి**
*విరచితమైన* ***శ్రీవిష్ణుపురాణం*** *సంపూర్ణం.*